శనివారం 16-12-2023



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 265

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

19న తిరుమలలో బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 23 నుంచి 2024 జనవరి 1వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాన్ని పురస్కరించుకుని ఈ నెల 19న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆ రోజు బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఈ కారణంగా ఈ నెల 18న సిఫార్సు లేఖలు స్వీకరించడంలేదని స్పష్టం చేసింది.

తిరుపతి విమానాశ్రయంలోని శ్రీవాణి దర్శన టికెట్ కౌంటర్ మార్పు

16 నుంచి తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో టికెట్ల జారీ

తిరుమల: దేశ, విదేశాల నుంచి తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే విమాన ప్రయాణికుల సౌకర్యార్థం తిరుపతి విమానాశ్రయంలో రోజూ 100 ఆఫ్‌లైన్ శ్రీవాణి టికెట్లను టీటీడీ జారీ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే విమానాశ్రయంలో శ్రీవాణి టికెట్ల జారీకి అనుమతి లేని కారణంగా డిసెంబరు 16వ తేదీ శనివారం నుంచి తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో ఇకపై టికెట్‌లు జారీ చేస్తారు. రోజూ 100 టికెట్లను బోర్డింగ్ పాస్ సమర్పించిన భక్తులకు యధావిధిగా శ్రీవాణి దర్శన ఆఫ్‌లైన్ టికెట్లు అందజేస్తారు. విమానాశ్రయంలో శ్రీవాణి దర్శన టికెట్ కౌంటర్ మార్పును భక్తులు గమనించాలని టీటీడీ కోరుతోంది.

రామజన్మభూమి ట్రస్టు చైర్మన్‌కు స్వాత్మానందేంద్ర ఆశీస్సులు

సాక్షి, న్యూఢిల్లీ: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు చైర్మన్ నృపేంద్ర మిశ్రా విశాఖ శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి ఆశీస్సులు అందుకున్నారు. మిశ్రా ఆహ్వానం మేరకు ఢిల్లీలోని ఆయన నివాసాన్ని స్వాత్మానందేంద్ర శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు ధార్మిక అంశాలను చర్చించారు. అయోధ్యలో రామ జన్మభూమి ట్రస్టు కార్యకలాపాలను స్వాత్మానందేంద్రకు మిశ్రా వివరించారు. అలాగే పార్లమెంట్ సభ్యులు, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సుకాంత్ కుమార్‌ను కూడా స్వాత్మానందేంద్ర స్వామి కలిశారు. వీరికి శంకరాచార్య ప్రతిమను బహూకరించి, రాజశ్యామల అమ్మవారి ప్రసాదాన్ని స్వాత్మానందేంద్ర అందించారు.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..


తూర్పు గోదావరి జిల్లా ప్రకాశరావుపాలెంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


పల్నాడు జిల్లా నరసరావుపేట 13వ వార్డులో డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించి బ్రోచర్ ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి తదితరులు


శ్రీకాకుళం జిల్లాలోని బొరిగివలసలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న పొందర కార్పొరేషన్ చైర్ పర్సన్ హైమావతి తదితరులు


చిత్తూరు వన్నియర్‌బ్లాక్ సచివాలయ పరిధిలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


కృష్ణా జిల్లా గుడివాడ 15వ వార్డులో పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, తదితరులు


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఇనుకుర్తిలో సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించిన గ్రామస్తులు


పార్వతీపురం మన్యం జిల్లా కోడిశలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు


పశ్చిమ గోదావరి జిల్లా కొడమంచిలిలో బ్రోచర్లను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఇలా అయితే ఎప్పటికీ ప్రభుత్వ నియామకాలు పూర్తి కావు

ఎత్తు, ఛాతీ కొలతలపై వివాదం

ఎస్‌ఐ నియామక ప్రక్రియలో ఎత్తు, ఛాతి చుట్టు కొలతల్లో తమను అనర్హులుగా ప్రకటించారంటూ ఆరుగొళ్ళు దుర్గాప్రసాద్ మరో 23 మంది హైకోర్టులో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని విచారించిన సింగిల్ జడ్జి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఎస్‌ఐ రాత పరీక్ష ఫలితాలను తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు వెల్లడించవద్దంటూ ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ధర్మాసనం ముందు అప్పీల్ చేశాయి. ఈ అప్పీల్‌పై ఇటీవల విచారణ జరిపిన జస్టిస్ నరేంద్ర ధర్మాసనం.. పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుపై చేసిన ఆరోపణలు అవాస్తవమని తేలితే రూ.లక్ష జరిమానా విధిస్తామని, అందుకు సిద్ధమైన వారు ఎత్తు పరీక్షకు హాజరు కావాలని ఆదేశించింది. దీనికి ముందుకు వచ్చిన 19 మంది పిటిషనర్లకు హైకోర్టే ఇటీవల ఎత్తు పరీక్షలు చేయించింది. ఈ సమయంలో అభ్యర్థులు పలువురు ప్రభుత్వ డాక్టర్లు ఇచ్చిన ఎత్తు సర్టిఫికెట్లను ధర్మాసనం ముందుంచారు. దీనిపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాటిపై విచారణ జరపాలని గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజుని ఆదేశించింది. శుక్రవారం ఈ వ్యవహారంపై ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. ఐజీ పాలరాజు నివేదికను ప్రభుత్వ న్యాయవాది కిషోర్ కుమార్ ధర్మాసనం ముందుంచారు. ఆ నివేదికను ధర్మాసనం క్షుణ్ణంగా పరిశీలించింది. తమ సమక్షంలోనే ఎత్తు పరీక్ష నిర్వహిస్తామని చెప్పిన తరువాత కూడా డాక్టర్ల సర్టిఫికెట్లు తేవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టును మోసం చేయాలని భావిస్తున్నారా అంటూ అభ్యర్థులు, వారి న్యాయవాది శ్రవణ్‌కుమార్‌పై మండిపడింది.

- ప్రతి దానికీ కోర్టుకొచ్చి అడ్డుకుంటుంటే ఉత్తీర్ణులైన వారి పరిస్థితి ఏమిటి?
- ఓవైపు కోర్టుకొస్తారు.. ఉద్యోగాలు భర్తీ చేయరంటూ తిరిగి అధికారులను నిందిస్తుంటారు
- మా సమక్షంలోనే 'ఎత్తు' పరీక్ష నిర్వహిస్తామని చెప్పాం
- తిరిగి డాక్టర్ల నుంచి సర్టిఫికెట్లు తెస్తారా?
- ఇది కోర్టు ధిక్కారమే.. ప్రాసిక్యూషన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం కండి
- ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగాల ప్రక్రియలో పాల్గొనకుండా బ్లాక్‌లిస్ట్ చేస్తాం
- కోర్టుకొచ్చిన ఎస్‌ఐ ఉద్యోగాల అభ్యర్థులపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- నిరుపేద నిరుద్యోగులంటూ ప్రాధేయపడ్డ న్యాయవాది
- చివరకు సానుకూలంగా స్పందించిన హైకోర్టు
- చేసిన తప్పుకు 3 నెలలు ఆసుపత్రుల్లో సేవ చేయాలని స్పష్టీకరణ
- ముందుగా అఫిడవిట్ దాఖలు చేయాలని, దాన్ని పరిశీలించి ఆదేశాలిస్తామని వెల్లడి
- తదుపరి విచారణ 18కి వాయిదా

సాక్షి, అమరావతి: పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపట్టిన 'ఎత్తు' కొలతలపై అభ్యంతరం తెలుపుతూ కోర్టును ఆశ్రయించిన పలువురు ఎస్‌ఐ అభ్యర్థులు ప్రభుత్వ వైద్యుల నుంచి ఎత్తు సర్టిఫికెట్లు తేవడంపై హైకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. ఇది తమను (కోర్టు) ఫూల్స్ చేయడమేనంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. నమ్మకం ఉంచాల్సిన వ్యవస్థపై ఆరోపణలు చేయడం ఫ్యాషన్‌గా మారిపోయిందని వ్యాఖ్యానించింది. తమ సమక్షంలోనే ఎత్తు కొలతలు జరుగుతాయని స్పష్టంగా చెప్పినప్పటికీ, డాక్టర్ల నుంచి సర్టిఫికెట్లు తేవడం కోర్టు ధిక్కారమే అవుతుందని, ప్రాసిక్యూషన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించింది. భవిష్యత్తులో ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగాల ప్రక్రియలో పాల్గొనకుండా బ్లాక్ లిస్ట్ చేస్తామని హెచ్చరించింది. భవిష్యత్ తరాలకు ఇదో గుణపాఠం కావాలంది. భారీ స్థాయిలో ఉద్యోగాలు భర్తీ చేసే సమయంలో చిన్న చిన్న తప్పులు జరుగుతుంటాయని, నిజంగా తప్పులు జరిగి ఉంటే తప్పుపట్టొచ్చని, ప్రతి దానికీ కోర్టులకొచ్చి అడ్డుకుంటుంటే, పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించింది. ఇలాంటి ప్రయత్నాలను ఆమోదిస్తే, ప్రభుత్వ నియామకాలు ఎప్పటికీ పూర్తి కావని, వేల మంది ఉద్యోగాల్లేకుండా ఉంటారని తెలిపింది. ఇలా కోర్టులకొచ్చి అడ్డుకుంటూ, మరోవైపు ఉద్యోగాలు భర్తీ చేయడంలేదంటూ అధికారులను తిరిగి నిందిస్తుంటారని అన్నది. రేపో ఎల్లుండో కేసు తేలుతుందని ఎదురు చూస్తూనే పదవీ విరమణ వయస్సుకు చేరుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. హైకోర్టు ఆగ్రహంతో పరిస్థితిని అర్థం చేసుకున్న అభ్యర్థుల తరఫు న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ దిగొచ్చారు. తాను చెబితేనే అభ్యర్థులు ప్రభుత్వ వైద్యుల నుంచి సర్టిఫికెట్లు తెచ్చారని తెలిపారు. తాను ఇలా ఎందుకు చేయాల్సి వచ్చిందో వివరణ ఇవ్వబోగా, మరోసారి ఈ విషయాన్ని చెబితే తీవ్రంగా పరిగణిస్తామంటూ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఆయన కోర్టుకు క్షమాపణలు చెప్పారు. పిటిషనర్లు అమాయక, నిరుపేద నిరుద్యోగులని, వారిని క్షమించాలని వేడుకున్నారు. ఇందుకు హైకోర్టు ససేమీరా అంది. అమాయకత్వమంటూ చేసిన తప్పు నుంచి తప్పించుకోవడం కుదరదని చెప్పింది. కోర్టును తప్పుదోవ పట్టించొద్దని శ్రవణ్ కుమార్‌కు చెప్పింది. నియామక ప్రక్రియ బ్రోకర్లకు అవినీతి కేంద్రంగా మారిందని, అనేక మంది అభ్యర్థులు బ్రోకర్లకు లక్షలు చెల్లించి మోసపోయిన ఘటనలు ఉన్నాయని తెలిపింది. శ్రవణ్ కుమార్ పలుమార్లు అభ్యర్థించడంతో హైకోర్టు మెత్తపడింది. చేసిన తప్పుకు శిక్ష కింద పిటిషనర్లు ఆసుపత్రుల్లో మూడు నెలలు సామాజిక సేవ చేయాలని చెప్పింది. సేవా కాలాన్ని తగ్గించాలని శ్రవణ్ కుమార్ కోరగా.. హైకోర్టు తిరస్కరించింది. చేసిన తప్పుకు బేషరతుగా క్షమాపణలు కోరుతూ అఫిడవిట్ దాఖలు చేయాలంది. ఆ అఫిడవిట్‌ను పరిశీలించిన తరువాత తగిన ఆదేశాలు జారీ చేస్తామంది. తదుపరి ఆదేశాల నిమిత్తం విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేంద్ర, జస్టిస్ న్యాపతి విజయ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇలా డాక్టర్లు సర్టిఫికెట్లు ఇవ్వకుండా సర్క్యులర్ జారీ చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం తెలిపింది.

భూ వివాదాల్లేని రాష్ట్రంగా ఏపీ

- ఈ చట్టం భూసమస్యలన్నిటికీ పరిష్కారం చూపుతుంది
- రాష్ట్రం మొత్తం పండుగ చేసుకునే చట్టం ఇది.. సామాన్యుడికి మేలు చేస్తుంది
- టైటిల్‌కు ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుంది
- ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని దేశం మొత్తం అనుసరిస్తుంది
- దీనిపై విస్తృతంగా చర్చ జరగాలి
- ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై జరిగిన సదస్సులో వక్తలు

సాక్షి, అమరావతి: ల్యాండ్ టైట్లింగ్ చట్టం (భూ హక్కుల చట్టం) ద్వారా రాబోయే రోజుల్లో ఏపీ భూ వివాదాల్లేని రాష్ట్రంగా తయారవుతుందని పలువురు వక్తలు చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఎప్పటి నుంచో అనుసరిస్తున్న కన్‌క్లూజివ్ ల్యాండ్ టైట్లింగ్ విధానాన్ని (నిశ్చయాత్మక యాజమాన్య హక్కు) దేశంలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ చట్టం ద్వారా తీసుకొచ్చిందని తెలిపారు. తాడేపల్లిలోని ఒక హోటల్‌లో శుక్రవారం ఓపెన్ మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో 'ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టం'పై జరిగిన సదస్సులో వారు మాట్లాడారు. వారేమన్నారంటే..

భూ యజమానులకు స్వాతంత్ర్యం వస్తుంది



ల్యాండ్ టైట్లింగ్ చట్టం ద్వారా భూ యజమానులకు స్వాతంత్ర్యం వస్తుంది. నిజమైన స్ఫూర్తితో అందరూ దీన్ని ఆమోదించాలి. భూములపై ఉన్న అనిశ్చితివల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. నేను సర్వీసులోకి వచ్చి 22 ఏళ్లయింది. అప్పటి నుంచి భూముల సమస్యలు చూస్తూనే ఉన్నా. ఆ సమస్యలన్నింటికీ ఈ చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుంది. ఇప్పటివరకు మన భూముల వ్యవస్థలో అంతా భయమే. రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే భయం. రికార్డు సరిగ్గా ఉందో లేదోననే భయం. బ్రిటీష్ వాళ్లు తమ దేశంలో చేసుకున్న చట్టాలను మన దేశంలో పెట్టలేదు. భూముల విషయంలో అక్కడ ఉన్న స్పష్టత, ఇక్కడలేదు. ప్రతిదీ వివాదమే. ప్రతిదాన్లోనూ అనిశ్చితి. ఆ పరిస్థితిని ఇప్పుడు ఏపీ అధికమిస్తోంది. ఈ చట్టం ద్వారా భూముల సమస్యలన్నింటినీ పరిష్కరించవచ్చు. బ్రిటీష్ ప్రభుత్వం 1920లో ఈ చట్టం చేసింది. అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి దేశాల్లో ఎన్నో ఏళ్ల కిందే ఆ చట్టం అమల్లో ఉంది. మన దేశంలో తొలిసారి ఏపీలోనే ఈ చట్టం అమలవుతోంది. ఖరారైన టైటిల్‌కి ప్రభుత్వమే గ్యారంటీ ఇస్తుంది. ఇప్పుడు ఏపీ చేసిన ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని మున్ముందు దేశం అంతా అనుసరిస్తుంది.

– సిద్ధార్థ జైన్, కమిషనర్, సర్వే సెటిల్మెంట్, భూమి రికార్డుల శాఖ

భూయాజమాన్యానికి ప్రభుత్వానిదే గ్యారంటీ..



దేశంలోని భూములపై ఖచ్చితమైన యాజమాన్యపు హక్కులు లేకపోవడంవల్ల పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు భూములు కొనాలంటే భయపడే పరిస్థితి ఉంది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఉన్నట్లు యాజమాన్య హక్కుల విధానం మన దేశంలో లేదు. అందుకే పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు ఈ విషయాన్ని అనేక ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వానికి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో.. కేంద్రం దీనిపై పలు కమిటీలు, టాస్క్‌ఫోర్స్‌ను సైతం నియమించింది. ఇవి మన దేశంలో కూడా కన్‌క్లూజివ్ టైటిల్ చట్టం చేయాలని, దానికి ఒక మోడల్ చట్టం తీసుకురావాలని సిఫారసు చేశాయి. నీతి ఆయోగ్ సైతం అన్ని రాష్ట్రాలు ల్యాండ్ టైట్లింగ్ చట్టం చేసుకోవాలని చెప్పింది. ఈ చట్టం చేయాలంటే ముందు రికార్డులు అప్‌డేట్ చేయాలి. అందుకు భూముల సర్వే జరగాలి. ఇప్పుడు ఏపీలో భూముల రీసర్వే ద్వారా ఆ పని జరుగుతోంది. చాలావరకు అది పూర్తయింది. ఏ రెవెన్యూ చట్టంలో అయినా అప్పీల్ చేసుకోవడానికి కొన్ని వారాల సమయం మాత్రమే ఉంటుంది. కానీ, టైట్లింగ్ చట్టంలో రెండేళ్ల సమయం ఉంది. ఈలోపు ఎలాంటి అభ్యంతరం లేకపోతే అప్పుడు కన్‌క్లూజివ్ టైటిల్ ఖరారవుతుంది. దీనికి ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుంది. ఇది ప్రజలకు ఉపయోగపడే మంచి చట్టం.

– అజేయ కల్లం, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు

రాష్ట్రమంతా పండుగ చేసుకునే చట్టం ఇది



ప్రపంచంలోని మిగిలిన దేశాలతో భారత్ పోటీపడాలంటే టైటిల్ గ్యారంటీ వ్యవస్థ రావాలని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఎప్పుడో చెప్పారు. దేశంలోని సివిల్ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో 66 శాతం భూములకు సంబంధించినవే. అవి కూడా లక్షలోపు ఆదాయం ఉన్న వ్యక్తులకు సంబంధించిన కేసులే 93 శాతం. ఇందుకోసం వారు ఏటా పెట్టే ఖర్చు రూ.27 వేల కోట్లని ఒక అధ్యయనంలో తేలింది. అలాగే, ఎన్‌సీఆర్‌బీ రికార్డుల ప్రకారం 14 శాతం హత్యలు, 60 శాతం నేరాలు భూవివాదాలవల్ల జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనే టైటిల్ గ్యారంటీ చట్టం తేవాలని కేంద్ర భావిస్తోంది. ఈ నేపథ్యంలో.. దేశంలో తొలిసారిగా ఏపీ ప్రభుత్వం టైటిల్ గ్యారంటీ చట్టాన్ని తీసుకొచ్చింది. దీనివల్ల భూయజమానుల హక్కులకు ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుంది. బీమా కూడా ఇస్తుంది. రాష్ట్రం మొత్తం పండుగ చేసుకోవాల్సిన చట్టం ఇది. ఇంత మంచి చట్టం వస్తే నేరాలు తగ్గుతాయి. ఆర్థిక వృద్ధి పెరుగుతుంది.

– సునీల్‌కుమార్, భూ చట్టాల నిపుణులు, నల్సార్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్

ఈ చట్టాన్ని వ్యతిరేకించడం దురదృష్టకరం



సామాన్యుడికి మేలు చేసే చట్టం ఇది. భూ వివాదాలన్నింటికీ చెక్ పెట్టడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక అడ్డంకుల్ని అధిగమించి ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. సీఎం వైఎస్ జగన్ పట్టుదలకు, పేదలపట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి ఈ చట్టమే తార్కాణం. భూ యజమానుల హక్కులు పరిరక్షించే చట్టం ఇది. ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని ఇప్పుడు కొందరు వ్యతిరేకిస్తున్నా త్వరలోనే ప్రజల మన్ననలు పొందుతుంది.

– రాజశేఖర్‌రెడ్డి, ఓపెన్ మైండ్స్ సంస్థ అధ్యక్షులు

దీనిపై చర్చ జరగాలి..



ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై అవగాహన కోసం ఈ సదస్సు ఏర్పాటుచేశాం. అన్ని రాష్ట్రాల్లో దీన్ని అమలుచేయాలని 2019లో నీతి ఆయోగ్ సూచించింది. అదే ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని చేసి కేంద్రానికి పంపింది. ఇటీవలే రాష్ట్రపతి దీనికి ఆమోదముద్ర వేశారు. వెంటనే దాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనిపై న్యాయవాదులు నిరసనలు తెలుపుతున్నారు. ఇంత మంచి చట్టంపై అపోహలను నివృత్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. దీనిపై విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉంది. – మనోహర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు

రసవత్తరంగా కోడిపోరు

- రణక్షేత్ర వీధుల్లో చిందేసిన పల్నాటి పౌరుషం
- పాల్గొన్న ప్రభుత్వ విప్ పీఆర్కే, వైఎస్సార్‌సీపీ నేత చలమారెడ్డి
- నేటితో ముగియనున్న పల్నాటి వీరారాధన ఉత్సవాలు


కోడి పుంజులను పోరుకు వదులుతున్న ఎమ్మెల్యే పిన్నెల్లి, పార్టీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాల్లో శుక్రవారం.. నాటి పల్నాటి పౌరుషానికి ప్రతి రూపమైన కోడిపోరు రసవత్తరంగా జరిగింది. పల్నాటి వీరుల గుడి ఆవరణలో వేలాది ప్రజల సమక్షంలో కోడిపోరు ప్రదర్శన ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాచర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేత కొమ్మారెడ్డి చలమారెడ్డి, పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ కోడిపోరు ప్రదర్శనలో పాల్గొన్నారు. నాయకురాలు పుంజు పేరు శివంగిడేగని, బ్రహ్మనాయుడు పుంజు పేరు రతనాల చిట్టిమల్లుగా కథకులు చెప్పారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బ్రహ్మనాయుడు పుంజును, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం నాయకురాలు నాగమ్మ పక్షాన పుంజును పోటీకి వదిలారు. పల్నాటి వీర విద్యావంతులు కోడిపోరు కథాగానం చేశారు. సంప్రదాయం కోసం నిర్వహణ కావడంతో పోరులో ఉండగానే పుంజులను విడదీశారు. కోడిపోరు నిర్వహణకు ముందు పిన్నెల్లి, చలమారెడ్డిలు వీరుల గుడిలో పల్నాటి వీరుల ఆయుధాలకు పూజలు చేశారు. కాగా, కోడిపోరు నాడు పల్నాటి రణక్షేత్రంలో పల్నాటి వీరుల ఆయుధాల(దైవాలు) గ్రామోత్సవం తెల్లవారుజామునే ప్రారంభమైంది. చెన్నకేశవస్వామి, అంకాలమ్మ దీవెనలందుకున్న అనంతరం బ్రహ్మనాయుడు మేడ వద్దకు తరలివెళ్లాయి. తర్వాత కోడిపోరు వద్దకు కొన్ని దైవాలు రాగా, ప్రధాన గ్రామోత్సవం మాత్రం యధావిధిగా కొనసాగింది. ప్రధాన వీధుల్లోని ప్రతి గడప వద్ద ప్రజలు పల్నాటి వీరుల ఆయుధాలకు పూజలు చేసి నీరాజనాలు పట్టారు. చివరకు వీరాచారవంతుల పాదాలను కూడా నీటితో తడిపి పల్నాటి వీరుల పట్ల భక్తిని చాటుకున్నారు. కాగా, ఈ ఉత్సవాలు శనివారంతో ముగియనున్నాయి.

ఆర్బీకేలు, సచివాలయాల నిర్మాణాలపై వివిధ రాష్ట్రాల ఆసక్తి

- 3 రోజులపాటు ఏపీలో పర్యటించిన 8 రాష్ట్రాల అధికారులు
- గ్రామాల్లో శాశ్వత భవనాల నిర్మాణంపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధకు ప్రశంసలు
- రాష్ట్రవ్యాప్తంగా ఒకే విడతలో 22 వేలకుపైగా భవనాలను నిర్మిస్తున్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ప్రాథమిక వైద్యంతో సహా ప్రభుత్వ సేవలన్నింటినీ ఎక్కడికక్కడ స్థానికంగా ప్రజలకు అందించడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై వివిధ రాష్ట్రాలు ప్రశంసలు కురిపిస్తున్నాయి. ప్రభుత్వ సేవలన్నింటినీ ప్రజల ముంగిటకు తేవడానికి రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో ఒకే విడతలో ప్రభుత్వం 22 వేలకు పైగా శాశ్వత భవనాలను నిర్మిస్తోంది. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రజలకు ఎక్కువగా ఉపయోగపడే నూతన కార్యక్రమాల అమలు తీరును పరిశీలించడానికి కేరళ, ఒడిశా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, బిహార్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ నుంచి దాదాపు 24 మంది అధికారుల బృందం రాష్ట్రానికి వచ్చింది. బుధవారం నుంచి శుక్రవారం వరకు విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని భోగాపురం, జామి, ఎస్.కోట, అనంతగిరి మండలాల్లో ఈ బృందం పర్యటించింది. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ప్రత్యేకంగా చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఈ బృందం స్వయంగా పరిశీలించింది. గ్రామాల్లో పనులు కావాలని కోరే ప్రతి ఒక్కరికీ పెద్ద ఎత్తున పనులను కల్పిస్తూనే.. గ్రామాల్లో భారీగా శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టామని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్ అధికారుల బృందానికి వివరించారు. నేరుగా సీఎం కార్యాలయం 22,435 భవన నిర్మాణాల పురోగతిని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోందని తెలిపారు. వీటిలో ఇప్పటికే 14,956 భవనాలను ప్రారంభించామన్నారు. మరో 5,570 భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయని వివరించారు. కాగా వివిధ రాష్ట్రాల అధికారుల బృందం భోగాపురం మండలం సవరవిల్లిలో కొత్తగా నిర్మించిన మూడు రకాల భవనాలను పరిశీలించింది. అలాగే నందిగ్రాంలో అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా కొత్తగా చేపట్టిన చెరువు నిర్మాణంతో పాటు ప్రభుత్వ సాయంతో ఓ లబ్ధిదారుడు సాగు చేసుకుంటున్న కొబ్బరి తోటను కూడా వీక్షించింది. రాష్ట్రమంతా గ్రామాల్లో ప్రజలకు సేవలందించడానికి ఒకే విడతలో 22 వేలకు పైగా భవన నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టడాన్ని వివిధ రాష్ట్రాల అధికారుల బృందం ప్రశంసించింది.

వేడుకగా తెలుగు గళ పురస్కారాలు

15 మందికి అవార్డుల ప్రదానం



భవానీపురం (విజయవాడపశ్చిమ): తెలుగు భాషా వికాసానికి గళంతో కృషిచేస్తున్న పలువురికి శుక్రవారం విజయవాడలో తెలుగు గళ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఏపీ అధికార భాషాసంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ, ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు ప్రసార మాధ్యమాల్లో వ్యాఖ్యాతలు, ప్రయోక్తలు, న్యూస్‌రీ డర్లుగా పని చేస్తున్న 15 మందికి పురస్కారాలను అందచేశారు. ఏపీ అధికార భాషాసంఘం అధ్యక్షుడు పి.విజయ బాబు, కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్, ఏపీ మీడియా అకాడమీ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు, ఏపీ ప్రవాసాంధ్ర తెలుగుసంఘం అధ్యక్షుడు వెంకట్ ఎస్ మేడపాటి, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్.కృష్ణంరాజు తదితరులు అవార్డు గ్రహీతలను సత్కరించి పురస్కారాలను ప్రదానం చేశారు. విజయ బాబు మాట్లాడుతూ తెలుగు భాషా వికాసానికి కేవలం రచనల ప్రాతిపదికనే కాకుండా మౌఖిక భాషకు కూడా ప్రాధాన్యత పెరిగిన నేపథ్యంలో అందులో ప్రతిభావంతులను సత్కరించినట్లు చెప్పారు. తెలుగు భాషా చైతన్యంలో మారుతున్న పరిస్థితుల్లో కలానికి ఎంత బలం ఉందో గళానికి కూడా అంతే ప్రాధాన్యం ఏర్పడిందన్నారు. గళాన్ని కళగా మార్చుకుని తెలుగుభాషకు సేవ చేస్తున్న ప్రతిభావంతులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో సరికొత్త సంప్రదాయంతో ఈ అవార్డులు ఇస్తున్నట్లు చెప్పారు. కొమ్మినేని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ విద్య, వైద్యరంగాలకు అత్యంత ప్రాధాన్యత నిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధికార భాషాసంఘం సభ్యులు జి.రామచంద్రారెడ్డి, డాక్టర్ వెంకటయ్య, ఏపీ ప్రెస్ అకాడమీ కార్యదర్శి ఎం.బాలగంగాధర్‌తిలక్, డాక్టర్ శారద, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

పురస్కారాలు అందుకున్నవారు..

రజనీకాంత్ వెల్లలచెరువు (టీవీ9), స్వప్నసుందరి (స్వప్న) (సాక్షి టీవీ), డాక్టర్ అనిత గడ్డిపాటి (ఏఎన్‌యూ జర్నలిజం విభాగాధిపతి), చుండూరు శాయివెంకటసత్యనారాయణ (జర్నలిస్ట్), దీప్తి వాజ్‌పేయి (టీవీ9), దేవి (ఎన్‌టీవీ), భోగేంద్రనాథ్ పారుపల్లి (ఎన్టీవీ), సౌజన్య నాగర్ (వీ6), స్వర్ణరోజ (జర్నలిస్ట్), రుషి మర్ల (సీఈవో హెచ్‌ఎంటీవీ), టి.సతీష్‌కుమార్ (10 టీవీ), డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ (వ్యాఖ్యాత, తిరుమల తిరుపతి దేవస్థానాలు), డాక్టర్ చుండూరు మాణిక్యారావు (ఆకాశవాణి, విజయవాడ), తంగిరాల అన్నపూర్ణ (వ్యాఖ్యాత, దూరదర్శన్, విజయవాడ) గళ ప్రతిభా పురస్కారాలు, ఏపీ రాష్ట్ర ప్రెస్ అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాలగంగాధర్‌తిలక్ తెలుగు భాషా విశిష్టసేవ పురస్కారం అందుకున్నారు.


సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+4 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 265
శనివారం 16-12-2023
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'




క్రిస్మస్ & సంక్రాంతి
పండుగ వేడుకలు
9TH DEC 2023 - 15TH JAN 2024
FESTIVE
LUCKY
DRAWS
షాపింగ్ చేయండి
గెలుచుకోండి 2+ కోట్ల విలువైన
లక్కీ డ్రాలలో బహుమతులు
SMART TV
32 inches
200
nos
SAMSUNG
Galaxy A7 Lite Tabs
200
nos
NATIONAL
PANASONIC
Electric Rice cookers
600
nos
SILVER
BOWLS
(100 grams each)
200
nos
80
TVS JUPITER
BIKES
Lucky Draws:
17th & 27th December 2023
6th & 15th January 2024
ప్రతి ₹500ల కొనుగోలుపై లక్కీడ్రా కూపన్
వీక్లీ డ్రా రేపే
17th డిసెంబర్ రాత్రి 9 గంటలకు
కస్టమర్ల సమక్షంలో, కస్టమర్ల చేత
లక్కీడ్రా తీయబడును.
ఈ అవకాశం ఆంధ్రప్రదేశ్ షోరూంలలో మాత్రమే
కంచి, ధర్మవరం, ఆరణి, ఉప్పాడ, పోచంపల్లి
నుండి సరికొత్త డిజైన్లలో పట్టు కలెక్షన్
క్రిస్మస్ కొరకు
సరికొత్త పండుగ కలెక్షన్‌లలో
పట్టుచీరలు, మెన్స్ వేర్ & కిడ్స్ వేర్
R.S. Brothers™
బందరు రోడ్, విజయవాడ.
ఫోన్ : 0866 249900
Email : info@rsbrothers.net | Shop us @ www.rsbrothers.net Follow us on : RSBrothersIndia rsbrothersindia
TOLL FREE 1800 570 1999


'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 265

శనివారం 16-12-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



6 జెర్సీలకు.. రూ.65 కోట్లు

వేలంలో రికార్డు ధర పలికిన ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీ జెర్సీలు - స్పోర్ట్స్‌లో



బుల్.. రికార్డుల్..

71 వేల పాయింట్ల శిఖరంపై సెన్సెక్స్.. 21,450 స్థాయి పైకి నిఫ్టీ - బిజినెస్‌లో



వీసా లేకున్నా ఇరాన్ వెళ్లొచ్చు

పర్యాటకులను ఆకర్షించేందుకు భారత్ సహా 33 దేశాల వారికి వీసా లేని ప్రయాణాలకు అనుమతులివ్వనున్నట్లు ఇరాన్ ప్రకటించింది.

వివరాలు 6లో ▸



రాజస్థాన్ సీఎం ప్రమాణం

రాజస్థాన్ సీఎంగా భజన్‌లాల్ శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ వెంటనే సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

వివరాలు 6లో ▸



ఎమ్మెల్యేకు 25 ఏళ్ల జైలు శిక్ష

బాలికపై అత్యాచారం కేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే రామ్‌దులార్ గోండ్‌కు కోర్టు 25 ఏళ్ల జైలు శిక్ష విధించింది.

వివరాలు 6లో ▸



మహిళా జడ్జికి లైంగిక వేధింపులు

తనను జిల్లా జడ్జి లైంగికంగా వేధిస్తున్నారని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ మహిళా జడ్జి సీజేఐకి లేఖ రాయడం కలకలం రేపింది.

వివరాలు 6లో ▸



రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రూ.25 లక్షలు ఉచిత వైద్యం

ఆరోగ్యశ్రీ చికిత్స వ్యయ పరిమితిని భారీగా పెంచిన రాష్ట్ర ప్రభుత్వం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన మంత్రి మండలి సమావేశంలో ఆమోదం

- ఆరోగ్యశ్రీకి ఏడాదికి రూ.4,400 కోట్ల వ్యయం.. ఎల్లుండి ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం
- 19 నుంచి ఆరోగ్యశ్రీ, జగనన్న సురక్ష కార్యక్రమాలపై అవగాహన
- జగనన్న సురక్ష లబ్ధిదారులకు మందులు ఉచితంగా డోర్ డెలివరీ
- ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వైద్యుల పర్యటన
- ఈనెల 21న 4.35 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు
- 62వేల తరగతి గదుల్లో ఐఎఫ్‌పీ ప్యానళ్లు
- 26 నుంచి 51 రోజుల పాటు 'ఆడుదాం ఆంధ్ర' నిర్వహణ
- జనవరి 1 నుంచి 'వైఎస్సార్ పింఛన్ కానుక' రూ.3 వేలకు పెంపు
- వచ్చే నెలలోనే పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు 'వైఎస్సార్ ఆసరా'
- తుది విడత కింద రూ.6,394 కోట్ల పంపిణీకి ఏర్పాట్లు.. జనవరి 29 నుంచి పది రోజులు పండుగ వాతావరణలో 'వైఎస్సార్ చేయూత'
- ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతిపై మంత్రి మండలి సంతాపం

2లో

ఎన్నికలకు సన్నద్ధం

మంత్రులకు సీఎం జగన్ దిశానిర్దేశం

ఈసారి సార్వత్రిక ఎన్నికలకు కాస్త ముందే షెడ్యూలు రావచ్చు

ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి ఉధృతంగా వెళ్లండి

గత నాలుగున్నరేళ్లుగా మనం చేసిన మంచిని ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరించండి

175 స్థానాల్లోనూ విజయమే మన లక్ష్యం

2లో

రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జి దుర్మరణం



- మరో ముగ్గురికి గాయాలు
- పశ్చిమ గోదావరి జిల్లా చెరుకువాడ వద్ద ఎదురెదురుగా కార్లు ఢీకొనడంతో ఘటన
- గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం జగన్ సంతాపం

5లో

ఉదారంగా సిఫార్సులు చేయండి

- తుపాను, కరువు ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర బృందానికి సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి
- రాష్ట్ర ప్రభుత్వ అప్రమత్తత వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించగలిగారన్న కేంద్ర బృందం
- తుపాను నష్టంపై కేంద్రానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని వెల్లడి

3లో

ఏడు రోజుల్లో పరిష్కరించాలి



- తొలిదశ నాడు–నేడు స్కూళ్లలో మరమ్మతులు, నిర్వహణపై విద్యా శాఖ ఆదేశాలు
- ప్రధానోపాధ్యాయుడు వారంటీ సంస్థలకు వెంటనే సమాచారమివ్వాలి
- బాలబాలికలకు వేర్వేరు టాయిలెట్లలో నిరంతర నీటి సరఫరా
- తరగతి గదుల రూఫ్, ఫ్లోరింగ్, డోర్లు, కిటికీలు ఎప్పటికప్పుడు పరిశీలన
- ఫ్యాన్లు, లైట్లు మొరాయిస్తే వెంటనే మరమ్మతులు.. స్కూల్ ప్రాంగణం ఆహ్లాదంగా ఉండేలా చర్యలు

5లో

మార్కాపురం కిడ్నీ బాధితులకు ప్రభుత్వం భరోసా

బోధనాస్పత్రిలో యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాల ఏర్పాటు



నెఫ్రాలజీ విభాగంలో ఇప్పటికే 21 పోస్టులు మంజూరు.. ఇప్పటికే ఉద్దానం సమస్యకు శాశ్వత పరిష్కారం

రూ.700 కోట్లతో వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు.. రూ.85 కోట్లతో కిడ్నీ సూపర్ స్పెషాలిటీ సేవలు

వీటిని ప్రారంభించి అందుబాటులోకి తెచ్చిన సీఎం వైఎస్ జగన్

3లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

అమ్మా.. నాన్నా.. పిలుపుతో పరవశం

పుట్టుకతో బధిరులైన నా ఇద్దరు పిల్లలకు మాట నేర్పి పునర్జన్మ ఇచ్చిన గొప్ప ప్రభుత్వం ఇది. నా బిడ్డలకు రూ.14 లక్షలు ఖర్చయ్యే ఆపరేషన్లు ఉచితంగా చేశారు. మాది బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అల్లవరం మండలం ఊటగుంట సావరం గ్రామం. మాది మేనరికం వివాహం. మాకు ఒక కుమారుడు, ఒక కుమార్తె. ఇద్దరూ మూగ, చెవుడు సమస్యతో పుట్టారు. నేను కార్పెంటర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. పిల్లలకు మాటలు రాక ఎంతో ఆందోళన పడేవాళ్లం. పిల్లలకు వైద్యం చేయించాలని ఎన్నో ఆస్పత్రులకు తిరిగినా ఫలితం కనిపించలేదు. పిల్లల శస్త్ర చికిత్సకు లక్షల్లో ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. రెక్కాడితే గాని డొక్కాడని మేము అంత ఖర్చు ఎక్కడ చేయగలం? 2021 డిసెంబర్‌లో విశాఖలోని ఈఎన్‌టీ ఆస్పత్రికి వెళ్లాం. నా కుమారుడు మోహన్‌కృష్ణను అక్కడి వైద్యులకు చూపించాను. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేశారు. ఫలితంగా నా కుమారుడు ఇప్పుడు మాట్లాడగలుగుతున్నాడు. ఏడు లక్షల రూపాయలు ఖరీదు చేసే చికిత్సను ఈ ప్రభుత్వం ఉచితంగా చేసి నా



కుమారుడికి కొత్త జీవితాన్ని ఇచ్చింది. ఇప్పుడు స్కూలుకు కూడా వెళ్తున్నాడు. అమ్మా.. నాన్నా.. అని నోరారా పిలుస్తుంటే పరవశించి పోతున్నాం. ఇటీవల నా కుమార్తె కడలి దివ్య వెంకట సత్యకు (మూడున్నర సంవత్సరాలు) కూడా విశాఖ ఈఎన్‌టీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్స చేయించాం. త్వరలో డిశ్చార్జి చేస్తామని చెప్పారు. పిల్లలతో అమ్మా–నాన్న అని పిలిపించుకోలేమేమో అని ఎంతో ఆందోళనకు గురయ్యాం. ఇక ఆ బెంగలేదు. మా పిల్లలకు మాట నేర్పిన దేవుడు జగనన్న.

– కడలి మనోహర్, ఊటగుంట సావరం

(వెలవలపల్లి శ్రీనివాసరావు, విలేకరి, మహారాణిపేట విశాఖపట్నం)

అప్పుల తిప్పలు లేవిక

మా ఆయన 14 ఏళ్ల క్రితం కాలం చేశారు. నేను రోజువారీ కూలిపనికి వెళ్లేదాన్ని. వేసవి, వర్షాకాలాల్లో అనారోగ్యం సంభవించినప్పుడు రోజు గడవడం కష్టమయ్యేది. మందులు కూడా కొనుగోలు చేయలేక పోయేదాన్ని. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం ముక్కెళ్ల గ్రామంలో పురాతన సొంతిల్లు ఉండేది. దానివల్ల అద్దె భారం లేకపోయినా జీవనానికి ఇబ్బంది పడేవాళ్లం. తప్పనిసరి పరిస్థితుల్లో ఇద్దరు అబ్బాయిలు ఉపాధి కోసం హైదరాబాద్ వలస వెళ్లినా, వారి బతుకు వారు బతకడానికే అక్కడి ఆదాయం సరిపోతుండేది. నేను ఇందిరమ్మ పొదుపు సంఘంలో సభ్యురాలిని. బతుకుదెరువు కోసం టైలరింగ్‌లో శిక్షణ పొంది ఉండడంతో కుట్టుపని ప్రారంభించాను. స్నేహితులు, బంధువులు సహకరించడంతో కొంత వరకూ బతుకీడ్చాను. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గతంలో నేను తీసుకున్న రుణం మాఫీ చేయడంతో వైఎస్సార్ ఆసరా కింద గత మూడేళ్లలో 24,000



రూపాయలు వచ్చింది. కాపు నేస్తం కింద ఏటా 15,000, చేదోడు కింద 10,000 రూపాయలు వచ్చాయి. దాంతో హైదరాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో చీరలు, ఇతర వస్త్రాలు తెప్పించి ఆ వ్యాపారం చేపట్టాను. ఇప్పుడు నెలకు రూ.20 వేలకు పైగా ఆదాయం వస్తోంది. ఈ ప్రభుత్వం ఇచ్చిన తోడ్పాటుతో ఇప్పుడు నా జీవితం ప్రశాంతంగా, అప్పుల బెంగ లేకుండా సాఫీగా సాగుతోంది.

– సుజాతమ్మ, ముక్కెళ్ల

(గవిని శ్రీనివాసులు, విలేకరి, కర్నూలు)

ఇంజినీరింగ్ కల సాకారం

మా నాన్న రాడ్ బెండింగ్ పనులు చేస్తూ.. తద్వారా వచ్చిన కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. నాకు ఒక తమ్ముడు ఉన్నాడు. మా ఇద్దరి చదువు మా నాన్నకు భారంగా మారింది. ఈ ప్రభుత్వం అందించిన విద్యా దీవెన పథకంతో



మా సొంత ఊరైన తిరుపతి జిల్లా నాయుడుపేటలో ఇంటర్ పూర్తి చేశాను. ఇంజినీరింగ్ చేయాలని నా ఆకాంక్ష. మా తల్లిదండ్రులు పెద్ద చదువులు చదివించలేరనుకుని ఆలోచనలో పడ్డా. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాలాంటి పేద విద్యార్థులకు తోడ్పాటును అందించేందుకు తీసుకువచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందని చెప్పడంతో విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ పూర్తి చేశా. తొలి ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా రూ.73,000 అందించారు. మరో రెండు నెలల్లో రెండో ఏడాదికి సంబంధించిన నగదు జమ కానుంది. ఈ ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో నేను ఈ రోజు ఉన్నత చదువు కొనసాగిస్తున్నా. నాకు ఉద్యోగం వస్తే నా కుటుంబం పరిస్థితి మారిపోతుందని నమ్ముతున్నా. ఇదంగా సీఎం జగన్ చలువేనని చెప్పేందుకు ఎంతో సంతోషపడుతున్నా.

– మొండెం అజయ్, నాయుడుపేట

(ఎస్.ముత్యాలయ్య, విలేకరి, నాయుడుపేట)

రూ.25 లక్షలు ఉచిత వైద్యం

ఆరోగ్యశ్రీ చికిత్స వ్యయ పరిమితిని భారీగా పెంచిన రాష్ట్ర ప్రభుత్వం

ముఖ్యమంత్రి జగన్ అధ్యక్షతన మంత్రి మండలి సమావేశంలో ఆమోదం

సాక్షి, అమరావతి: ప్రజారోగ్య పరిరక్షణలో మరో విప్లవాత్మక నిర్ణయానికి క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ లభించింది. పేద కుటుంబాలకు పునర్జన్మ ప్రసాదిస్తున్న అపర సంజీవని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఉచిత వైద్య పరిమితిని ఏకంగా రూ.25 లక్షలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ వైద్యశాలల్లో కార్పొరేట్ వైద్యాన్ని అందించడంతో పాటు ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ అధునాతన వైద్య సేవలు పొందేలా ఆరోగ్యశ్రీని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బలోపేతం చేయడం తెలిసిందే. ఇప్పటికే క్యాన్సర్ లాంటి మహమ్మారి బారిన బాధితులకు పరిమితి లేని చికిత్సలు అందిస్తూ ఆరోగ్యశ్రీ సంజీవనిగా మారింది. వార్షిక ఆదాయం రూ.5 లక్షలు ఉన్న ప్రతి ఒక్క కుటుంబాన్ని ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చడంతో రాష్ట్రంలో 90 శాతం కుటుంబాలు ఆరోగ్యశ్రీతో లబ్ధి పొందుతున్నాయి. నాలుగున్నరేళ్లలో 37.40 లక్షల మంది ఆరోగ్యాలకు భరోసానిస్తూ వివిధ జబ్బుల చికిత్సకు 53,02,816 ప్రొసీజర్లతో ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం రూ.11,859.86 కోట్లు ఖర్చు చేసింది. గతంలో సుస్తీ చేస్తే వైద్య ఖర్చులకు కుటుంబాలు అప్పుల పాలై పేదలు జీవన ప్రమాణాలు క్షీణించేవి. అలాంటి దుస్థితి ఏ ఒక్కరికీ రాకూడదనే సంకల్పంతో ఆరోగ్యశ్రీ వైద్య పరిమితి, ప్రొసీజర్లను రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచింది. మరోవైపు గత ఎన్నికల్లో చెప్పిన మాటను తు.చ. తప్పకుండా ఆచరిస్తూ మేనిఫెస్టోలో పేర్కొన్న మరో హామీని సంపూర్ణంగా నెరవేరుస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించింది. ప్రస్తుతం రూ.2,750గా ఉన్న వైఎస్సార్ పింఛన్ కానుకను జనవరి 1వ తేదీ నుంచి రూ.3 వేలకు పెంచాలని నిర్ణయించింది. తద్వారా 65.33 లక్షల మంది వృద్ధులు, వితంతువులు, చర్మకారులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులకు మరింత ఆర్థిక భరోసా కల్పిస్తోంది. గత సర్కారు హయాంలో పింఛన్ల కోసం నెలకు రూ.400 కోట్లు మాత్రమే వ్యయం చేయగా ఇప్పుడు తాజా పెంపుతో పింఛన్ల వ్యయం నెలకు రూ.2 వేల కోట్లకు పెరగనుంది. ఈ మేరకు శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర లభించింది. ఈ నేపథ్యంలో జనవరిలో సంక్రాంతికి తోడు పేదల ఇంట సంక్షేమ పథకాల పండగ సందడి చేయనుంది. జనవరి 10వతేదీ నుంచి 23వరకు చివరి విడత వైఎస్సార్ ఆసరా, జనవరి 29 నుంచి ఫిబ్రవరి 10 వరకు వైఎస్సార్ చేయూత కార్యక్రమాలను అమలు చేయనున్నారు. సమాచార, పౌర సంబంధాలు, బీసీ సంక్షేమ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మంత్రి మండలి నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు.

దేశ ప్రజారోగ్య చరిత్రలో కీలక మైలురాయి

పేదలకు ఉచిత వైద్య సేవల కోసం గత సర్కారు ఏడాదికి రూ.వెయ్యి కోట్లు మాత్రమే ఖర్చు చేయగా ఇప్పుడు ఏడాది 4,400 కోట్లు వెచ్చిస్తున్నాం. ఇప్పటి వరకు ఒక్క క్యాన్సర్ ప్రొసీజర్స్‌లోనే వైద్యానికి రూ.1,897 కోట్లు వ్యయం చేశాం. ఇక ఆరోగ్యశ్రీ కొత్త కార్డుతో ఆస్పత్రికి వెళ్తే రూ.25 లక్షల వరకూ ఉచితంగా వైద్యం అందిస్తాం. ఇది దేశంలోని ప్రజారోగ్య చరిత్రలో అతిపెద్ద మైలు రాయి. ఈ నెల 18న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల పంపిణీని ప్రారంభిస్తారు. గతంలో ఆరోగ్యశ్రీలో 1,059 ప్రొసీజర్స్ మాత్రమే ఉండగా, సీఎం జగన్ వీటిని ఏకంగా 3,257కి పెంచడం ప్రజారోగ్యం పట్ల చిత్తశుద్ధికి నిదర్శనం. ఆరోగ్యశ్రీ, ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను మరింత సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంపై సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. 19వ తేదీ నుంచి ప్రతి నియోజకవర్గంలోని ఐదు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో కొత్త కార్డుల పంపిణీ చేపడతాం. ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు పొందడంపై జనవరి నెలాఖరు/ఫిబ్రవరి తొలి వారంలోగా ఆశ వర్కర్లు, సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంల ద్వారా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తాం. ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రజల ఫోన్లలో డౌన్‌లోడ్ చేస్తారు. ఆరోగ్యశ్రీ యాప్‌లో సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల వివరాలు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో అందే వైద్య సేవల సమగ్ర డేటా అందుబాటులో ఉంటుంది. ఆరోగ్యశ్రీ చికిత్సను 104 కాల్ సెంటర్, విలేజ్ హెల్త్ క్లినిక్, 108 అంబులెన్స్, ఫ్యామిలీ డాక్టర్, స్థానిక పీహెచ్‌సీల ద్వారా పొందడంపై ప్రతి ఒక్కరికీ తెలియచేస్తాం. ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో వ్యాధి నిర్ధారణ జరిగి చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీస్తాం. ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొంది తిరిగి డాక్టర్ చెకప్ కోసం వెళ్లాల్సి వస్తే రవాణా ఖర్చుల కింద రూ.300 చెల్లిస్తాం. డాక్టర్ చెకప్‌కు 10 రోజులు ముందే ఏఎన్‌ఎంతో సమాచారం అందిస్తాం.

మందులు డోర్ డెలివరీ..

ఫేజ్–2 జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గుర్తించిన వ్యాధిగ్రస్తులకు మందులు నేరుగా ఉచితంగా డోర్ డెలివరీ చేస్తాం. మందులు అయిపోతే వాటి కోసం ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్‌లోనే ఇండెంట్ తీసుకుని విలేజ్ క్లినిక్స్ నుంచి ఏఎన్‌ఎంలు ద్వారా బాధితులకు చేరుస్తాం. తపాలా శాఖ సహాయంతో వేగంగా, డబ్ల్యూహెచ్‌ఓ, జీఎంపీ ప్రమాణాలు కలిగిన మందుల పంపిణీ చేస్తాం. ఇందుకోసం ప్రత్యేక ఎస్‌ఓపీ రూపొందించాం. సూపర్ స్పెషాల్టీ సేవలందించే వైద్యులకు రూ.4 లక్షల వరకూ జీతాలు ఇస్తున్నాం. వైద్యశాఖలో 53 వేల పోస్టులను భర్తీ చేసి దాదాపు జీరో వేకెన్సీని తీసుకొచ్చాం. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.668 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలను కూడా చెల్లించాం.

10 రోజుల పాటు 'వైఎస్సార్ చేయూత'

పేద అక్కచెల్లెమ్మల ఆర్థిక స్వావలంబన, సాధికారత లక్ష్యంగా వైఎస్సార్ చేయూత పంపిణీని మంత్రి మండలి ఆమోదించింది. జనవరి 29 నుంచి ఫిబ్రవరి 10 వరకూ పది రోజుల పాటు వైఎస్సార్ చేయూత సాయాన్ని ప్రభుత్వం అందించనుంది. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయసున్న అక్కచెల్లెమ్మల జీవనోపాధి కల్పనకు ఏటా రూ.18,750 చొప్పున అందిస్తూ సీఎం జగన్ నాలుగేళ్లు అండగా నిలిచారు.

26 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' మెగా టోర్నీ డిసెంబర్ 26 నుంచి ప్రారంభం కానుంది. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ డబుల్స్, ఖోఖో, కబడ్డీతో పాటు సాంప్రదాయ క్రీడలైన యోగ, మారథాన్, టెన్నీకాయిట్ పోటీలు ఏర్పాటు చేస్తున్నాం. దాదాపు రూ.120 కోట్ల వ్యయంతో 51 రోజుల పాటు పోటీలు నిర్వహిస్తాం.



మంత్రిమండలి సమావేశంలో సీఎం జగన్

'వైఎస్సార్ ఆసరా' తుది విడత

చంద్రబాబు మాయమాటలతో నమ్మి మోస పోయిన పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలను సీఎం జగన్ మంచి మనసుతో ఆదుకున్నారు. ఇప్పటికే వైఎస్సార్ ఆసరా ద్వారా మూడు విడతల్లో 78.81 లక్షల మంది పొదుపు మహిళలకు రూ.19,165.28 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశారు. చివరి విడతగా రూ.6,394 కోట్లు పంపిణీ చేయనున్నారు. జనవరి 10 నుంచి జనవరి 23 వరకు ప్రతి నియోజవర్గంలో ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున పండగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

4.35 లక్షల మందికి ట్యాబ్‌లు

ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ట్యాబ్‌ల పంపిణీకి శ్రీకారం చుట్టాం. పేద విద్యార్థులకు డిజిటల్ బోధన అందించడంలో భాగంగా రూ.638 కోట్ల వ్యయంతో 4.35 లక్షల ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నాం. గతంతో పోలిస్తే ట్యాబ్‌ల సాంకేతిక సామర్థ్యాన్ని పెంచాం. విదేశీ భాషలు నేర్చుకునేందుకు వీలుగా డ్యుయో లింగో యాప్, విద్యార్థుల సందేహాల నివృత్తికి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టూల్‌ను ఇన్‌స్టాల్ చేస్తున్నాం. డిసెంబరు 21 నుంచి 31వరకు ట్యాబ్‌ల పంపిణీ కొనసాగుతుంది. వీటితో పాటు 6వ తరగతి, ఆపై ప్రతి తరగతి గదిలో ఐఎఫ్‌పీ ప్యానళ్ల ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. తద్వారా 62 వేల తరగతి గదుల్లో ఐఎఫ్‌పీ ప్యానళ్లు అందుబాటులోకి వస్తాయి.

ఏడు ఆసుపత్రుల్లో అత్యాధునిక క్యాన్సర్ చికిత్స

- కడప ప్రభుత్వ వైద్యకళాశాలలో 300 పడకలతో సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో పేదలకు మెరుగైన, అత్యాధునిక వైద్యాన్ని అందించేందుకు వీలుగా నూతనంగా 293 పోస్టుల భర్తీ ప్రతిపాదనకు ఆమోదం.
- గుంటూరు సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో 18 హెడ్ నర్స్, నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టుల భర్తీ.
- రాష్ట్రంలోని 11 పాత వైద్య కళాశాలల్లో ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు అందించేందుకు నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, మార్కాపురంలో యూరాలజీ విభాగం ఏర్పాటు.
- విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కొత్త మెడికల్ కాలేజీలలో గైనిక్, పీడియాట్రిక్, అనస్థీసియా విభాగాల్లో 95 పోస్టుల భర్తీ.
- విజయనగరం జిల్లా చీపురుపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) 50 పడకల నుంచి 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్.
- రాష్ట్రవ్యాప్తంగా 7 ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక చికిత్స అందించేందుకు కొత్తగా కేన్సర్ విభాగాల ఏర్పాటు. శ్రీకాకుళం, కాకినాడ, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, అనంతపురంలో 64 పోస్టులతో ఆంకాలజీ–రేడియేషన్, సర్జికల్, మెడికల్ ఆంకాలజీ విభాగం ఏర్పాటు.

కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీలో కీలక సంస్కరణలు..

కుల, ఆదాయ ధ్రువపత్రాల మంజూరులో ప్రభుత్వం కీలక సంస్కరణలు తెచ్చింది. సర్టిఫికెట్ల జారీలో జాప్యాన్ని నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. గతంలో కుటుంబ సభ్యులకు జారీ చేసిన కుల ధ్రువపత్రం ఆధారంగానే గ్రామ, వార్డు సచివాలయాల్లో వేగంగా కులధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని అందించే బాధ్యతను అధికారులకే అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలకు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. దరఖాస్తుదారుల జాబితా నేరుగా గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్తుంది. ఆ జాబితాపై సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ చేస్తారు. అందులో విఫలం అయితే రెవెన్యూ సిబ్బందికి పంపుతారు. వారు వెంటనే పరిశీలన చేసిన ఆటోమేటిక్‌గా నిర్ధారిస్తారు. గత రెండేళ్లలో దాదాపు 75 లక్షల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీచేశాం. ఒక్క జగనన్న సురక్ష కార్యక్రమంలోనే 39 లక్షల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందించాం.

ఉదారంగా మిచాంగ్ సాయం..

మిచాంగ్ తుపాన్ నష్టంపై మంత్రి మండలి సుదీర్ఘంగా చర్చించింది. ప్రభుత్వం తక్షణ సహాయం కింద రూ.52.47 కోట్లు విడుదల చేసింది. శిబిరాలకు వచ్చిన వారికే కాకుండా ఇళ్లలో నీళ్లు నిలిచిన వారందరికీ కూడా ప్రత్యేక సహాయం అందించింది. ఒంటరి వ్యక్తి అయితే రూ.వెయ్యి, కుటుంబానికి రూ.2,500 చొప్పున 1.10 లక్షల మందికి సహాయం అందించాం. గతంలో ఇలాంటి సాయం ఎన్నడూ అందలేదు. ప్రత్యేక ఆర్థిక సహాయం కింద రూ.28.07 కోట్లు పంపిణీ చేశాం.

విశాఖ మెట్రో డీపీఆర్‌కు ఆమోదం..

- విశాఖపట్నంలో 4 కారిడార్లలో 76.9 కి.మీ. నిడివితో లైట్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ డీపీఆర్‌కు మంత్రిమండలి ఆమోదం.
- కొత్తగా ఏర్పాటైన 26 రెవెన్యూ డివిజనల్ కేంద్రాల్లో 26 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఓకే.
- జలజీవన్ మిషన్ కింద గ్రామ జలసంఘం కమిటీల ఏర్పాటు. గ్రామంలో ప్రతి ఇంటికి సురక్షిత తాగు నీరు అందించడమే లక్ష్యంగా ప్రణాళిక అమలు.
- శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో గురుకుల పాఠశాల నుంచి అప్‌గ్రేడ్ అయిన మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ మహిళా గురుకుల కళాశాలలో రెగ్యులర్ విధానంలో 2, అవుట్ సోర్సింగ్ విధానంలో 6 పోస్టుల భర్తీ.
- గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో 251 (తెలుగు భాషా పండితులు 98, హిందీ భాషా పండితులు 93, ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ టీచర్స్ 60) పోస్టుల అప్‌గ్రేడ్.
- 15 ఆర్థిక సంఘం విధులు సజావుగా నిర్వహించేందుకు 10 పోస్టులు తాత్కాలిక విధానంలో భర్తీ.
- యాంటీ నక్సలైట్ ఆపరేషన్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి అందించే యాంటీ నక్సలైట్ స్క్వాడ్ అలవెన్స్ బేసిక్ పేలో 15 శాతం ఇంక్లూడ్.
- కేంద్ర ఉద్యోగులతో సమానంగా జ్యుడీషియల్ అధికార్లకు డీఏ, జ్యుడీషియల్ పెన్షనర్లకు డీఆర్ ఇస్తూ విడుదల చేసిన జీవోలకు ఆమోదం.
- నవంబర్ 10 నుంచి డిసెంబర్ 6వ తేదీ మధ్య 50 ఎకరాలలోపు భూములకు సంబంధించిన ఏపీఐఐసీ ద్వారా కేటాయించిన 110 అలాట్‌మెంట్‌లకు ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డులో విలీనం. ఇకపై ఏపీ మారిటైం బోర్డు పరిధిలోనే ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం
- కొత్తగా ఏర్పాటైన కమలాపురం నగర పంచాయతీలో వివిధ విభాగాల్లో 7 పోస్టుల భర్తీ. కమలాపురం, మీరాపురం గ్రామ పంచాయతీలను విలీనం చేసి కమలాపురం నగర పంచాయతీగా ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఇప్పటికే ఉనికిలో ఉన్న 14 పోస్టులు తగిన కేడర్‌లో సర్దుబాటు.
- పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో అదనపు జిల్లా జడ్జి, సెషన్స్ జడ్జి కోర్టు ఏర్పాటు. న్యాయ శాఖలో 2 డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీ.
- తూర్పు గోదావరి జిల్లా దేవరాపల్లిలో ఆర్ అండ్ బీ యూనిట్ కార్యాలయం ఏర్పాటు.
- సాధారణ ఎన్నికల విధుల నిర్వహణకు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ఎలక్షన్ ఆఫీసర్, రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయాల్లో వివిధ కేటగిరీలలో 982 మంది తాత్కాలిక పద్ధతిలో నియామకం.

అభివృద్ధి ప్రతిపాదనలకు ఆమోదం..

- ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం రాయనపాడులో 20 సెంట్ల ప్రభుత్వ భూమి సీఐడీ ప్రాంతీయ కార్యాలయ నిర్మాణానికి కేటాయింపు.
- అన్నమయ్య జిల్లా చిట్వేలు, కోడూరు, సంబేపల్లె మండలాల్లో జిల్లా హరిజన డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు చెందిన 1,269 ఎకరాలు భూమిలేని 769 మంది ఎస్సీ, ఎస్టీ పేదలకు పంపిణీ.
- విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం తర్లువాడలో 7 ఎకరాల భూమి నేషనల్ స్కిల్ ఇనిస్టిట్యూట్‌తో పాటు రీజనల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ శాశ్వత భవనాల కోసం కేటాయింపు.
- ప్రముఖ జానపద కళాకారుడు వంగపండు ప్రసాదరావు సతీమణి వంగపండు విజయలక్ష్మికి విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం నరవలో 1,000 చదరపు గజాల ఇంటి స్థలం గజం రూ.10కే ఇచ్చేందుకు ఆమోదం.
- విశాఖపట్నం జిల్లా మధురవాడ వద్ద 11.25 ఎకరాల భూమి ఎకరం రూ.కోటి చొప్పున బెంగళూరుకు చెందిన టీఐఎస్‌బీ ఇంటర్నేషనల్ స్కూల్‌కు కేటాయింపు. ఇందులో 25 శాతం సీట్లు విద్యా హక్కు చట్టం కింద, మరో 25 శాతం సీట్లు స్థానికులకు ఉచితంగా కేటాయించాలని నిబంధన.
- పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం నాగూరులో మూడు సర్వే నెంబర్లలో సుమారు 10 ఎకరాల భూమి సైంటిఫిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ అండ్ ఫిట్నెస్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటుకు రహదారులు, భవనాల శాఖకు ఉచితంగా కేటాయింపు.
- కర్నూలు జిల్లా ఆదోని మండలం ఎస్.కొండాపురం, బైచిగిరి, కాపటి గ్రామాలకు చెందిన సుమారు 10 ఎకరాల భూమి ఆర్టీవో కార్యాలయం, డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ ఏర్పాటు కోసం రహదారులు, భవనాల శాఖకు కేటాయింపు.
- బీచ్ టూరిజం అభివృద్ధిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖకు శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి వద్ద 5 ఎకరాల భూమి కేటాయింపు.
- కర్నూలు జిల్లా కల్లూరు మండలం లక్ష్మీపురం, దూపాడు గ్రామాలకు చెందిన 5.68 ఎకరాల భూమి పర్యాటకరంగ అభివృద్ధి కోసం పర్యాటకశాఖకు కేటాయింపు.

ఎన్నికలకు సన్నద్ధం

మంత్రులకు సీఎం జగన్ దిశానిర్దేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని మంత్రులకు సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. 2019లో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ మార్చి 10న వచ్చిందని పేర్కొంటూ ఈ సారి కాస్త ముందుగానే వెలువడే అవకాశం ఉందన్నారు. నాలుగున్నరేళ్లుగా ప్రజలతో మమేకమవుతున్నామని, 175 స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలను సమన్వయం చేసుకుంటూ ఇకపై మరింత ఉద్ధృతంగా జనంలోకి వెళ్లాలని మార్గనిర్దేశం చేశారు. శుక్రవారం వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో సీఎం జగన్ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం సందర్భంగా అజెండా అంశాలపై చర్చ ముగిశాక అధికారులు నిష్క్రమించారు. తర్వాత సమకాలీన రాజకీయ పరిస్థితులపై సీఎం జగన్ మంత్రులతో చర్చించారు. నాలుగున్నరేళ్లుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో సాకారమైన విప్లవాత్మక మార్పులను ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరించాలన్నారు.

వరుస కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి..

ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఈనెల 21 నుంచి ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు సమన్వయం చేసుకుంటూ విస్తృతంగా పాల్గొనాలని సీఎం జగన్ సూచించారు. వృద్ధాప్య పింఛన్ రూ.2,000 వేల నుంచి రూ.3 వేలకు పెంచుకుంటూ పోతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. జనవరి 1 నుంచి రూ.3 వేలకు పెంచి పంపిణీ చేసే కార్యక్రమాన్ని జనవరి 8 వరకూ నిర్వహిస్తామని, అందులో విస్తృతంగా పాల్గొనాలని సూచించారు. జనవరి 10 నుంచి 23 వరకూ వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కింద మహిళా సంఘాలకు నిధుల జమ కార్యక్రమంతో పాటు వైఎస్సార్ చేయూత పథకం కింద మహిళల ఖాతాల్లో నిధుల జమ కార్యక్రమాన్ని జనవరి 29 నుంచి ఫిబ్రవరి 10 వరకూ నిర్వహిస్తున్నామని, అందులో విస్తృతంగా పాల్గొనాలని ఆదేశించారు. నాలుగున్నరేళ్లుగా మనం చేసిన మంచిని ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తూ, ఎల్లో మీడియాతో కలిసి టీడీపీ, జనసేన చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని మార్గనిర్దేశం చేశారు.

జగన్నినాదాలతో ప్రతిధ్వనించిన నెల్లూరు

- విప్లవాత్మక సంస్కరణలతో విద్యాకాంతులు
- విద్యార్థి సాధికారత జగనన్నతోనే..
- కదం తొక్కిన విద్యార్థులు

నెల్లూరు (బారకాసు): విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విద్యార్థులు జేజేలు పలికారు. వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు జై జగన్.. జైజై జగన్.. జయహో జగన్ మామ.. అంటూ చేసిన నినాదాలతో నెల్లూరు నగరం ప్రతిధ్వనించింది. విద్యార్థి సాధికారత కోసం సీఎం చేస్తున్న కార్యక్రమాల వివరాలున్న ఫ్లెక్సీలు రెపరెపలాడాయి. బడుగు, బలహీన విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి అమలు చేస్తున్న పథకాలు, విద్యార్థులు చదువుకునేందుకు ఇస్తున్న ప్రోత్సాహకాలు వివరిస్తూ విద్యార్థులు, నేతలు కదం తొక్కారు. నగరంలో భారీగా విద్యార్థులు నిర్వహించిన ర్యాలీ ఆసాంతం అందరినీ ఆకర్షించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన తదితర పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వేలనోళ్ల ప్రశంసించడం వినిపించింది. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరులో నిర్వహించిన 'విద్యార్థి సాధికారత జగనన్నతోనే సాధ్యం' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వీఆర్సీ క్రీడామైదానం నుంచి ట్రంకురోడ్డు గాంధీబొమ్మ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు, యువతీ యువకులు ఫ్లెక్సీలు పట్టుకుని విద్యారంగాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ నినాదాలు చేశారు. జగనన్న మళ్లీ సీఎం కావాలంటూ ఆకాంక్షించారు. ముఖ్య అతిథి వైఎస్సార్ కాంగ్రెస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత చదువుకు భరోసా ఇస్తున్న వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడాలేని విధంగా పేద విద్యార్థుల చదువుకు భరోసా కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్ అమ్మఒడి పథకం, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్యాదీవెన తదితర పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కార్పొరేట్, ప్రైవేట్ విద్యకు ప్రాధాన్యం ఇస్తారని, వారు అధికారంలోకి వస్తే పేద విద్యార్థులు చదువు మానుకోవాల్సిందేనని పేర్కొన్నారు. ఈ క్రమంలో యావత్ విద్యార్థి లోకమంతా జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని బహిరంగంగా ప్రతినబూనుతున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరులో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా...

పటేల్, పొట్టి శ్రీరాములుకు సీఎం వైఎస్ జగన్ ఘన నివాళి



సాక్షి,అమరావతి: భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్, అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా సచివాలయంలో వారి ఇద్దరి చిత్రపటాల వద్ద సీఎం జగన్ పూలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ నందిగం సురేష్ పాల్గొన్నారు. 'ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలు కోల్పోయిన మహనీయులు, తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక పొట్టి శ్రీరాములు. తన ప్రాణత్యాగంతో ప్రత్యేక తెలుగు రాష్ట్రం ఏర్పడేలా చేసి, అమరజీవిగా నిలిచారు. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు' అంటూ సీఎం వైఎస్ జగన్ శుక్రవారం ఎక్స్(ట్విట్టర్)లో పోస్టు చేశారు.

26 డీఎల్‌డీవో పోస్టుల మంజూరుపై హర్షం



సీఎం జగన్‌ను కలిసిన ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన 26 రెవెన్యూ డివిజన్లకు అదనంగా మరో 26 డీఎల్‌డీవో పోస్టులను మంజూరు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడంపై గ్రూపు-1 అధికారుల సంఘం నాయకులు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రూపు-1 అధికారులు శ్రీకాంత్‌రెడ్డి, మహేష్, భార్గవి తదితరులు సీఎం జగన్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. 250 మందికి పైగా ఎంపీడీవోలకు ఒకేసారి పదోన్నతులు లభించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. మరో ప్రకటనలో పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల సంఘం గౌరవ అధ్యక్షుడు దేవరకొండ వెంకట్రావు, అధ్యక్షుడు నారాయణరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు జీవీ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కేఎన్‌వీ ప్రసాదరావు, కన్వీనర్ నారి బుజ్జి సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉదారంగా సిఫార్సులు చేయండి

తుపాను, కరువు ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర బృందానికి సీఎం జగన్ విజ్ఞప్తి

- రాష్ట్రంలో రైతులను తుదివరకూ ఆదుకునేలా వ్యవస్థలున్నాయి
- దీనివల్ల సహాయం, పరిహారం అత్యంత పారదర్శకంగా రైతులకు చేరుతుందన్న సీఎం
- రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తతతో ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించగలిగారన్న కేంద్ర బృందం
- సచివాలయాల రూపంలో గ్రామస్థాయిలో బలమైన వ్యవస్థ ఉందని ప్రశంస
- విపత్తు సందర్భాల్లో క్షేత్రస్థాయిలో అనుసరిస్తున్న మార్గాలు బాగున్నాయని కితాబు
- ఈ-క్రాపింగ్ లాంటి విధానం దేశంలో ఎక్కడాలేదని ప్రశంస
- ఇవి ఇతర రాష్ట్రాలూ అనుసరించదగ్గవి..
- తుపాను నష్టంపై కేంద్రానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని బృందం వెల్లడి



కేంద్ర బృందంతో సమావేశమైన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి : తుపాను, వర్షాభావ ప్రాంతాల్లో రాష్ట్రానికి ఉదారంగా సహాయం చేసేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సులు చేయాల్సిందిగా కేంద్ర అధికారుల బృందాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. తుపాను, కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన బృందాలు క్షేత్రస్థాయి పర్యటనల అనంతరం శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఉన్నతాధికారులతో సమావేశమయ్యాయి. తుపాను బాధిత ప్రాంతాల్లో తాము చూసిన పరిస్థితులను, గుర్తించిన అంశాలను సమావేశంలో వివరించాయి. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

విస్తృత వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి..

తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలను సహాయక శిబిరాలకు తరలించడమే కాకుండా వారికి తక్షణ సహాయాన్ని కూడా అందించాం. సహజంగా.. తుపాను ఏదో ఒక ప్రాంతంలో తీరం దాటుతుంది. కానీ, ఈ తుపాను తీరం వెంబడి కదులుతూ కోస్తా ప్రాంతంలో విస్తృతంగా వర్షాలకు కారణమైంది. దీనివల్ల పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం తుపాను బాధిత ప్రాంతాల్లో తిరుగుతూ నష్టాన్ని అంచనా వేస్తోంది. ఏపీలో ఈ-క్రాపింగ్ లాంటి సమర్థవంతమైన వ్యవస్థ ఉంది. నష్టపోయిన రైతుల జాబితాలను గ్రామ సచివాలయాల్లో సోషల్ ఆడిట్ కోసం పెడతాం. ఎవరైనా నష్టపోయిన రైతు పేరు లేకుంటే వెంటనే దాన్ని సరిదిద్దేలా అత్యంత పారదర్శకత వ్యవస్థను అమలుచేస్తున్నాం. రైతులను తుదివరకూ ఆదుకునేలా వ్యవస్థలు రాష్ట్రంలో ఉన్నాయి. దీనివల్ల రైతులకు అందించే సహాయం, పరిహారం అత్యంత పారదర్శకంగా వారికి చేరుతుంది. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి స్వయంగా చూసినందున ఆ మేరకు రాష్ట్రానికి ఉదారంగా సహాయం చేసేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సులు చేయండి.

ఆర్బీకేలు, ఉచిత పంటల బీమా, డీబీటీ పథకాలు బాగున్నాయి..

రాష్ట్రంలో ఆర్బీకేలు, ఉచిత పంటల బీమా, డీబీటీ పథకాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, కంటింజెన్సీ కింద విత్తనాల పంపిణీ, అమూల్ పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా మిల్క్ కలెక్షన్ సెంటర్ల ఏర్పాటూ బాగున్నాయి. అలాగే, గ్రామ సచివాలయాల వ్యవస్థ పనితీరును తాము స్వయంగా చూశామని.. ఈ కార్యక్రమాలు చాలా బాగున్నాయని కేంద్ర బృందం కితాబిచ్చింది.

కౌలు రైతులకూ రైతుభరోసా భేష్..

అంతేకాక.. కౌలు రైతులకూ ఎక్కడాలేని విధంగా రైతుభరోసా అందించడం అభినందనీయమని కేంద్ర బృందం పేర్కొంది. వరి కాకుండా పెసలు, మినుములు, మిల్లెట్స్ లాంటి ఇతర పంటల వైపు మళ్లేలా చూడాలని సూచించింది. ఇదే అంశంపై ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను అధికారులు వివరించారు.

'ఉపాధి' పెండింగ్ నిధులు వెంటనే ఇప్పించండి..

మరోవైపు.. ఉపాధి హామీ పథకం కింద విస్తారంగా కల్పిస్తున్న పనిదినాలపైన కేంద్ర బృందానికి రాష్ట్ర అధికారులు వివరించారు. పెండింగులో ఉన్న ఉపాధి హామీ పథకం బిల్లులను రాష్ట్రానికి వెంటనే వచ్చేలా చూడాలని వారు కోరారు. అలాగే, తుపాను కారణంగా రంగుమారిన, తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తున్నామని.. ఈ విషయంలో కొన్ని సడలింపులు కావాలంటూ ఇప్పటికే కేంద్రాన్ని అభ్యర్థించామని, వీలైనంత త్వరగా అవి కూడా వచ్చేలా చూడాలన్నారు.

ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎన్ఐడీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర రత్నూ, వ్యవసాయ శాఖ జేడీ విక్రాంత్‌సింగ్, డీఏఎఫ్‌డబ్ల్యూ జాయింట్ సెక్రటరీ పంకజ్ యాదవ్ సహా రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ జవహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ స్పెషల్ సీఎస్ జి. సాయిప్రసాద్, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై. శ్రీలక్ష్మి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, రవాణా శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ కమిషనర్ సీహెచ్ హరికిరణ్, విపత్తు నిర్వహణ శాఖ డైరెక్టర్ అంబేద్కర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ముందుజాగ్రత్తతో నష్టాలను నివారించారు : కేంద్ర బృందం

అనంతరం.. కేంద్ర బృందం స్పందిస్తూ.. అనంతపురం జిల్లా నుంచి పర్యటన ప్రారంభమై కర్నూలు, నంద్యాల, సత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య, ఎన్టీఆర్ జిల్లాల్లో పర్యటించామని వివరించింది. మూడు బృందాలుగా జిల్లాల్లో పర్యటించి వర్షాభావ పరిస్థితులను పరిశీలించామని అందులోని సభ్యులు తెలిపారు. వర్షాభావం కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించామని, స్థానిక రైతులతో మాట్లాడి వారి కష్టసుఖాలు తెలుసుకున్నామన్నారు. అలాగే, జలవనరులు, రిజర్వాయర్లలో నీటిమట్టాల పరిస్థితిని చూడడంతోపాటు ఉపాధి పథకాన్ని పరిశీలించినట్లు కేంద్ర బృందం తెలిపింది. తుపానుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగానే అప్రమత్తం కావడంవల్ల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించగలిగిందని పేర్కొంది. సచివాలయాల రూపంలో ఇక్కడ గ్రామస్థాయిలో బలమైన వ్యవస్థ ఉందని, విపత్తు వచ్చిన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో అనుసరిస్తున్న మార్గాలు బాగున్నాయని ప్రశంసించింది. ఈ-క్రాపింగ్ లాంటి విధానం దేశంలో ఎక్కడాలేదని, ఇవి ఇతర రాష్ట్రాలూ అనుసరించదగ్గవని, ఆయా ప్రభుత్వాలకు వీటిని తెలియజేస్తామని తెలిపింది. అలాగే, తుపాను కారణంగా జరిగిన పంట నష్టం, మౌలిక సదుపాయాలకు ఏర్పడ్డ నష్టాలపై కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని బృందం వెల్లడించింది. రాష్ట్రంలో కరువు పరిస్థితులనూ బృందం అధికారులు వివరించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ.30లక్షల పరిహారం

- విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 11వ రోజే అందించిన సీఎం జగన్
- కానిస్టేబుల్ కుమారుడికి డిగ్రీ పూర్తయిన తర్వాత ఉద్యోగం



కానిస్టేబుల్ సత్యకుమార్ కుటుంబ సభ్యులకు రూ.30 లక్షల చెక్‌ను అందజేసిన సీఎం వైఎస్ జగన్. చిత్రంలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

సాక్షి, అమరావతి: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ సత్యకుమార్ కుటుంబానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.30లక్షల పరిహారం అందించారు. తుపాను సహాయక చర్యల్లో పాల్గొనేందుకు ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌కు చెందిన సత్యకుమార్ ఈ నెల 5వ తేదీన కడప-చెన్నై జాతీయ రహదారిపై బైక్ మీద వెళుతుండగా చెట్టు విరిగిపడటంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రభుత్వం ఆయన కుటుంబానికి రూ.30లక్షలు పరిహారాన్ని ప్రకటించింది. ఈ మేరకు వెలగపూడిలోని సచివాలయంలో శుక్రవారం కానిస్టేబుల్ సత్యకుమార్ సతీమణి శిరివెల్ల రాజీ, కుమారుడు సంతోష్‌కుమార్‌లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రూ.30లక్షల చెక్‌ను అందజేశారు. ఇంటర్మీడియెట్ చదువుతున్న సంతోష్‌కుమార్ డిగ్రీ పూర్తిచేసిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగం కల్పించే విధంగా జీవో జారీ చేయాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. సత్యకుమార్ మృతిచెందిన 11వ రోజే ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం కిడ్నీ బాధితులకు ప్రభుత్వం భరోసా

- బోధనాస్పత్రిలో యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాల ఏర్పాటు
- నెఫ్రాలజీ విభాగంలో ఇప్పటికే 21 పోస్టులు మంజూరు

సాక్షి, అమరావతి: శ్రీకాకుళం జిల్లా ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రకాశం జిల్లా మార్కాపురం పరిసర ప్రాంతాల్లో కిడ్నీ సమస్య బాధితులపై ప్రత్యేక దృష్టి సారించింది. వీరికి ప్రభుత్వ రంగంలో కార్పొరేట్ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను చేరువ చేయనుంది. ఇందులో భాగంగా మార్కాపురంలో నూతనంగా ప్రారంభించబోతున్న ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన బోధనాస్పత్రిలో నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాలను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే నెఫ్రాలజీ విభాగం ఏర్పాటు కోసం 21 పోస్టులను కొత్తగా మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యూరాలజీ విభాగం ఏర్పాటుకు పోస్టులు మంజూరు చేస్తూ శుక్రవారం రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2024-25 విద్యా సంవత్సరంలో మార్కాపురం వైద్య కళాశాల ప్రారంభం కానుంది. నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) నిబంధనల ప్రకారం.. ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు ప్రారంభించడానికి నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాల ఏర్పాటు తప్పనిసరి కాదు. అయినప్పటికీ మార్కాపురం ప్రాంత కిడ్నీ సమస్యల బాధితులకు వైద్య సేవలను చేరువ చేయడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. ఇందులో భాగంగానే ఆ రెండు విభాగాలను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే గత నాలుగు దశాబ్దాల ఉద్దానం కిడ్నీ సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా రూ.700 కోట్లతో వైఎస్సార్ సుజలధార ప్రాజెక్ట్‌ను చేపట్టి కిడ్నీ సమస్యల ప్రభావిత గ్రామాలకు మంచినీటి సరఫరాను చేపట్టింది. అదే విధంగా రూ.85 కోట్లతో శ్రీకాకుళం జిల్లా పలాసలో డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని, 200 పడకలతో ఆస్పత్రిని ఏర్పాటు చేసింది. వీటిని కొద్ది రోజుల క్రితం సీఎం వైఎస్ జగన్ ప్రారంభించిన విషయం తెలిసిందే.

'దివ్యాంగుల సాధికారత సీఎం జగన్‌తోనే సాధ్యం'



సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌తోనే దివ్యాంగుల సాధికారత సాధ్యమని ఎమ్మెల్సీ పోతుల సునీత చెప్పారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టం అమలు చేసినందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు చెబుతూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ వికలాంగుల విభాగం ఆధ్వర్యంలో తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోతుల సునీత మాట్లాడుతూ.. దివ్యాంగుల హక్కులు, ఆత్మగౌరవం, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పలు కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. రాష్ట్ర అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఈచట్టం ద్వారా సీఎం జగన్ దివ్యాంగులకు అన్ని శాఖల్లో 4% రిజర్వేషన్లు కల్పించారని చెప్పారు. ఈ సందర్భంగా అర్హులైన దివ్యాంగులకు వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, ఇతర ఉపకరణాలు అందించారు. బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు పొందిన వారికి, జాతీయస్థాయిలో అవార్డులు సాధించిన క్రీడాకారులను సన్మానించారు.

పిల్లలు, గర్భిణులను ఇబ్బంది పెట్టడం సరికాదు

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులపై అంగన్‌వాడీ కార్యకర్తల ముసుగులో కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం మండిపడింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్ కృష్ణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చిన్న పిల్లలు, గర్భిణులకు పౌష్టికాహార పంపిణీలో ఇబ్బంది తలెత్తకుండా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను తాము నిర్వర్తిస్తున్నామని చెప్పారు. ఒక ప్రభుత్వ ఉద్యోగిగా.. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. అంగన్‌వాడీల ముసుగులో కొందరు తమ రాజకీయాల కోసం పిల్లలకు, గర్భిణులకు ప్రభుత్వ సాయం అందకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. తమను అడ్డుకోవడం ద్వారా పిల్లలను పస్తులుంచాలని కోరుకుంటున్నారా? అని ప్రశ్నించారు. 'తాళాలు పగలగొట్టారు.. దొంగల్లా దూరారు' అంటూ దుష్ప్రచారం చేయడం సరికాదని సూచించారు. సచివాలయాల ఉద్యోగులపై తప్పుడు ఆరోపణలు చేసినవారు వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కులగణన కోసం ప్రతిపక్షాలు పోరాడాలి

సాక్షి, అమరావతి: దేశంలో అసమానతలు తొలిగి సామాజికన్యాయం జరగాలంటే ఓబీసీ కులగణన తప్పనిసరి అని, ఈ విషయంలో ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో పోరాడి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. నిజంగా కులగణన చేయాలంటే కేంద్రానికి రెండు నెలల సమయం సరిపోతుందని, అయినా అలసత్వం చూపుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే బిహార్‌లో కులగణన చేపట్టారని, ఏపీలో కూడా కులగణనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని తెలిపారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని దేశవ్యాప్తంగా కులగణనకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

విశాఖ నుంచి బ్యాంకాక్‌కు నేరుగా విమానం

గోపాలపట్నం(విశాఖ): బ్యాంకాక్‌కు వెళ్లే వారికి శుభవార్త. త్వరలోనే విశాఖపట్నం నుంచి నేరుగా బ్యాంకాక్‌కు విమాన సర్వీసు నడపనున్నట్టు థాయ్ ఎయిరేషియా ప్రతినిధి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీస్ 2024 ఏప్రిల్ 9వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. బ్యాంకాక్‌లో బయలు దేరే విమానం 9వ తేదీ రాత్రి 8 గంటలకు విశాఖ చేరుకుని, 8.30 గంటలకు బ్యాంకాక్ బయలు దేరుతుందని వివరించారు. ఈ సర్వీసు మంగళవారం, గురువారం, శనివారం ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ విశాఖ నుంచి సింగపూర్‌కు నేరుగా విమాన సర్వీసు ఉండగా, ఇప్పుడు బ్యాంకాక్‌కు కూడా రావడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గన్నవరం విమానాశ్రయ నిర్వాసితుల కల సాకారం

- గృహ నిర్మాణాల దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అడుగులు
- నిర్వాసితుల కోసం రూ. 80.48 కోట్లు మంజూరు
- ఫలించిన ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ కృషి

గతంలో వారిని గాలికొదిలేసిన టీడీపీ ప్రభుత్వం



ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం సేకరించిన భూమి

గన్నవరం: ఎంతో కాలంగా కన్నులు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న గన్నవరం విమానాశ్రయ నిర్వాసితుల కల సాకారం కానుంది. విమానాశ్రయ విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చిన హామీలను గత టీడీపీ ప్రభుత్వం నెరవేర్చకుండా మోసం చేయగా.. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తూ వారికి బాసటగా నిలుస్తోంది. కనీసం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ప్రత్యామ్నాయంగా గృహ నిర్మాణాలు చేపట్టేందుకు అప్పటి ప్రభుత్వం జారీ చేసిన జీవోలో కూడా నిర్దిష్టమైన విధి విధానాలను రూపొందించలేదు. దీంతో చిక్కుముడిగా మారిన నిర్వాసితుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ గృహ నిర్మాణాలను సాకారం చేసే దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అడుగులు వేస్తుంది. నిర్వాసితుల పక్షాన నిలిచిన ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ వారి సమస్యల పరిష్కారానికి, నిధులు మంజూరుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి.

హామీలు విస్మరించిన టీడీపీ ప్రభుత్వం..

రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. విస్తరణలో దావాజీగూడెం, అల్లాపురం, బుద్ధవరంలో ఇళ్లు, స్థలాలు పోతున్న 423 కుటుంబాలకు గృహాలు నిర్మించేందుకు 2015లో టీడీపీ ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ తీసుకొచ్చింది. ఈ ప్యాకేజీలో భాగంగా గృహ నిర్మాణాలకు చిన్నఆవుటపల్లి పరిధిలో ల్యాండ్ పూలింగ్ ద్వారా సుమారు 52 ఎకరాల భూమి సేకరించారు. ఆ భూమిలో కొద్దిమేర మెరక చేసి.. మౌలిక సదుపాయల కల్పనను అప్పటి ప్రభుత్వం గాలికి వదిలేసింది. కనీసం నిర్వాసితులకు ప్లాట్లు కూడా కేటాయించకుండా చేతులు దులుపుకుంది. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలపై దృష్టి సారించింది. రెండుసార్లు నిర్వాసితులతో సమావేశాలు నిర్వహించి లాటరీ పద్ధతిలో ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసింది. ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే వంశీమోహన్ నిర్వాసితుల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సీఎం ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద నిర్వాసితుల గృహ నిర్మాణాలకు రెండు దఫాలుగా రూ. 4.50 లక్షలు చొప్పున ఒక్కొక్కరికీ రూ.9 లక్షలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నిర్వాసితులు చెల్లించాల్సిన రూ.3.76 కోట్ల స్టాంప్ డ్యూటీకి మినహాయింపు కల్పించి ఉచితంగా ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేసి దస్తావేజులను అందజేశారు.

సమస్యల పరిష్కారానికి రూ. 80.48 కోట్లు మంజూరు..

విమానాశ్రయ నిర్వాసితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా రూ.80.48 కోట్లు ఖర్చు చేయనుంది. వీటిలో ఎయిర్‌పోర్ట్ అవుట్ డ్రెయిన్ కోసం ఇళ్లు తొలగించిన 47 కుటుంబాలకు అద్దె బకాయిలు రూ. 1.21 కోట్లు, ఆర్‌అండ్‌ఆర్ స్థలంలో మౌలిక సదుపాయాలకు రూ.41.20 కోట్లు, గృహ నిర్మాణాలకు రూ. 38.06 కోట్లు వ్యయం చేయనుంది. ఇప్పటికే అద్దె బకాయిలు, నిర్వాసితులకు మొదటి విడతగా గృహ నిర్మాణాలకు చెల్లించేందుకు రూ. 17.35 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను కాంపిటెంట్ అథారిటీ, గుడివాడ రెవెన్యూ డివిజన్ అధికారి ద్వారా నిర్వాసితుల బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ చేయనున్నారు. ఇంకా గృహ నిర్మాణాలకు రెండో విడత నిధులు, ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ స్థలంలో లెవలింగ్, రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాల కోసం మిగిలిన రూ. 63.12 కోట్లు కూడా కేటాయిస్తూ ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పేదలను చదువుకు దూరం చేయాలనే విషపు రాతలు

వారికి ట్యాబుల పంపిణీపై దుష్ప్రచారం దారుణం

- బడుగు, బలహీన వర్గాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే బుద్ధి చెబుతాం
- ఈనాడు పచ్చ రాతలు మానుకోకపోతే ఉద్యమిస్తాం
- గుంటూరు ఈనాడు ఆఫీసు ఎదుట నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నిరసన ప్రదర్శన
- ఈనాడు ప్రతులు దహనం

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుల్లో బాగా రాణిస్తుంటే ఈనాడు రామోజీరావు అదిజీర్ణించుకోలేక, వారిని చదువు నుంచి దూరం చేయాలనే దుర్మార్గపు ఆలోచనతో ఈనాడులో విషపు రాతలు రాస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు మాదిగ మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం పంపిణీ చేసిన బైజూస్ ట్యాబ్‌లతో విద్యార్థులు అశ్లీల దృశ్యాలు చూస్తున్నారంటూ దారుణమైన కథనాలు రాయడంపట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈనాడులో రామోజీరావు రాయించిన కథనాలకు వ్యతిరేకంగా గుంటూరు ఈనాడు కార్యాలయం ఎదుట నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. పేద విద్యార్థులు చదువులో సాంకేతికంగా రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 5.50 లక్షల ట్యాబ్‌లను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు పంపిణీ చేసిందని.. వాటివల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు ఎంతో విజ్ఞానాన్ని పొందుతున్నారని శ్రీనివాసరావు చెప్పారు. వారికి ఇంత మెరుగైన విద్యను అందిస్తున్న సీఎం జగన్‌పై అక్కసుతో రామోజీరావు పిచ్చి రాతలు రాయడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు మనవడు, లోకేశ్ కొడుకు.. రామోజీ, వేమూరి రాధాకృష్ణల కుటుంబాల్లోని పిల్లలు సాంకేతికతను ఉపయోగించుకోవచ్చు కానీ పేద, మధ్యతరగతి విద్యార్థులు మాత్రం సాంకేతిక విద్య అందుకుంటుంటే ఓర్వలేరా అంటూ ఆయన ప్రశ్నించారు. విద్యార్థులు ట్యాబుల్లో అశ్లీల దృశ్యాలు చూస్తున్నారంటూ తప్పుడు కథనాలు రాస్తున్న రామోజీ.. 'లక్షలు ఖర్చుపెట్టి మీ పిల్లలను అత్యున్నత ప్రమాణాలు కలిగిన స్కూల్స్‌లో చదివిస్తూ, వారు బైజూస్ పాఠాలు నేర్చుకోవచ్చు.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు భారం కాకూడదనే ఉద్దేశంతో పేద వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ట్యాబ్‌లు ఇచ్చి, బైజూస్ కంటెంట్ పెట్టి చదివిస్తుంటే ఓర్చుకోలేరా'.. అంటూ పరిశపోగు మండిపడ్డారు. కేవలం జగన్ మీద విష ప్రచారం చేయాలనే లక్ష్యంతో మాత్రమే ఇలాంటి చెత్త వార్తలు రాస్తున్నారు తప్ప, వీటిల్లో ఎలాంటి వాస్తవంలేదని ఆయన కొట్టిపారేశారు. ఇకనైనా రామోజీరావు తప్పుడు రాతలు మానుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేశారు.



ఈనాడు కార్యాలయం ఎదుట ధర్నాచేస్తున్న నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు

జగన్ రాజకీయంతో చంద్రబాబుకు షాక్

- చంద్రగిరి నుంచి కుప్పంకు ఎందుకు బదిలీ అయ్యావ్
- మా ఎమ్మెల్యేలను ఎందుకు చేర్చుకున్నావ్
- పవన్‌కళ్యాణ్ తన పార్టీని చంద్రబాబుకు లాంగ్‌లీజుకు ఇచ్చాడు
- తెలంగాణలో జీవనం.. ఆంధ్రాలో రాజకీయం
- సీటు రాకపోయినా పార్టీ కోసం పనిచేస్తా
- మా కుటుంబమంతా జగన్ మేలు కోసమే
- మాజీ మంత్రి పేర్ని నాని



చిలకలపూడి (మచిలీపట్నం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న రాజకీయం చూసి చంద్రబాబుకు షాక్ తగిలిందని మాజీమంత్రి, బందరు శాసనసభ్యుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) చెప్పారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుకు కొత్తగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై ప్రేమ పుట్టుకొచ్చిందన్నారు. గోతికాడ నక్కలా రెండుకళ్ల సిద్ధాంతం, రెండు నాలుకల ధోరణితో మాట్లాడుతున్నారని విమర్శించారు. 40 ఏళ్ల రాజకీయజీవితంలో, 13 ఏళ్ల ముఖ్యమంత్రిగా పాలనలో చంద్రబాబు ఏం చేశారని ప్రశ్నించారు. 175 సీట్లలో విజయం సాధించాలనే దిశగా సీఎం జగన్ పనిచేస్తుంటే చంద్రబాబుకు షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయన్నారు. ఎమ్మెల్యేలను బదిలీ చేస్తున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించటం విడ్డూరంగా ఉందన్నారు. మరి చంద్రబాబు చంద్రగిరి నుంచి కుప్పం ఎందుకు వెళ్లాడు, కోడెల శివప్రసాద్‌ను నరసరావుపేట నుంచి సత్తెనపల్లెకు ఎందుకు పంపారో చెప్పాలని డిమాండ్ చేశారు. నువ్వు చేస్తే రాజ్యాంగబద్ధం వేరొకరు చేస్తే తప్పు అని మాట్లాడటమా అని చంద్రబాబును ప్రశ్నించారు. మరి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలను ఎందుకు చేర్చుకుంటున్నావని నిలదీశారు. అగ్రవర్ణానికి చెందిన ఎంపీ రాజును ఎలా అక్కున చేర్చుకున్నావో చెప్పాలన్నారు.

పవన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం


జనసేన పార్టీ నేత పవన్‌కళ్యాణ్ వైఎస్సార్ సీపీని ఓడించటమే లక్ష్యంగా పనిచేస్తున్నాననటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి వైపు మాట్లాడకుండా కేవలం చంద్రబాబు రాజకీయ లబ్ధికోసమే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. పార్టీ పెట్టి పదేళ్లు దాటినా ఆత్మస్థైర్యం లేకుండా పనిచేస్తున్నారన్నారు. టెంట్‌హౌస్‌లాగా అద్దెకు ఇచ్చే పార్టీని నడుపుతున్నారని, తన పార్టీని చంద్రబాబుకు లాంగ్‌లీజ్‌కు ఇచ్చారని ఎద్దేవా చేశారు. తెలంగాణాలో జీవనం సాగిస్తూ ఆంధ్రాలో రాజకీయం చేయటం చంద్రబాబుకు, పవన్‌కళ్యాణ్‌కే చెల్లిందని విమర్శించారు. ఈనాడు రామోజీరావు,ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ పరాయి రాష్ట్రంలో ఉండి ఆంధ్రరాష్ట్రంలో ఎత్తుగడలు వేస్తూ విషం చిమ్ముతున్నారన్నారు. ప్రజాసంక్షేమానికి సీఎం జగన్ నేడు 2.5 లక్షల కోట్లు ఖర్చుపెడితే.. గతంలో అధికారంలో ఉన్న చంద్రబాబు ఆ సొమ్మును ఏం చేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఒక పోర్టు, మెడికల్ కాలేజీ, హార్బర్.. ఏమీ నిర్మించలేదని, అప్పులు మాత్రం దండిగా వదిలివెళ్లారన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చి జనం సొమ్ము మూటలు కట్టుకోవాలనే చూస్తున్నారన్నారు.

కరోనా సమయంలో కొల్లు రవీంద్ర ఎక్కడున్నాడు

టీడీపీ నాయకుడు కొల్లు రవీంద్ర ఏ తుపానులోగానీ, కరోనా సమయంలోగానీ కనిపించారా అని పేర్ని నాని ప్రశ్నించారు. తాను, తన కుమారుడు పేర్ని కిట్టు కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి కరోనా బారినపడిన ప్రజలను కాపాడేందుకు విశ్వ ప్రయత్నాలు చేశామని గుర్తుచేశారు. ఏ పరికరం కావాలన్నా సొంత డబ్బుతో తెప్పించి ప్రాణనష్టం జరగకుండా చూశామన్నారు. తుపాను హెచ్చరికల నుంచి చివరివరకు ప్రాణనష్టం జరగకుండా మోకాలులోతు నీటిలో పేర్ని కిట్టు తిరిగారని తెలిపారు. ముక్కుపచ్చలారని యువకుడు ప్రజల కోసం తిరుగుతుంటే కొల్లు రవీంద్ర సిగ్గుపడాలన్నారు. తాము సీటు వస్తే ఏంటి రాకపోతే ఏంటి అనే ఆలోచనతో పార్టీకోసం ఉంటామని చెప్పారు. జగన్ బాగుంటే చాలు రాష్ట్రమంతా బాగుంటుందనే తమ కుటుంబమంతా ఆలోచిస్తుందని ఆయన పేర్కొన్నారు.


అమరజీవి స్ఫూర్తితో హక్కులు సాధిస్తాం

- బహుజన పరిరక్షణ సమితి నాయకులు
- 1,174వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



తాడికొండ/సాక్షి, న్యూఢిల్లీ: అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో పోరాటం చేసి బహుజనులకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులు సాధిస్తామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 1,174వ రోజుకు చేరాయి. ఈ శిబిరాన్ని పలువురు ముఖ్యులు సందర్శించి మాట్లాడారు. ఉద్యమాలు ప్రజల హక్కులు, వారి మాన, ప్రాణాలు రక్షించడం కోసం చేయాలి కానీ దోచుకున్న సొమ్మును కాపాడుకునేందుకు, అవినీతి కేసుల నుంచి తప్పించుకునేందుకు అమరావతి పేరుతో దొంగ ఉద్యమం నడుపుతున్న బాబు అండ్ కో తెలుసుకుంటే మంచిదన్నారు. అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసే బాబును జైలులోనే ఉంచాలన్నారు. పేదలకు కార్పొరేట్ వసతులు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో నేడు విద్య, వైద్యం, రాజకీయ రంగాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని విధాలా న్యాయం జరుగుతుందని చెప్పారు. అనంతరం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాగా, శుక్రవారం కేబినెట్ భేటీకి వెళుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల దీక్షా శిబిరం వద్ద తన వాహన శ్రేణిని వేగం తగ్గించి ముకుళిత హస్తాలతో బహుజన పరిరక్షణ సమితి నాయకులకు అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, పెరికె వరప్రసాద్, పులి దాసు, ఈపూరి ఆదాం, పల్లె బాబు, బొలిమేర శ్యామ్యూల్, కారుమూరి పుష్పరాజ్, ఇందుపల్లి సుభాషిణి, బూదాల సలోమి, బూదాల సౌమ్య, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి



అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు శుక్రవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఘనంగా జరిగాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆడిటోరియంలో ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ ఆదిత్యనాథ్‌దాస్, రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్, స్పెషల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి తదితర అధికారులు, భవన్ సిబ్బంది పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు.

క్లుప్తంగా...

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

రవాణాశాఖ మంత్రి పినిపె విశ్వరూప్



సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపె విశ్వరూప్ తెలిపారు. విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆర్టీసీ ఉద్యోగుల గ్రీవెన్స్ డేలో ఆయన పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 15 మంది ఉద్యోగుల సమస్యలను ఆయన సావధానంగా విని పరిష్కార మార్గాలను సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సీహెచ్. ద్వారకా తిరుమలరావు, ఈడీ కేఎస్ బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడుతో పాఠశాలలకు మహర్దశ

భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు



విద్యార్థులతో మాట్లాడుతున్న అంబటి రాయుడు, ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్ తదితరులు

గుంటూరు రూరల్: నాడు-నేడు కార్యక్రమంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చిందని భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. గుంటూరు మండలం నల్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ వై.నాగార్జున యాదవ్‌తో కలసి శుక్రవారం సందర్శించారు. అంబటి రాయుడు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్నారన్నారు. డిజిటల్ క్లాసులు, బెంచీలు, మరుగుదొడ్లు చూస్తే ఇది ప్రభుత్వ పాఠశాల.. ప్రైవేట్ పాఠశాల అనే అనుమానం కలుగుతుందని తెలిపారు. అధునాతన సౌకర్యాలతో విద్యార్థులకు విద్యను అందించిన జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్ మాట్లాడుతూ నేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లిష్ మీడియం బైజూస్ కంటెంట్‌తో విద్యాబోధన చేయటం గర్వించదగ్గ విషయమన్నారు. రూ.3 కోట్లతో నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో

ఎమ్మెల్సీ షేక్ సాబ్జి దుర్మరణం

- మరో ముగ్గురికి గాయాలు
- చెరుకువాడ వద్ద ఎదురెదురుగా కార్లు ఢీకొనడంతో ఘటన



ఎమ్మెల్సీ సాబ్జి మృతికి కేబినెట్ సమావేశంలో నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్, మంత్రులు

సాక్షి, అమరావతి/సాక్షి, భీమవరం : ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి(60) శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఆయన ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఘటనలో మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఉదయం ఆకివీడులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లకు మద్దతు తెలిపిన అనంతరం స్నేహితుడి కారులో ఎమ్మెల్సీ సాబ్జి పాలకొల్లు బయలుదేరారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో చెరుకువాడలోని రైస్‌మిల్లు సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు కార్లకూ ముందు భాగాలు దెబ్బతిన్నాయి. తలకు తీవ్రగాయమై కొన ఊపిరితో ఉన్న ఎమ్మెల్సీ సాబ్జిని స్థానికులు బయటకు తీసి సపర్యలు చేస్తుండగానే కన్నుమూశారు. ఆయన పీఏ షేక్ ఆలియా, గన్‌మేన్ ముత్యాలరాజు, కారు నడుపుతున్న వాసా శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారుకు ముందుభాగంలో బెలూన్ ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్నవారికి ఏమీ కాలేదు. భీమవరంలో ప్రయాణికులను దించి ఆకివీడు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సాబ్జి భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు తమ వాహనంలోనే భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రులకు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. ఎమ్మెల్సీ సాబ్జి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణ్‌రావు, ఐ.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ డా.పూనూరు గౌతమ్ రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లప్ప, అండ్ర మాల్యాద్రిలు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు.



భీమవరం ప్రభుత్వాస్పత్రిలో ఎమ్మెల్సీ సాబ్జి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు

గవర్నర్, ముఖ్యమంత్రి సంతాపం

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతిపై గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు గవర్నర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారని రాజ్‌భవన్‌వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. కాగా, మంత్రివర్గ సమావేశం జరుగుతుండగా ఎమ్మెల్సీ మరణవార్త సీఎం జగన్ దృష్టికి వచ్చింది. వెంటనే సాబ్జి మృతికి కేబినెట్ సంతాపం తెలిపింది. కేబినెట్ సభ్యులు కొద్దిసేపు మౌనం పాటించారు.

ఎమ్మెల్సీ సాబ్జీ మృతిపై సీబీఐతో విచారణ జరిపించాలి

ఎమ్మెల్సీ సోదరుడు ఫరీద్ ఖాసీం డిమాండ్

సాక్షి, భీమవరం : ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతిపై ప్రభుత్వం సీబీఐతో విచారణ జరిపించాలని ఆయన సోదరుడు ఫరీద్ ఖాసీం కోరారు. శుక్రవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ.. సాబ్జీ మృతికి రోడ్డు ప్రమాదం కారణం కాదని, నలుగురు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా 150 కిలోమీటర్ల స్పీడుతో కారులో దూసుకువచ్చి ఢీకొట్టారని చెప్పారు. కారు దూసుకువచ్చిన వేగం సీసీ కెమెరాల్లో రికార్డయిందని తెలిపారు. పథకం ప్రకారం ఆయన్ని హత్య చేశారని ఖాసీం ఆరోపించారు. మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై ఎమ్మెల్సీ సాబ్జీ అలుపెరుగని పోరాటం చేశారన్నారు.

అలిపిరి ఘటనలో ముగ్గురిపై కేసు కొట్టివేత

తిరుపతి లీగల్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై 2003లో తిరుమల ఘాట్ రోడ్డులో అలిపిరి వద్ద జరిగిన క్లైమోర్‌మైన్స్ దాడి ఘటనకు సంబంధించి ముగ్గురిపై కేసు కొట్టివేస్తూ తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి, స్థానిక ఐదవ అదనపు జిల్లా కోర్టు జడ్జి అన్వర్‌బాషా శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ కేసు వివరాల మేరకు... తిరుమల బ్రహ్మోత్సవాల్లో భాగంగా 2003, అక్టోబర్ ఒకటో తేదీ మధ్యాహ్నం నాలుగు గంటల ప్రాంతంలో అప్పటి సీఎం చంద్రబాబు తిరుమలకు బయలుదేరారు. అలిపిరి నుంచి 300 మీటర్లు వెళ్లిన తర్వాత క్లైమోర్‌మైన్ పేలింది. దీంతో బాబుతోపాటు పలువురికి గాయాలయ్యాయి. ఈ కేసు దర్యాప్తుకు ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. సిట్ అధికారులు 33 మందిపై కేసు నమోదు చేశారు. వారిలో 11 మంది మృతిచెందారు. మొదట్లో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో 25వ సాక్షిగా చంద్రబాబు కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పారు. ఆ నలుగురికి కోర్టు శిక్ష విధించింది. అనంతరం వారు తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి కోర్టులో అప్పీలు చేసుకోగా, కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి.. వారిపై కేసును కొట్టివేశారు. అలాగే ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న తిరుపతిలోని అమరావతినగర్‌కు చెందిన జి.రామమోహన్‌రెడ్డి, వైఎస్సార్ జిల్లా వెంకటరెడ్డిగారిపల్లికి చెందిన ఎస్.నరసింహారెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా, కలికిరి మండలం దిగువ అంకమ్మవారిపల్లికి చెందిన ఎం.చంద్ర అలియాస్ కేశవ్ అలియాస్ వెంకటరమణలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. వీరికి నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.1,200 చొప్పున జరిమానా విధిస్తూ 2014, సెప్టెంబర్ 25వ తేదీన కోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పుపై జి.రామమోహన్‌రెడ్డి, ఎస్.నరసింహారెడ్డి, ఎం.చంద్ర తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి కోర్టులో అప్పీలు దాఖలు చేసుకున్నారు. వీరు ముగ్గురు నేరం చేశారనడానికి ఆధారాలు లేవని వారి తరఫు న్యాయవాది వాదించారు. ప్రాసిక్యూషన్ వారు సరైన సాక్ష్యాధారాలు చూపలేకపోవడంతో ముగ్గురిపై కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఏడు రోజుల్లో పరిష్కరించాలి

స్కూల్ ప్రాంగణం పరిశుభ్రతతో ఆహ్లాదంగా ఉండేలా చర్యలు

- 21లోగా సమగ్ర నిర్వహణ, మరమ్మతుల పనులు పూర్తి కావాలి
- తొలి దశ నాడు-నేడు స్కూళ్లపై మార్గదర్శకాలు జారీ చేసిన విద్యాశాఖ

సాక్షి, అమరావతి: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అన్ని మౌలిక సదుపాయాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన రాష్ట్ర ప్రభుత్వం వాటిని అదే ప్రమాణాలతో నిరంతరం నాణ్యతగా నిర్వహించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. మన బడి నాడు - నేడు తొలి దశ పనులు పూర్తైన పాఠశాలల్లో మరమ్మతులు, నిర్వహణపై దృష్టి పెట్టి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా విద్యా శాఖ అధికారులు, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్లకు పాఠశాల విద్య (మౌలిక సదుపాయాలు) కమిషనర్ కె.భాస్కర్ సూచించారు. నాడు-నేడు తొలి దశ స్కూళ్ల నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలను ఆయన జారీ చేశారు. మరమ్మతులు, నిర్వహణ సమస్యలపై ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు వారంటీ సంస్థలకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. మరమ్మతులు, నిర్వహణ సమస్యలను ఏడు రోజుల్లోగా ఆయా సంస్థలు పరిష్కరించాలన్నారు. ఈమేరకు ఈ నెల 21వ తేదీ లోగా సమగ్ర నిర్వహణ, మరమ్మతుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. బాలికలు, బాలురకు వేర్వేరు టాయిలెట్లలో నిరంతరం నీటి సరఫరా ఉండాలని, ఇందులో ఏమైనా సమస్యలుంటే పరిష్కరించే బాధ్యత ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులదేనని స్పష్టం చేశారు. తొలి దశలో సృష్టించిన అన్ని ఆస్తుల నిర్వహణ సజావుగా కొనసాగేలా చూడాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులతో పాటు జిల్లా విద్యా శాఖ అధికారులు, ప్రాజెక్టు అదనపు కో-ఆర్డినేటర్లదేనని పేర్కొన్నారు. గ్రీన్ చాక్ బోర్డులు, ఐఎఫ్‌పీలలో సమస్యలు తలెత్తితే ఏడు రోజుల్లోగా మరమ్మతులు చేయించాలని సూచించారు. టాయిలెట్లలో అన్నీ సక్రమంగా పని చేస్తున్నాయో లేదో పరిశీలించి అవసరమైతే మరమ్మతులు లేదా రీప్లేస్‌మెంట్ కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. తరగతి గదుల్లో తలుపులు, కిటికీలు, సీలింగ్, అల్మారాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలన్నారు. తాగునీటి వ్యవస్థలు సక్రమంగా పని చేస్తున్నాయా లేదా అనేది నిర్ధారించుకుంటూ ప్రమాణాలకు అనుగుణంగా రక్షిత మంచినీటిని క్రమం తప్పకుండా పరీక్షించాలన్నారు. తాగునీటి సరఫరాలో అంతరాయాలు లేకుండా పర్యవేక్షిస్తూ బ్యాటరీ, పంపులు, వాటర్ పైపుల మరమ్మతులతోపాటు అవసరమైన చోట ఫిల్టర్లను రీప్లేస్‌మెంట్ చేయాలన్నారు. ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు సరిగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. స్కూళ్ల ఆవరణలో పెయింటింగ్ సరిగా లేకుంటే ఆయా సంస్థలకు తెలియచేసి రంగులు వేయించాలన్నారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేత ఆర్‌వీ సుభాష్ చంద్రబోస్

సీఎం వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరిక



సీఎం వైఎస్ జగన్‌తో సుభాష్ చంద్రబోస్. పక్కన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్, ఎమ్మెల్యే వెంకటే గౌడ

సాక్షి, అమరావతి/పలమనేరు(చిత్తూరు జిల్లా): పలమనేరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నేత ఆర్‌వీ సుభాష్ చంద్రబోస్ వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. ఆర్‌వీ సుభాష్ చంద్రబోస్ 2014 సార్వత్రిక ఎన్నికల్లో పలమనేరు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్, పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ తదితరులు పాల్గొన్నారు.

బ్రిటన్‌లో పాపం పసివాడు!

- తల్లే 'కిడ్నాప్' చేసింది!
- అప్పట్లో దేశవ్యాప్త సంచలనం
- ఆరేళ్లకు ఫ్రాన్స్‌లో దొరికాడు

అనగనగా అలెక్స్ బాటీ. ఓ 11 ఏళ్ల పాల బుగ్గల పసివాడు. సొంతూరు బ్రిటన్‌లోని గ్రేటర్ మాంచెస్టర్. తల్లి, తాతయ్య విదేశీ యాత్రకు వెళ్దామంటే సంబరంగా వాళ్లతో కలిసి స్పెయిన్ బయల్దేరాడు. ఆ యాత్ర ఏకంగా ఆరేళ్లకు పైగా సాగుతుందని అప్పుడతనికి తెలియదు పాపం! ఎందుకంటే అప్పట్నుంచీ అతను బ్రిటన్ తిరిగి రానే లేదు. సరికదా, ఆచూకీ కూడా తెలియకుండా పోయాడు! అతనే కాదు, నాటినుంచీ అతని తల్లి, తాతయ్య కూడా నేటికీ పత్తా లేరు!! ఈ ఉదంతం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బ్రిటన్ పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు కూడా చేశారు. అలెక్స్ కోసం యూరప్ అంతటా వెదికీ వెదికీ అలసిపోయారు. ఇక తమవల్ల కాదంటూ చేతులెత్తేశారు. అదుగో, అలాంటి స్థితిలో మూడు రోజుల క్రితం అనుకోకుండా ఫ్రాన్స్‌లో దొరికాడు అలెక్స్. ఈ లాస్ట్ అండ్ ఫౌండ్ స్టోరీ ఇప్పుడు బ్రిటన్ అంతటా టాక్ ఆఫ్ ద టౌన్‌గా మారింది!


ట్రక్కు డ్రైవర్ అడిసినీ

ఇలా దొరికాడు...


వాయవ్య ఫ్రాన్స్‌లోని టౌలోస్ అనే కొండ ప్రాంతంలో గత బుధవారం అర్ధరాత్రి దాటాక ఓ 17 ఏళ్ల కుర్రాడు హోరు వానలో తడుస్తూ, హైవే పక్కగా పేవ్‌మెంట్‌పై ఒంటరిగా నడుస్తూ పోతున్నాడు. అటుగా వెళ్తున్న ఫాబియన్ అసిడినీ అనే ఓ ట్రక్ డ్రైవర్ కంటపడ్డాడు. అది మారుమూల ప్రాంతం, పైగా ఎవరూ బయట తిరగని వేళ కావడంతో అనుమానం వచ్చిన ఆ డ్రైవర్ మనవాణ్ని దగ్గరికి తీశాడు. తొలుత బెదురు చూపులతో మారుపేరు చెప్పినా, అనునయించి అడిగేసరికి అసలు పేరు, తాను తప్పిపోయిన వృత్తాంతం మొత్తం చెప్పుకొచ్చాడు. 'కొన్నేళ్ల కింద మా అమ్మే నన్ను కిడ్నాప్ చేసింది' అంటూ ముక్తాయించాడు. దాంతో బిత్తరపోయిన అసిడినీ వెంటనే అతన్ని స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పజెప్పాడు. వాళ్లు బ్రిటన్‌కు సమాచారమివ్వడం, ఫొటో చూసిన నానమ్మ అలెక్స్‌ను గుర్తు పట్టడం, ఇద్దరూ వీడియో కాల్‌లో మాట్లాడుకుని ఆనందబాష్పాలు రాల్చడం చకచకా జరిగిపోయాయి.

ఏం జరిగిందంటే...

అలెక్స్ అమ్మానాన్నలు చాన్నాళ్ల క్రితమే విడిపోయారు. అలెక్స్ కోరిక మేరకు కోర్టు అతన్ని నానమ్మ సంరక్షణలో ఉంచింది. ఆమె అనుమతి లేకుండానే 11 ఏళ్ల అలెక్స్‌ను తల్లి, తాతయ్య కలిసి విహారయాత్ర పేరిట 2017లో స్పెయిన్ తీసుకెళ్లారు. అప్పటినుంచీ ముగ్గురూ అయిపు లేకుండా పోయారు. పెద్దవాళ్లిద్దరూ అప్పటికి కొంత కాలంగా ఆధ్యాత్మిక బాట పట్టినట్టు దర్యాప్తులో తేలింది. తమతో పాటు అలెక్స్ కూడా ఆ ప్రత్యామ్నాయ జీవనం గడపాలనే ఉద్దేశంతో అతన్ని తీసుకుని స్పెయిన్‌లో ఓ ఆరామం వంటి ప్రదేశానికి వెళ్లినట్టు పోలీసులు ముక్తాయించారు. తాము తొలుత ఓ విలాసవంతమైన ఇంట్లో ఒక రకమైన ఆధ్యాత్మిక సమూహంతో కలిసి కొన్నేళ్ల పాటు గడిపామన్న అలెక్స్ తాజా వాంగ్మూలం కూడా దీన్ని ధ్రువీకరించింది. తర్వాత అమ్మ, తాతయ్య ఇద్దరూ అలెక్స్‌ను తీసుకుని 2021లో ఫ్రాన్స్‌లో ప్రత్యామ్నాయ జీవన శైలికి పేరున్న పైరెనీస్ ప్రాంతానికి మారినట్టు భావిస్తున్నారు. అలెక్స్ దొరికిన చోటు కూడా అక్కడికి కొద్ది దూరంలోనే ఉంది. ఆ జీవన విధానం తనకు నచ్చక నానమ్మ చెంతకు చేరేందుకు తప్పించుకుని వచ్చేశానని అలెక్స్ చెప్పుకొచ్చాడు. అతన్ని ఒకట్రెండు రోజుల్లో నానమ్మ దగ్గరికి చేర్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అతని అమ్మ, తాతయ్యలపై కిడ్నాపింగ్ కేసు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉండటం విశేషం! తాజా వివరాల ఆధారంగా వారిని తెరపైకి తీసుకొచ్చే పనిలో పడ్డారు బ్రిటన్ పోలీసులు.


11 ఏళ్ల ప్రాయంలో అలెక్స్ బాటీ

- సాక్షి, నేషనల్ డెస్క్



సౌర విలయం!

వాషింగ్టన్: వజ్రపు మొనపై కాంతి ఒక క్రమంలో చెదిరిపోయి చిత్రించిన అందమైన వెలుగు రేఖల్లా కన్పిస్తున్నాయి కదూ! కానీ ఇవేమిటో తెలుసా? సూర్యునిపై చెలరేగుతున్న ప్రచండమైన మంటలు! వీటిని ఎక్స్ కేటగిరీకి చెందిన సోలార్ ఫ్లేర్స్‌గా నాసా పేర్కొంది. గత 20 ఏళ్లలో నమోదైన అత్యంత శక్తిమంతమైన మంటలు ఇవేనట! సాధారణంగా సూర్యుని ఉపరితలంపై అయస్కాంత క్షేత్రాలు పునఃసంధానమయ్యే క్రమంలో ఈ మంటలు చెలరేగుతుంటాయి. తీవ్రతను బట్టి వాటిని జీ, సీ, ఎం, చివరగా అతి తీవ్రమైన మంటలను ఎక్స్‌గా వర్గీకరిస్తారు. ఇవి వరుసగా ఒక దానికంటే మరొకటి పదిరెట్లు శక్తిమంతమైనవన్నమాట. తాజా మంటలు ఎక్స్ కేటగిరీలోనూ అతి తీవ్రతతో కూడినవని నాసా వివరించింది. వీటి దెబ్బకు అమెరికాతో పాటు ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల కొద్దిసేపు రేడియో ధార్మికత బాగా పెరిగిపోయింది. వీటి దెబ్బకు ఆయా చోట్ల రెండు గంటలకు పైగా సిగ్నల్స్‌కు అంతరాయం కూడా కలిగిందట. 2003లో వీటికంటే 15 రెట్లు శక్తిమంతమైన సోలార్ ఫ్లేమ్స్ నమోదయ్యాయి!

ప్రతి విద్యార్థికీ సమాన అవకాశాలు దక్కాలి



న్యూఢిల్లీ: ప్రపంచ స్థాయికి ఎదిగే క్రమంలో ప్రతి భారతీయ విద్యార్థికీ సమాన అవకాశాలుండాలని కోరుకుంటున్నట్లు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారు. శుక్రవారం తనను కలిసిన హార్వర్డ్ యూనివర్సిటీ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి వచ్చిన హార్వర్డ్ విద్యార్థులతో చర్చలో పాల్గొనడం తనకు సంతోషంగా ఉందన్నారు. భారతదేశం గురించి, ఇక్కడ పెరుగుతున్న నియంతృత్వ ధోరణులు, ప్రజాస్వామ్య రాజకీయాలకు ఎదురవుతున్న సవాళ్లు, చైనాతో భౌగోళిక రాజకీయ సవాళ్లు, కృత్రిమ మేధ వంటి అనేక అంశాలను తెలుసుకునేందుకు విద్యార్థులు ఆసక్తిగా ఉన్నారు' అని గాంధీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. విద్యార్థులతో మాట్లాడుతున్న ఫొటోలను కూడా ఆయన షేర్ చేశారు. 'ప్రజాస్వామ్య నమూనా, భారతదేశ తాత్విక, ఆధ్యాత్మిక ధోరణులపై నాకున్న అభిప్రాయాలను వివరించాను. ప్రతి భారతీయ విద్యార్థి ప్రపంచ స్థాయికి ఎదగటానికి అన్ని అవకాశాలను కల్పించాలని, అందుకోసం పోరాడాలని నిర్ణయించుకున్నాను'అని తెలిపారు.

ఆవిష్కరణలపై భారత్, అమెరికా ఎంవోయూ

న్యూఢిల్లీ: ఆవిష్కరణలకు అనువైన వాతావరణం కల్పించేందుకు భారత్–అమెరికా మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం(ఎంవోయూ)ను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన శుక్రవారం మంత్రివర్గ సమావేశం జరిగింది. ఉన్నత సాంకేతిక రంగంలో వాణిజ్య అవకాశాల బలోపేతానికి ఈ ఎంవోయూ దోహదపడుతుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఎంవోయూలో భాగంగా త్వరలోనే సిలికాన్ వ్యాలీలో హ్యాకథాన్, ఇన్వెస్ట్‌మెంట్ ఫోరం సదస్సులుంటాయి. ఇండస్ట్రియల్ ప్రాపర్టీ రైట్స్(ఐపీఆర్‌లు)కు సంబంధించి ఇటలీతో కుదిరిన ఎంవోయూను కూడా కేబినెట్ ఆమోదించింది.

పట్టువీడని విపక్షాలు

- పార్లమెంట్‌లో భద్రతా లోపంపై రెండో రోజూ కొనసాగిన ఆందోళన
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్
- భద్రతా లోపానికి రాజీనామా చేయాలని స్పష్టీకరణ
- లోక్‌సభ, రాజ్యసభలో పూర్తిగా స్తంభించిన కార్యకలాపాలు
- ఉభయ సభలు సోమవారానికి వాయిదా



పార్లమెంట్ ఆవరణలో బైఠాయించి నిరసన తెలుపుతున్న విపక్ష ఎంపీలు

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యంపై ప్రతిపక్షాల ఆందోళనలు, నినాదాలతో ఉభయ సభలు వరుసగా రెండో రోజు శుక్రవారం సైతం పూర్తిగా స్తంభించిపోయాయి. తమ డిమాండ్ నుంచి విపక్ష ఎంపీలు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. బుధవారం నాటి అవాంఛనీయ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే సభకు వచ్చి వివరణ ఇవ్వాలని, భద్రతా లోపంపై ఉభయ సభల్లో చర్చ చేపట్టాలని వారు తేల్చిచెప్పారు. పార్లమెంట్ బయట మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తున్న హోంమంత్రి సభకు ఎందుకు రావడం లేదని వారు నిలదీశారు. పార్లమెంట్‌లో భద్రతా లోపానికి బాధ్యత వహిస్తూ హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆగంతకులకు విజిటర్ పాసులు ఇచ్చిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహాపై చర్యలు తీసుకోవాలన్నారు. భద్రతా లోపంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు 14 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతించాలంటూ లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ పదేపదే కోరినా వినిపించుకోలేదు. ప్రతిపక్షాలు ఎంతకీ పట్టువీడకపోవడంతో ఉభయ సభలను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. పరిస్థితిలో మార్పు రాకపోవడంతో సభలను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ ప్రకటించారు. పార్లమెంట్ ప్రాంగణంలోనూ విపక్ష ఎంపీలు ఆందోళన కొనసాగించారు. గురువారం సస్పెన్షన్ వేటు పడిన ఎంపీలు శుక్రవారం పార్లమెంట్ ప్రాంగణంలో గాంధీ విగ్రహం వద్ద బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

లోక్‌సభ అలా...

లోక్‌సభ శుక్రవారం ఉదయం ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. భద్రతా లోపాన్ని లేవనెత్తారు. వెల్‌లోకి దూసుకెళ్లి ప్రకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు ప్రారంభించారు. దీంతో నిమిషాల వ్యవధిలోనే సభ వాయిదా పడింది. మధ్యాహ్నం 2 గంటలకు సభ పునః ప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితి అదుపులోకి రాలేదు. విపక్ష సభ్యులు నినాదాలు ఆపలేదు. దాంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ స్థానంలో ఉన్న కిరీట్ సోలంకీ ప్రకటించారు.

రాజ్యసభ ఇలా...

ఎగువ సభలోనూ విపక్షాలు అలజడి సృష్టించాయి. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే విపక్షాల నుంచి నినాదాల హోరు మొదలైంది. హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి, సమాధానం చెప్పాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ మల్లికార్జున ఖర్గే అన్నారు. సభలో స్టాండింగ్ కమిటీ నివేదికలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. భద్రతా లోపంపై చర్చ చేపట్టాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేయగా, చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ అంగీకరించలేదు. భద్రతా లోపంపై రాజ్యసభలో చర్చ కోసం పట్టుబడుతూ విపక్షాలు ఇచ్చిన 23 నోటీసులను తిరస్కరిస్తున్నట్లు చెప్పారు. జీరో అవర్ చర్చను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సమయంలో పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తడానికి ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా ప్రయత్నించగా, చైర్మన్ ధన్‌ఖడ్ అసహనం వ్యక్తం చేశారు. నిబంధనలు అతిక్రమించవద్దని సూచించారు. విపక్ష ఎంపీలు నినాదాలు జోరు పెంచడంతో సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. పునఃప్రారంభమైన తర్వాత కూడా సభలో అలజడి తగ్గలేదు. సభా కార్యకలపాలు సజావుగా సాగడానికి సహకరించాలని పలుమార్లు కోరినా విపక్ష ఎంపీలు లెక్కచేయలేదు. దాంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ధన్‌ఖడ్ ప్రకటించారు.

అది మా బాధ్యత: ఖర్గే

దేశ భద్రతకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశంపై గళం వినిపించడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తమ బాధ్యత, పార్లమెంటరీ విధి అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. విపక్ష ఎంపీలను చట్టవ్యతిరేకంగా నుంచి సస్పెండ్ చేశారని విమర్శించారు. ఇదెక్కడి న్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.

గాంధీ విగ్రహం వద్ద నిరసన

14 మంది ఎంపీలను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ విపక్ష ఇండియా కూటమి నేతలు శుక్రవారం పార్లమెంట్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద బైఠాయించారు. గురువారం రాజ్యసభ నుంచి సస్పెండైన ఎంపీలు, కాంగ్రెస్ పార్టీ నేత సోనియా గాంధీ ఈ నిరసనలో పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎలాంటి తప్పు చేయని విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారని, భద్రతా లోపానికి కారణమైన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహాపై మాత్రం చర్యల్లేవని మండిపడ్డారు. తమపై సస్పెన్షన్ వేటును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

ప్లాన్ బీ కూడా ఉంది..!

పార్లమెంట్‌లో అలజడికి కుట్ర పన్నిన లలిత్ ఝా బృందం, ప్లాన్ బీ కూడా సిద్ధం చేసుకుంది. విచారణలో లలిత్ ఈ మేరకు వెల్లడించాడు. నీలమ్, అమోల్ పార్లమెంట్ వద్దకు చేరుకోలేకుంటే ముకేశ్, కైలాశ్ మరో మార్గంలో చేరుకుని మీడియా కెమెరాల ఎదుట నినాదాలిస్తూ పొగ గొట్టాలను పేల్చాలనుకున్నారు. కానీ మంగళవారం రాత్రి గురుగ్రామ్‌లోని విక్కీ ఇంటికి సాగర్ శర్మ, మనోరంజన్, అమోల్, నీలమ్ మాత్రమే వచ్చారు. మహేశ్, కైలాశ్ రాలేకపోయారు.

బూట్లలో పొగ గొట్టాలు

లోక్‌సభలో ప్రయోగించిన పొగ గొట్టాలను నిందితులు బూట్లలో దాచి సభలోకి తెచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఎడమ బూటు కింది భాగంలో రబ్బరు పొరలతో చేసిన రహస్య అరలో వాటిని అమర్చుకొని సభలోకి ప్రవేశించారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. బూట్లను భద్రతా సిబ్బంది తనిఖీ చేయరని కనిపెట్టే ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. వారినుంచి స్వాధీనం చేసుకున్న కరపత్రాల్లో కరపత్రాల్లో మణిపూర్ హింసాకాండపై నినాదాలున్నట్లు తెలిపారు.

ఏడు రోజుల కస్టడీ

పార్లమెంట్‌లో పొగ గొట్టాలు ప్రయోగించిన కేసులో అరెస్టయిన కీలక సూత్రధారి లలిత్ ఝాను 7 రోజుల పాటు ఢిల్లీ పోలీసుల కస్టడీకి అప్పగిస్తూ ఢిల్లీ కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఝాను గురువారం రాత్రి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అతను వాడిన ఫోన్లో కీలక సమాచారం ఉండొచ్చన్నారు. ఈ ఉదంతంపై ఉన్నత స్థాయి దర్యాప్తు కొనసాగుతోందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ చెప్పారు. దీనిపై లోక్‌సభలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, విపక్షాలు ముందుకు రావాలని సూచించారు.



సహనశీలత తగ్గుతోంది



పదవీ విరమణ కార్యక్రమంలో సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ కౌల్

న్యూఢిల్లీ: ఎదుటి వారి అభిప్రాయాల పట్ల ప్రజలు సహనం కలిగి ఉండాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా సమాజంలో నేడు సహనశీలత స్థాయిలు తగ్గుతూండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయమూర్తులు ధైర్యం కలిగి ఉండటం చాలా కీలకమైన అంశమన్నారు. న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడే బాధ్యత బార్ అసోసియేషన్‌దేనని చెప్పారు. అత్యున్నత న్యాయస్థానంలో ఆరేళ్ల 10 నెలలపాటు బాధ్యతలు నిర్వర్తించిన జస్టిస్ ఎస్కే కౌల్ ఈ నెల 25న పదవీ విరమణ చేయనున్నారు. సుప్రీంకోర్టుకు ఈ నెల 18 నుంచి వచ్చే జనవరి 2వ తేదీ వరకు శీతాకాల సెలవులు. దీంతో, శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలో సమావేశమైన వీడ్కోలు ధర్మాసనంలో జస్టిస్ కౌల్ మాట్లాడారు. 'సర్వోన్నత న్యాయస్థానం నిర్భయంగా న్యాయాన్ని అందించిన న్యాయ దేవాలయం. ఈ ఒరవడి ఇలాగే కొనసాగాలి'అని ఆయన ఆకాంక్షించారు. పూర్తి సంతృప్తితో పదవీ విరమణ చేస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రచూడ్.. జస్టిస్ కౌల్‌తో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. '70ల్లో నేనూ జస్టిస్ కౌల్ కలిసి కాలేజీకి వెళ్లాం. పుట్టస్వామి గోపత్యా హక్కు కేసు, వైవాహిక సమానత్వ కేసు, తాజాగా ఆర్టికల్ 370 కేసు..ఇలా పలు కేసుల్లో ఇరువురం కలిసి ఇదే వేదికపై నుంచి తీర్పులు వెలువరించడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను' అన్నారు. గోప్యతా హక్కు ప్రాథమిక హక్కేనంటూ తీర్పు వెలువరించిన తొమ్మిదిమంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ కౌల్ కూడా ఉన్నారు. ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ ఇటీవల తీర్పు వెలువరించిన ఐదుగురు సభ్యుల ధర్మాసనంలోనూ ఉన్నారు.

1958లో జన్మించిన కౌల్ 1982లో ఢిల్లీ వర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పట్టా అందుకున్నారు. 1999లో సీనియర్ న్యాయవాది గుర్తింపు పొందారు. 2001లో ఢిల్లీ హైకోర్టు అదనపు జడ్జీగా, 2003లో శాశ్వత జడ్జిగా పదోన్నతి పొందారు. 2013లో పంజాబ్ హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2014లో మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2017లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు.

షాహీ ఈద్గాలో సర్వేపై స్టేకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని మథురలో శ్రీకృష్ణ జన్మభూమి ఆలయాన్ని ఆనుకుని ఉన్న షాహీ ఈద్గాలో సర్వే చేపట్టాలంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరించింది. కోర్టు పర్యవేక్షణలో షాహీ ఈద్గాలో శాస్త్రీయ సర్వే చేపట్టాలని అలహాబాద్ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. సర్వేను పరిశీలించేందుకు అడ్వొకేట్ కమిషనర్‌ను నియమించేందుకు కూడా అంగీకరించింది. ఈ ఉత్తర్వుల అమలును నిలిపివేయాలంటూ శుక్రవారం షాహీ మసీద్ ఈద్గా మేనేజ్‌మెంట్ కమిటీ ట్రస్ట్ చేసిన వినతిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులను పిటిషన్ రూపంలో సవాల్ చేయాలని సూచించింది. దీనితో పాటు దీనిపై ట్రస్ట్ వేసిన మరో పిటిషన్‌పై కూడా జనవరి 9వ తేదీన విచారణ చేపడతామని ధర్మాసనం తెలిపింది.

మహిళా జడ్జికి లైంగిక వేధింపులు

గౌరవప్రదంగా చనిపోవాలనుందంటూ సీజేఐకి బాధితురాలి లేఖ

అలహాబాద్ హైకోర్టు నుంచి నివేదిక కోరిన జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ మహిళా జడ్జి తనను జిల్లా జడ్జి లైంగికంగా వేధిస్తున్నారని, అనుమతిస్తే గౌరవప్రదంగా చనిపోతానంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడం కలకలం రేపింది. ఈ వ్యవహారాన్ని సీజేఐ సీరియస్‌గా తీసుకున్నారు. ఆయన ఉత్తర్వుల మేరకు..సత్వరమే నివేదిక ఇవ్వాలంటూ సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ అలహాబాద్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించారు. జిల్లాలోని బారాబంకీలో నియామకం అయిన ఏడాదిన్నర నుంచి తనపై కొనసాగుతున్న వేధింపులను బాధిత జడ్జి రెండు పేజీల లేఖలో ప్రస్తావించారు. 'నాకు ఏమాత్రం జీవించాలని లేదు. ఏడాదిన్నర కాలంలో నన్ను జీవచ్ఛవంలా మార్చారు. నిర్జీవమైన ఈ శరీరాన్ని ఇంకా మోయడం వల్ల ప్రయోజనం లేదు. నా జీవితంలో ఎలాంటి లక్ష్యం లేదు. దయచేసి నా జీవితాన్ని గౌరవప్రదంగా ముగించుకునేందుకు అనుమతించండి'అని అందులో తెలిపారు. ఈ లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. బాధిత జడ్జి గతంలో పెట్టుకున్న పిటిషన్‌పై జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే, బాధితురాలిపై వేధింపుల అంశం అంతర్గత ఫిర్యాదుల కమిటీ పరిశీలనలో ఉన్నదని, కమిటీ తీర్మానం అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వద్ద ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నదంటూ ఆ ఫిర్యాదును ధర్మాసనం కొట్టివేసింది. తాజాగా, బాధితురాలి లేఖపై సీజేఐ ఆదేశాల మేరకు సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ అలహాబాద్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ నుంచి నివేదిక కోరారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీ నివేదికపై ఏమేరకు చర్యలు తీసుకున్నారో తెలపాలంటూ ఆదేశించినట్లు సుప్రీంకోర్టు వర్గాలు తెలిపాయి.

వీసా లేకున్నా ఇరాన్ వెళ్లొచ్చు

భారత్ సహా 33 దేశాలకు అవకాశం

టెహ్రాన్: ఇరాన్ సందర్శించాలనుకునే భారతీయులకు శుభవార్త. ఇరాన్‌కు వెళ్లేందుకు ఇక వీసా అవసరమే లేదు. విదేశీ పర్యాటకులు, సందర్శకులకు ఆకర్షించేందుకు ఇరాన్ ప్రభుత్వం భారత్ సహా 33 దేశాల వారికి వీసా లేని ప్రయాణాలకు అనుమతులివ్వనున్నట్లు ప్రకటించింది. ఇరాన్ మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆదేశ పర్యాటక మంత్రి ఎజ్జతొల్లా జర్ఘామి ఇటీవల ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. ఇరాన్ వ్యతిరేక ప్రచారానికి చెక్ పెట్టేందుకు కూడా ఇది ఉపయోగపడుతుందన్నారు. ఇరాన్ వీసా ఫ్రీ వెసులుబాటు ప్రకటించిన దేశాల్లో భారత్‌తోపాటు రష్యా, యూఏఈ, బహ్రెయిన్, సౌదీ, ఖతార్, కువాయిట్, లెబనాన్, ఉజ్బెకిస్తాన్ తదితరాలున్నాయి. మార్చి 21తో ప్రారంభమైన ఈ ఏడాది మొదటి 8 నెలల్లోనే ఇరాన్‌ను సందర్శించిన విదేశీయుల సంఖ్య 44 లక్షలుగా ఉంది. ఇది గత ఏడాదితో పోలిస్తే 48.5% ఎక్కువ. భారతీయులు ఇకపై తమ దేశానికి వీసాతో పనిలేకుండా రావొచ్చంటూ ఇటీవలే మలేసియా, శ్రీలంక, వియత్నాం దేశాలు ప్రకటించిన విషయం తెలిసిందే.

బాలికపై అత్యాచారం కేసు.. యూపీ బీజేపీ ఎమ్మెల్యేకి 25 ఏళ్ల జైలు

సోన్‌భద్ర: బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే రామ్‌దులార్ గోండ్‌కు ప్రత్యేక న్యాయస్థానం 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, మరో రూ.10 లక్షల జరిమానా విధించింది. దీంతో, శాసనసభ సభ్యత్వానికి ఆయన అర్హత కోల్పోనున్నారు. తొమ్మిదేళ్ల క్రితం చోటుచేసుకున్న ఈ ఘటనపై ఈ నెల 12న కోర్టు విచారణ ముగిసింది. సోన్‌భద్ర అడిషనల్ జడ్జి, ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు సెషన్ జడ్జి అహ్సానుల్లా ఖాన్ తాజాగా తీర్పు వెలువరించారు. జరిమానా మొత్తాన్ని బాధితురాలి కుటుంబ సంక్షేమం కోసం వినియోగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2014లో ఈ ఘటన చోటుచేసుకోగా ఆ సమయంలో రామ్‌దులార్ గోండ్ భార్య గ్రామ సర్పంచిగా ఉన్నారు. బాధితురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు మియోర్పూర్ పోలీస్ స్టేషన్‌లో గోండ్‌పై పోక్సో సహా వివిధ సెక్షన్ల కింద కేసు నమోదైంది. మొదట్లో పోక్సో ప్రత్యేక కోర్టులో కేసు విచారణ సాగింది. బీజేపీ తరఫున గోండ్ దుద్ధి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అయ్యాక ఈ కేసు ఎంపీ/ఎమ్మెల్యే కోర్టుకు బదిలీ అయ్యింది.


సీఎంగా ప్రమాణస్వీకారం తర్వాత ప్రధాని మోదీకి శర్మ అభివాదం

రాజస్థాన్ సీఎంగా భజన్‌లాల్ ప్రమాణం

జైపూర్: రాజస్తాన్ నూతన ముఖ్యమంత్రిగా శుక్రవారం భజన్ లాల్ శర్మ బాధ్యతలు చేపట్టారు. ప్రధాని మోదీ, బీజేపీ అగ్ర నాయకత్వం సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసిన కొద్దిసేపటికే సెక్రటేరియట్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో)కు భజన్ లాల్ శర్మ చేరుకున్నారు. సీఎం కుర్చీలో ఆయన కూర్చోగానే మాజీ సీఎం వసుంధరా రాజె ఆయన శిరస్సుపై చేయి నుంచి ఆశీర్వదించారు. సీఎం శర్మ లేచి నిలుచుని రాజే సహా అక్కడున్న వారందరికీ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సీపీ జోషి, కేంద్రమంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, అర్జున్ మేఘ్వాల్, కైలాశ్ చౌదరి, రాష్ట్ర నేతలు రాజేంద్ర రాథోడ్, సతీశ్ పునియా కూడా ఉన్నారు. వీరంతా ముఖ్యమంత్రి కుర్చీ కోసం పోటీలో నిలిచిన వారే కావడం విశేషం ఈ నెల 12వ తేదీన జరిగిన పార్టీ శాసనసభా పక్ష సమావేశం మొదటిసారిగా ఎమ్మెల్యే అయిన భజన్‌లాల్ శర్మను తమ నేతగా ఎన్నుకున్న విషయం తెలిసిందే. డిప్యూటీ సీఎంలుగా ప్రమాణం చేసిన దియా కుమారి, ప్రేమ్‌చంద్ బైరవ కూడా సెక్రటేరియట్‌లోని తమ కార్యాలయాల్లో బాధ్యతలను చేపట్టారు.

జనవరి 10 కల్లా తేల్చండి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: శివసేన పార్టీలోని రెండు వర్గాలు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ పెట్టుకున్న పిటిషన్లపై నిర్ణయం తీసుకునేందుకు మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్‌కు సుప్రీంకోర్టు గడువు పెంచింది. గతంలో డిసెంబర్ 31వ తేదీలోగా ఏదో ఒకటి తేల్చాలంటూ ఇచ్చిన గడువును తాజాగా మరో 10 రోజులు పొడిగించింది. 'డిసెంబర్ 20వ తేదీతో అసెంబ్లీ కార్యకలాపాలు ముగుస్తున్నందున, ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకునేందుకు గడువు పొడిగించాలంటూ స్పీకర్ పెట్టుకున్న వినతిని సహేతుకమైందిగా భావిస్తున్నాం. అందుకే, గడువును మరో 10 రోజులపాటు, వచ్చే ఏడాది జనవరి 10వ తేదీ వరకు పొడిగిస్తున్నాం'అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం శుక్రవారం పేర్కొంది.

'మణిపూర్'పై ఏం చర్యలు తీసుకున్నారు: సుప్రీం

న్యూఢిల్లీ: మణిపూర్‌లో ప్రార్థనా స్థలాల రక్షణకు తీసుకున్న చర్యలను తాము ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీకి వివరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం మణిపూర్‌లో ప్రార్థనాస్థలాల పునరుద్ధరణ అంశంపై శుక్రవారం విచారణ చేపట్టింది. వర్గ హింసలో దెబ్బతిన్న, ధ్వంసమైన మత సంబంధ నిర్మాణాలపై రెండు వారాల్లోగా కమిటీకి సమగ్ర వివరాలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శనివారం ı 16 ı డిసెంబర్ ı 2023



పేదల నాడి తెలిసిన నేత జగన్

గుణదల (విజయవాడ తూర్పు): పేదల నాడి తెలిసిన నేత మన సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. -8లో▸



తెలుగు గళ ప్రతిభా పురస్కారాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడలో శుక్రవారం తెలుగు ప్రసార మాధ్యమాల్లో పనిచేస్తున్న 15 మందికి తెలుగు గళ ప్రతిభా పురస్కారాలు అందజేశారు.

బ్యాడ్మింటన్‌లో మనోళ్ల సత్తా



విజయవాడ స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జాతీయ బ్యాడ్మింటన్ బాలబాలికల సింగిల్స్‌లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. సింగిల్స్‌లో మెరుగైన ఆట తీరు కనబరుస్తున్నారు.

న్యూస్‌రీల్

పొట్టి శ్రీరాములు త్యాగనిరతి చిరస్మరణీయం

– జేసీ అపరాజిత సింగ్



చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి చిరస్మరణీయం. అందరికీ ఆదర్శనీయమని జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జేసీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని పని చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా, కలెక్టరేట్ ఏవో ఏఎస్ఎన్ రాధిక, డీవైఈవో యూవీ సుబ్బారావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి నృత్య పోటీలకు ఎంపికైన శరణ్య



మచిలీపట్నంటౌన్: కళా ఉత్సవ్–2023 జాతీయ స్థాయి కూచిపూడి నృత్య ప్రదర్శన పోటీలకు రాష్ట్రం నుంచి మచిలీపట్నంకు చెందిన నృత్య కళాకారిణి జల్లూరి శరణ్య ఎంపికైంది. కళాఉత్సవ్–2023 ఉమ్మడి జిల్లా స్థాయి కూచిపూడి నృత్య పోటీలు ఈ నెల 12న అంగలూరు డైట్ కళాశాలలో జరగ్గా శరణ్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై ంది. పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌లో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి 13 జిల్లాల నుంచి కళాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా శరణ్య ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం. కళా ఉత్సవ్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, డీఈవో తాహెరా సుల్తానా శరణ్యకు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు.

ఎస్‌బీ ఏసీపీగా పార్థసారథి, ఏఆర్ ఏసీపీగా ప్రసాదరావు





విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా బి.పార్థసారథి, ఆర్మ్ రిజర్వ్ ఏసీపీగా డి.ప్రసాదరావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి సీఐడీ ఆర్ఓ సీఐగా పని చేస్తూ ఇటీవలే డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందిన పార్థసారథితో పాటు శ్రీకాకుళం ఏఆర్ డీఎస్పీగా పని చేస్తున్న ప్రసాదరావును రాష్ట్ర హోం శాఖ ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ చేసింది. బాధ్యతలు తీసుకున్న ఇరువురూ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణాను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

సెంట్రల్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు కేయూ విద్యార్థులు



ఇబ్రహీంపట్నం: ఆల్ ఇండియా యూనివర్సిటీస్ సెంట్రల్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు కృష్ణా యూనివర్సిటీ నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు యూనివర్సిటీ టీమ్ మేనేజర్, జాకీర్ హుస్సేన్ కళాశాల పీడీ అబ్దుల్ హమీద్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో జరిగిన సౌత్ వెస్ట్ జోన్ చాంపియన్ షిప్ పోటీల్లో జాకీర్ హుస్సేన్ కళాశాలకు చెందిన నాగరాజు, నిషీగాస్పెల్ 71 కిలోల విభాగంలో, కేబీఎన్ కళాశాలకు చెందిన స్వప్న 55 కేజీల విభాగంలో ప్రతిభ చాటారు. హిమాచల్ ప్రదేశ్ ధర్మశాల యూనివర్సిటీలో జనవరి 24 నుంచి 27వ తేదీ వరకు జరిగే సెంట్రల్ జోన్ ఆల్ ఇండియా చాంపియన్ షిప్ పోటీల్లో కృష్ణా యూనివర్సిటీ తరఫున వీరు ప్రాతినిధ్యం వహిస్తారని పీడీ తెలిపారు.

పక్కాగా ఓటర్ల సర్వే

- 9వ తేదీ లోపు 1,34,405 దరఖాస్తులు
- ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్న సిబ్బంది
- ప్రధానంగా డబుల్, డూప్లికేట్ ఓట్ల పైనా దృష్టి
- ఎపిక్ కార్డులు ఇస్తున్న వైనం
- వచ్చిన దరఖాస్తులకు 100 శాతం వెరిఫికేషన్



ఓటర్ల సర్వే కార్యక్రమంలో పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు(ఫైల్)

సాక్షిప్రతినిధి,విజయవాడ: ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసిన నాటి నుంచి ఇప్పటివరకు నమోదయిన అన్ని రకాల దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. ప్రధానంగా నమోదు చేసుకున్న ఫారం –6, 7, 8 దరఖాస్తులు పెండింగ్ లేకుండా ఇంటింటికీ వెళ్లి పక్కాగా పరిశీలించి, అర్హులైన వారికి ఓటు హక్కు కల్పిస్తున్నారు. అర్హత లేని వారిని ఓట్ల జాబితాల నుంచి తొలగిస్తున్నారు. దీంతో పాటు కొత్త ఓటర్లు 18–19 సంవత్సరాల వయస్సు కలిగిన యువతను ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అక్టోబర్ 27న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 18–19 ఏళ్ల వయస్సు కలిగిన 12,728 మంది ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నారు. జిల్లా యంత్రాంగం యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఇప్పటివరకు యువ ఓటర్లుగా 22,838 మంది నమోదయ్యారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఇప్పటివరకు ఫారం–6కు సంబంధించి 1,34,405 దరఖాస్తులు రాగా, వాటిలో 1,09,930 పరిష్కారం అయ్యాయి. ఇంకా మిగిలి ఉన్న 24,475 దరఖాస్తుల పరిష్కారంతో పాటు, ఫారం–7కు సంబంధించి 1,20,244 దరఖాస్తులు రాగా వాటిలో 1,03,268 పరిష్కరించారు. ఇంకా మిగిలి ఉన్న 16,976 దరఖాస్తుల పరిష్కారంతో పాటు, ఫారం –8కు సంబంధించి 2,20,555 దరఖాస్తులు రాగా వాటిలో 2,05,057 పరిష్కరించారు. ఇంకా మిగిలిఉన్న 15,468 దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ దరఖాస్తులను వారానికి ఒకసారి సమీక్షిస్తున్నారు. ఇంకా నమోదవుతున్న దరఖాస్తులను బీఎల్ఓ లు, ఏఈఆర్వోలు, ఈఆర్వోలు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓట్లను ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సంక్షిప్త ఓటర్ల జాబితాకు సంబంధించి నమోదవుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. ఈ నెల 26 నాటికి అన్ని దరఖాస్తులను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. జనవరి 1 నాటికి దోష రహిత ఓటర్ల జాబితాను అందజేయనున్నారు. జనవరి 5న తుది ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుంది.

పారదర్శకంగా ఓటర్ల జాబితా



యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాం. డిసెంబరు 9 నాటికి వచ్చిన అన్ని రకాల క్లయిమ్‌లను 100 శాతం విచారణ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. డబుల్, డూప్లికేట్ ఓట్లపై దృష్టి సారించి విచారణ చేసి, అనర్హులైన ఓట్లు తొలగించాం. ఒకే ఇంట్లో 10కి పైగా ఓటర్లు ఉన్నవి, ఒకే ఫొటో రెండు ఓట్లు వంటి ఫిర్యాదులపై దృష్టి సారించి పక్కాగా విచారణ చేశాం. ఎపిక్ కార్డులు సిద్ధం చేస్తున్నాం. మొత్తం మీద పారదర్శకంగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేస్తున్నాం.

–ఢిల్లీరావు, కలెక్టర్, ఎన్టీఆర్ జిల్లా

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులే కీలకం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే పరిస్థితులను కల్పించటంలో సెక్టార్ అధికారులదే కీలక పాత్ర అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ అధికారులు, ఏఈఆర్ఓల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కొక్క సెక్టార్ అధికారికి పది నుంచి పన్నెండు పోలింగ్ స్టేషన్లు ఉంటాయని తెలిపారు. సెక్టార్ అధికారులుగా నియమించిన వారికి పోలింగ్‌కు వారం రోజుల ముందుగా ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారాలు ఉంటాయన్నారు. సెక్టార్ అధికారులు తమ పోలింగ్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఇప్పటి నుంచే తనిఖీ చేసి మౌలిక వసతులైన ర్యాంప్, రహదారి, తాగునీరు, తగినంత వెలుతురు వంటి వాటిని చూసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో సామాజిక, సాంఘిక, రాజకీయ, శాంతి భద్రతల పరిస్థితులను సమీక్షించుకుని వాస్తవాలను అంచనా వేసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లోని వర్గాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సమస్యలపై చర్చించుకోవాలన్నారు. ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్, డిస్పాచ్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు ఉన్న దూరాన్ని పరిశీలించుకోవాలన్నారు. గత ఎన్నికల్లో జరిగిన సంఘటనల పూర్వాపరాలను తెలుసుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ల సంఖ్య, నియోజకవర్గం ప్రస్తుత సమస్యలు, సెక్టార్ మ్యాప్ పరిశీలించుకోవాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 85 శాతం కంటే ఎక్కువ పోలింగ్ నమోదు కావాలన్నారు.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిద్దాం

జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా రూపొందించడంలో అధికారుల కృషి ప్రశంసనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిద్దామని అన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఫారం 17(ఎ), 17(సి) నివేదికలను తప్పులు లేకుండా పూర్తి చేయాలన్నారు. పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్, మాస్టర్ ట్రైనర్ జి.వెంకటేశ్వర్లు పోలింగ్‌కు ముందు, పోలింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్ఓ ఎస్‌వీ నాగేశ్వరరావు, ఆర్డీఓలు కె.మాధవి, పి.సాయిబాబా, సబ్ డివిజనల్ పోలీస్ అధికారులు, ఈఆర్ఓలు, ఏఆర్ఓలు పాల్గొన్నారు.

బెజవాడలో ఉప్పెన సుందరి



హీరోయిన్ కృతిశెట్టి శుక్రవారం బెజవాడలో ప్రత్యక్షమైంది. ఒక వస్త్ర దుకాణం ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆమెను చూడడానికి అభిమానులు ఉప్పెనలా తరలి వచ్చారు. తన అందచందాలతో, ముద్దు ముద్దు మాటలతో నగర వాసులను కట్టిపడేసింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఇగ్నో ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) నిర్వహించే వివిధ కోర్సుల ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కె.సుమలత తెలిపారు. ఇగ్నో నిర్వహించే బీఎడ్, బీఎస్సీ (నర్సింగ్), పీహెచ్‌డీ కోర్సులకు సంబంధించి 2024 వ సంవత్సరానికి జనవరి ఏడో తేదీన దేశ వ్యాపితంగా ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా ఆయా కోర్సులకు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఇగ్నో వెబ్‌సైట్‌ను సందర్శించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. మరింత సమాచారం కోసం విజయవాడ కొత్తపేట హిందూ హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని లేదా ఫోన్ –0866 2565253కు సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి షష్టి కల్యాణ మహోత్సవాలు

కరపత్రాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



స్వామివారి షష్టి కల్యాణ మహోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్టి మహోత్సవాలు ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా అవనిగడ్డ శాసన సభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు శుక్రవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు మాట్లాడుతూ ఆలయ వేదపండితులు కొమ్మూరి ఫణికుమార్ బ్రహ్మత్వంలో ఆలయ ప్రధానార్చకుడు బుద్దు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో షష్టి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల సమయంలో స్వామివారి ఆర్జిత సేవలన్నీ రద్దు చేసినట్లు చెప్పారు. సోమవారం స్వామివారి కల్యాణం మాత్రమే జరుపుతామన్నారు. 17వ తేదీ ఉదయం 11 గంటలకు శ్రీ స్వామివారిని పెండ్లి కుమారుని చేయుట, రాత్రి 7 గంటలకు యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణ, అంకురారోపణ, వాస్తు పూజ, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పాలతో పూజల అనంతరం తీర్థప్రసాదం ఉంటుందని తెలిపారు. 18వ తేదీ సోమవారం ఉదయం 6 గంటలకు ప్రాతఃకాలార్చనలు, గోపూజ, నిత్యహోమం, బలిహరణ ఉదయం 11 గంటలకు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం, నీరాజన మంత్ర పుష్పములతో పూజల అనంతరం తీర్థప్రసాదం ఉంటుందని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు మయూర వాహనంపై శ్రీ స్వామివారి గ్రామోత్సవం రావివారిపాలెం వరకు ఉంటుందని చెప్పారు. 19వ తేదీ మంగళవారం ప్రాతఃకాలార్చనలు, గోపూజ, నిత్యహోమం, బలిహరణ, పంచామృత స్నపన, వసంతోత్సవం, మహా పూర్ణాహుతి, తీర్థప్రసాద వినియోగం, ఉదయం 11 గంటలకు శేషవాహనంపై శ్రీ స్వామివారి గ్రామోత్సవం రావివారిపాలెం వరకు ఉంటుందని తెలిపారు. రాత్రి 7 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, 8 గంటలకు శ్రీ స్వామివారి పుష్పశయ్యాలంకృత పర్యంకసేవ, తీర్థప్రసాద వినియోగం ఉంటాయని వివరించారు. భక్తులు స్వామివారి ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన కేంద్ర బృందం



ఘంటసాల మండలం దేవరకోటలో తుపానుకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధిలోని దేవరకోటలో తుపాను వల్ల దెబ్బతిన్న పంట, రంగు మారిన ధాన్యాన్ని కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎఫ్‌సీఐ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్స్ యూనస్, రాంప్రసాద్‌తో కూడిన బృందం దేవరకోటలో పర్యటించి దెబ్బతిన్న ధాన్యాన్ని పరిశీలించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి డి.రాజుతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు కేంద్ర బృందం సభ్యులతో కలిసి తుపాను వల్ల దెబ్బతిన్న పంట, రంగుమారిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి రాజు మాట్లాడుతూ రంగు మారిన ధాన్యం నాణ్యత, పరిస్థితిని కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు ద్వారా కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్లు చెప్పారు. వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎన్.పద్మావతి పంట నష్టం నమోదుకు సంబంధించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ నెల 18వ తేదీ నాటికి పంట నష్టం నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏడీఏ శ్యామల, పౌర సరఫరాల శాఖ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ కోటిరెడ్డి, తహసీల్దార్ రామానాయక్, ఏవో కె.మురళీకృష్ణతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు: తుపానుకు దెబ్బతిన్న పంటలను పరిశీలించడానికి నియమించిన కేంద్ర బృందం శుక్రవారం గూడూరు మండలం కంచాకోడూరులో పర్యటించింది. ఎఫ్‌సీఐ టెక్నికల్ అధికారులు బసంత్, కిరణ్ ఆధ్వర్యంలోని బృందం కంచాకోడూరులో పర్యటించి తుపానుకు దెబ్బతిన్న పంటలను పరిశీలించింది. ఈ సందర్భంగా రైతులు తమను ఆదుకోవాలని అధికారులకు గోడు వెలిబుచ్చుకున్నారు. స్పందించిన అధికారులు కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుపాను ప్రభావం ఉన్న ఏడు మండలాల్లో పర్యటించి పంటలు ఏ మేరకు దెబ్బతిన్నాయో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పరిశీలనలో వచ్చిన విషయాలను కేంద్రానికి పంపిస్తామన్నారు. వీరితో పాటు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, కంచాకోడూరు సర్పంచ్ కోళ్ల హనుమంతరావు, తహసీల్దారు విజయ్‌ప్రసాద్, వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ తదితరులున్నారు.

బషీర్.. నటనలో షంషేర్

ఒకప్పుడు సెంటర్లో నాటకం వేస్తున్నారంటే.. ఆ గ్రామంతో పాటు చుట్టుపక్కల వారు కూడా అక్కడకు వచ్చి సమయంతో సంబంధం లేకుండా అర్ధరాత్రి వరకూ కూడా నాటకాన్ని చూసే పరిస్థితి. ఇప్పుడా పరిస్థితి లేదు. నాటకరంగం నిరాదరణకు గురవుతున్న పరిస్థితుల్లో ఓ యువకుడు నాటకానికి 'వెండితెర'ను పరిచయం చేశాడు. వినూత్న పంథాలో రంగస్థలంలో రాణిస్తున్నాడు. నటుడిగా, దర్శకుడిగా, శిక్షకుడిగా ప్రపంచ వేదికలపై సత్తా చాటుతున్నాడు జగ్గయ్యపేట నియోజకవర్గం వత్సవాయి మండలంలోని గోపినేనిపాలెంకు చెందిన షేక్ జాన్ బషీర్. ప్రస్తుతం పీహెచ్‌డీ స్కాలర్‌గా ఉంటూ సినిమాల్లోనూ నటిస్తున్న ఈ యువకుడిపై ప్రత్యేక కథనం.



నంది అవార్డు అందుకుంటున్న బషీర్ (ఫైల్)

- వినూత్న పంథాలో కళకు జీవం
- థియేటర్లలో తక్కువ ఖర్చుతో నాటకాల ప్రదర్శన
- ప్రపంచ వేదికలపై సత్తా
- పలు సినిమాల్లోనూ నటన
- దర్శకుడిగా, శిక్షకుడిగానూ గుర్తింపు
- నంది అవార్డు సైతం సొంతం

పెనుగంచిప్రోలు: వత్సవాయి మండలంలోని చిన్న గ్రామం గోపినేనిపాలెంకు చెందిన షేక్ జాన్ బషీర్ నాటకరంగంలో వినూత్నంగా దూసుకుపోతున్నాడు. వ్యవసాయ కూలీలైన ఇమామ్‌సాహెబ్, రహీమూన్ దంపతులకు రెండో కుమారుడు ఈ బషీర్. 1986లో పుట్టిన ఈయన ప్రాథమిక విద్యాభ్యాసం అంతా గోపినేనిపాలెంలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగింది. 8, 9, 10 తరగతులు మాత్రం మక్కపేటలోని శ్రీసాయి సెంచరీ స్కూల్‌లో సాగింది. ఇంటర్ జగ్గయ్యపేటలోని ఎస్‌జీఎస్ కళాశాల, బీఏ ఇంగ్లిష్ లిటరేచర్ ఖమ్మంలో పూర్తి చేశారు. షేక్‌స్పియర్, గిరీష్ కర్నాడ్ వంటి రచయితల రచనలు చదివి నాటకరంగంపై విపరీతమైన ఆసక్తి పెంచుకున్నాడు. అదే సమయంలో ఖమ్మంలో ప్రదర్శించిన నాటకాలను చూసి మరింత ఆసక్తి పెంచుకున్న బషీర్‌కు సుధాకర్ అనే స్నేహితుడు పరిచయం కావటం అతనిచ్చిన స్ఫూర్తితో డిగ్రీ పూర్తి కాగానే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో థియేటర్ ఆర్ట్స్‌లో పీజీ చేయటంతో పాటు గోల్డ్‌మెడల్ సాధించాడు.

నాటకానికి 'వెండి' వెలుగులు అద్దిన జిల్లా యువకుడు

400 మందికి పైగా శిక్షణ

థియేటర్ ఆర్ట్స్‌లో పీజీ చేసిన అనంతరం బషీర్ హైదరాబాద్ నగరంలోని పలు యాక్టింగ్ స్కూల్స్‌లో పని చేయటంతో పాటు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గెస్ట్ ఫ్యాకల్టీగా చేరి ఇప్పటికీ అక్కడ పని చేస్తున్నారు. గచ్చిబౌలి ప్రాంతంలో యాక్టింగ్ స్కూల్ స్థాపించి ఇప్పటి వరకు 400 మంది వరకు నటనలో శిక్షణ ఇచ్చారు. తనతో పాటు ఉన్న 15 నుంచి 20 మంది గ్రూపుతో మన దేశంతో పాటు పలు దేశాల్లో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. నార్వే, స్వీడన్, ఫ్రాన్స్ తదితర దేశాల్లో పర్యటించారు. సినిమాలకు కాస్టింగ్ కూడా చేస్తుంటారు.




తల్లిదండ్రులతో జాన్ బషీర్

వరించిన అవార్డులు..

2013లో రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు, 2021లో తెలుగు యూనివర్సిటీ వారి నుంచి జీవీఎల్ నరసింహారావు పురస్కారం అందుకున్నారు. 2015లో నందిఅవార్డు కమిటీలో జ్యూరీ సభ్యుడిగా ఉన్నారు.

నాటక రంగమే పునాది



సినిమాల్లో నటించే వారందరికీ నాటక రంగమే పునాది. ప్రస్తుతం నాటకాలను థియేటర్లలో ప్రదర్శిస్తున్నాం. తక్కువ ఖర్చుతో భారీ సెట్టింగులు లేకుండా ఆధునిక హంగులు ఉండేలా చూస్తున్నాం. గతంలో కంటే ప్రస్తుతం పిల్లలు, యువత నాటకాలపై ఆసక్తి చూపిస్తున్నారు. థియేటర్స్‌కు కూడా వస్తున్నారు. పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్నప్పుడు అప్పటి మాస్టారు సత్యనారాయణ రేడియోలో ఏకపాత్రాభినయం, నాటికలు చెప్పించేవారు. ఆలయాల మైక్‌ల్లో వచ్చే నాటకాలను తాత వివరించే వాడు. అలా చిన్నతనం నుంచే కొంత నాటకాల మీద ఆసక్తి ఏర్పడి అదే ప్యాషన్‌గా, వృత్తిగా మార్చుకున్నా. ప్రభుత్వాలు కూడా కల్చరల్ పాలసీ తెస్తే బాగుంటుంది. ప్రస్తుతం రెండు సినిమాల్లో కూడా నటిస్తున్నా. పీహెచ్‌డీ స్కాలర్‌గా ఉన్నా.

– షేక్ జాన్ బషీర్, నటుడు

ప్రేక్షకాదరణ పొందిన నాటకాలు..

బషీర్ దర్శకత్వం వహించి, నటించిన నాటకాల్లో మహ్మద్ ఖదీర్‌బాబు రాసిన న్యూబాంబే టైలర్స్ ఇప్పటి వరకు 10 ప్రదర్శనలు పూర్తయ్యాయి. విశాఖపట్నంలో నాలుగు రోజుల క్రితం పదో ప్రదర్శన పూర్తి చేశారు. మహా నిర్యాణం నాలుగు ప్రదర్శనలు, షేక్‌స్పియర్ రచనల్లో ఒకటైన ఏ మిడ్ నైట్ సమ్మర్ నైట్ డ్రీమ్స్ 6 ప్రదర్శనలు, విశ్వ విఖ్యాత ముక్కు 10, అడ్వెంచర్స్ ఆఫ్ చిన్నారి 58 ప్రదర్శనలు ఇచ్చారు. వీటితో పాటు కొన్ని నాటక సంస్థలకు కన్సల్టెంట్‌గా, ప్రభుత్వాలు ప్రజలకు అవసరమైన మెసేజ్ ఇచ్చే స్కిట్లు సొంతగా రూపొందించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.



జాన్ బషీర్ దర్శకత్వం వహించిన నాటకంలో ఓ సన్నివేశం

క్లుప్తంగా

ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీకి విజయవాడ క్రీడాకారుడు



విజయవాడ స్పోర్ట్స్: ప్రపంచ కప్ న్యాయవాదుల క్రికెట్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే భారత జట్టులో విజయవాడకు చెందిన దూబె క్రాంతికుమార్ చోటు దక్కించుకున్నాడు. ఇటీవల జరిగిన జాతీయ జట్టు ఎంపిక పోటీల్లో క్రాంతి ఆల్‌రౌండర్‌గా ఉత్తమ క్రీడానైపుణ్యం ప్రదర్శించి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. శ్రీలంకలోని కొలంబోలో ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు జరిగే ప్రపంచ కప్ పోటీల్లో పాల్గొంటాడు. ఈ పోటీల్లో ఇండియాతో పాటు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు తలపడతాయి. మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్‌గా, స్పిన్ బౌలర్‌గా క్రాంతి తన ప్రతిభను ఈ ప్రపంచ కప్ టోర్నీలో ప్రదర్శించనున్నాడు. శ్రీలంక(2017), న్యూజిలాండ్(2019)లో జరిగే ప్రపంచ కప్ పోటీలతో పాటు, శ్రీలంకలో ఈ ఏడాది మార్చిలో జరిగిన ఆసియా కప్ పోటీల్లోనూ క్రాంతి భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. భారత న్యాయవాదుల క్రికెట్ జట్టులో చోటు దక్కించుకున్న క్రాంతికుమార్‌ను ఏపీ అడ్వకేట్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పి.సురేష్‌కుమార్ అభినందించారు.

యార్డుకు 45,961 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 43,224 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 45,961 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 20,115 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

పేదల నాడి తెలిసిన నాయకుడు మన సీఎం

- హోం మంత్రి తానేటి వనిత
- విజయవాడ తూర్పు నియోజకవర్గంలో రూ. 5కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వనిత, చిత్రంలో మేయర్ భాగ్యలక్ష్మి, దేవినేని అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ పేదల ప్రభుత్వంగా గుర్తింపు తెచ్చుకుందని, పేదల నాడి తెలిసిన నాయకుడిగా సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రజల మన్ననలు పొందుతున్నారని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. తూర్పు నియోజకవర్గం పరిధిలోని 5వ డివిజన్ సున్నపు బట్టీల సెంటర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆమె శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం హోం మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేదల పక్షంగా పోరాడుతోందన్నారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేదలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలే పార్టీని తిరిగి అధికారంలోకి తెస్తాయని ధీమా వ్యక్తం చేశారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలోని కొండ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో కొండ ప్రాంతాలలో సుమారు 42 పనులను చేపట్టనున్నామన్నారు.

'తూర్పు' అభివృద్ధికి సీఎం జగన్ కృషి..

విజయవాడ తూర్పు నియోజకవర్గం గత దశాబ్ద కాలంగా అభివృద్ధికి దూరమైందన్నారు. టీడీపీ నాయకులు ప్రజలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప ప్రజా సమస్యలు పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికీ స్థానిక ఎమ్మెల్యే ప్రజలకు దూరంగా ఉంటూ ఇంటికే పరిమితమయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కడియాల బుచ్చిబాబు, కార్పొరేటర్లు కలపాల అంబేడ్కర్, అంబడిపూడి నిర్మలా కుమారి, భీమిశెట్టి ప్రవల్లిక, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులపై కక్ష సాధింపు తగదు

- తప్పుడు రాతలతో మనో ధైర్యాన్ని దెబ్బ తీయొద్దు
- పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని, అయితే టీడీపీ అనుకూల మీడియా తప్పుడు రాతలు రాస్తూ పేద విద్యార్థుల మనో ధైర్యాన్ని దెబ్బతీయటానికి యత్నిస్తోందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆరోపించారు. కానూరులో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో పేద విద్యార్థుల పట్ల ఈనాడు పత్రికలో అసత్య కథనాలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో హైస్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు పంపిణీ చేసిందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి పేద విద్యార్థి ఆధునిక విద్య అభ్యసించటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. పేద విద్యార్థులకు చదువు భారం కాకూడదని రాష్ట్రంలో జగనన్న విద్యా విధానంలో విప్లవం తీసుకువచ్చారని తెలిపారు. టీడీపీ, దాని అనుబంధ మీడియా పేద విద్యార్థుల ఎదుగుదలను చూసి ఓర్వలేక తప్పుడు రాతలు రాయడం దారుణమని మండి పడ్డారు. ఉన్నత వర్గాల పిల్లలు స్మార్ట్ ఫోన్‌లు వాడినా, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు ఉపయోగిస్తే లేని తప్పు.. పేద విద్యార్థులు ట్యాబ్‌లు వాడితే వేలెత్తి చూపుతూ అసత్య ప్రచారం చేయటం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉపయోగిస్తున్న ట్యాబ్‌లపై ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియంత్రణలోనే ఉంటాయన్నారు.

చేసిన మంచిని వివరించే యాత్ర

నందిగామ టౌన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు మన ప్రభుత్వం చేసిన మంచిని వివరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. నందిగామ పట్టణంలోని ఐదు, ఏడు, 15, 17, 18 వార్డులతో పాటు చందర్లపాడు మండల స్థాయిలో చందర్లపాడు గ్రామంలో బస్సు యాత్రకు సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ 17న నందిగామలో బస్సు యాత్ర ఉంటుందన్నారు. గతంలో మాదిరిగా అది చేస్తాం.. ఇది చేస్తాం ఓట్లేయండి.. అండగా ఉండండి.. అని అడగటం లేదని మనం చేసిన మంచిని వివరించి మద్దతు పలకాలని కోరుతున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి సికింద్రాబాద్‌కు చెందిన రాణి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత గుండయ్య గల్లా లక్ష రూపాయల విరాళం ఇచ్చారు. ఇంద్రకీలాద్రిపైకి వచ్చిన ఆయన శుక్రవారం ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్ రామారావును కలిసి రూ.1,00,000 చెక్కును అందజేశారు. దాతకు అమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం అర్చకులు వేదాశీర్వచనం ఇచ్చారు.

ఆరోగ్యశ్రీపై అవగాహన పెంచుదాం

డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై ప్రజలకు అవగాహన పెంచాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కొత్త కార్డులు పంపిణీతో పాటు, సేవల విస్తరణపై అవగాహన కలిగించే కార్యక్రమం చేపట్టనున్న దృష్ట్యా ఎన్టీఆర్ జిల్లాలోని ఏఎన్ఎంలు, కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్‌లు, గ్రామీణ, పట్టణ ప్రాంత పర్యవేక్షకులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ పంపిణీ చేయనున్న బ్రోచర్‌ను ఆవిష్కరించారు. బెంజిసర్కిల్ సమీపంలోని వాసవ్య మహిళా మండలి హాలులో నిర్వహించిన ఈ సదస్సులో డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ జిల్లాలో కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను నాలుగు దశల్లో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా నిర్దేశించిన గ్రామీణ ప్రాంతాల్లో ఎంపిక చేసిన సచివాలయాలు, నగర పాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయాల్లో ఈ నెల 18న కార్యక్రమాన్ని ఉన్నతాధికారులు శాసన సభ్యులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అందుకు సంబంధించి వైద్యాధికారులు, సిబ్బంది అందరూ సంసిద్ధంగా ఉండాలని, ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయ అధికారి డాక్టర్ సుమన్, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, డాక్టర్ నవీన్, డాక్టర్ పద్మావతి, డీపీఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మాధుర్యం అమోఘం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, వేదికపై విజయబాబు, అనూరాధ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): తెలుగు భాష మాధుర్యం అద్వితీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. యువత ఎన్ని బాషలను నేర్చుకున్నప్పటికీ మాతృభాష తెలుగును విడనాడకూడదన్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘం, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, జిజ్ఞాస సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నలంద డిగ్రీ కళాశాలలో తెలుగు గళ పురస్కారాల పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విదేశీ పాలకులు సైతం తెలుగు భాషను 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా అభివర్ణించారని గుర్తు చేశారు.

ఐదు అంశాలలో పోటీలు..

తెలుగు అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు మాట్లాడుతూ తెలుగు గళ పురస్కారాలను పురస్కరించుకొని విద్యార్థులకు సాహితీ రంగంలోని ఐదు అంశాలపై పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. సృజనాత్మక రచన (మీ ఉత్సాహాన్ని పెంచుకోండి), వార్తా పఠనం (ఆత్మ విశ్వాసంతో చదవండి), చిక్కుముడి విప్పుదాం (బృంద చర్చ), పుస్తక సమీక్ష (గ్రంథ విమర్శ), వ్యంగ్య చిత్రాలు వార్త వివరణ వంటి ఐదు అంశాలలో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. శాప్ సీఈవో శ్రీనివాసరావు, నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం. అనూరాధ, జిజ్ఞాస డైరెక్టర్ వై. భార్గవ్ పాల్గొన్నారు.

గ్రూప్-1, 2 ప్రిలిమినరీ పరీక్షలకు ఉచిత శిక్షణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్–1, 2 ప్రిలిమినరీ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణకు ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్టడీసర్కిల్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ డైరెక్టర్ ఎం. రుక్మాంగదయ్య ఓ ప్రకటనలో తెలిపారు. గ్రూప్–2కు ఈనెల 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 27వ తేదీ నుంచి 50 రోజుల పాటు 100 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. అలాగే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు అభ్యర్థులు ఈ నెల 31 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే ఏడాది జనవరి నెల 5వ తేదీ నుంచి 60 రోజుల పాటు 60 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ, స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. ఉచిత శిక్షణకు అభ్యర్థుల ఎంపిక డిగ్రీలో వచ్చిన మార్కుల మెరిట్ ప్రాతిపదికపై జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పది, డిగ్రీ మార్కులిస్టులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు దరఖాస్తుతో జతచేయాలని కోరారు. వివరాలకు 9505094349, 9966849937లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెనమలూరు: కానూరు కామయ్యతోపు వద్ద శుక్రవారం వేకువ జామున బందరు రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తోట్లవల్లూరు మండలం రొయ్యూరుకు చెందిన తుల్లూరి రవికిరణ్ (33) యమలకుదురులో భార్య పిల్లలతో ఉంటున్నాడు. అతను డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. కాగా అతను శుక్రవారం అర్ధరాత్రి కామయ్యతోపు వద్ద బైక్ ఆపి రోడ్డు పక్కన నిలుచున్నాడు. ఈ లోగా తాడిగడప వైపు నుంచి వచ్చిన పాల ట్యాంకర్ రోడ్డు పక్కన నిలబడి ఉన్న రవికిరణ్‌కు ఢీ కొట్టింది. ఈ ఘటనలో రవికిరణ్‌కు తీవ్ర గాయాలై మృతి చెందాడు. ప్రమాదంలో బైక్ దగ్ధమైంది. ఈ ఘటనపై మృతుడి మేనమామ లంకా శివనాగపోతురాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రెడిట్ సొసైటీని సద్వినియోగం చేసుకోండి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్రెడిట్ సొసైటీలో సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ అన్నారు. శుక్రవారం బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సొసైటీలో అర్హతను బట్టి రూ. 6లక్షల వరకు రుణ సదుపాయం కల్పించినట్లు చెప్పారు. రాష్ట్రంలోనే మన జిల్లా క్రెడిట్ సొసైటీ లాభాల్లో నడుస్తోందన్నారు. వడ్డీ శాతం కూడా తగ్గించామని, సభ్యులు సొసైటీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సభ్యులకు డివిడెండ్ చెక్కులను అందజేశారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు బి.విజయకుమార్, సభ్యులు పద్మావతి, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నలందలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): నలంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం కొటక్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. డెప్యూటీ మేనేజర్ పోస్టులకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 180 మంది విద్యార్థులు హాజరవ్వగా, మూడు దశల్లో జరిగిన ఇంటర్వ్యూల్లో నలుగురిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ రానున్న రెండు నెలల్లో మరిన్ని కంపెనీలు తమ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆ కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి, టెక్నికల్ హెడ్ యు.తిరుపతిరావు పాల్గొన్నారు.

పాఠశాలకు సీసీ కెమెరాల వితరణ




ఆటోనగర్(విజయవాడతూర్పు): అమరావతి కార్ మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గుణదలలోని విజయమేరి ఇంటిగ్రేటెడ్ బ్లైండ్ స్కూలుకు 16సీసీ కెమెరాలను ఉచితంగా అందజేశారు. వీటిని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ పౌలిన్, అమరావతికార్ మెకానిక్ సంఘ అధ్యక్షుడు టీఎస్ దివాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దివాకర్ మాట్లాడుతూ సంఘం స్థాపించి ఎనిమిదో వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాలని సంఘం నిర్ణయించినట్లు తెలిపారు. సిస్టర్ పౌలిన్ మాట్లాడుతూ మంచి మనసుతో సీసీ కెమెరాలు ఇచ్చిన అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ఎస్కే బాబు, కోశాధికారి ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎస్టీవీఆర్ విద్యార్థిని



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాల విద్యార్థి బొగిలి ప్రియాంక జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన జరిగిన 67వ రాష్ట్ర స్థాయి అండర్ 19 అథ్లెటిక్స్ పోటీల్లో 3000 మీటర్స్ రైస్ వాకింగ్ విభాగంలో బొగిలి ప్రియాంక అత్యుత్తమ ప్రదర్శనతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్ర జట్టు తరపున పాల్గొనడానికి ప్రియాంకను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ప్రియాంకను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సూర్యప్రభ, ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటి పాఠశాల నగర ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

సోమేపల్లి మృతి సాహితీరంగానికి తీరనిలోటు



విజయవాడ కల్చరల్: ఏపీ రచయితల సంఘం అధ్యక్షుడు సోమేపల్లి వెంకటసుబ్బయ్య మృతి సాహితీ రంగానికి తీరనిలోటని రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. కవిగా సోమేపల్లి కవితా సంపుటులు ప్రచురించినట్లు పేర్కొన్నారు. ఏపీ రచయితల సంఘం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సాహితీ సదస్సులు నిర్వహించారని తెలిపారు. ప్రభుత్వంలో అనేక ఉన్నత పదవులను అలంకరించినట్లు పేర్కొన్నారు. నగరానికి చెందిన పలు సాహితీ సంస్థల ప్రతినిధులు గోళ్ల నారాయణరావు, బోడి ఆంజనేయరాజు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ వెన్నావల్లభరావు, ఏపీ రచయితల సంఘం సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

పౌష్టికాహారం ఆవశ్యకతపై ప్రదర్శన

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్టెల్లా కళాశాల విద్యార్థినులు ఆరోగ్యం– పోషకాహారం అంశంపై 3, 4, 5 తరగతుల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎటువంటి పౌష్టికాహారం తీసుకోవాలో అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు లభించే ఆహార పదార్థాలను వివరించారు. జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉంటూ పండ్లు, పోషకాహారాలు తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యల నుంచి దూరం కావచ్చన్నారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

అమరజీవికి నివాళి

లబ్బీపేట(విజయవాడతూర్పు): పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని అధికారులు తెలిపారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, డీపీహెచ్ఎన్ లిడియా, డీపీఎంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ బాలాజీనాయక్, డాక్టర్ విద్యాసాగర్, అకౌంట్స్ అధికారి విజయ్, డీపీఓ మహేష్, జ్యోతి, వలీ, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో..

పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ యు.శోభ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్, వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం పోరాడిన మహనీయుడు పొట్టి శ్రీరాములని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి, అదనపు కమిషనర్ (జనరల్) శకుంతల, చీఫ్ ఇంజినీర్ ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, అకౌంట్స్ ఎగ్జామినర్ చక్రవర్తి, సెక్రటరీ వసంత లక్ష్మి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, మేనేజర్ బి.శ్రీనివాసరావు, వీఎంసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్ఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న డాక్టర్ సుహాసిని తదితరులు

సత్యనారాయణపురం: అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని ఆంధ్రరత్న పార్కు వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తితో కలసి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ఆ మహనీయుని స్ఫూర్తితో నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు.

దీక్ష విరమణల క్యూ లైన్ల పనులకు శ్రీకారం



పనులు ప్రారంభిస్తున్న కేఎస్ రామారావు, కర్నాటి రాంబాబు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీ దీక్షల విరమణల నేపథ్యంలో వినాయకుడి గుడి వద్ద శుక్రవారం క్యూ లైన్ల పనులకు శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావు, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కర్నాటి రాంబాబు కొబ్బరికాయలు కొట్టి శ్రీకారం చుట్టారు.

జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు దీక్ష విరమణలు జరగనున్నాయి. తొలుత వినాయక దేవస్థానం వద్ద శ్రీకనకదుర్గమ్మ చిత్రపటం ఏర్పాటు చేసి ఆలయ వైదిక, అర్చక సిబ్బంది శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు కోటేశ్వరరావు, లింగం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో ప్రజా సమస్యల పరిష్కారం

గుణదల (విజయవాడతూర్పు): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. రెండో డివిజన్ పరిధిలోని మాచవరం కొండ ప్రాంతంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించి రాష్ట్రంలో సుపరిపాలన స్థిరపరచడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాలతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. ఈ పరిస్థితులను మార్చాలనే ఉద్దేశంతో ప్రజా సంకల్పయాత్ర చేపట్టారన్నారు. నాడు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సఫలమయ్యారని తెలిపారు.

క్వారీ రోడ్డు నిర్మాణం

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రమే కొండ ప్రాంతాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రస్తుత తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలకు దూరమై ఇంటికే పరిమితమయ్యారని విమర్శించారు. పదేళ్లుగా ఎమ్మెల్యేగా కొనసాగుతున్నా 'తూర్పు'లో సామాజిక కార్యక్రమాలు నిర్వహించలేదని దుయ్యబట్టారు. ఎంతో కాలంగా నిలిచిపోయిన పనులను పూర్తి చేసిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందని పేర్కొన్నారు. మాచవరం క్వారీ రోడ్డును రూ. 4 లక్షల నిధులతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో కాలిబాటలు, తాగునీటి వసతి, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరిచామన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలాకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు కోటి నాగులు, కిరణ్ తేజ, మొయిన్ తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్

శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకుని బాల శాస్త్రవేత్తలుగా ఎదగాలని డాక్టర్ జి.కృష్ణవేణి ఆకాంక్షించారు. భవానీపురం క్రాంబ్వే రోడ్డులోని సెయింట్‌జాన్స్ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సైన్స్ క్వెస్ట్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు సుమారు 400 సైన్స్ ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించిన వివిధ నమూనాలను చూసి వారిని ప్రశంసించారు. ఆమె మాట్లాడుతూ సైన్స్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని, ఎందరో శాస్త్రవేత్తల కృషి ఫలితంగా ఎన్నో వినూత్న ఆవిష్కరణలను చూశామన్నారు. మనం అనుభవిస్తున్న శాస్త్రీయ ఫలాలు వారి పుణ్యమేనని తెలిపారు. పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ టి.సుమన్‌త్యాగరాజ్ మాట్లాడుతూ తన మాతృమూర్తి టి.సుదర్శనమ్మ జయంతి సందర్భంగా ఏటా సైన్స్ క్వెస్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. పాఠశాల ప్రెసిడెంట్ టి.మోనికా సుమన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సైన్స్ క్వెస్ట్ కార్యక్రమానికి పి.మౌనిక, ఎం.సాహితి, పి.సురేష్, జె. శ్రీనివాసరావు వ్యవహరించారు. విజేతలకు డాక్టర్ ఆర్.విజయ బహుమతులు అందజేశారు.



సైన్స్ క్వెస్ట్‌లో నమూనాలు

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(లా అండ్ ఆర్డర్) డాక్టర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. బెంజిసర్కిల్ సమీపంలోని నలంద విద్యానికేతన్ 26వ వార్షిక క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రీడా జ్యోతిని వెలిగించి పోటీను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రీడలు ఎంతో అవసరమన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మాదల పద్మజ మాట్లాడుతూ అండర్–14, అండర్ –17, బాలురు, బాలికలకు ఇంటర్ స్కూల్ పోటీలు జరుగుతుండగా, అందులో భాగంగా లాంగ్‌జంప్, షాట్‌పుట్, క్రికెట్, వాలీబాల్, త్రోబాల్, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని 11 పాఠశాలల నుంచి 155 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. విజేతలకు శనివారం బహుమతులు, యోగ్యతాపత్రాలను, అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భవాని, హెడ్‌మిస్ట్రెస్ సీహెచ్ ఉషారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




పోటీలు ప్రారంభిస్తున్న అదనపు డీజీపీ శంఖబ్రత బాగ్చీ, నలంద ప్రిన్సిపాల్ మాదల పద్మజ



విద్యార్థుల ప్రదర్శన

నాలుగోదశ న్యూరోఎండోక్రైన్ క్యాన్సర్‌కు అరుదైన చికిత్స



ఎస్.సుబ్బారావు, మెడికల్ ఆంకాలజిస్ట్

లబ్బీపేట(విజయవాడతూర్పు): అరుదైన, తీవ్రమైన నాలుగో దశలో ఉన్న న్యూరోఎండోక్రైన్ కార్సినోమా (క్యాన్సర్)తో బాధపడుతున్న 42 ఏళ్ల మహిళకు విజయవంతంగా చికిత్స చేసినట్లు అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ డైరెక్టర్, మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎస్.సుబ్బారావు తెలిపారు. వినుకొండకు చెందిన 42 ఏళ్ల మహిళ మూడు నెలల వ్యవధిలో 10 కిలోల బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, మలబద్ధకం వంటి సమస్యలతో చికిత్సకోసం తమ వద్దకు వచ్చినట్లు తెలిపారు. ఆమెను పరీక్ష చేయగా సిగ్మాయిడ్ కోలన్‌లో అల్సెరోప్రొలిఫెరేటివ్ పెరుగుదలతో బాధపడుతున్నట్లు నిర్ధారించినట్లు తెలిపారు. బయాప్సీ చేయగా గ్రేడ్ 3 న్యూరోఎండోకిరన్ కార్సినోమాగా నిర్ధారించినట్లు తెలిపారు. సమగ్ర రోగ నిర్ధారణ పరీక్షల్లో నాలుగో దశలో ఉన్నట్లు తేలిందన్నారు. కాలేయ గాయాలు కూడా ఉన్నట్లు వెల్లడైందని డాక్టర్ సుబ్బారావు తెలిపారు. రోగి బలహీనంగా ఉండటంతో పాటు, పొత్తికడుపు పెరగడం, రెండు కాళ్లలో వాపు, విపరీతమైన కడుపునొప్పి వంటి సమస్యలతో రోజులో సగం మంచానికే పరిమితమైనట్లు తెలిపారు. దీంతో ఆమెకు పాలియేటివ్ కీమోథెరపీ మొదటి సైకిల్ తర్వాత ట్యూమర్ లైసిస్ సింద్రోమ్ అనే క్లిష్టమైన ఆంకోలాజికల్ ఎమర్జెన్సీని ఎదుర్కొన్నట్లు తెలిపారు. కీమో చేసిన పదిరోజుల్లో పొత్తికడుపు నొప్పి తగ్గడం, మూత్రపిండాల పనితీరు మెరుగుపడిందని తెలిపారు.

ఇలా అధునాతనంగా ఆరు కీమోథెరపీ సైకిల్స్‌ను విజయవంతంగా చేయడంతో ఆమెకు పూర్తిగా నివారించగలిగామన్నారు. ఆమెకు పెట్‌స్కాన్ చేయగా వ్యాధి పూర్తిగా తగ్గుముఖం పట్టినట్లు డాక్టర్ సుబ్బారావు తెలిపారు. రోగికి చికిత్స అందించిన బృందంలో మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సృజన జోగా ఉన్నట్లు తెలిపారు.

కుంగ్‌ఫూలో విద్యార్థులకు బంగారు పతకాలు



కంకిపాడు: జాతీయ స్థాయి కుంగ్‌ఫూ–కరాటే చాంపియన్‌షిప్‌లో గోసాల హెచ్ఎంకే విద్యార్థులు సత్తాచాటారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను శుక్రవారం పాఠశాల డైరెక్టర్ ఆర్.వసంత్‌కుమార్, ప్రిన్సిపాల్ సుక్‌మిత్ కౌర్ పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4వ జాతీయ స్థాయి కుంగ్‌ఫూ–కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 10న నంది గామలో ఓసీ క్లబ్‌లో జరిగాయన్నారు. పోటీల్లో క్రీడాకారులు వై.నిరుపమ, ఎస్.ప్రేమ్‌కుమార్, పి.లియాకత్, అలిఖాన్, ఎం.శ్రీ బాలసాయి, ఎ.అఖిల్ సాయి, బి.గీతమ్ ప్రహర్ష, బి.వశిష్ఠసాయి, కె.లోహిత్, ఎం.హర్షవర్ధన్ బంగారు పతకాలను సాధించారన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అందుకు అనుగుణంగానే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కుంగ్‌ఫూ కోచ్ డి.రామాంజనేయులును అభినందించారు.

సెమీక్రిస్మస్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న సెమీ క్రిస్మస్ వేడుకలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. సెమీ క్రిస్మస్ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సెమీ క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టర్ ఢిల్లీరావు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు చెందిన క్రైస్తవ మత పెద్దలు, చర్చి ఫాదర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు. వేడుకల్లో 2,500 మంది చర్చి ఫాదర్లు, 5వేల మందికి పైగా క్రైస్తవ సోదరులు హాజరవుతారన్నారు.

వాతావరణంలో మార్పులు వచ్చినా ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు. క్యాండిల్ లైట్ నిర్వహణకు తగిన ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపక పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. వేడుకలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

అయ్యప్ప ఇరుముళ్లు



కంకిపాడు: మండలంలోని కోలవెన్ను శివాలయంలో అయ్యప్ప మాలధారుల ఇరుముళ్ల కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. దీక్షపూర్తి చేసుకున్న మాలధారులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి కోసూరు శ్రీనివాసరావు మాలధారులకు ఇరుముడి కట్టారు. అనంతరం మాలధారులు శరణం అయ్యప్ప అని స్మరిస్తూ శబరిమలకు పయనమయ్యారు.

86 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

గన్నవరం: క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పార్థసారథి సూచించారు. స్థానిక కొత్తపేటలోని డాక్టర్ సీఎల్. రాయుడు రోటరీ ఆడిటోరియంలో శుక్రవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మణిపాల్ ఆస్పత్రి సహకారంతో క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ మహిళల్లో రొమ్ము, శరీర భాగంలో గడ్డలు, గొంతు ద్వారా ఆహారం తీసుకోలేకపోవడం వంటి లక్షణాలు ఉంటే క్యాన్సర్ వ్యాధికి సాంకేతంగా భావించాలని చెప్పారు. వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా వ్యాధి నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. ఈ శిబిరంలో 86 మందికి క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్ తెలిపారు. వీరికి వారం రోజుల్లో రిపోర్ట్‌లు అందజేయనున్నట్లు చెప్పారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి నర్రా సీతారామారావు, రోటేరీయన్లు చింతపల్లి సీతారామయ్య, టీఎస్ఆర్‌కె. ప్రసాద్, గన్నె వెంకట్రావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల బస్సు వద్ద రోటేరియన్లు

ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ప్రదర్శన

పెనమలూరు: ఈవీఎం మిషన్‌లపై ప్రజలకు అవగాహన కల్పించటానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపారు. ఆయన శుక్రవారం పెనమలూరులో ఈవీఎంలతో ఉన్న వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు తెలుపుతూ భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రజలకు ఈవీఎం మిషన్‌ల పై అవగాహన కల్పించటానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మిషన్ ఏర్పాటు చేసి ప్రజలకు ఓటు ఎలా వేయాలో పూర్తిగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. పెనమలూరు నియోజకవర్గంలో మొత్తం 304 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలను ఏర్పాటు చేసి ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఈవీఎంల పై అవగాహన 45 రోజులు పాటు పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. శుక్రవారం కానూరు గ్రామంలో ఈవీఎంలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ భవాని, ఆర్ఐ రమేష్, రెవెన్యూ సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక 45వ డివిజన్ పరిధిలోని రాము క్వారీ ప్రాంతంలో రూ.10 లక్షల అంచనాతో సిమెంట్ రోడ్డు, కాలువల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య తెలిపారు. సీసీ రోడ్ నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ స్థానికులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించే ఆయన వీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారని ఈ రోజు పనులను మొదలు పెట్టామని తెలిపారు. వెలంపల్లి మార్గదర్శకత్వంలో డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. డివిజన్‌లో అవసరమైన ప్రాంతాల్లో రోడ్లు, సైడు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు శక్తినగర్‌లో శుక్రవారం పైప్‌లైన్ మరమ్మతులు నిర్వహించారు. ఈ ప్రాంతవాసులకు తాగునీరు సరఫరా అయ్యే పైప్‌లైన్ మరమ్మతులకు గురవ్వడంతో వెల్డింగ్ పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ మాట్లాడుతూ మరమ్మతులకు గురైన పైప్‌లైన్‌తో ఈ ప్రాంతవాసులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని వెంటనే పరిష్కరించినట్లు తెలిపారు. గ్రామంలో సురక్షిత తాగునీరు సరఫరా చేయడానికి అవసరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. గ్రామంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్ విస్తరణ పనులను ఇటీవల పూర్తి చేసినట్లు తెలిపారు. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి సురక్షిత తాగునీటిని అందిస్తున్నామన్నారు. తాగునీటి సరఫరాలో ఏమైనా సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

బీసీ విభాగం రాష్ట్ర కార్యవర్గంలోకి కంపెళ్ల



కంపెళ్ల లక్ష్మీనారాయణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంకకు చెందిన ఇద్దరు వైఎస్సార్ సీపీ నాయకులు పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యవర్గంలో నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 21వ డివిజన్‌కు చెందిన కంపెళ్ల భాను లక్ష్మీనారాయణ జాయింట్ సెక్రటరీగా, కసగాని దుర్గారావు గౌడ్ జోనల్ ఇన్‌చార్జి (జోన్–4)గా పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జాయింట్ సెక్రటరీగా నియమించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, దేవినేని అవినాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంధన పరిరక్షణ మనందరి బాధ్యత

ఇబ్రహీంపట్నం: ఇంధన పరిరక్షణ మనందరి బాధ్యత అని విద్యుత్‌శాఖ విజయవాడ రూరల్ డివిజన్ డీఈ జీబీ శ్రీనివాసరావు అన్నారు. డివిజన్ కార్యాలయం నుంచి ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ వరకు ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని ఇంధనం, విద్యుత్ తదితర వనరుల సంరక్షణపై ఉద్యోగులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


సీఎం వైఎస్ జగన్‌కు తన సమస్యను తెలియజేస్తున్న సంతోషి


తులసీదాస్


సాయికృష్ణ


హేమంత్‌కుమార్


యోగేశ్వరరావు


సాత్విక్ గురించి తెలియజేస్తున్న తల్లి


వితిక గురించి వివరిస్తున్న తల్లి


కలెక్టర్ నుంచి చెక్కు అందుకుంటున్న సంతోషి



తులసీదాస్


సాయికృష్ణ, అతని తల్లి


హేమంత్‌కుమార్


యోగేశ్వరరావు


సాత్విక్ తల్లిదండ్రులు


వితిక తల్లిదండ్రులు

విన్నారు.. ఆదుకున్నారు..

సాయం కోరిన అభాగ్యులకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్

24 గంటల్లో ఎనిమిది మందికి రూ.9 లక్షలు అందజేత

శ్రీకాకుళం పాత బస్టాండ్: శ్రీకాకుళం జిల్లా పలాస పర్యటనకు గురువారం వచ్చిన సీఎం వైఎస్ జగన్ మరోసారి తన మంచి మనస్సుని చాటుకున్నారు. సాయం కోరి వచ్చిన వారిని అక్కున చేర్చుకుని ఒక్కరోజులోనే ఆయన వారికి ఆర్థిక సాయాన్ని అందించేలా చర్యలు తీసుకున్నారు. ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం నిర్మించిన వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి, వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రిని పలువురు కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. మందుల కోసం, ఇతర వైద్య అవసరాల కోసం సాయం కోరారు. వారి కష్టాలు విన్న సీఎం వెంటనే సాయం చేయాలని అక్కడే ఉన్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం ఉదయం తన కార్యాలయంలో ఎనిమిది మందికి రూ.9లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు.


సాయం అందుకున్న వారి వివరాలు

- పొందూరు మండలం నరసాపురం గ్రామానికి చెందిన బోను సంతోషి పదేళ్లుగా తెలికపాటి పక్షవాతం, తీవ్రమైన చర్మవ్యాధితో బాధపడుతోంది. ఆమె సీఎంను కలిసి ఆర్థిక సాయం కోరడంతో ఆమెకు రూ.2 లక్షలు అందించారు.
- పెద్ద శ్రీపురం సచివాలయ పరిధికి చెందిన మేరపాటి తులసీదాసు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. సీఎంను కలిసి కష్టం చెప్పుకోగా ఆయనకు రూ.లక్ష అందించారు.
- సనపల హేమంత్‌కుమార్ అనే వ్యక్తి వంశ పారంపర్య హైపర్ కొలెస్ట్రిమియా అనే కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆరోగ్యశ్రీలో తనకు చికిత్స అందేలా చూడాలని సీఎంను కోరారు. వెంటనే ఆయనకు రూ.లక్ష చెక్కును కలెక్టర్ అందజేశారు.
- రాజాం మండలానికి చెందిన అడపా యోగేశ్వరరావు సీఎంను కలిసి తనకు గుండెలో రంధ్రాలు, జన్యుపరమైన సమస్యకు ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్స జరిగిందని, ఆర్థిక సాయం చేయాలని కోరారు. దీంతో ఆయనకు రూ.లక్ష మంజూరు చేశారు.
- అలాగే.. వితిక (అధిక రక్తస్రావం), సాయికృష్ణ (మానసిక వ్యాధి), ఎం. సాత్విక్ (జన్యుపరమైన సమస్యలు), అధిక కొలెస్ట్రాల్) కొమర పోలరాజు (ఊపిరితిత్తుల క్యాన్సర్ 4వ దశ)లు కూడా ముఖ్యమంత్రిని కలిసి సాయం అభ్యర్థించగా.. వారికి కలెక్టర్ ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు.
- ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త పి. ప్రకాశరావు, కొవ్వాడ ఎస్‌డీసీ తహసీల్దార్ బీవీ రమణ, డి–సెక్షన్ సూపరింటెండెంట్ పి. అమల, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రైతుల ప్రత్యామ్నాయ ప్లాట్లకు ఈ-లాటరీ

44 మందికి కేటాయింపు పత్రాల పంపిణీ


భూ యజమానికి ప్లాట్ కేటాయింపు పత్రం అందిస్తున్న వివేక్ యాదవ్

సాక్షి, అమరావతి: ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్డీఏ)కు భూములప్పగించి ప్రత్యామ్నాయ ప్లాట్లు పొందేందుకు అంగీకారం తెలిపిన భూ యజమానులకు శుక్రవారం విజయవాడలోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో సంస్థ కమిషనర్ వివేక్ యాదవ్ ఈ–లాటరీ తీసి ప్లాట్లు కేటాయింపు పత్రాలను అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ భూ సమీకరణ పథకంలో భాగంగా ఏపీ సీఆర్డీఏకు భూములిచ్చిన రైతులకు గతంలో నివాస, వాణిజ్య ప్లాట్లను కేటాయించామన్నారు. వాటిలో 3,356 ప్లాట్లు భూ సమీకరణ పరిధిలోని భూ సేకరణ పూర్తికాని భూమిలో ఉన్నట్లుగా గుర్తించామని చెప్పారు. తొలి విడతలో 679 రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు పొందాలని నోటీసులు జారీ చేశామన్నారు. రెండో దశలో ప్లాట్లు పొందేందుకు 44 మంది రైతులు అంగీకారం తెలిపారన్నారు. ప్రభుత్వాదేశాల మేరకు వారికి ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించేందుకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ఈ–లాటరీ తీసి భూ యజమానులకు ప్లాట్ల కేటాయింపు పత్రాలు అందించామని తెలిపారు. 16 గ్రామాల పరిధిలోని భూ యజమానులకు 31 నివాస, 13 వాణిజ్య ప్లాట్లు అందజేశారు. ఏపీసీఆర్డీఏ అదనపు కమిషనర్లు కట్టా సింహాచలం, అలీం బాషా, ల్యాండ్స్ విభాగం జాయింట్ డైరెక్టర్ టి. చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మంగోలియా, భారత్ మైత్రి బలపడాలి

మంగోలియా ప్రతినిధులతో పార్లమెంటరీ స్థాయి సంఘం చైర్మన్ విజయసాయిరెడ్డి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: మంగోలియా భారత్ మధ్య వాణిజ్యం, రవాణా, సంస్కృతి బలపడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, వాణిజ్యం, రవాణా, సంస్కృతి పార్లమెంటరీ స్థాయి సంఘం చైర్మన్ విజయసాయి రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం మంగోలియా పార్లమెంటరీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. రవాణా, వాణిజ్యం, సంస్కృతిపై రెండు దేశాల ప్రతినిధుల బృందంతో చర్చలు జరిగినట్లు తెలిపారు. భారతదేశం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని మంగోలియా ప్రతినిధులకు చెప్పినట్లు ఎక్స్ ఖాతాలో ఎంపీ విజయసాయిరెడ్డి పోస్ట్ చేశారు.


మార్గదర్శి పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లు తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలంటూ మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారణ వాయిదా వేసింది. ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణ ఫిబ్రవరి 2కు వాయిదా వేసింది. మార్గదర్శి తరపు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూత్రా విజ్ఞప్తి మేరకు తదుపరి విచారణ వరకూ ఏపీ హైకోర్టు ఈ పిటిషన్‌కు సంబంధించి ఎలాంటి ప్రొసీడింగ్స్ చేపట్టవద్దని ధర్మాసనం సూచించింది.

వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఘోర పరాజయం తథ్యం

175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

- ఇప్పటినుంచే ఓటమికి సాకులు వెదుక్కుంటున్న చంద్రబాబు
- అందుకే ఎల్లో మీడియాతో ప్రభుత్వంపై బురదజల్లుతూ అభూతకల్పనలతో కథనాలు రాయిస్తున్న బాబు
- తాంత్రికపూజలపై నమ్మకంతోనే అధికారంలోకి వస్తానని చంద్రబాబు కలలుకంటున్నాడేమో!
- ఉద్దానం సమస్యపై నాడు కోతలు కోసి.. నేడు సీఎం జగన్ పరిష్కరిస్తే నోరుమెదపని బాబు, పవన్
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను మారిస్తే చంద్రబాబుకు నొప్పేంటి?
- వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే పదవులు, పార్టీ పదవులు రెండు సమానమే
- చంద్రగిరి నుంచి బీసీ స్థానమైన కుప్పానికి వలస ఎందుకు వెళ్లావ్ బాబూ?
- బీసీ స్థానమైన మంగళగిరిలో పోటీచేయడానికి లోకేశ్‌కు సిగ్గుండాలి
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి




సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వచ్చే శాసన సభ ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో టీడీపీకి ఘోర పరాజయం తప్పదని, వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని నిర్ధారణకు వచ్చే తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు ఇప్పటి నుంచే ఓటమికి సాకులు వెదుక్కుంటున్నారని ప్రభుత్వ సలహాదారు (ప్రజావ్యవహారాలు), వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. అందుకే అత్యంత పారదర్శక పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్, ప్రభుత్వంపై బురదజల్లుతూ తనకు వత్తాసుపలికే ఎల్లో మీడియాతో అభూతకల్పనలతో కథనాల్ని రాయించడం, వాటిపైనే టీడీపీ నేతలతో మరోమారు ప్రెస్‌మీట్‌లు పెట్టి మాట్లాడిస్తున్నాడని విమర్శించారు. మేధావుల సంఘాలంటూ ఊరూపేరులేని వ్యక్తుల్ని తీసుకొచ్చి వారికి ఏవో పదవుల్ని తగిలించి ప్రభుత్వాన్ని విమర్శించమని చెప్పి, వారి నోటిమాటల్ని ప్రజాభిప్రాయంగా చిత్రీకరించాలనే చంద్రబాబు ప్రయత్నాల్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో శుక్రవారం సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనిరీతిలో నాలుగున్నరేళ్లుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో సీఎం వైఎస్ జగన్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నిలిపారని వివరించారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధుల ప్రభావంతో వేలమంది చనిపోయారని, ఆ ప్రాంతంలో పెళ్లి చేసుకోవాలంటే గతంలో పిల్లనిచ్చే పరిస్థితి లేదని గుర్తుచేశారు. రాష్ట్రంలో 2014–19 మధ్య అధికారంలో ఉన్న చంద్రబాబు ఉద్దానానికి ఏమీ చేయలేదని, ఆయన దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ ఆ ప్రాంతంలో ప్రత్యేక హెల్త్ క్యాంపులు పెట్టిస్తానంటూ గతంలో పెద్దపెద్ద కోతలు కోసి, చివరికి ఏమీ చేయకుండా చేతులెత్తేశాడని విమర్శించారు. దాదాపు రూ.800 కోట్లు ఖర్చుపెట్టి కిడ్నీ రీసెర్చి సెంటర్‌తోపాటు మంచినీటి శుద్ధి ప్లాంట్ ప్రాజెక్టును శరవేగంగా పూర్తిచేసి ప్రారంభించడం ద్వారా ఉద్దానం కిడ్నీ వ్యాధుల సమస్యను సీఎం వైఎస్ జగన్ శాశ్వతంగా పరిష్కరిస్తే.. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు నోటమాట రావడంలేదని చెప్పారు. సజ్జల రామకృష్ణారెడ్డి ఇంకా ఏమన్నారంటే..

ఏపీకి వారు అతిథులు

- 3నెలల్లో అధికారంలోకి వస్తానంటూ చంకలు చరుస్తున్న చంద్రబాబుకు మతితప్పిందేమో! ప్రజామోదంతో అభ్యర్థుల్ని ఎంపిక చేస్తానంటున్నాడు. అసలు చంద్రబాబుకే ప్రజామోదం లేనప్పుడు.. ఆయన ఎంపికచేసే అభ్యర్థులను ఏ ఒక్కరూ ఆమోదించరనే సంగతి గ్రహిస్తే మంచిది. నిజానికి ఆయన్ని 2019లోనే ప్రజలు తిరస్కరించారు. ప్రజలకు మంచిచేసి ఉంటే.. 2019లో 23 సీట్లకు టీడీపీని ఎందుకు పరిమితం చేస్తారు?
- గతంలో చంద్రబాబు హయాంలో విజయవాడ దుర్గమ్మగుడిలో తాంత్రికపూజలు చేయించినట్లు, ఇప్పుడు కూడా ఎక్కడైనా చేతబడుల్లాంటి తాంత్రికపూజలు చేయిస్తున్నాడేమో? వాటిమీద నమ్మకంతోనే మూడునెలల్లో అధికారంలోకి వస్తానంటూ మాట్లాడుతున్నాడేమో చూడాలి. చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా సీఎం జగన్‌ను, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఏమీ పీకలేడని తెలుసుకోవాలి.
- తెలంగాణలో తమ ఆస్తుల్ని కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రజల్ని పట్టించుకోకుండా గాలికొదిలేశాడు చంద్రబాబు. సొంత కొడుకు లోకేశ్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌కు ఆంధ్రప్రదేశ్‌తో సంబంధం లేదు. రాష్ట్రానికి అతిథుల్లా వచ్చి రాజకీయం చేస్తున్నారు. జగన్‌ను ప్రజలు వద్దంటున్నారని చంద్రబాబు ఎలా చెబుతాడు?
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను మారిస్తే చంద్రబాబుకు నొప్పేంటి? అసలు.. నువ్వు చంద్రగిరిని వదిలి బీసీ స్థానమైన కుప్పానికి ఎందుకు వలస వెళ్లావ్? నీ కొడుకు బీసీ స్థానమైన మంగళగిరికి ఎందుకు వలస పోయారు? నీ వియ్యంకుడు బాలకృష్ణకు హిందూపురంతో ఏం సంబంధం ఉందని అక్కడ పోటీచేస్తున్నారు బాబూ? మంగళగిరిలో వైఎస్సార్‌సీపీ తరఫున బీసీ అభ్యర్థిని నిలబెడుతుంటే.. టీడీపీ తరఫున లోకేశ్ పోటీచేయడానికి సిగ్గుండాలి కదా?
- విలువలు, విశ్వసనీయతతో రాజకీయాలు చేయాలనేది సీఎం జగన్ అభిమతం. అందులో భాగంగానే మా ఎమ్మెల్యేల పనితీరుపై అధికారంలోకొచ్చిన ఏడాది తర్వాత నుంచి జగన్ చెబుతూనే ఉన్నారు. రేపటి ఎన్నికలకు సంబంధించి ప్రజల మేలు కోసం సమర్థమైన నాయకులతో బరిలోకి దిగబోతున్నాం. అందుకే, ఫర్ఫెక్ట్ టీమ్ కోసం కసరత్తు చేస్తున్నాం. మా పార్టీలో ఎమ్మెల్యే పదవులు, పార్టీ పదవులు రెండు సమానమే.
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం భేషైన చర్యలు తీసుకుంటే.. చంద్రబాబు మాత్రం రాష్ట్రంలో 22 లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిందని, రూ.10 వేల కోట్ల నష్టం వాటిల్లిందని కేంద్రానికి లేఖ రాస్తాడా? అసలు మతి ఉండే లేఖ రాశాడా? పంటనష్టం అంచనాపై ఆయనెలా లెక్కలేస్తాడు? నేనడిగితే కేంద్రం స్పందించిందని చెప్పుకోవడానికే చంద్రబాబు ఆరాటపడుతున్నాడా? బాధ్యతతో పనిచేసే రాజకీయ నాయకుడి లక్షణాలేమైనా బాబుకు ఉన్నాయా? సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి వ్యవహరించాల్సింది ఇలాగేనా? ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేందుకు పూర్తి చిత్తశుద్ధిగా పనిచేస్తుంటే.. తప్పుబట్టటానికి ఏ కారణం చూపలేక కేంద్ర ప్రభుత్వానికి లేఖలంటూ నాటకాలాడతావా బాబూ?.

తుపాను, కరువుపై చంద్రబాబువి ఉన్మాద మాటలు


- తుపానును తానే జయించాననే కబుర్లు సీఎం జగన్‌కు చేతకాదు
- ఏపీ అగ్రిమిషన్ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి



సాక్షి, అమరావతి: చంద్రబాబు తుపాను, కరవు అంశాలపై ఉన్మాదిలా మాట్లాడుతున్నారని రాష్ట్ర అగ్రిమిషన్ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.ఎస్.నాగిరెడ్డి ధ్వజమెత్తారు. చంద్రబాబులా కాళ్లూచేతులు అడ్డుపెట్టి తుపానును దారి మళ్లించలేం, ఆపలేం.. అని వ్యంగ్యంగా పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు మాదిరిగా ఫొటోలకు ఫోజులిచ్చి తుపానునంతా తానే జయించాననే కబుర్లు చెప్పటం సీఎం జగన్‌కి చేతకాదని పేర్కొన్నారు. రేయింబవళ్లు డ్యాష్ బోర్డు ముందే కూర్చుని షో చేయలేమని, పలుగు, పార బట్టి మీడియా ముందు విన్యాసాలు చేయలేమని చెప్పారు. తమకు తెలిసిందల్లా.. వాస్తవాల్లో బతకడం, ప్రజలకు మేలు చేయడమేనని స్పష్టం చేశారు. ఇటీవలి తుపాను సమయంలో సీఎం జగన్ ముందుగా అధికారులను అప్రమత్తం చేసి, సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారని చెప్పారు. తుపాను తగ్గిన తర్వాత క్షేత్రస్థాయికి వెళ్లి నష్టాలను పరిశీలించారని తెలిపారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేశామని, తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ఈ తుపాను వల్ల రూ.3,711 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా కేంద్రానికి నివేదించామన్నారు. చంద్రబాబులా తప్పుడు లెక్కలు చూపి మాయచేసే పనులు తాము చేయబోమన్నారు. హుద్‌హుద్ తుపాను సమయంలో చంద్రబాబు.. మహారాష్ట్రలో చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని చూపించి రూ.3 వేల కోట్ల నష్టం అని కేంద్రానికి నివేదిక ఇచ్చారని, దాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రూ.600 కోట్లు ఇచ్చి సరిపెట్టిందని గుర్తుచేశారు. అలాంటి మోసాలు ఈ ప్రభుత్వానికి, సీఎం జగన్‌కు చేతకాదన్నారు. పంటనష్టం అంచనాలు చాలా పారదర్శకంగా జరుగుతున్నాయని చెప్పారు. 19వ తేదీకి జాబితా ఆర్బీకేల్లో పెడతామన్నారు. సోషల్ ఆడిట్ అయిన తర్వాత ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. చంద్రబాబు పల్లెలకు, రైతులకు పూర్తి వ్యతిరేకమని చెప్పారు. చంద్రబాబు హయాంలో వర్షాల్లేక ప్రాజెక్టులు ఎండిపోయి షట్టర్లన్నీ తుప్పుపట్టిపోయాయని, వాటిని సరిగా నిర్వహించకపోవడంతో ఇప్పుడు కొట్టుకుపోతున్నాయని పేర్కొన్నారు. దేశంలో రైతులను అతిపెద్ద స్థాయిలో మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని చెప్పారు. చంద్రబాబు తలకిందులుగా తపస్సు చేసినా రైతులు ఆయన్ని నమ్మరని నాగిరెడ్డి తెలిపారు.

రైతు ఉద్యమం మరింత విస్తరించాలి

ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు అశోక్ ధావలే




కర్నూలు(సెంట్రల్): దేశంలో రైతు ఉద్యమం మరింత విస్తరించాలని అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) జాతీయ అధ్యక్షుడు అశోక్ ధావలే అన్నారు. కర్నూలులోని సత్య ఇన్ రెసిడెన్సీలో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అశోక్ ధావలే మాట్లాడుతూ ఇటీవల రైతు ఉద్యమంలో పలు చరిత్రాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. రైతులు, కార్మికులు సంయుక్తంగా ఉద్యమాలు చేపట్టడం గొప్ప విషయమన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మూడుచోట్ల బీజేపీ గెలవడం ఆందోళనకరమని ఆయన చెప్పారు. బీజేపీ పదేళ్ల పాలనలో వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని, రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని, ప్రజలపై అనేక భారాలు మోపారని విమర్శించారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు మోదీ సర్కార్ దోచిపెడుతోందన్నారు. అయినా కాంగ్రెస్ ఒంటెద్దు పోకడ, ప్రతిపక్షాల అనైక్యత వల్ల బీజేపీ ఎన్నికల్లో విజయం సాధిస్తోందన్నారు. రాజస్థాన్ మినహా ఇతర రాష్ట్రాల్లో వామపక్షాలు ఓట్లు సాధించడంలో పురోగతి లేకపోవడం విచారకరమన్నారు. ఆర్టికల్ 370 రద్దుకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

శరవేగంగా విస్తరిస్తున్న ఎలక్ట్రానిక్స్ రంగం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం




సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల రంగం శరవేగంగా విస్తరిస్తోందని కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి దేవుసిన్హ్ చౌహాన్ తెలిపారు. ఎలక్ట్రానిక్స్, టెలికాం నెట్‌వర్కింగ్ ఉత్పత్తుల రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధార ప్రోత్సాహకాల (పీఎల్‌ఐ) పథకం సత్ఫలితాలను ఇస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి శుక్రవారం రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2021లో పీఎల్‌ఐ పథకం ప్రారంభించిన తర్వాత అతి తక్కువ కాలంలోనే దేశంలో టెలికాం ఉత్పత్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ చర్యల కారణంగా 2014–15లో రూ.1,80,000 కోట్లు ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పాదన 2022–23 నాటికి రూ.8,22,000 కోట్లకు చేరుకుందన్నారు. 2014లో 78 శాతం మొబైల్ ఫోన్లు దిగుమతి చేసుకోగా, మేడిన్ ఇండియా కార్యక్రమం ద్వారా ప్రస్తుతం 99.2 శాతం మొబైల్ ఫోన్ల తయారీ దేశంలోనే జరుగుతోందని మంత్రి వివరించారు.

తూర్పు తీరంలో సమృద్ధిగా మత్స్య సంపద


ఆంధ్రప్రదేశ్ సహా తూర్పు తీర రాష్ట్రాల్లో మత్స్య సంపద నిల్వలు సమృద్ధిగా (97 శాతం) ఉన్నట్లు ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్), సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) ప్రచురించిన మెరైన్ ఫిష్ స్టాక్ స్టేటస్ ఆఫ్ ఇండియా–2022 నివేదికలో పేర్కొన్నట్లు కేంద్ర మత్స్య, పశు సంవర్థక శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా తెలిపారు. 2022లో దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అధ్యయనం చేసిన 135 ఫిష్ స్టాక్ ప్రాంతాల్లో 91.1% మంచి నాణ్యత, పరిమాణం గల చేపల లభ్యత ఉన్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఫిషరీస్ మెనేజ్‌మెంట్ పాలన వ్యవస్థ కింద ఆంధ్రప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా సముద్ర చేపల నిల్వల స్థితి అంచనా వేసి, అన్ని వివరాలతో కూడిన పూర్తి సమాచారం అందించడమే ఈ అధ్యయనం ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. మేనేజ్‌మెంట్ యూనిట్స్ నిర్వచించిన ప్రకారం చేపల పంట స్థాయి, సమృద్ధి ఆధారంగా బయోలాజికల్ స్థిరత్వం కోసం ఫిష్ స్టాక్స్ అంచనా వేస్తున్నట్లు తెలిపారు. మెరైన్ ఫిష్ స్టాక్ స్టేటస్ ఆఫ్ ఇండియా అధ్యయనంలో రాష్ట్రాలవారీగా ఫిష్ స్టాక్స్ అంచనా వేయలేదన్నారు.

ఏపీలో కోల్డ్ చైన్ ప్రాజెక్టుకు రూ.9.83 కోట్లు సబ్సిడీ



పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.44.77 కోట్ల విలువైన ఒక ఇంటిగ్రేటెడ్ కోల్డ్ చైన్ ప్రాజెక్టుకు రూ.9.83 కోట్లు క్యాపిటల్ సబ్సిడీని అందించినట్లు కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి పశుపతి కుమార్ పారస్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తానరావు అడిగిన ప్రశ్నకు ఆయన శుక్రవారం ప్రశ్నోత్తరాల్లో సమాధానమిచ్చారు. ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజనలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో రూ.780.52 కోట్లు క్యాపిటల్ సబ్సిడీ అంచనా వేస్తూ 76 ప్రాజెక్టులు అనుమతించినట్లు తెలిపారు.


ఏపీలో 86 వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ ఔట్‌లెట్లు



ఆంధ్రప్రదేశ్‌లో 81 రైల్వే స్టేషన్లలో 86 వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ (ఓఎస్‌ఓపీ) ఔట్ లెట్లు ఉన్నాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. వీటి ద్వారా 2170 మంది నేరుగా లబ్ధి పొందుతున్నట్లు వైఎస్సార్‌సీపీ సభ్యుడు పరిమళ్ నత్వానీ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.


లోక్‌సభ

తొమ్మిది ప్రాజెక్టులకు రూ.338 కోట్లు విడుదల




సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ పోర్టుల వద్ద చేపట్టే తొమ్మిది ప్రాజెక్టులకు రూ.338 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర నౌకాయాన, ఓడరేవుల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. 'సాగర్ మాల' పథకం కింద ఈ ప్రాజెక్టులకు మొత్తం రూ.1765 కోట్లు ఇవ్వనున్నట్లు వైఎస్సార్‌సీపీ సభ్యుడు మిథున్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌కు రూ.50 కోట్లు, కాకినాడ యాంకరేజ్ పోర్టుకు రూ.43 కోట్లు, భవాని ఐలాండ్‌కు రూ.10 కోట్లు, నెల్లూరు ఫిషింగ్ హార్బర్‌కు రూ.72 కోట్లు, కోస్తా ఏరియా అభివృద్ధి ఫేజ్–2కు రూ.6 కోట్లు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌కు రూ.40 కోట్లు, కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్‌కు రూ.40 కోట్లు, పూడిమడక ఫిషింగ్ హార్బర్‌కు రూ.40 కోట్లు, బియ్యపుతిప్ప కోస్టల్ బెర్త్‌కు రూ.37 కోట్లు మొత్తం రూ.338 కోట్లు విడుదల చేసినట్లు కేంద్రమంత్రి తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లో టీబీ కేసులు తగ్గుముఖం




ఆంధ్రప్రదేశ్‌లో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది టీబీ కేసులు తగ్గుముఖం పట్టాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి భారతి ప్రవీణ్ తెలిపారు. 2022లో 136 టీబీ కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది ఇప్పటివరకూ 118 కేసులు మాత్రమే నమోదయినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానలో చెప్పారు.

ఏపీ హైకోర్టులో ఏడుగురు జడ్జిలను నియమించాల్సి ఉంది



ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఏడుగురు న్యాయమూర్తుల్ని నియమించాల్సి ఉందని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ తెలిపారు. ఏపీ హైకోర్టులో 37 మంది న్యాయమూర్తులకు గాను 30 మంది ఉన్నారని వైఎస్సార్‌సీపీ సభ్యురాలు బీవీ సత్యవతి ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

ఎంఎస్ఎంఈ కార్యాలయం నిర్మాణంపై కేంద్ర కమిటీ పర్యటన



ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ కార్యాలయం నిర్మాణంపై వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి రాసిన లేఖపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ కార్యాలయాన్ని తిరుపతి లేదా విజయవాడలో ఎక్కడ నిర్మించాలో అధ్యయనం చేయడానికి ఓ కమిటీని నియమించాలని ఎంఎస్ఎంఈ అడిషనల్ కమిషనర్‌ను కేంద్రం ఆదేశించింది. కార్యాలయం ఏర్పాటు సాధ్యాసాధ్యాలు పరిశీలించడానికి ఈ నెల 21న విజయవాడ, 22, 23ల్లో తిరుపతిలో కేంద్ర బృందం పర్యటించే అవకాశం ఉందని ఎంపీ గురుమూర్తి తెలిపారు.

క్లుప్తంగా...

బాయిలర్ అటెండెంట్ పరీక్షలకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, అమరావతి: బాయిలర్ అటెండెంట్ రూల్స్ 2011 ప్రకారం 2024 మార్చి, ఏప్రిల్‌లో నిర్వహించే బాయిలర్ అటెండెంట్ మొదటి, రెండవ తరగతి పరీక్షల కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు బోర్డు ఆఫ్ ఎగ్జామినర్స్ చైర్మన్, బాయిలర్ల డైరెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు సంబంధించిన తేదీలు, పరీక్షల సెంటర్ తదితర అంశాలు త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. అర్హతలు, అనుభవం, వయస్సు, ఇతర సమాచారం కోసం www.ap.gov.in వెబ్ సైట్ సందర్శించాలని తెలిపారు. దరఖాస్తులు, ఇతర వివరాలు సంబంధిత వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జనవరి 8వ తేదీ, 2024 సాయంత్రం ఐదు గంటల వరకు స్వీకరిస్తారని తెలిపారు. అదే విధంగా ఎవరైనా ఫిబ్రవరి 12, 2021న జారీ చేసిన బి3/502/2021 ప్రకటనకు అనుగుణంగా దరఖాస్తు చేసుకున్నట్లైతే మళ్లీ ఇప్పుడు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

పవన్ వ్యాఖ్యల కేసులో.. ఇద్దరు సాక్షుల వాంగ్మూలాలు నమోదు

విచారణ 22కు వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చేసిన అవమానకర వ్యాఖ్యలపై నమోదైన కేసు విచారణలో భాగంగా ఇద్దరు సాక్షుల వాంగ్మూలాలను న్యాయస్థానం నమోదు చేసింది. రాష్ట్రంలో యువతులు కనిపించకుండాపోవడానికి, వ్యభిచార కూపంలో కూరుకుపోవడానికి అవసరమైన సమాచారాన్ని వలంటీర్లు సంఘ విద్రోహశక్తులకు చేరవేస్తున్నారని పవన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన వలంటీర్ రంగవల్లి విజయవాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో పవన్‌పై క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన వ్యాఖ్యలతో సమాజంలో తమను సందేహాస్పదంగా చూస్తున్నారని.. తాము తీవ్ర అవమానాన్ని ఎదుర్కోవాల్సి వస్తోందని ఆమె అందులో పేర్కొన్నారు. దీనిపై రంగవల్లి వాంగ్మూలాన్ని న్యాయస్థానం గతంలోనే నమోదు చేసింది. కాగా, ఈ కేసులో ఇద్దరు సాక్షుల వాంగ్మూలాలను శుక్రవారం నమోదు చేసింది. పిటిషనర్ తరఫున న్యాయవాదులు వెంకటేష్ శర్మ, ఒగ్గు గవాస్కర్ తమ వాదనలు వినిపించారు. అనంతరం న్యాయస్థానం ఈ కేసు విచారణను ఈనెల 22కు వాయిదా వేసింది.

మానవతా దృక్పథంతో సమ్మె విరమించండి

- అణగారిన వర్గాలకు పౌష్టికాహార పంపిణీకి ఇబ్బందులు
- బాలింతలు, పసిపిల్లలు, చిన్నారులు, గర్భిణుల్ని దృష్టిలో పెట్టుకుని సహకరించండి
- అంగన్‌వాడీ నేతలతో చర్చల్లో మంత్రుల వినతి
- వేతన పెంపునకు పట్టుబట్టిన యూనియన్ నేతలు

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ప్రతిపాదించిన అనేక అంశాల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, మానవతా దృక్పథంతో సమ్మెను విరమించాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కర్లు, హెల్పర్లు పలు డిమాండ్లపై సమ్మెచేస్తున్న విషయం తెలిసిందే. సమ్మె విరమణ కోసం ప్రభుత్వం శుక్రవారం మరోదఫా సానుకూలంగా చర్చలు జరిపింది. మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, కె.వి.ఉషశ్రీ చరణ్, బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి, మహిళా శిశుసంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలతో చర్చలు జరిపారు. యూనియన్ నేతలు ప్రస్తావించిన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రులు వివరించారు. ఇప్పటికే అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు కూడా గరిష్ట వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని నిర్ణయించిందన్నారు. కార్యకర్తలకు తమ సర్వీసు చివరి నాటికి బెనిఫిట్‌ను ఇప్పుడున్న రూ.50 వేల నుంచి రూ.1 లక్షకు పెంచేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. హెల్పర్లకూ సర్వీసు చివరి నాటికి బెనిఫిట్ రూ.20 వేల నుంచి రూ.40 వేలకు పెంచుతూ నిర్ణయించిందన్నారు. సహాయకులకు అంగన్‌వాడీ కార్యకర్తలుగా ప్రమోషన్ కోసం గరిష్ట వయో పరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచేందుకు అంగీకరించిందని తెలిపారు. కార్యకర్తలకు టీఏ, డీఏలను రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుంచి విడుదల చేయడానికి ప్రభుత్వం అంగీకరించిందన్నారు. రాష్ట్రంలో అవకాశం ఉన్న మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించిందని తెలిపారు. గ్రాట్యుటీ అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిది కావడంతో లేఖరాశామని, దానిపైన కూడా కేంద్రం ఆమోదంతో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో మేలు

గతంతో పోల్చుకుంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు మేలు జరిగిందనే విషయాన్ని అర్థం చేసుకోవాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక వేతనాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.11,500, సహాయకులకు రూ.7 వేలకు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. మంచి పనితీరు కనబర్చిన వర్కర్లు, హెల్పర్లకు ప్రోత్సాహకంగా నెలకు రూ.500 చొప్పున ఇస్తున్నామని, ఇందుకోసం ఏడాదికి సుమారు రూ.27.8 కోట్లు ప్రోత్సాహకాలుగా ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. 2013 నుంచి అంగన్‌వాడీలకు ప్రమోషన్లు ఇవ్వలేదని, రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ఈ ప్రభుత్వమే ప్రమోషన్లు ఇచ్చిందని చెప్పారు. 560 గ్రేడ్–2 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీచేసిందన్నారు. సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్షలు రాసే వారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 సంవత్సరాలకు పెంచుతూ వారికి అనుకూల నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి రూ.1,313 కోట్లు అందించిందని, నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతుభరోసా, ఆరోగ్యశ్రీ తదితర పథకాలను వర్తింపజేసిందని వివరించారు. రూ.85.47 కోట్లతో 56,984 స్మార్ట్ ఫోన్లు అందించిందని, డేటా చార్జీల కోసం ఏడాదికి రూ.12 కోట్లు చెల్లిస్తోందని తెలిపారు. ఈ ఏడాది నుంచి వర్కర్లు, హెల్పర్లకు రూ.2 లక్షల జీవిత బీమాను వర్తింపజేస్తోందని, రూ.16 కోట్ల విలువైన యూనిఫాం శారీలు అందించిందని చెప్పారు. అంగన్‌వాడీల్లో కూడా మంచి వసతులు, సదుపాయాలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం నాడు–నేడు ద్వారా అనేక చర్యలు చేపట్టిందన్నారు. గతంతో పోలిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అనేక చర్యలతో అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశతోపాటు వర్కర్లు, హెల్పర్లకు ఎంతో మేలు జరిగిందనే విషయాన్ని గుర్తించాలని కోరారు. తాజాగా ప్రతిపాదించిన అనేక అంశాలపైనా సానుకూలంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. అత్యంత అణగారిన వర్గాలకు చెందిన వారికి పౌష్టికాహార పంపిణీ సమ్మె కారణంగా నిలిచిపోయే ప్రమాదం ఉందని అర్థం చేసుకోవాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు. బాలింతలు, పసిపిల్లలు, చిన్నారులు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం నిలిచిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. మానవతా దృక్పథంతో సమ్మె విరమించాలని విజ్ఞప్తి చేశారు. అన్నీ అంగీకరించినప్పటికీ ఒక్క వేతనం పెంపు విషయంలోనే అంగన్‌వాడీ యూనియన్ నేతలు పట్టువీడకపోవడం గమనార్హం.

నేడు పలమనేరులో సామాజిక సాధికార యాత్ర

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర ఈనెల 16న చిత్తూరు జిల్లా పలమనేరులో జరగనున్నది. ఉదయం 11.30 గంటలకు మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అంజాద్ బాషా, గుమ్మనూరు జయరామ్, కె.నారాయణ స్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి యాత్రను ప్రారంభిస్తారు. స్థానిక సీఎస్‌ఐ చర్చి ఎదురుగా బహిరంగ సభ జరగనున్నది. ఇంతవరకు వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్ర రాష్ట్రవ్యాప్తంగా అప్రతిహసంగా సాగింది. యాత్రలో జై జగన్.. జై జై జగన్ నినాదాలు మార్మోగాయి. బస్సుయాత్రలో వచ్చిన ప్రజాప్రతినిధులకు ప్రజలు అడగుడుగునా నీరాజనాలు పలికారు. శనివారం చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగే సామాజిక సాధికార యాత్రల్లో వేలాది మంది పాల్గొననున్నారు.

రాజమహేంద్రవరంలో 'అకర్- కంపాస్' ఇంటర్నేషనల్ హోటల్



ఎంఓయూపై సంతకాలు చేస్తున్న ఇరు సంస్థల ప్రతినిధులు

సాక్షి, రాజమహేంద్రవరం: ఆఫ్రికా, ఆసియా పసిఫిక్ ప్రాంతాల్లో 1,000కి పైగా హోటళ్ల నిర్వహిస్తున్న ప్రముఖ గ్లోబల్ హాస్పిటాలిటీ గ్రూప్ 'అకర్', మరొక ప్రముఖ సంస్థ 'కంపాస్' కలిసి రాజమహేంద్రవరంలో ఇంటర్నేషనల్ హోటల్ (రాజమహేంద్రవరం సిటీ సెంటర్) ఏర్పాటు చేయనున్నాయి. ఈ మేరకు 'అకర్' దక్షిణాసియా డెవలప్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ అనిరుద్ధకుమార్, కంపాస్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు ఇటీవల రాజానగరం మండలం జీఎస్ఎల్ హాస్పిటల్‌లోని కంపాస్ కార్యాలయంలో సమావేశమై పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకున్నారు. వెయ్యి చదరపు మీటర్ల విస్తీర్ణంలో హోటల్‌ను అత్యంత విలాసవంతంగా నిర్మించనున్నారు. ఈ సిటీ సెంటర్‌లో 120 గదులు ఉంటాయి. రాజమహేంద్రవరం నగర ఆర్థిక, సాంస్కృతిక చైతన్యాన్ని ప్రతిబింబించేలా ప్రపంచ స్థాయి హోటల్‌ను తీసువస్తామని అనిరుద్ధకుమార్, డాక్టర్ గన్ని భాస్కర్‌రావు ప్రకటించారు.

• తెలంగాణ

ఆస్పత్రి నుంచి కేసీఆర్ డిశ్చార్జి

- జారిపడి తుంటి ఎముక విరగడంతో సర్జరీ చేసిన వైద్యులు
- ఆరు వారాల పాటు విశ్రాంతి అవసరమని సూచన
- బంజారాహిల్స్ నందినగర్‌లోని నివాసానికి చేరుకున్న మాజీ సీఎం

లక్డీకాపూల్ (హైదరాబాద్): బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు యశోద ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఈ నెల 7వ తేదీన అర్ధరాత్రి ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో కేసీఆర్ ప్రమాదవశాత్తు జారిపడిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో కేసీఆర్ ఎడమ కాలి తుంటి ఎముక విరిగింది. కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే హైదరాబాద్‌లోని సోమాజిగూడలో ఉన్న యశోద ఆస్పత్రికి తరలించారు. వైద్యులు 8న సాయంత్రం ఆయనకు తుంటి ఎముక మార్పిడి సర్జరీ చేశారు. వారం రోజులుగా ఆస్పత్రిలోనే ఉన్న ఆయనను శుక్రవారం డిశ్చార్జి చేశారు. ఆస్పత్రి లోపలి నుంచి వీల్‌చైర్‌లో కేసీఆర్‌ను బయటికి తీసుకువచ్చి ప్రత్యేక వాహనంలో బంజారాహిల్స్ నందినగర్‌లో ఉన్న నివాసానికి తీసుకెళ్లారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆ వాహనంలో కూర్చుని వెంట వెళ్లారు. ఈ సమయంలో కేసీఆర్‌ను చూసేందుకు ఆస్పత్రి వద్దకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చారు. సర్జరీ అనంతర చికిత్స, ఫిజియోథెరపీ కోసం తరచూ డాక్టర్ల బృందం వచ్చి వెళ్లేందుకు వీలుగా కేసీఆర్ హైదరాబాద్‌లోనే ఉండనున్నారు. కేసీఆర్ పూర్తిగా కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల సమయం పడుతుందని వైద్యులు చెప్తున్నారు.

భార్య, ఇద్దరు పిల్లలను చంపి..

కలెక్టర్ గన్‌మెన్ ఆత్మహత్య

- సర్వీస్ పిస్టల్‌తో కాల్చి చంపిన వైనం
- ఆన్‌లైన్ గేమ్స్, ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేసిన కానిస్టేబుల్!
- కలెక్టర్ సెలవుపై వెళ్లడంతో ఇంటికి వచ్చి ఘాతుకం

సాక్షి, సిద్దిపేట: కలెక్టర్ గన్‌మెన్‌గా పనిచేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ తన భార్య, ఇద్దరు పిల్లలను పిస్టల్‌తో కాల్చి చంపి.. తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులే ఈ దారుణానికి కారణమని తెలుస్తోంది. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామంలో శుక్రవారం ఉదయం ఈ ఘటన జరిగింది. మృతుడు కలెక్టర్ గన్‌మెన్ కావడంతో ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పోలీసుల కథనం ప్రకారం.. రామునిపట్ల గ్రామానికి చెందిన ఆకుల రాములు, లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు ఆకుల నరేశ్ (35) 2013లో ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఎనిమిదేళ్ల క్రితం కోహెడ మండలం ఎర్రగుంటపల్లికు చెందిన చైతన్య (30)తో వివాహం జరిగింది. వీరికి కుమారుడు రేవంత్ (7), కుమార్తె హితాశ్రీ(5) సంతానం. భార్య చైతన్య సిద్దిపేట పట్టణంలోని ఓ స్కూల్‌లో టీచర్‌గా విధులు నిర్వహిస్తుండగా.. అదే పాఠశాలలో కుమారుడు రేవంత్ రెండో తరగతి, కుమార్తె హితాశ్రీ ఒకటో తరగతి చదువుతున్నారు. నరేశ్ సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ దగ్గర గన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధుల్లో లేని సమయంలో నరేశ్.. ఆన్‌లైన్ రమ్మీ గేమ్‌కు అలవాటు పడ్డాడు. డబ్బులు పెట్టి ఆర్థికంగా నష్టపోయాడు. దీనికి తోడు సొంత గ్రామంలో ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు గుదిబండగా మారాయి. దీంతో నరేశ్ అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. ఇదిలా ఉండగా శుక్రవారం కలెక్టర్ సెలవుపై వెళ్లడంతో విధి నిర్వహణలో ఉన్న నరేశ్.. రామునిపట్లలోని ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయంలో భార్య చైతన్యను, స్కూల్‌కు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ఇద్దరు పిల్లలను 9ఎంఎం సర్వీస్ పిస్టల్‌తో పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చి, తర్వాత తాను కూడా అదే తుపాకీతో కాల్చుకుని అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తుపాకీ శబ్దం విన్న ఇరుగు, పొరుగువారు ఇంట్లోకి వెళ్లి చూడగా.. నరేశ్ కుటుంబం రక్తపు మడుగులో పడి ఉండటంతో వెంటనే మృతుడి సోదరుడికి, డయల్ 100కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీపీ శ్వేత ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. చిన్నకోడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏజీగా వేణుగోపాల్?

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ న్యాయవాది పరాంకుశం వేణుగోపాల్‌ను అడ్వొకేట్ జనరల్‌గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఏజీ పదవి కోసం చాలామంది సీనియర్ల పేర్లు వినిపించినా, అనూహ్యంగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏజీగా పనిచేసిన పి.వేణుగోపాల్ పేరు తెరపైకి వచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో తొలి అడ్వొకేట్ జనరల్‌గా 2014 జూన్‌లో బాధ్యతలు చేపట్టిన ఆయన 2016 మే వరకు కొనసాగారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వం కోరడంతో ఏజీ పదవికి రాజీనామా చేశారు. ఏజీగా వేణుగోపాల్ పేరును ప్రభుత్వం ఖరారు చేసిందంటూ శుక్రవారం రోజంతా హైకోర్టు న్యాయవాదుల మధ్య చర్చ సాగింది.

జిల్లా వార్తలు

పేదలు ఆరోగ్య శ్రీమంతులే

- ప్రజారోగ్యానికి పూర్తి భరోసా
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితి పెంపు
- రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు..
- ఈనెల 18 నుంచి అమలుకు శ్రీకారం

గుంటూరు మెడికల్: పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలను అందించటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో అనేక మార్పులు చేస్తోంది. నిరు పేదలను ఆరోగ్య శ్రీమంతులను చేస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైద్య చికిత్స ఖర్చు రూ.వెయ్యి దాటే అన్ని అనారోగ్య సమస్యలనూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చింది. పరిమితిని రూ.ఐదు లక్షలు చేసింది. ఇప్పుడు ఆ పరిమితిని మరో నాలుగు రెట్లు పెంచి రూ.25 లక్షలు చేసింది. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 18 నుంచి పరిమితి పెంపు అమలుకు శ్రీకారం చుట్టనున్నారు.

5,99,122 ఆరోగ్యశ్రీ కార్డులు

జిల్లా వ్యాప్తంగా ఐదులక్షల లోపు ఆదాయం ఉన్న 5,99,122 బీపీఎల్ కుటుంబాలకు ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేసింది. గతంలో 1,059 రోగాలకు పరిమితమైన ఆరోగ్యశ్రీ పథకాన్ని 3,257 జబ్బులకు విస్తరించింది.

వైఎస్సార్ సీపీ హయాంలో ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ చికిత్సల వివరాలు ఇలా..

సంవత్సరం	చికిత్స పొందిన రోగుల సంఖ్య	ఖర్చుచేసిన సొమ్ము(రూ.కోట్లలో)
2019–20	32,332	80.909
2021–22	40,592	108.264
2021–22	55,500	135.089
2022–23	71,554	160.686
2023–24 అక్టోబర్ వరకు	79,991	163.936
మొత్తం	2,79,969	648.884



ప్రాణదాత సీఎం జగన్

నేను గుంటూరు నల్లచెరువులో నివాసం ఉంటూ తోపుడు బండిపై ఉల్లిపాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాను. నాకు రెండు నెలల క్రితం గుండెపోటు వచ్చింది. జీజీహెచ్‌లో నెలరోజుల పాటు చికిత్స పొందా. ఇంటికి వెళ్లాక మళ్లీ గుండెనొప్పి రావడంతో జీజీహెచ్ వైద్యులు నవంబరు 23న నాకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా బైపాస్ సర్జరీ చేసి ప్రాణాలు కాపాడారు. నాకు ఇద్దరు ఆడపిల్లలు. వారికి పెళ్లిళ్లయ్యాయి. ఆరోగ్యశ్రీ నాకు పునర్జన్మనిచ్చింది. చికిత్స అనంతరం జీవనానికి వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా రూ.9,500 నా ఖాతాకు జమ చేశారు. ఇప్పుడు ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంచడం నాలాంటి ఎందరికో వరమవుతోంది. ప్రాణదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలకాలం చల్లగా ఉండాలి.





గుంటూరు జీజీహెచ్‌లో ఆరోగ్యశ్రీ రోగులతో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి(ఫైల్)

ఇళ్ల వద్దే స్పెషాలిటీ వైద్యసేవలు

అలాగే ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ఇళ్ల వద్దకే స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తోంది. ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, వైద్యసిబ్బంది పోస్టులు భారీగా భర్తీ చేసింది. కొత్త పోస్టులూ మంజూరు చేసింది. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మారుమూల గ్రామాల్లోనూ ఉచిత వైద్యసేవలు అందిస్తోంది. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా వైద్యులు గ్రామీణుల ఇళ్లకే వెళ్లి ఆరోగ్యపరిస్థితులపై ఆరా తీసి మందులు అందిస్తున్నారు. 136 నెట్‌వర్క్ ఆస్పత్రుల ద్వారా వేగంగా సేవలు అందిస్తోంది. ఆస్పత్రులకు బిల్లుల చెల్లింపులూ వేగంగా జరుపుతోంది. ఇతర రాష్ట్రాల్లోనూ ఆరోగ్యశ్రీ సేవలు పొందే వీలు కల్పించింది. దీంతో పాటు దేశంలో ఎక్కడా లేని విధంగా డాక్టర్ వైఎస్సార్ ఆసరా పథకాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనిద్వారా ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొంది ఇంటికి వెళ్లాక విశ్రాంతి కాలంలో రోగులు జీవనానికి ఇబ్బంది పడకుండా రోజుకు రూ.225 చొప్పున నెలకు రూ.5,000 అందిస్తోంది.

ఇంటింటికీ ఆరోగ్యశ్రీపై అవగాహన



ఆరోగ్యశ్రీ పథకంపై ఇంటింటికీ అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరి ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్నాం. ప్రభుత్వం తాజాగా ఆరోగ్యశ్రీ చికిత్సల వ్యయం రూ.25 లక్షలకు పెంచటం అద్భుతం. ఇదో సువర్ణాధ్యాయం.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు
డీఎంహెచ్‌ఓ, గుంటూరు

నిరుపేదలకు అందుబాటులో కార్పొరేట్ వైద్యం




శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హోంమంత్రి తానేటి వనిత, పక్కన ఎమ్మెల్యే విష్ణు, డీఎంఅండ్‌హెచ్‌ఓ సుహాసిని, మేయర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

- హోంమంత్రి తానేటి వనిత
- విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో పలు ప్రారంభోత్సవాలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి నిరుపేద ప్రజల జీవన ముఖచిత్రాలు పూర్తిగా మారిపోయాయని, పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం, నాణ్యమైన విద్య పూర్తి అందుబాటులోకి తీసుకువచ్చారని హోంమంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలో రూ.1.07 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, రూ.3.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేద ప్రజల జీవితాలు అభివృద్ధిని సాధించాయని, ముఖ్యంగా మన సీఎం జగనన్న విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం వంటి కార్యక్రమాలే దీనికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిరుపేద ప్రజల ఆరోగ్యం కోసం, పేద విద్యార్థుల కోసం ఇంతలా ముందు చూపుతో పనిచేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని అన్నారు. ఒకవైపు ప్రజలకు సంక్షేమ పథకాలు పుష్కలంగా అందించి అండగా నిలవడం, మరోవైపు అన్ని మౌలిక వసతులు కల్పించడం, అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేయడం గొప్ప విషయమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్ల ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని, ఎవరు ఎన్ని అసత్య ఆరోపణలు చేసినా, కుతంత్రాలు పన్నాలని చూసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి అఖండ మెజార్టీతో విజయఢంకా మోగించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేషన్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెన్షన్ ఫిర్యాదుల తక్షణ పరిష్కారానికే అదాలత్

డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



అదాలత్‌లో మాట్లాడుతున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్‌దారులు, గ్రాట్యుటీ, సెటిల్‌మెంట్ బకాయిలకు సంబంధించిన ఫిర్యాదుల తక్షణ పరిష్కారానికే డివిజన్‌లో పెన్షన్ అదాలత్ నిర్వహించినట్లు విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పేర్కొన్నారు. విజయవాడ డివిజన్ పర్సనల్ బ్రాంచ్ ఆధ్వర్యాన శుక్రవారం రైల్వే ఆడిటోరియంలో పెన్షన్ అదాలత్ నిర్వహించారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ఏడీఆర్ఎంలు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం పెన్షన్ అదాలత్ ప్రాముఖ్యాన్ని వివరించారు. అదాలత్‌ల కోసం ఎదురు చూడకుండా అన్ని పని దినాల్లో ఫిర్యాదులు అందించవచ్చన్నారు. డివిజన్‌లో మొత్తం 26వేల మంది పెన్షనర్లు ఉండగా అదాలత్‌లో కేవలం 64 ఫిర్యాదులు మాత్రమే వచ్చాయని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో డివిజన్ సమర్థతకు ఇది అద్దం పడుతుందని వెల్లడించారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసి సత్వరమే పరిష్కరించడానికి తీసుకోవాలని పర్సనల్, అకౌంట్స్ బ్రాంచ్‌ల అధికారులకు ఆయన సూచించారు. సీనియర్ డీపీఓ ముత్యాల బారము రళీధర్, సీనియర్ డీఎఫ్ఎం ఈవీ శివరామకృష్ణ, డీపీఓ కట్టా ఆనంద్, ఎస్‌డీఐ డెప్యూటీ జనరల్ మేనేజర్ జి.ఎస్.ఆర్ ఆనందరరావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌ను సందర్శించిన న్యాయమూర్తులు

గుంటూరు మెడికల్: హైకోర్టు ఉత్తర్వుల మేరకు శిక్షణ నిమిత్తం ఏపీ జ్యుడీషియల్ అకాడమీ ఆధ్వర్యంలో నుంచి 29 మంది న్యాయమూర్తులు వివిధ జిల్లాల నుంచి శుక్రవారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిని పరిశీలించారు. ఏపీ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ ఏ. హరిహరనాథశర్మ పర్యవేక్షణలో శిక్షణ కోసం వచ్చిన న్యాయమూర్తులు ఆస్పత్రిలోని వివిధ విభాగాల్ని పరిశీలించారు. ముందుగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌తో పలు అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య రంగం కొత్త పుంతలు తొక్కుతోందని తెలిపారు. రాష్ట్రంలో జిల్లాకు ఒకటి చొప్పున ప్రభుత్వం 28 మెడికల్ కళాశాలలను మంజూరు చేసిందని చెప్పారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కార్పొరేట్ వైద్యం అందుతోందని, అందుకు అవసరమైన సదుపాయాల్ని ప్రభుత్వం కల్పిస్తోందని వివరించారు. ఆస్పత్రిని పరిశీలించేందుకు వచ్చిన న్యాయమూర్తులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి వార్డును పరిశీలించి, సమస్యలుంటే సూచనలు ఇవ్వాలని కోరారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తామని తెలిపారు. అనంతరం పలు జిల్లాల నుంచి వచ్చిన న్యాయమూర్తులు జీజీహెచ్‌లోని వార్డుల్ని పరిశీలించారు. మెడికల్ లీగల్ కేసుల గురించి వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం గురించి సంబంధిత వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఏపీ జ్యుడీషియల్ అకాడమీ డెప్యూటీ డైరెక్టర్ బిందు మాధవి, అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా...

గంగవరం పోర్టుకు అవార్డు



అవార్డు అందుకుంటున్న పోర్టు అధికారులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టుకు ఎన్విరాన్‌మెంటల్ ఎక్స్‌లెన్స్–2023 అవార్డు లభించింది. ఈ మేరకు యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ.. పోర్టు పరిసర ప్రాంతాల్లో నిరంతర గాలి నాణ్యత పర్యవేక్షణ సదుపాయాలు, యాంత్రీకరించిన కార్గో హ్యాండ్లింగ్, ఇంటిగ్రేటెడ్ ట్రక్ టార్పాలిన్ కవరింగ్ సదుపాయాలు, రోడ్ క్లీనింగ్ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని గ్రీన్ టెక్ ఫౌండేషన్ వారు ఈ అవార్డును అందజేశారని వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పోర్టు నిషేధించిందని తెలిపారు. భద్రత, సుస్థిరత, పర్యావరణాన్ని పెంపొందించేందుకు పోర్టు కృషి చేస్తోందన్నారు. ఈ అవార్డు రావడం సంతోషమని, భవిష్యత్తులో మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు వెల్లడించారు.

కైలాసగిరిపై సైన్స్ మ్యూజియం

- రూ.4.69 కోట్లతో ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సైన్స్ విద్య, పరిశోధనలు, వారసత్వ సాంస్కృతిక పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం విశాఖలో సైన్స్ మ్యూజియంను ఏర్పాటు చేయనుంది. కైలాసగిరిపై ఎకరం విస్తీర్ణంలో సైన్స్ మ్యూజియంను రూ.4.69 కోట్ల వ్యయంతో నిర్మించడానికి పరిపాలన అనుమతులను మంజూరు చేసింది. ఏపీ సైన్స్‌సిటీ, వీఎంఆర్‌డీఏ సంయుక్తంగా ఈ సైన్స్ మ్యూజియంను ఏర్పాటు చేయనున్నాయి. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.4.69 కోట్లలో కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిత్వ శాఖ 80% వాటా కింద రూ.3,75,20,000 భరించనుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.93,80,000 వ్యయం చేయనుంది.

భారీ యుద్ధ నౌక తయారీకి షిప్‌యార్డ్ రెడీ


షిప్‌యార్డులో తయారైన షిప్ నమూనాలు

సాక్షి, విశాఖపట్నం: ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా భారీ యుద్ధ నౌకల నిర్మాణానికి విశాఖలోని హిందూస్థాన్ షిప్‌యార్డు సన్నద్ధమవుతోంది. మేరీటైమ్ సదస్సులో భారత రక్షణ మంత్రిత్వ శాఖతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా షిప్‌యార్డ్ 43 వేల టన్నుల భారీ ఫ్లీట్ సపోర్ట్ షిప్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గంటకు 20 నాటికల్ మైళ్ల వేగంతో దూసుకెళ్లేలా ఈ యుద్ధ నౌక నిర్మించనున్నట్లు హెచ్‌ఎస్‌ఎల్ సీఎండీ హేమంత్ ఖత్రి తెలిపారు. ప్రస్తుతం భారీ ఫ్లీట్ సపోర్ట్ షిప్స్ నమూనాలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని ఉపసంహరించాలి

- సీఎం వైఎస్ జగన్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

సాక్షి, అమరావతి: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టం (ఆంధ్రప్రదేశ్ భూ హక్కుల చట్టం)ను ఉపసంహరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌కు లేఖ రాశారు. జీవో నంబర్ 512 వల్ల చిన్నకారు, సన్నకారు, బడుగు బలహీనవర్గాల రైతులకు ముప్పు ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల స్థిరాస్తుల విషయంలో వివాదాలు ఏర్పడినప్పుడు పరిష్కరించే అధికారం సివిల్ కోర్టుల పరిధి నుంచి తప్పించి ప్రభుత్వం ఏర్పాటుచేసే జిల్లాస్థాయి ట్రిబ్యునల్స్‌కు ఇవ్వడం వల్ల చిన్న, సన్నకారు రైతులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. ఈ చట్టం అమల్లోకి వస్తే ఇప్పటి వరకు భూములకు ఉన్న 30 రకాల రికార్డులు రద్దు అవుతాయని తెలిపారు.

పేదలకు సంక్షేమ పథకాలు ఎందుకు?

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ

అల్లిపురం (విశాఖ): ఏపీలో పేదలకు సంక్షేమ పథకాలు ఎందుకు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ప్రశ్నించారు. సంక్షేమం తప్ప అభివృద్ధి అవసరం లేదా అని అన్నారు. అల్లిపురం సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో అహంకారంతోనే కేసీఆర్ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారని రామకృష్ణ అన్నారు. అంతకు రెట్టింపు దురహంకారంతో సీఎం జగన్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఏపీలో కూడా తెలంగాణ పరిస్థితే ఉంటుందన్నారు. ఇప్పటికే సీఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని, ఆ భయంతోనే 82 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను, ఎంపీలను మారుస్తామంటున్నారంటే ఆయన ఓటమిని అంగీకరించినట్టేనన్నారు. 16, 17 తేదీల్లో భువనేశ్వర్‌లో సీపీఐ జాతీయ స్థాయి సమావేశాలు జరగనున్నాయని, వివిధ రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో పొత్తులపై ఈ సమావేశాల్లో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు పాల్గొన్నారు.

'ఒంగోలు' జాతి పరిరక్షణకు గుర్తింపు

గుంటూరు లాంలోని పశుపరిశోధన స్థానానికి బ్రీడ్ కన్జర్వేషన్ అవార్డు–2023

- ప్రకటించిన ఐసీఏఆర్–ఎన్‌బీఏజీఆర్
- ఈ నెల 23న కర్నాల్‌లో ప్రదానం
- గతేడాది పుంగనూరు పరిశోధన కేంద్రానికి దక్కిన అవార్డు



సాక్షి, అమరావతి: అరుదైన, అంతరించిపోతున్న ఒంగోలు జాతి ఆవుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో కృషిచేస్తున్న శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పనిచేస్తున్న గుంటూరు లాంలోని పశుపరిశోధన స్థానాన్ని బ్రీడ్ కన్జర్వేషన్ అవార్డు–2023 వరించింది. జాతీయస్థాయిలో అరుదైన, అంతరించిపోతున్న జాతుల పరిరక్షణకు కృషిచేసే పరిశోధన సంస్థలకు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) ఏటా ఈ అవార్డులను ప్రదానం చేస్తుంది. గతేడాది పుంగనూరు జాతి పరిరక్షణ కోసం కృషిచేస్తున్న పలమనేరులోని పుంగనూరు పరిశోధన కేంద్రానికి ఈ అవార్డు లభించింది. ఈ ఏడాది ఒంగోలు జాతి పరిరక్షణకు కృషిచేస్తున్న పరిశోధన స్థానానికి ప్రతిష్టాత్మకమైన బ్రీడ్ కన్జర్వేషన్ అవార్డును ప్రకటించారు. కిసాన్ దివస్ సందర్భంగా ఈ నెల 23న హరియాణలోని కర్నాల్‌లో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు కింద ప్రత్యేక ప్రశంసాపత్రం, నగదు బహుమతి ప్రదానం చేయనున్నారు

ఒంగోలు జాతికి శతాబ్దాల చరిత్ర

ఒంగోలు జాతి పశువుల స్వస్థలం ఒకప్పటి ఒంగోలు, గుంటూరు, నరసరావుపేట తాలూకాలైనప్పటికీ వీటి పుట్టినిల్లు దక్షిణాన పెన్నా, ఉత్తరాన కృష్ణానదుల మధ్యకు వ్యాపించింది. 1900 దశకంలో ప్రతి రైతు దగ్గర నాలుగు నుంచి ఎనిమిది ఒంగోలు ఆవులుండేవి. కానీ క్రమేపీ ఇవి అంతరించిపోతున్న జాతుల జాబితాలోకి చేరాయి. మంచి పాలసార కలిగిన జాతిగా ఇవి అంతర్జాతీయ ఖ్యాతి గడించాయి. ఏ వాతావరణాన్ని అయినా తట్టుకునే శక్తి, వ్యాధినిరోధక శక్తి కలిగి ఉండడంతో పాటు భారీ శరీరంతో ఆకర్షణీయంగా ఉండడంతో ఒంగోలు జాతి పశువులు విదేశీయులను విశేషంగా ఆకర్షించాయి. ఫలితంగా తొలుత 1875లో బ్రెజిల్, 1885లో అమెరికా వీటిని తమ దేశానికి తీసుకెళ్లాయి. క్రమంగా ఒంగోలు జాతి అక్కడి నుంచి లాటిన్ అమెరికా దేశాలకు విస్తరించింది. బ్రెజిల్‌లో ఒంగోలు జాతిని నెలోర్, సంబా ఒంగోలు జాతిగా పిలుస్తారు. మన ఒంగోలు, గిర్, కాంక్రెజ్ జాతుల కలయికతో ఇండు బ్రెజిల్ జాతిని అభివృద్ధి చేశారు. అలాగే జమైకాలో ఒంగోలు జాతి ద్వారా బ్రాహ్మన్, వెనెజ్యులాలో ప్రిడియన్, ఒంగోలు జాతుల కలయికతో ఒంక్యాంపో అనే కొత్తజాతిని అభివృద్ధి చేశారు.

ఐవీఎఫ్ ద్వారా మేలుజాతి ఒంగోలు ఆవుల అభివృద్ధి

2019లో 'ఐవీఎఫ్–ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ (ఐవీఎఫ్అండ్ఈటీ) ద్వారా మేలు జాతి ఆవుల అభివృద్ధి పథకానికి రూ.2.39 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అత్యుత్తమ జన్యు లక్షణాలు, మంచి పాలసార గలిగిన దేశీ ఆవుల సంతతిని అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ ప్రాజెక్టు ద్వారా అత్యుత్తమమైన ఇన్విట్రో ఫెర్టిలైజేషన్, పిండ మార్పిడి ప్రక్రియ ద్వారా మేలు జాతి ఒంగోలు, పుంగనూరు జాతి పిండాలు ఉత్పత్తి చేసి తద్వారా ఆ జాతుల పరిరక్షణకు కృషిచేస్తున్నారు. ప్రస్తుతం 450 దేశీయ మేలుజాతి ఒంగోలు పశుసంపద కలిగిన లాం పశు పరిశోధన స్థానం ఒంగోలు జాతి ప్రత్యుత్పత్తి, జీవ సాంకేతికతలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా ఉంది.

రాష్ట్రంలో భారీగా పెరిగిన ఒంగోలు జాతి పశుసంతతి

మన దేశంలో వీటిసంఖ్య క్రమేపీ తగ్గి అంతరించిపోతున్న వాటి జాబితాలో చేరడంతో ఒంగోలు జాతి గోవుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. 1926లో ఏర్పాటైన గుంటూరు లాంలోని పరిశోధన స్థానం 1972 నుంచి ఒంగోలు జాతి పరిరక్షణ కోసం కృషిచేస్తోంది. వంద మేలు జాతి ఒంగోలు ఆబోతుల నుంచి దాదాపు 11 లక్షల వీర్య మోతాదులు తయారు చేసి తెలుగు రాష్ట్రాల రైతులకు అందజేశారు. ఫలితంగా రాష్ట్రంలో ఈ జాతి పశుసంపద అభివృద్ధి చెందింది. దేశంలో సుమారు ఏడులక్షల ఒంగోలు గోసంతతి ఉండగా, ఒక్క ఏపీలోనే నాలుగు లక్షలకుపైగా వీటి సంఖ్య పెరిగింది. ఇటీవల మేఘాలయ రాష్ట్ర సంవర్ధకశాఖకు ఒంగోలు జాతి వీర్యంతో పాటు కోడెదూడలను సరఫరా చేశారు. ఒంగోలు జాతి పరిరక్షణ కోసం వివిధ ప్రాజెక్టుల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటుతో పాటు శ్రీవేంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం నిర్విరామ కృషిచేస్తోంది.

అవార్డుతో మరింత బాధ్యత



ఒంగోలు జాతి పరిరక్షణ కోసం దశాబ్దాలుగా కృషిచేస్తున్నప్పటికీ.. నాలుగున్నరేళ్లుగా ఐవీఎఫ్, ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ ద్వారా మేలుజాతి ఒంగోలు ఆవుల అభివృద్ధితో విశేష గుర్తింపు లభించింది. గుంటూరు పశుపరిశోధన స్థానం ద్వారా చేస్తున్న నిర్విరామ కృషికి గుర్తింపుగా హరియాణలోని కర్నాల్‌లోగల ఐసీఏఆర్–నేషనల్ బ్యూరో ఆఫ్ యానిమల్ జెనిటిక్ రిసోర్సెస్ (ఐసీఏఆర్ అండ్ ఎన్‌బీఏజీఆర్) నుంచి 'జాతి పరిరక్షణ అవార్డు–2023' లభించింది. ఈ అవార్డు ద్వారా ఒంగోలు జాతి పరిరక్షణ, అభివృద్ధి కోసం మరిన్ని పరిశోధనలు చేసేందుకు యూనివర్సిటీకి మరింత తోడ్పాటు లభించనుంది.

– ప్రొఫెసర్ సర్జన్‌రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం

పాడేరులో దట్టంగా కురుస్తున్న పొగమంచు



అరకును వణికిస్తున్న చలిగాలులు

అల్లూరి సీతారామరాజు జిల్లాను చలిగాలులు వణికిస్తున్నాయి. పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఏజెన్సీలో కనిష్ట ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతున్నాయి. శుక్రవారం అరకు లోయలోని కేంద్ర కాఫీ బోర్డు కార్యాలయం వద్ద 10.9 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 11.8, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీ బోర్డు వద్ద 12 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. రాత్రి వేళల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటోందని పేర్కొన్నారు.

– సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

9 మందికి నాన్ క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 9 మంది అదనపు ఎస్పీలకు నాన్ క్యాడర్ ఎస్పీలుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. వారికి పోస్టింగులు ఇవ్వడంతో పాటు మరో ఐదు గురిని బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అధికారి	పదోన్నతి, బదిలీ అయిన విభాగం
డి.హైమావతి	ఎస్పీ, విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్, విశాఖపట్నం
పి.శ్రీనివాస్	ఎస్పీ, ఆర్ఎస్ఎస్ఏటీఎఫ్, తిరుపతి
కె.లతా మాధురి	ఎస్పీ, ఇంటెలిజెన్స్
కె.కృష్ణ ప్రసన్న	ఎస్పీ, ఇంటెలిజెన్స్
కరీముల్లా షరీఫ్	ఎస్పీ, విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్, విజయవాడ
ఎం.రజని	ఎస్పీ, మెరైన్ పోలీస్
షేక్ షకీలా బానూ	ఎస్పీ, ఇంటెలిజెన్స్
డీఎన్ మహేశ్	ఎస్పీ, ఏసీబీ
జి.నాగన్న	ఎస్పీ, అప్పా
పి.వెంకటరత్నం	డీసీపీ(క్రైమ్), విశాఖపట్నం
కె.చక్రవర్తి	డీసీపీ (ట్రాఫిక్), విజయవాడ
జి.స్వరూపారాణి	అదనపు ఎస్పీ, తూర్పు గోదావరి
సీహెచ్.సౌజన్య	అదనపు ఎస్పీ, నెల్లూరు
కె.కనకరాజు	పోలీస్ ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలి

గ్యాస్ టర్బైన్ టెక్నాలజీలో స్వయం ప్రతిపత్తి

- ఆత్మనిర్భర్ భారత్‌లో భారత నౌకాదళం మరో ముందడుగు

సాక్షి, విశాఖపట్నం: ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా దేశీయ సాంకేతికతను అభివృద్ధి చేయడంలో భారత నౌకాదళం ముఖ్య భూమిక పోషిస్తోంది. గ్యాస్ టర్బైన్ టెక్నాలజీలో స్వయం ప్రతిపత్తిని సాధించింది. విశాఖలోని ఇండియన్ నేవీ నేవల్ బేస్ ఐఎన్ఎస్ ఏకశిలలో ఈ సాంకేతికత అభివృద్ధి జరిగింది. గ్యాస్ టర్బైన్ కంప్రెసర్ బ్లేడ్ల తయారీ ఇకపై మేడ్ ఇన్ ఇండియాగా రానున్నట్లు ఇండియన్ నేవీ చీఫ్ మెటీరియల్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సందీప్ నత్వానీ తెలిపారు. డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డా.వై శ్రీనివాసరావుతో కలిసి సందీప్ నత్వానీ ఐఎన్ఎస్ ఏకశిలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జీటీసీ బ్లేడ్ల తయారీకి సంబంధించిన డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. ఇకపై ఇతర ప్రాంతాలకు జీటీసీ బ్లేడ్లను ఎగుమతి చేసేందుకు అనుమతులు రాబోతున్నాయని వైస్ అడ్మిరల్ నత్వానీ తెలిపారు.


జీటీసీ బ్లేడ్స్ నమూనాని పరిశీలిస్తున్న వైస్ అడ్మిరల్ నత్వానీ, డీఆర్డీవో డీజీ డా.శ్రీనివాసరావు

ముగిసిన రాష్ట్రస్థాయి కళాఉత్సవ్, బాల్‌రంగ్ పోటీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రస్థాయి కళాఉత్సవ్, బాల్‌రంగ్–2023–24 పోటీలు ఘనంగా ముగిశాయి. ఈనెల 14వ తేదీ నుంచి రెండురోజుల పాటు విజయవాడలోని ఓ ప్రముఖ హోటల్‌లో 10 విభాగాలో పోటీలు నిర్వహించగా 142 మంది పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారితో పాటు 60 మందికి బహుమతులు ప్రదానం చేశారు. ప్రతి విభాగంలోనూ అబ్బాయిల్లో ఒకరిని, అమ్మాయిల్లో ఒకరిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. బాల్‌రంగ్ పోటీల్లో ప్రతి టీంలో 15 మంది చొప్పున 5 టీమ్‌లు థింసా, తప్పెట గుళ్లు వంటి అంశాల్లో పాల్గొన్నారు. థింసా నృత్యానికి ప్రథమ బహుమతి లభించింది. ఈ బృందం జాతీయ స్థాయిలో తమ ప్రదర్శన ఇవ్వనుంది. బహుమతి ప్రదానోత్సవానికి వచ్చిన సమగ్ర శిక్ష పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కళలను, విద్యను సమ్మిళితం చేయడం ద్వారా అద్భుతాలు సాధించవచ్చన్నారు.

లోకేశ్.. ఆళ్లగడ్డ కాదు

- నోరు తిరగని టీడీపీ నేత



అచ్యుతాపురం (అనకాపల్లి జిల్లా): ఆయనకే నోరు తిరగదు. తాను పోటీ చేసిన మంగళగిరి నియోజకవర్గం పేరే సరిగా పలకలేని నాలుకది. ఇహ మరొకళ్ల తప్పు ఎత్తి చూపడానికి ఆ నాలుక ఇంకెన్ని వంకర్లు తిరగాలి! ఇప్పుడు జరిగిందిదే. 2019 ఎన్నికల్లో మంగళగిరి అనే పదం పలకలేక మందలగిరి అంటూ గడిపేసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్.. ఆ తర్వాతా చాలా పదాలు పలకలేక నానా తంటాలూ పడ్డారు. తాజాగా అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో శుక్రవారం లోకేశ్ చేసిన పాదయాత్రలో స్థానికులతో మాట్లాడుతూ.. ఆలుగడ్డ అన్న పదాన్ని పలకలేక.. ఆళ్లగడ్డ అంటూ పలికేశారు. దీంతో అక్కడ ఉన్న వారంతా ఘొల్లున నవ్వేశారు. కార్యకర్తలు పొటాటో.. పొటాటో.. అని చెప్పినా వినిపించుకోకుండా అదే పదాన్ని మళ్లీ పలికారు.

18 నెలల్లో న్యాయం చేస్తా

పాదయాత్రలో భాగంగా లోకేశ్ శుక్రవారం అచ్యుతాపురంలో మత్స్యకారులు, నేవల్‌బేస్ బాధితులతో మాట్లాడారు. తమ ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లోనే ఆ బాధితులకు న్యాయం చేస్తామన్నారు. మత్స్యకారులకు, మత్స్యకారులు కానివారికి తగవులు పెట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో కొద్దిపాటి సమస్యలు మిగిలిపోయాయని చెప్పారు. పంచదార్ల క్యాంపు నుంచి పాదయాత్ర ప్రారంభించిన లోకేశ్ వెదురువాడలో కాపు సామాజిక వర్గీయులు, యాదవులతో మాట్లాడారు. అచ్యుతాపురం, చోడపల్లి, కొండకర్ల జంక్షన్, హరిపాలెం మీదుగా తిమ్మరాజుపేట డేవన్సీ స్కూల్‌కు పాదయాత్ర చేరుకుంది. ఈ పాదయాత్రలో పాల్గొన్నదే కొద్దిమంది. అందులోనూ టీడీపీ కార్యకర్తలకంటే జనసేన కార్యకర్తలే ఎక్కువగా పాల్గొన్నారు. కొండకర్ల జంక్షన్ దాటాక వారూ జారుకున్నారు. దీంతో పాదయాత్ర చివరికి వచ్చేసరికి చాలా కొద్దిమందే ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో సాయ్ క్రీడాకారులకు పతకాల వెల్లువ

పలు అంశాల్లో బంగారు, రజత పతకాలు సాధించిన క్రీడాకారులు

సాక్షి, అమరావతి: ఏపీ స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఏలూరులోని 'సాయ్' క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచినట్లు సెంటర్ ఇన్‌చార్జి వినాయక ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి 14 వరకు నరసరావుపేటలో జరిగిన అండర్ 17 బాలుర విభాగంలో బి.సుకుమార్ 200 మీటర్ల పరుగులో బంగారు పతకం, 100 మీటర్ల పరుగులో రజత పతకం సాధించినట్లు చెప్పారు. జి. వెంకట లోకేశ్ 800 మీటర్ల పరుగులో రజత పతకం, 1500 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించారని తెలిపారు. జావెలిన్ త్రోలో డి.ఉదయ్ బంగారు పతకం సాధించినట్లు చెప్పారు. డిస్కాస్ త్రోలో పి.రూబేష్‌బాబు బంగారు పతకం సాధించారన్నారు.

బాలికల విభాగంలో 100, 200 మీటర్ల పరుగులో రెండింటిలోనూ బి.జాహ్నవి బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. 100 మీటర్ల రిలేలో బి.షలోని బంగారు పతకం సాధించిందని, జావెలిన్ త్రోలోనూ ఈ బాలిక కాంస్య పతకం సాధించిందని తెలిపారు. టి. లక్ష్మీ హర్ష 400, 800 మీటర్ల పరుగులో రజత పతకాలు సాధించిందన్నారు.

అండర్–19లో 100 మీటర్ల పరుగులో పి.వెంకటేశ్ రజత పతకం సాధించారని చెప్పారు. షాట్‌పుట్‌లో ఎం.మానస బంగారు పతకం గెలుపొందిందన్నారు. అండర్ 17లో జాహ్నవి ఉత్తమ అథ్లెట్‌గా నిలిచిందని తెలిపారు.

ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్‌లో రాష్ట్ర క్రీడాకారుల ముందంజ

- బాలికల విభాగంలో సెమీస్‌కు చేరిన సూర్య చరిష్మ
- బాలుర విభాగంలో క్వార్టర్స్‌లో రాహుల్ ద్రవిడ్, కోమల్

విజయవాడ స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్–19 జాతీయ బ్యాడ్మింటన్ బాలబాలికల సింగిల్స్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. బాలికల సింగిల్స్‌లో రాష్ట్ర క్రీడాకారిణి సూర్య చరిష్మ అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించింది. విజయవాడ సీహెచ్ఆర్‌కే ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైన ఈ పోటీల్లో సూర్య చరిష్మ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్స్‌లో సమృద్ధి భరద్వాజ్ (పంజాబ్)పై 2–0 (15–9, 15–7) తేడాతో గెలిచి సెమీస్‌కు చేరింది. అంతకుముందు తొలి పోటీలో ఢిల్లీ క్రీడాకారిణి అంజలీనాను, ప్రీ క్వార్టర్స్‌లో గుజరాత్ క్రీడాకారిణి ఫ్లోరా ఇంజనీర్‌ను సునాయాసంగా ఓడించింది. శనివారం ఉదయం జరిగే సెమీఫైనల్లో మోనిత (కర్ణాటక)తో తలపడనుంది. బాలుర విభాగంలో రాష్ట్ర క్రీడాకారులు రాహుల్ ద్రవిడ్, ఎస్.ఎ.కె.కోమల్ క్వార్టర్స్‌లోకి ప్రవేశించారు. వీరితోపాటు సికార్‌రెలన్ (పంజాబ్), సువిప్రిదన్ (మహారాష్ట్ర), మెంత్రా సోనిజ (మధ్యప్రదేశ్), ఆర్యన్ త్యాగి (రాజస్థాన్), కియాన్ రంజన్ (ఢిల్లీ), ఆక్సర్ మాలిక్ (చండీగఢ్) కూడా క్వార్టర్స్‌కు చేరారు. 33 రాష్ట్రాల జట్లు పాల్గొంటున్న ఈ పోటీలు ఆద్యంతం రసవత్తరంగా సాగుతున్నాయి.


Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

I
సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శనివారం ॥ 16-12-2023

ఫస్టు నుంచి చూద్దాం!

ఆ మాటే వద్దు.. ఇవ్వాళే మొదలెట్టండి!

**'న్యూ ఇయర్ రానీ' అంటారు కొందరు.
'జనవరి 1 నుంచి అంతా మార్చేస్తా'
అంటుంటారు ఇంకొందరు.
'లాస్ట్ ఇయర్ వేస్ట్‌గా పోయింది.
ఈ ఇయర్ జిమ్‌ను కేక పెట్టిస్తా'...
మనం ఫిట్‌గా ఉండటానికి
న్యూ ఇయరే రావాలా?
మంచి అలవాటుకు ప్రతిరోజూ మంచిరోజే.
నిపుణుల అభిప్రాయం ఏమిటంటే
జనవరి 1 కంటే నవంబర్, డిసెంబర్‌లలో
ఫిట్‌నెస్ సంకల్పం తీసుకుంటున్నవారు
బెటర్‌గా మాటకు కట్టుబడుతున్నారని.
ఒకటి దాకా ఆగొద్దు.
ఇవాళ్టితో కదుల్దాం ముందుకు.**



అందరి షూ ర్యాక్‌లో దుమ్ము పట్టిన వాకింగ్ షూస్ ఉంటాయి. అవి గత సంవత్సరం జనవరి నెలలో కొన్నవి. కొత్త సంవత్సరంలో తీసుకున్న నిర్ణయాలలో భాగంగా, వాకింగ్ చేయాలనుకుని కొన్నవి అవి. ఆ వాకింగ్ ఎన్ని రోజులు సాగిందో. ప్రస్తుతం అవి దుమ్ముకొట్టుకుని, పట్టించుకునే యజమాని కోసం ఎదురు చూస్తూ అలా పడి ఉంటాయి.

ఆ దారిన వెళుతున్నప్పుడల్లా ఆ జిమ్ కనిపిస్తూనే ఉంటుంది. జనవరి, ఫిబ్రవరి రెండు నెలలు వెళ్లి మూడో నెల నుంచి మానేసిన జిమ్. ట్రైనర్ ఇప్పటికీ ఫోన్ చేస్తుంటాడు. జిమ్ నుంచి అలెర్ట్ మెసేజ్‌లు వస్తూనే ఉంటాయి. గత సంవత్సరం కంటిన్యూ చేయలేదు కాని ఈ సంవత్సరం మళ్లీ చేరి కంటిన్యూ చేయాలి అనుకుంటూ ఉంటారు కొందరు.

ఉదయం వాకింగ్ ఫ్రెండ్స్ వాకింగ్ చేస్తూనే ఉంటారు. మనం వారు కనిపిస్తే ముఖం తిప్పుకుని వెళ్లిపోతూ ఉంటాం. నాలుగు రోజుల సింగారంగా మన వాకింగ్ ముగిసిపోయి ఉంటుంది. 'న్యూ ఇయర్ రానివ్వండి. జాయిన్ అవుతాను' అని వాళ్లు కనిపించినప్పుడల్లా అంటూనే ఉంటారు.

తక్షణం అవశ్యం ఆరోగ్యం

'ఆలస్యం అమృతం విషం' అన్నారు పెద్దలు. 'తక్షణం అవశ్యం ఆరోగ్యం' అనుకోవాలి విజ్ఞులు. ఇవాళ రేపట్లో మనం ఏం తింటున్నామో అందరికీ తెలుసు. విషం. మందులు విషం. కల్తీ గాలి. అయితే పరిగెత్తి చేసే ఉద్యోగాలు లేదా తిష్ట వేసినట్టుగా కదలక కూచుని చేసే కొలువులు... ఆరోగ్యం ఎలా? వయసు పెరిగే కొద్దీ బాధ్యతలు పెరుగుతాయి. బాధ్యతలు నెరవేరాలంటే ఆరోగ్యం ముఖ్యం.

అందుకు ప్రయత్నం ముఖ్యం. అక్కడే వస్తుంది చిక్కు. 'ఆరంభించరు నీచ మానవులు' అని భర్తృహరి అన్నాడు కాని 'ఆరంభించడానికి వేచి చూస్తారు సోమరి పోతులు' అనాలి నిజానికైతే. 'జనవరి 1 వస్తేనే ఆరంభిస్తా' అనుకుంటే జనవరి 1 వస్తేనే భోం చేస్తా అనుకోరు ఎందుకో.

ఫ్రెష్ స్టార్ట్ ఎఫెక్ట్

జనవరి 1 అంటే కొత్త సంవత్సరం వస్తుంది. క్యాలెండర్ మారుతుంది. అన్నిచోట్ల ఒక కొత్త ఉత్సాహం ఉంటుంది. కనుక కొత్తగా నిర్ణయాలను అమలు చేద్దాం అని చాలామంది అనుకుంటారు. దీనిని ఫ్రెష్ స్టార్ట్ ఎఫెక్ట్ అంటారు. అయితే డాక్టర్ జాన్ నార్‌క్రాస్ అనే సైకాలజీ ప్రొఫెసర్ ఇలా న్యూ ఇయర్ నిర్ణయాలు తీసుకుంటున్నవారిని గత 40 ఏళ్లుగా పరిశీలిస్తూ ఏమని తేల్చాడంటే– సాధారణంగా న్యూ ఇయర్ నిర్ణయాలలో ముఖ్యమైనవి 2. మొదటిది ఫిట్‌నెస్ సాధించడం, రెండోది బరువు తగ్గడం. ఫిట్‌నెస్ సాధించాలనుకునేవారు, బరువు తగ్గాలనుకునేవారు ఒక నెల రోజుల్లో సగానికి సగం మంది వ్యాయామం ఆపేస్తున్నారు. ఆరు నెలల్లో తొంభై శాతం మంది. పది శాతం మందే న్యూ ఇయర్ నిర్ణయాలను కొనసాగిస్తున్నారు. నిర్ణయం తీసుకోవడం ఎందుకు నీరుగారిపోవడం ఎందుకు?

మంచి సీజన్

అమెరికా, బ్రిటన్‌లలో ప్రతి సంవత్సరం జనవరి నెలలో జిమ్‌లు కిటకిటలాడతాయి. నవంబర్, డిసెంబర్ వచ్చేసరికి ఖాళీ అయిపోతాయి. కొత్త సంవత్సరం ఉత్సాహం, నిర్ణయం నిలబడకపోవడమే కారణం. నిపుణులు ఏమంటున్నారంటే మీరు, మీ చుట్టూ ఉండే వాతావరణం ఎప్పుడు ఉత్సాహంగా ఉంటే అప్పుడు నిర్ణయాలు తీసుకుని అమలు చేయండి అని. ఉదాహరణకు మనకు వేసవి కాలం ఉత్సాహంగా అనిపిస్తే అప్పుడు మొదలెట్టి కొనసాగించాలి. లేదా నవంబర్ మంచి సీజన్ అనుకుంటే మొదలెట్టాలి. అమెరికాలో జనవరి నెల చలిలో మొదలెట్టే వ్యాయామాలు కొనసాగించడం సాధ్యం కావడం లేదని తేల్చారు. మన దగ్గర కూడా జనవరి చలి. ఆ చలిలో ఉదయాన్నే లేవలేక న్యూ ఇయర్ రెజల్యూషన్ పాటించడం లేదని బాధపడి... ఇదంతా ఎందుకు? ఈ రోజు నుంచే మొదలెట్టొచ్చు కదా.

ముఖ్యం... చాలా ముఖ్యం

ఆరోగ్యం కోసం కష్టపడటం ముఖ్యం. చాలా ముఖ్యం. ఏదో ఒక మంచి సందర్భంలో వజ్ర సంకల్పం తీసుకోవాలి. ఆల్కహాల్ తగ్గిస్తాను, స్మోకింగ్ మానేస్తాను, ఫేస్‌బుక్ కట్టేస్తాను, పిల్లలతో గడుపుతాను, యోగా చేస్తాను, నాన్‌వెజ్ వారంలో ఒక్కరోజే... ఇలా ఏ మంచి నిర్ణయమైనా మీకు మేలు చేస్తుంది.

నేటి మీ నిర్ణయం రేపు మీ యోగం.

పండుటాకులే పిల్లలుగా...

దైనందిన జీవితంలో ఎన్నో సందర్భాలు ఎదురవుతుంటాయి. వాటిలో కొన్ని మనల్ని కదిలించి ఆలోచింపచేస్తాయి. మరికొన్ని సందర్భాలు భవిష్యత్‌నే మార్చేస్తాయి. అలాంటి ఓ సంఘటన ప్రణవ్ శుక్లా జీవితాన్ని మార్చేసి సామాజికవేత్తగా తీర్చిదిద్దింది. వందలమంది వృద్ధులను చేరదీసి వారి ఆలన పాలన చూసుకుంటూ ఎంతోమందికి స్ఫూర్తినిస్తున్నాడు ప్రణవ్.



వృద్ధురాలితో ప్రణవ్

హరియాణలోని ఫరిదాబాద్‌కు చెందిన వ్యక్తి ప్రణవ్ నారాయణ్ శుక్లా. ప్రణవ్ శుక్లా ప్రొఫెసర్ కొడుకు కావడంతో ఇంటర్మీడియట్ తరువాత మెడిసిన్ చదవాలనుకున్నాడు. అనుకున్నట్టుగానే మెడిసిన్‌లో చేరాడు. కానీ ఫ్యాషన్ డిజైనింగ్‌పై మక్కువ ఏర్పడడంతో నెలరోజుల తరువాత మెడిసిన్ మానేసాడు. ఇది కుటుంబ సభ్యులకు నచ్చకపోవడంతో ఎటువంటి ఆర్థిక సాయం చేయలేదు. అయినా తనకిష్టమైన ఫ్యాషన్ డిజైనింగ్‌ను కష్టపడి చదివి ఓ బహుళజాతి సంస్థలో ఉద్యోగం సంపాదించాడు.

కాలేజీ రోజుల్లో...

ప్రణవ్ శుక్లా ఫ్యాషన్ డిజైనింగ్ చదివేటప్పుడు రోజూ కాలేజీకి ట్రైన్‌లో వెళ్తుండేవాడు. ఒకసారి ట్రైన్ ఎక్కేందుకు ఓక్లా స్టేషన్‌కు చేరుకున్నాడు. అది చలికాలం కావడంతో ప్లాట్‌ఫాం మీద మెల్లగా నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఇంతలో ప్లాట్‌ఫాం పైన ఒక మూలన ఒక వృద్ధుడు చలికి వణికిపోతూ అల్లాడిపోతున్నాడు. అదిచూసి చలించిపోయిన ప్రణవ్ తను ఎంతో ఇష్టంతో కొనుక్కున్న జాకెట్‌ను ఆ వృద్ధుడికి ఇచ్చాడు. అప్పుడు అతడి కళ్లలో చూసిన ఆనందం ప్రణవ్‌కు చాలా సంతృప్తినిచ్చింది. తను జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకున్న తరువాత వృద్ధుల బాగోగులను చూసుకోవాలని అప్పుడే నిర్ణయించుకున్నాడు.

> **అందుకే పిల్లలు వద్దనుకున్నాం**
> కాలేజ్ డేస్‌లో తీసుకున్న నిర్ణయం ఈరోజు ఇంతమందికి ఆశ్రయం కల్పిస్తోంది. పెద్దవారికి సాయం చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రస్తుతం ఆశ్రమంలో నలభై రెండు మంది వృద్ధులు ఉన్నారు. వారిని కన్నబిడ్డల్లా చూసుకుంటున్నాము. అందుకే నేను, నా భార్య పిల్లలు వద్దు అనుకున్నాము.

ఆనందాల, ఆత్మీయతల ఆశ్రమం..

ప్రణవ్ ఉద్యోగంలో చేరాక కొంతమొత్తాన్ని దాచుకుని వృద్ధులకు ఖర్చుపెట్టాలని నిర్ణయించుకున్నాడు. కొంత మొత్తం జమయ్యాక.. నిరాశ్రయులైన వృద్ధులకు బియ్యం, పప్పులు, దుస్తులు వంటి నిత్యావసరాలు సమకూర్చేవాడు. అయితే వారి అవసరాలు తీర్చడానికి మరిన్ని సదుపాయాలు అవసరం అని భావించి... 1996లో 'అనడి సేవా ప్రకల్ప్' పేరిట ఓల్డేజ్ హోమ్‌ను ఏర్పాటు చేశాడు. అప్పుడు ప్రణవ్‌కు పంతొమ్మిదేళ్లు. వసతి సదుపాయాలు లేక అనాథలుగా మారిన ఒంటరి వృద్ధులను చేరదీసి వసతి, కడుపునిండా ఆహారం పెట్టడం, అవసరమైన ఆరోగ్య అవసరాలు తీర్చుతూ వృద్ధుల జీవననాణ్యతను మెరుగుపరిచాడు. ఒక పక్క ప్రణవ్ ఉద్యోగం చేస్తూనే అనడిని చూసుకునేవాడు. కొన్నాళ్ల తరువాత పూర్తి సమయాన్ని ఆశ్రమానికి కేటాయించడం కోసం 2017లో ఉద్యోగం వదిలేశాడు. అప్పటి నుంచి మరింత సమయాన్ని కేటాయించి ఆశ్రమంలోని వారిని సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకోవడం మొదలు పెట్టాడు. వారికి అవసరమైన వైద్యసదుపాయాలు సకాలంలో అందిస్తూ వారిని ఆనందంగా ఉంచేందుకు తనవంతు కృషి చేస్తున్నాడు.

ఆవులు పెంచుతూ...

ఆశ్రమాన్ని నడిపేందుకు.. అవసరమైన ఖర్చుల కోసం అనడి ఫారమ్స్ అండ్ గోదామ్ పేరిట ఆవుల పెంపకాన్ని ప్రారంభించాడు. రెండువందల ఆవులను పెంచుతూ.. వాటి ద్వారా వచ్చే పాలు, పెరుగు, నెయ్యిని విక్రయిస్తూ వచ్చిన ఆదాయాన్ని అనడి ఆశ్రమ వృద్ధుల కోసం ఖర్చు చేస్తున్నాడు. గత ఇరవై ఆరేళ్లుగా అనడిలో ఎంతోమంది వృద్ధులు ఆశ్రయం పొందారు. మలివయస్కుల జీవితాల్లో వెలుగులు నింపుతోన్న నలభై ఆరేళ్ల ప్రణవ్ సేవకు గుర్తింపుగా అనేక అవార్డులు, గౌరవ సత్కారాలు దక్కడంలో ఆశ్చర్యం లేదు.

రంగస్థల సింగం

ఫస్ట్ టైం

'అమ్మాయిలు నటించడం ఏమిటి?' అనే ఆశ్చర్యం నుంచి రంగస్థలానికి వెలుగులు అద్దిన ప్రసిద్ధ నటీమణుల వరకు ఎంతో చరిత్ర ఉంది. రంగస్థలానికి సంబంధించిన చరిత్రలో మరో విశిష్టమైన పేరు ఇందు. లండన్‌లోని ప్రసిద్ధ రాయల్ నేషనల్ థియేటర్‌కు ఇందు రుబసింగంను ఆర్టిస్టిక్ డైరెక్టర్, జాయింట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా నియమించారు. 60 సంవత్సరాల చరిత్ర ఉన్న నేషనల్ థియేటర్‌కు మహిళా దర్శకురాలిని 'ఆర్టిస్టిక్ డైరెక్టర్'గా నియమించడం ఇదే తొలిసారి....



ఇందు

ఇందు తల్లిదండ్రులు ఇంగ్లాండ్‌లో స్థిరపడిన శ్రీలంక తమిళులు. నాటింగ్‌హామ్ సిటీలోని నాటింగ్‌హామ్ గర్ల్స్ హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేసింది ఇందు. హల్ యూనివర్శిటీలో థియేటర్ ఆర్ట్స్‌లో డాక్టరేట్ చేసింది. థియేటర్ రాయల్, స్ట్రాట్‌ఫర్డ్ ఈస్ట్‌లో ట్రైనీ డైరెక్టర్‌గా పనిచేసింది. ఆ తరువాత ఫ్రీలాన్స్ థియేటర్ డైరెక్టర్‌గా పది సంవత్సరాలకు పైగా పనిచేసింది.

ఫ్రీలాన్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కాలంలోనే లండన్‌లోని 'గేట్ థియేటర్'లో అసోసియేట్ డైరెక్టర్‌గా నియామకం అయింది.

లండన్‌లోని కిల్న్ థియేటర్‌కు 'ఆర్టిస్టిక్ డైరెక్టర్'గా నియామకం కావడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది ఇందు. గతంలో ఈ థియేటర్ శ్వేత జాతీయుల ఆధ్వర్యంలోనే నడిచేది. శ్వేతజాతేతర మహిళా దర్శకురాలు 'ఆర్టిస్టిక్ డైరెక్టర్'గా నియామకం కావడం ఇదే తొలిసారి. కిల్న్ థియేటర్ నిర్వహణలో 'ఆర్టిస్టిక్ డైరెక్టర్' గా తనదైన ముద్ర వేసింది ఇందు. ఆడిటోరియంను ఆధునీకరించి సీట్ల సంఖ్యను పెంచింది.

కొత్త సౌకర్యాలు మాత్రమే కాదు కొత్త నాటకాన్ని థియేటర్‌కు పరిచయం చేసింది.

'రెడ్ వెల్వెట్' 'హ్యాండ్ బ్యాగ్‌డ్' 'వెన్ ది క్రాస్ విజిట్' 'ఏ వోల్ఫ్ ఇన్ స్నేక్‌స్కిన్ షూస్'...మొదలైన నాటకాలు డైరెక్టర్‌గా ఇందుకు మంచి పేరు తెచ్చాయి. ది ఆర్ట్స్ అండ్ కల్చర్ అవార్డ్, ఏషియన్ ఉమెన్ ఆఫ్ ఎచీవ్‌మెంట్ అవార్డ్, లిబర్టీ హ్యూమన్ రైట్స్ అవార్డ్... మొదలైన ఎన్నో అవార్డ్‌లు అందుకుంది.

> **కొత్త రెక్కలతో...**
> రంగస్థలం అనేది ఒకచోట, ఒకేకాలంలో ఉండిపోదు. కాలంతో పాటు కదులుతుంది. కాలాన్ని ప్రతిబింబిస్తుంది. రంగస్థలానికి ఆలోచనాపరులను ఒకే వేదిక మీదికి తీసుకువచ్చే శక్తి ఉంది. మానవసంబంధాల నుంచి అస్తిత్వ పోరాటాల వరకు ఎన్నో అంశాలకు నాటకం అద్దం పడుతుంది. సాంకేతిక పరంగానే కాదు ఇతివృత్త పరంగా కూడా నాటక రంగం కొత్త దారిలో వెళుతుంది. రంగస్థల ప్రపంచంలో కొత్త ద్వారాలు తెరుచుకుంటున్నాయి. కొత్త ఆలోచలకు రెక్కలు వస్తున్నాయి.
> – ఇందు రుబసింగం, రంగస్థల దర్శకురాలు



'ది ఫాదర్ అండ్ ది అసాసిన్' నాటకంలో...

'నాటకరంగాన్ని వినోద మాధ్యమానికి పరిమితం చేయకూడదు. మార్పు తెచ్చే శక్తి నాటకానికి ఉంది. ప్రజలను ఒక దగ్గరకు తీసుకువచ్చి అభిప్రాయాలు పంచుకునేలా, ఆలోచించేలా చేస్తుంది' అంటుంది ఇందు.

కొత్తదనం నిండిన నాటకాలకు ఇందు ప్రాధాన్యత ఇస్తుంది. మానవ సంబంధాలను విభిన్న కోణాల నుంచి విశ్లేషించే నాటకాలను ఎంపిక చేసుకుంటుంది. బీబీసీ రేడియో 4, బీబీసీ రేడియో 3, బీబీసి వరల్డ్ సర్వీస్‌కు సంబంధించి రేడియో నాటికలకు కూడా దర్శకత్వం వహించింది. నేషనల్ థియేటర్‌లో 'ది వెయిటింగ్ రూమ్' 'ది రామాయణ' అనుపమ చంద్రశేఖర్ 'ది ఫాదర్ అండ్ ది అసాసిన్' నాటకాలకు దర్శకత్వం వహించింది. 'ది ఫాదర్ అండ్ ది అసాసిన్'కు బెస్ట్ డైరెక్టర్‌గా అవార్డ్ అందుకుంది.

కొత్త రచయితలను, నటులను ప్రోత్సహించడంలో ప్రపంచ రంగస్థలానికి పరిచయం చేయడంలో ఎప్పుడూ ముందు ఉంటుంది ఇందు.

'ఇందు నేషనల్ డైరెక్టర్‌గా నియామకం కావడం సంతోషంగా ఉంది. ఆర్టిస్ట్‌గా, లీడర్‌గా ఆమె అంటే అపారమైన అభిమానం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించే నాటకాలు రావడానికి, నాటకరంగాన్ని స్ఫూర్తిదాయక శక్తిగా మలిచే విషయంలో ఆమె కొత్త అధ్యాయాన్ని మొదలు పెడతారని ఆశిస్తున్నాను' అంటుంది నేషనల్ థియేటర్ డైరెక్టర్ కేట్ వరహ్.

'ఆర్టిస్టిక్ డైరెక్టర్'గా తన నియామకంపై స్పందిస్తూ...

'నేషనల్ థియేటర్ నా జీవితంలో ముఖ్య పాత్ర పోషించింది. ఇదొక అత్యున్నత గౌరవంగా భావిస్తున్నాను. నాకు సంబంధించి ఇది ప్రపంచంలోనే అత్యున్నత బాధ్యత' అంటుంది ఇందూ రుబసింగం.

● ముగ్గు-ముచ్చట

ముగ్గులకు ఆహ్వానం

ధనుర్మాసం వచ్చిందంటే ఇంటిముంగిట తీర్చిదిద్దిన అందమైన రంగవల్లులు... ముచ్చటైన గొబ్బెమ్మలు... తెలుగింటి ఆడపడచులందరూ తమకు వచ్చిన ముగ్గులను మరొకరితో పంచుకుంటూ... తెలియని వాటిని నేర్చుకుంటూ కనిపిస్తుంటారు. మరి మీరు కూడా ముగ్గులు బాగా వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలతో సహా వాటిని మాకు పంపండి. అందిన వాటిలో చక్కటి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.



ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

జీవితాన్ని యోగవంతం చేసుకుంది

**చిన్న వయసులో పెళ్లి..
పుట్టింటి పుల్లవిరుపులను అత్తింటి ఆరళ్లను
తన యోగాసనాలతో అడ్డుకుని, తనతోపాటు, ఇతరులనూ...
ఆయురారోగ్యాలతో ఆనందంగా
జీవించేలా చేస్తోంది ఫైజా సైఫీ.**



ఉత్తరప్రదేశ్‌లోని హపూర్‌లో పుట్టింది ఫైజా సైఫీ. నలుగురు సంతానంలో పెద్దమ్మాయి. ఫైజా తండ్రి ఫరీదాబాద్‌లో పనిచేసేవారు. దీంతో ఫైజా కూడా అక్కడే చదివింది. కాస్త పెద్దయ్యేసరికి ''మనం మన సంప్రదాయాలు కచ్చితంగా పాటించాలి'' అని ఇంట్లో వారు చెప్పేవాళ్లు. వయసుతోపాటు నిబంధనలు పెరిగాయి. తనకు నచ్చని ఆంక్షలు పాటించడానికి ఫైజా ఒకపట్టాన ఇష్టపడేది కాదు. టీనేజ్‌లోకి రాగానే ''ఇది చేయకూడదు, అది చేయకూడదు, అలా ఉండు, ఇలా ఉండు'' అని చెప్పేవారితో 'అలా ఎందుకు?' అని వాదిస్తుండేది.

''అత్తారింటికి వెళ్లాక పనులన్నీ నువ్వే చేయాలి'' అని చెప్పినప్పుడు తనకు ఇష్టం లేకపోయినా... ఉదయం నాలుగ్గంటలకే లేచి ఇంటిపనులు చేసేది. స్కూలు నుంచి వచ్చాక కూడా ఇంటిపనులు చూసుకోక తప్పేది కాదు. ఇలా పనులు చూసుకుంటూనే 2003లో పదో తరగతి పాసైంది. ఆ తరువాత ఢిల్లీ సంబంధం వస్తే పెళ్లిచేశారు ఫైజాకు.

ఇల్లు కాస్తా జైలైంది...

పెళ్లి అంటే ఏంటో తెలియని వయసులో .. తనకంటే బాగా ఎక్కువ వయసు ఉన్న వ్యక్తితో వివాహం జరిగింది. భర్తకు మూర్ఛరోగంతో పాటు మానసిక సమస్యలు ఉండడంతో కోపం వచ్చినప్పుడల్లా ఫైజాను విపరీతంగా కొట్టేవాడు. దీనికితోడు పుట్టింట్లో ఎప్పుడూ ధరించని బురఖాను అత్తారింట్లో తప్పనిసరిగా వేసుకోవాలని హుకుం జారీ చేశారు. దీంతో ఫైజాకు జైల్లో ఉన్నట్లు అనిపించింది. రోజంతా గొడ్డు చాకిరి... అడుగడుగుకీ ఆంక్షలు... అత్తారింటి బాధలు భరించలేక అమ్మావాళ్ల దగ్గర గోడు వెళ్లబోసుకున్నా..''సమాజంలో పరువు, మర్యాదలు...'' అని చెప్పి నోరు మూయించేవారు. ఎవరికీ చెప్పుకోలేక తనలో తాను కుమిలిపోయేది ఫైజా.

పిల్లలు పుట్టాక కూడా..

అత్తారింట్లో ప్రసవం అయిన తరువాత వారానికే ఇంటి పనులు ఫైజా నెత్తిన పడ్డాయి. పెద్దకుటుంబం కావడంతో.. ఒక్కొక్కరు ఒక్కో రకమైన రుచిని కోరుతూ తను చేయగలదా... లేదా... అని కూడా చూడకుండా ఆమెను వండమని బలవంతం చేసేవాళ్లు. దీంతో ఫైజా నడుము నొప్పి, మైగ్రేన్, థైరాయిడ్, ఆస్తమాల బారిన పడి బాగా నీరసించిపోయింది. తిన్నావా? మందులు వేసుకున్నావా? అని అడిగేవారు ఒక్కరూ లేరు. ఇంత కష్టంలోనూ.. తన రెండున్నరేళ్ల కొడుకుని ప్లేస్కూల్లో దింపడానికి వెళ్లేది ఫైజా. అక్కడ పరిచయమైన టీచర్‌తో .. తనకు చదువుకోవాలని ఉందంటూ తన ఇంటి పరిస్థితులను వివరించి చెప్పింది. అప్పుడు టీచర్ ప్రైవేటుగా చదువుకోవచ్చని సలహా చెప్పడంతో చదవడం ప్రారంభించింది. పరీక్షలు ఉన్నప్పుడు పుట్టింటికి వెళ్లి అక్కడనుంచి రాసేది. పెద్దబాబుకి ఐదేళ్లు వచ్చేటప్పటికి రెండో బాబు కడుపులో పడ్డాడు. ఈసారి ఫైజా ఆరోగ్యం మరింత క్షీణించింది. మెడ నొప్పి, హై బీపీ వంటి సమస్యలు తలెత్తాయి.

టీవీలో యోగా చూసి...

ఒకరోజు ఫైజా ఆరోగ్యం బాగా క్షీణించడంతో పుట్టింటికి పంపించేశారు. అక్కడ ఆయుర్వేద మందులు వాడడంతో కొంత ఉపశమనం లభించింది. ఆ తరవాత రెండో బాబును ప్రసవించింది. ప్రసవం తరువాత పదిహేనురోజులు పుట్టింటిల్లోనే ఉంది. ఆ సమయంలో ఒకరోజు టీవీలో వస్తోన్న యోగా కార్యక్రమాలను చూసింది. యోగాతో అనారోగ్యాలు నయం అవుతాయని తెలుసుకుని యోగా నేర్చుకోవడం ప్రారంభించింది. ఎవరికీ తెలియకుండా ఆసనాలు వేసేది. ఆసనాలు వేసేకొద్ది తన ఆరోగ్యం కుదుటపడడం గమనించింది ఫైజా. యోగా గురించి ఇతరులకు సలహాలు ఇస్తుండేది. రహస్యంగా ఇంటర్మీడియట్ పూర్తిచేసిన తరువాత హిమాలయ యూనివర్శిటీలో యోగా, ఆక్యుప్రెజర్ థెరపీ, ఆయుర్వేదంలో డిప్లొమా చేసింది.

> **ఆరోగ్యంగా.. ఆనందంగా**
> నాకు ఢిల్లీ, ముంబై, అమెరికా, కువైట్‌ల నుంచి క్లైంట్లు ఉన్నారు. ఆన్‌లైన్ తరగతులు చెబుతున్నాను. ఏళ్లపాటు ప్రయత్నించినా గర్భం దాల్చని వారు సైతం నేను అందించే ప్రత్యేకమైన యోగా థెరపీ ద్వారా పిల్లల్ని కంటున్నారు. నా దగ్గర యోగా నేర్చుకునేవారిలో చాలామంది... జీపీ, గుండె సమస్యలు, అధిక బరువు, డయాబెటిస్, థైరాయిడ్, ఆందోళన, నిరాశా నిస్పృహల నుంచి బయటపడి ఆరోగ్యంగా ఆనందంగా జీవిస్తున్నారు. తమ్ముడు, చెల్లి కూడా నా దగ్గర యోగా నేర్చుకుని ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకుంటున్నారు. యోగా నాతోపాటు చాలామందిని ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంతో నిలబెడుతోంది. యోగా వల్లే ఈ రోజు నేను, నా ఇద్దరు కొడుకులు ఆరోగ్యంగా, ఆనందంగా బతక గలుగుతున్నాం. అమ్మాయిలూ... మీ నిర్ణయాలు మీరే తీసుకోండి. ఎవరి మీదా ఆధారపడకండి. ఇతరుల మీద ఆధారపడినంత కాలం ఆత్మవిశ్వాసం కోల్పోతారు. మిమ్మల్ని మీరు నమ్ముకుంటే.. నాలాగా ఏదైనా సాధించగలుగుతారు.
> – ఫైజా సైఫీ

ఆ రోజు రానేవచ్చింది

ఫైజా ఎవరికీ తెలియకుండా చదువుకున్నప్పటికీ అత్తారింట్లో అన్నీ తెలిసిపోయాయి... దాంతో ఆమెను కొత్తరకంగా హింసించడం అకారణంగా చేయి చేసుచేసుకోవడం మొదలు పెట్టారు. ఫైజా భర్త ట్రిపుల్ తలాఖ్ చెప్పి, రెండో పెళ్లికి రెడీ అయిపోయాడు. అంతటితో ఫైజాకు అత్తారింటితో సంబంధాలు తెగిపోయాయి. పుట్టింటిలో కొన్నిరోజులు ఉన్న తరువాత ..''నీ వల్ల చెల్లెళ్లు, తమ్ముళ్లకు పెళ్లిళ్లు కావు. నువ్వు మీ అత్తారింటికి వెళ్లు. అక్కడే సర్దుకుపో'' అని సతాయించడం మొదలు పెట్టారు ఫైజా తల్లిదండ్రులు. దాదాపు పదేళ్లపాటు అత్తారింట్లో అనుభవించిన నరకాన్ని మళ్లీ ఎదుర్కోవాలనుకోలేదు ఫైజా. తల్లిదండ్రులకు చెప్పినా అర్థం చేసుకోరు. వేరే దారిలేక తన పిల్లలను తీసుకుని ఫరీదాబాద్‌లో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో చేరింది. ఇక్కడ రెడ్ క్రాస్ సొసైటీ సాయం, మరోపక్క రూమ్‌మేట్స్ కూడా పిల్లలను ఉంచుకోవడానికి ఒప్పుకోవడంతో ఉద్యోగంలో చేరింది.

యోగా టీచర్‌గా..

స్కూల్లో టీచర్‌గా చేరిన ఫైజా యోగా తరగతులు చెప్పేది. అలా చెబుతూ 2013లో 'ఫైజా యోగా' పేరుతో సొంతంగా ఇన్‌స్టిట్యూట్‌ను పెట్టుకుంది. ప్రారంభంలో రోజుకి యాభైగా ఉన్న విద్యార్థుల సంఖ్య ఇప్పుడు ఐదువందలకు పైకి చేరింది. ఇన్‌స్టిట్యూట్‌లో తరగతులేగాక యోగా క్యాంప్స్‌కూడా నిర్వహిస్తోంది ఫైజా. ఫీజులు చెల్లించలేనివారికి ఉచితంగా యోగా నేర్పించి వారిని యోగా ఇన్‌స్ట్రక్టర్‌లుగా మారుస్తోంది. ఫైజా ఇన్‌స్టిట్యూషన్ గురించి తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు సైతం ఆమెతో సంబంధాలను పునరుద్ధరించుకోవడం మొదలుపెట్టారు.

అలా ఆమె జీవితం యోగవంతం అయింది.

అది (పరమాత్మ) నడుస్తుంది. నడవదు కూడా. అది దూరాతిదూరంగా ఉంటుంది. అత్యంత సమీపంగానూ ఉంటుంది. అది ఈ సమస్త జగత్తు లోపల పరిపూర్ణంగా నిండివుంటుంది; అదే సమయంలో ఈ జగత్తుకు వెలుపల కూడా ఉంటుంది.

– ఈశావాస్యోపనిషత్తు

సాక్షి

శనివారం, 16 డిసెంబర్ 2023

‘కీచక న్యాయం’పై కొరడా!

ఎన్ని చట్టాలున్నా, ఎలాంటి కఠిన చర్యలు తీసుకుంటున్నా మహిళలకు వేధింపులు తప్పడం లేదని తరచు రుజువవుతూనే వుంది. ఆఖరికి న్యాయదేవత కొలువుదీరే పవిత్ర స్థలం కూడా అందుకు మినహాయింపు కాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు ఉత్తర ప్రదేశ్‌లోని బాందా జిల్లా మహిళా సివిల్ జడ్జి రాసిన బహిరంగ లేఖ స్పష్టం చేస్తోంది. జిల్లా జడ్జి, ఆయన అనుచరుల నుంచి ఆమె ఎదుర్కొంటున్న వేధింపులు ఎలాంటివో, అవి ఎంత ఆత్మ న్యూనతకు లోనయ్యేలా చేశాయో మహిళా జడ్జి వాడిన పదజాలమే పట్టిచూపుతోంది. ‘నన్నొక వ్యర్థపదార్థంగా చూస్తున్నారు. పురుగుకన్నా హీనంగా పరిగణిస్తున్నారు’ అని అన్నారంటే ఆమె వేదనను అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు... ‘గత ఏడాదిన్నరగా నడిచే శవంగా బతుకీడుస్తున్నాను. ఇక జీవరహితమైన ఈ కాయాన్ని కొనసాగించలేను. ఆత్మహత్యకు అనుమతించండి’ అని కూడా ఆమె రాశారు. ‘మీరంతా ఆటబొమ్మగా, ప్రాణరహిత పదార్థంగా మారటం నేర్చుకోండి’ అని మహిళలనుద్దేశించి ఆమె వ్యాఖ్యానించారు. తనను రాత్రిపూట ఒంటరిగా కలవమంటూ వేధిస్తున్నారని మొన్న జూలైలో ఆమె చేసిన ఫిర్యాదుపై హైకోర్టులోని అంతర్గత ఫిర్యాదుల కమిటీ విచారించింది. కానీ కింది ఉద్యోగులు ధైర్యంగా సాక్ష్యం చెప్పాలంటే ఆ జడ్జిని విచారణ సమయంలో బదిలీ చేయాలన్న వినతిని పట్టించుకున్నవారు లేరు. దీనిపై సుప్రీంకోర్టులో రిట్ దాఖలు చేస్తే ఈ దశలో జోక్యం చేసుకోలేమంటూ ధర్మాసనం తోసిపుచ్చటం ఆమె తట్టుకోలేక పోయారు. నిరుడు దేశ వ్యాప్తంగా మహిళలపై 4.45 లక్షల నేరాలు చోటు చేసుకున్నాయని జాతీయ క్రైం రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక చెబుతోంది. లైంగిక నేరాలకు సంబంధించి సగటున ప్రతి 51 నిమిషాలకూ ఒక ఎఫ్ఐఆర్ నమోదవుతున్నదని ఆ నివేదిక వెల్లడించింది. ఉత్తరప్రదేశ్ 65,473 కేసులతో మొదటి స్థానంలో వుంటే మహారాష్ట్ర, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ ఆ తర్వాత స్థానాల్లో వున్నాయి. పనిచేసే చోట మహిళలను వేధించటంలో ఢిల్లీ అగ్రస్థానంలో వుంది. నిజానికి వాస్తవ ఘటనలతో పోలిస్తే కేసుల వరకూ వెళ్లే ఉదంతాలు తక్కువనే చెప్పాలి. అందరి దృష్టిలో పడతామని, ఉపాధి కోల్పోతామని, ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు ప్రతీకారానికి దిగొచ్చని భయపడి చాలామంది ఫిర్యాదు చేయటానికి వెనకాడతారు. ఈ వేధింపుల పర్యవసానంగా చాలామంది మహిళలు ఆత్మాభిమానం దెబ్బతిని, మానసిక క్షోభకు లోనయి వృత్తిపరంగా ఎదగలేని నిస్సహాయస్థితిలో పడుతున్నారు. ఇలాంటి కేసులు తమముందు విచారణకొచ్చినప్పుడు నేరగాళ్లను కఠినంగా శిక్షించి, బాధితులకు ఉపశమనం కలగజేయాల్సిన చోటే... మహిళా న్యాయమూర్తులకు వేధింపులుంటే ఇంతకన్నా ఘోరమైన స్థితి వుంటుందా?

నిజానికి న్యాయవ్యవస్థలో లైంగిక వేధింపులుంటున్నాయని ఆరోపణలు రావటం ఇది మొదటిసారేమీ కాదు. సాక్షాత్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులపైనే ఫిర్యాదులొచ్చిన సందర్భాలున్నాయి. ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తరుణ్ గొగోయ్‌పై 2019లో ఒక మహిళా ఉద్యోగి ఫిర్యాదు చేసినప్పుడు ఆమెను మొదట బదిలీ చేసి,ఆ తర్వాత సర్వీసునుంచి తొలగించి చివరకు చీటింగ్ కేసు కూడా పెట్టారు. గొగోయ్ పదవీ విరమణ చేశాక ఆ మహిళకు తిరిగి ఉద్యోగం లభించింది. జస్టిస్ గొగోయ్‌కి మాత్రం ఏం కాలేదు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లా అదనపు సెషన్స్ జడ్జిగా పనిచేసిన మహిళ కూడా ఇలాంటి స్థితినే ఎదుర్కొన్నారు. మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి తనను వేధించిన తీరు గురించి ఆమె ఫిర్యాదు చేశారు. తన గోడు అరణ్యరోదన కావటంతో గత్యంతరం లేక 2014లో ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆయన వేధింపులు ఎలావుండేవో సోదాహరణంగా వివరించారు కూడా. ‘నీ పని తీరు చాలా బాగుంది. నీ అందం మరింత బాగుంది’ అనటం, ఒక శుభకార్యంలో నృత్యం చేయాలంటూ భార్యతో ఫోన్ చేయించటం, ‘ఒంటరిగా ఓసారి నా బంగ్లాకు రా’ అని ఫోన్ చేయటం తేలిగ్గా కొట్టిపారేయదగ్గ ఆరోపణలు కాదు. కానీ విషాదమేమంటే ఆ ఫిర్యాదుకు అతీగతీ లేక పోయింది. ఆ న్యాయమూర్తి నిక్షేపంగా తన పదవీకాలం పూర్తిచేసుకున్నారు. ఆయన రిటైర్ కావటంతో తిరిగి ఉద్యోగం ఇవ్వాలంటూ సుప్రీంకోర్టులో ఆమె 2018లో పిటిషన్ పెట్టుకున్నారు. చివరకు ఆ మహిళా జడ్జి స్వచ్ఛందంగా రాజీనామా చేయలేదని సర్వోన్నత న్యాయస్థానం నిర్ధారించుకుని నిరుడు ఉద్యోగంలో చేరడానికి అనుమతించింది.

చదువూ సంస్కారం లేనివాళ్లూ, జులాయిలుగా తిరిగేవాళ్లూ మహిళలపై, బాలికలపై వేధింపులకు దిగుతారనే అపోహ వుంది. కానీ పెద్ద చదువులు చదువుకుని, ఉన్నత పదవులు వెలగబెడుతున్న వారిలో కొందరు ఆ తోవలోనే ఉంటున్నారని అప్పుడప్పుడు వెల్లడవుతూనే వుంది. ఇలాంటి కేసుల్లో అసహాయ మహిళలకు ఆసరాగా నిలవాల్సిన మహిళా న్యాయమూర్తులకు సైతం వేధింపులుంటే ఇక దిక్కెవరు? కాలం మారింది. యువతులు చదువుల్లో ఎంతో ముందుంటున్నారు. ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తున్నారు. వేరే వృత్తి ఉద్యోగాలను కాదనుకుని న్యాయవ్యవస్థ వైపు వచ్చే వారిలో చాలామంది సమాజానికి ఏదో చేద్దామన్న సంకల్పంతో వస్తారు. అలాంటి వారికి సమస్యలుండటం దురదృష్టకరం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ఆ మహిళా జడ్జి లేఖపై వెనువెంటనే స్పందించటం, అలహాబాద్ హైకోర్టు నుంచి నివేదిక కోరటం హర్షించదగ్గ అంశం. గతంలో మాదిరి కాక దోషులపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తే తప్ప ఈ కీచకపర్వం ఆగదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.చవితి రా.11.01 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ఉ.9.31 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ప.1.18 నుండి 2.46 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.26 నుండి 7.53 వరకు, **అమృతఘడియలు:** రా.10.21 నుండి 11.52 వరకు

సూర్యోదయం : 6.26
సూర్యాస్తమయం: 5.24
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

అవసరమైన సామాజిక కూర్పు

ఇటీవలి ఎన్నికలలో బీజేపీ ఘన విజయం సాధించిన మూడు రాష్ట్రాలకు కొత్త ముఖ్యమంత్రులే వచ్చారు. ఇదొక కొత్త రాజకీయ సంప్రదాయం కాబట్టి చర్చ కూడా పెద్ద ఎత్తునే జరుగుతోంది. అది రాజకీయ పార్టీలు మంచి చేసినప్పుడు జరగవలసిన చర్చేనా? ఇది ప్రశ్నార్థకమే. ప్రజాస్వామ్యాన్ని గౌరవించడం అంటే, అది ఏ పార్టీ మనస్ఫూర్తిగా, నిజాయితీగా చేసినా స్వాగతించాలి. ఏపీ ముఖ్యమంత్రి జగన్ కూడా ఈ విషయంలో పట్టింపుగా ఉన్నారు. ఈ ప్రస్తావన ఎందుకంటే, సోషల్ ఇంజినీరింగ్ కోసం ఏ పార్టీ అయినా ప్రయత్నిస్తుంటే ఆ విషయం చెప్పడానికి సందేహించనక్కర లేదు. మనం ఒక పార్టీని అభిమానించడం, ఆ పార్టీ చేపట్టే సోషల్ ఇంజినీరింగ్‌ను సానుకూలంగా గమనించడం, ఈ రెండూ అవసరమే.

సందర్భం



పి. వేణుగోపాల్ రెడ్డి

ఇటీవల గెలిచిన మూడు రాష్ట్రాల్లోనూ మాజీలను కాదని, కొత్తవారిని ముఖ్యమంత్రి స్థానాల్లో కూర్చోబెట్టింది బీజేపీ. మధ్యప్రదేశ్‌లో శివరాజ్‌సింగ్ చౌహాన్ స్థానంలో మోహన్ యాదవ్‌కూ, రాజస్థాన్‌లో వసుంధరా రాజేను కాదని మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టిన భజన్‌లాల్ శర్మకూ, ఛత్తీస్‌గఢ్‌లో మాజీ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌కు స్పీకర్ స్థానం ఇచ్చి విష్ణుదేవ్ సాయ్‌కీ బీజేపీ అధిష్ఠానం ముఖ్యమంత్రి స్థానాలను అప్పగించింది. ఇలాంటి నిర్ణయం రాజకీయాలకు కొత్త. ఒకే దెబ్బతో నిర్ణయించడం కూడా కొత్తే.

2018 ఎన్నికల తరువాత రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. కానీ గతంలో ముఖ్యమంత్రులుగా చేసినవారినే తిరిగి ప్రతిష్ఠించారు. అది సర్వసాధారణ సంప్రదాయమనే అంతా సర్దుకుపోయారు. ఆ మూస ధోరణితో ఇద్దరు యువనేతలకు అవకాశం లేకుండా పోయిందన్న వాస్తవం మరుగున పడింది. కొత్తవారికి అవకాశాల సంగతి ఆ పార్టీలో ప్రశ్నార్థకమైందన్న వాదన కూడా వీగిపోయింది. కానీ ఇప్పుడు ఓడిపోతుందని అంతా అనుకున్న మధ్యప్రదేశ్‌లో ఘన విజయం సాధించి పెట్టిన శివరాజ్ సింగ్ చౌహాన్‌ను వదిలిపెట్టి వేరొకరికి బీజేపీ అధికారం కట్టబెట్టడం అనూహ్యంగానే కనిపిస్తుంది. వసుంధరా రాజే వంటి దిగ్గజాన్ని ముఖ్యమంత్రి పదవికి దూరంగా ఉంచగలగడం కూడా అలాంటిదే. భజన్‌లాల్ శర్మకు ముఖ్యమంత్రిగా అవకాశం రావడం మరీ ఊహకు అందనిదే.

ఈ ముగ్గురికీ ప్రత్యేకతలు ఉన్నాయి. బీజేపీతో, లేదా మాతృసంస్థ ఆర్ఎస్ఎస్‌తో వీరికి విశేషమైన సాన్నిహిత్యం ఉంది. ఎవరూ ఇతర పార్టీల నుంచి దిగుమతి అయినవారు కాదు. అయోధ్య ఉద్యమంతో మమేకమైనవారు భజన్‌లాల్ శర్మ. ఇవన్నీ సాధారణ ప్రజానీకం దృష్టిలో పడని అభ్యర్థుల అర్హతలే అవుతాయి. వీరి పాలనానుభవం, ప్రజాహిత కార్యక్రమాలు, ప్రజల మధ్యన ఉండే తత్త్వం ఇవన్నీ పార్టీ పరిగణనలోకి తీసుకునే అంశాలు అవుతాయి. ఒక నాయకుడిని మూడు లేదా నాలుగు పర్యాయాలు పదవిలో కొనసాగించడం వల్ల, తద్వారా ఎదురయ్యే ప్రభుత్వ వ్యతిరేకత పార్టీ భవిష్యత్తుకు సంబంధించినది. కొత్త నాయకత్వాన్ని నిర్మించే ప్రక్రియ కూడా పార్టీ తాజా నిర్ణయంలో కనిపిస్తోంది. మొత్తంగా పార్టీ ప్రయోజనాల రక్షణ, అభ్యర్థి సామర్థ్యం, గుణగణాలు ఇవన్నీ పార్టీ మనుగడకు పరోక్షంగా దోహదం చేస్తాయి.

దీనితో పాటే పట్టించుకోవలసిన మరొక లోతైన అంశం, పార్టీ అనుసరించిన సోషల్ ఇంజినీరింగ్. దురదృష్టవశాత్తు బీజేపీ అమలు చేయదలిచిన సోషల్ ఇంజినీరింగ్‌కు మీడియా చర్చలు, పత్రికల కాలమ్‌లు తగిన స్థానం ఇస్తున్నాయా? ఇవ్వడం లేదన్నదే సమాధానం. సమాజంలోని అన్ని వర్గాలకు సామాజిక, రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి. స్త్రీపురుష సమానత్వం కూడా అందులో భాగం. వీటిని



ఇప్పటికైనా పార్టీలో, ప్రభుత్వంలో ప్రవేశపెట్టే ప్రయత్నం చేస్తున్నందుకు బీజేపీని మనసారా అభినందించవలసి ఉంటుంది. ఒక్క మహిళకు కూడా స్థానం కల్పించకుండా ఏళ్ల తరబడి ప్రభుత్వం నడిపిన ముఖ్యమంత్రులు మన కళ్లెదుటే ఉన్నారు. కొన్ని వర్గాలవారు అసలు శాసనసభ ముఖం చూడలేదన్నది ఒక చేదునిజం. వీటిని అధిగమించి తీరాలి. లేకుంటే ప్రజాస్వామ్యానికి అర్థం లేదు. అదే సమయంలో అప్పటిదాకా రాజకీయాలలో, పాలనలో తగినన్ని అవకాశాలను పొందిన వారికీ, ఇప్పుడు పొందవలసి ఉన్నవారికీ మధ్య సమతూకం పాటిస్తేనే ఏ పార్టీ అయినా మనుగడ సాగించగలుగుతుందన్నది ఒక వాస్తవం. మొత్తం వ్యవస్థను పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ద్వారా, ఓటు ద్వారా మార్చదలిచిన ఏ పార్టీ అయినా ఈ సూత్రానికి దగ్గరగా పనిచేస్తుంది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు కొత్త ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల ఎంపికలో బీజేపీ చేసిన కసరత్తు ఇందుకు సంబంధించినదే!

అయితే, ఏ అడుగు వేసినా అందులో ఎన్నికల కోణాన్ని మాత్రమే చూడడం ఇటీవలి చర్చలు, విశ్లేషణలలో కనిపించే ఒక అవాంఛనీయ పరిణామం. ఇప్పుడు బీజేపీ ఎంపికను కూడా విశ్లేషకులు మూస ధోరణిలో ఎన్నికల వ్యూహాన్నే చూస్తున్నారు. మీడియా ఏం చర్చించాలో పాఠాలు చెప్పడం ఇక్కడ ఉద్దేశం కాదు. అయితే అభ్యర్థుల ఎంపిక గురించి పార్టీలు తీసుకున్న నిర్ణయాలు, ఎంపికలు తమ ఊహాగానాలకు, సర్వేలకు అనుకూలంగా లేవేమిటని వారు ఆశ్చర్యపోవడం కూడా వింతే అనిపిస్తుంది. తాము ఎంతో ఖర్చు చేసి చేయించిన సర్వేల కంటే బీజేపీకి ఎక్కువ స్థానాలు రావడమేమిటన్న ఒక అసంబద్ధ వైఖరి కూడా కొందరు మీడియా వారు పరోక్షంగా అయినా వ్యక్తం చేయడం నిజం. ఇలాంటివారు మొదట చేయవలసిన పని ఆ తీర్పు ప్రజలు ఇచ్చినదని గౌరవించడం.

అలాగే ఊహాగానాలకు అతీతంగా ముఖ్యమంత్రి అభ్యర్థుల పేర్లు వచ్చినా బుగ్గలు నొక్కుకోవడం ఎందుకు? పార్టీ కొత్తవారికి అవకాశం ఇవ్వదలిచింది. గతం కంటే మెరుగ్గా సోషల్ ఇంజినీరింగ్‌కు స్థానం కల్పించాలని అనుకున్నది. దాని ఫలితమే ఇలాంటి ఎంపిక. తెలంగాణలో బీసీ వర్గానికి చెందిన వారికి ముఖ్యమంత్రి పదవి ఇస్తానని చెప్పిన తరువాత ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఎంపిక జరిగింది. అందులో తెలంగాణకు ఇచ్చిన హామీ జాడలు కనిపిస్తున్నాయి కూడా. దీనిని గుర్తించడం అవసరం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యాభయ్ శాతం ఉన్న ఓబీసీలకు ఆ అవకాశం దాదాపు రాలేదు. దానిని గుర్తించి, ఆ తప్పిదాన్ని సవరించే ప్రయత్నం బీజేపీ చేసింది. ఈ అంశం గురించి సరైన దారిలో చర్చ జరిపితే అది అన్ని పార్టీలకు ఉపయోగపడుతుంది. బీజేపీ చేసింది కాబట్టి మేము అనుసరించబోమని మిగిలిన పార్టీలు అంటే అది వేరే విషయం. అలాంటి అభిప్రాయానికి మీడియా కూడా రాకూడదన్నదే ఇక్కడ చెప్పదలుచుకున్నది. ఎప్పుడు ఎన్నికలు జరిగి ఫలితాలు వెలువడుతున్నా విశ్లేషణలు వస్తున్నాయి. ఏ సంవత్సరం ఎన్ని ఓట్లు వచ్చాయి, శాతం, ప్రాంతాలవారీగా అభ్యర్థులు, గెలుపోటములు విశ్లేషిస్తున్నారు. ఇవన్నీ స్వాగతించవలసినవే. వాటితో పాటు సోషల్ ఇంజినీరింగ్ విషయంలో పార్టీలలో వస్తున్న పురోగతి గురించి, అలాంటి ఆహ్వానించదగిన పరిణామం గురించి పార్టీలు పెడుతున్న శ్రద్ధలో వచ్చిన గ్రాఫ్ గురించి కూడా చర్చ జరిగితే రాజకీయాల గతినైనా మార్చవచ్చు.

మిగిలిన విషయాలు ఎలా ఉన్నా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ ఈ విషయంలో ముమ్మాటికి పట్టింపుగా ఉన్నారు. సోషల్ ఇంజినీరింగ్‌కు, స్త్రీపురుష సమానత్వానికి ఆయన తగిన ప్రాధాన్యం కల్పిస్తున్నారు. ఈ ప్రస్తావన ఎందుకు అంటే, సోషల్ ఇంజినీరింగ్‌ను పాటించడానికి ఏ పార్టీ అయినా ప్రయత్నం చేస్తుంటే ఆ విషయం చెప్పడానికి సందేహించనక్కర లేదు. మనం ఒక పార్టీని అభిమానించడం, ఆ పార్టీ చేపట్టే సోషల్ ఇంజినీరింగ్‌ను సానుకూలంగా గమనించడం, ఈ రెండూ అవసరమే. ప్రజాస్వామ్యాన్ని గౌరవించడం అంటే, అది ఏ పార్టీ మనస్ఫూర్తిగా, నిజాయితీగా చేసినా స్వాగతించాలి. అదే బాధ్యతాయుతమైన పౌరుల లక్షణం కూడా. అనేక కారణాలతో, వందల సంవత్సరాల విదేశీ పాలన ఫలితంగా ఇక్కడ అలాంటి సమతూకం, క్రమం దెబ్బతిన్నాయి. దానిని సరిదిద్దే బాధ్యతను అన్ని రాజకీయ పార్టీలు స్వీకరించాలి. బడుగు బలహీన వర్గాల గురించి, మైనారిటీల గురించి ఇంతగా మాట్లాడే వామపక్ష, ఉదారవాద పార్టీలు కూడా ఆ విషయంలో పెద్దగా సాధించినది ఏమీలేదు. అంతమాత్రాన బీజేపీ ఆ ప్రయత్నంలో ఉంటే అందులో రాజకీయాలు, ఎన్నికల వ్యూహాలు చూడడం మంచిది కాదు. అందుకు సంబంధించిన కీర్తి బీజేపీదే అయితే దానికే దక్కనివ్వాలి!

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ ఛైర్మన్
ఈ–మెయిల్: pvg@ekalavya.net

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పిలిచారా?



మీరు పాశ్చాత్య దేశాలనూ, వారి సంస్కృతినీ, వారి విలువలనూ ద్వేషిస్తున్నట్టయితే – అసలు ఆ దేశాలకు మిమ్మల్ని ఎవరు వెళ్లమన్నారు?

– లుయీ అహ్మద్, యాక్టివిస్ట్

అనారోగ్య చరిత్ర



స్థూలకాయం అనేది 1970లకు ముందు అసాధారణ విషయం. కానీ తర్వాత మన పోషణ మారింది. ఆరోగ్యకర కొవ్వుల స్థానంలోకి గింజ నూనెలు, రిఫైన్డ్ పిండిపదార్థాలు, చక్కెర వచ్చాయి. ఇప్పుడు స్థూలకాయం, మధుమేహం అనేవి నమోదైన చరిత్రలో ఏ కాలానికైనా అత్యధికం.

– రాబర్ట్ లుస్టిగ్, మెడికల్ స్కూల్ ప్రొఫెసర్

ఇవీ వండుతాం!



బెంగాలీ వంటకాలంటే కేవలం చేపలు, చికెన్, మటన్ మాత్రమే కాదు. బెంగాలీ జనం కూరగాయలతో కూడా నోరూరించే వంటలు వండుతారు. శుక్తో, ఆలూ పోస్తో, దోయి పొతోల్, బసంతీ పులావ్, ధోకర్ దాల్నా, భోగ్ ఖిచూరీ, లాబ్రా, రధా బల్లావీ, ఆలూర్ చోప్, చోర్‌చోరీ అందులో కొన్ని.

– ఇంద్రాణి, వ్యాఖ్యాత

ఒక వాస్తవం



అన్ని కులాలకు చెందిన హిందూ వితంతువులు తిరిగి పెళ్లి చేసుకోవచ్చునని మౌర్య యుగపు కౌటిల్యుడి అర్థశాస్త్రం చెబుతోంది. ఒకవేళ మామ అంగీకరించిన మనిషిని పెళ్లి చేసుకుంటే... భర్తగానీ, మామగానీ ఇచ్చిన ఆస్తిని ఆమె తనతో ఉంచుకోవచ్చునని కూడా అంటోంది. లేదంటే, ఆస్తి జప్తు అవుతుంది. పెళ్లి మాత్రం చేసుకోవచ్చు.

– సావిత్రి ముముక్షు, పరిశోధకురాలు

ఒక గౌరవం



యాభై ఏళ్ల క్రితం నేను పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి (ఫిజిక్స్‌లో ఎంఎస్సీ ఆనర్స్) పట్టభద్రురాలినయ్యాను. వృత్తిలో రాణించినందుకుగానూ 2023 ‘ఇలస్ట్రియస్ అలుమ్నై అవార్డ్’కు నన్ను డిపార్ట్‌మెంట్ ఎంపిక చేసిందన్న ప్రకటనను అణకువతో స్వీకరించాను. నా మాతృసంస్థకూ, పంజాబ్‌కూ ధన్యవాదాలు.

– వందనా శివ, పర్యావరణవేత్త

ఎందుకు వదిలేశారు?



స్టాలిన్ 1939లో పోలండ్ మీద కూడా దాడి చేశాడన్న విషయాన్ని ‘నెట్‌ఫ్లిక్స్’ కొత్త డాక్యుమెంటరీ సిరీస్ ‘వరల్డ్ వార్ 2: ఫ్రమ్ ద ఫ్రంట్‌లైన్స్’ విడిచిపెట్టింది. కేవలం జర్మనీ దాడిని మాత్రమే ప్రస్తావించారు. గొప్ప సూక్ష్మాంశాలు ఇవ్వక్కర్లేదు; కానీ ఎన్నో యుద్ధ, యుద్ధానంతర అంశాలకు అది ముఖ్యమైన భాగం కదా!

– గారీ కాస్పరోవ్, చెస్ దిగ్గజం, యాక్టివిస్ట్

ఒక సందేహం



పని ప్రదేశాల్లో సమానత్వాన్ని కోరుతూనే, రుతుస్రావాన్ని ఒక వైకల్యంగా పరిగణించి తప్పనిసరి పెయిడ్ లీవ్ ఇవ్వాలంటున్న మహిళల పట్ల నేను గర్వపడతాను. కానీ మీ ఇంట్లో పనిచేసే మహిళకు కూడా రుతుస్రావం ఉంటుంది; ఆమెకు కూడా మీరు పెయిడ్ లీవ్ ఇస్తున్నారా?

– రూపా మూర్తి
సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

పెట్టుబడి మర్మం తెలిపే గ్రంథం

పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా దేశాన్ని అభివృద్ధి చేయవచ్చని ప్రభుత్వాలు భావిస్తూ ఉన్నాయి. కానీ ఈ పెట్టుబడులు కొంతమందికి వందల కోట్ల రూపాయల లాభం చేకూరుస్తాయేమోగానీ మూడొంతుల ముప్పాతిక మంది జనానికి నయాకాణీ ఆస్తిని సమకూర్చలేవు. పెట్టుబడులు బాగా ఉన్న ఏ దేశంలో చూసినా ఇంకా దరిద్రం కొనసాగుతూనే ఉంది. నిరుద్యోగం, నిరాశ్రయత, ఆకలిదప్పులూ, అలమటింపులూ, విద్య వైద్య సేవల అలభ్యతలూ కొనసాగుతూనే ఉన్నాయి. కాబట్టి పెట్టుబడుల రాకడతోనో, పోగుపడటం మూలంగానో భూతలస్వర్గం ఏర్పడబోదు అని స్పష్టం అవుతోంది. మహా అయితే కొంతమందికి కూలి, ఇంకొంత మందికి జీతం, మరికొంత మందికి ఇయర్లీ ప్యాకేజీ గిట్టుబాటు అవుతాయి. అంతే!



పెట్టుబడుల లోగుట్టు తెలవాలంటే ‘కమ్యూనిస్ట్ మానిఫెస్టో’ (కమ్యూనిస్టు ప్రణాళిక)ను చదవాలి. దీనిని తొలిగా దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 1930వ దశాబ్దంలో తెలుగు చేసి వెలువరించారు. ఆ తర్వాత కంభంపాటి సత్యనారాయణ (సీనియర్), రాచమల్లు రామచంద్రా రెడ్డి, గిడుతూరి సూర్యం, ఇంగువ మల్లికార్జునశర్మ, ‘పీకాక్ క్లాసిక్స్’ ఏ. గాంధీ తెలుగులోకి అనువదించి వెలువరించారు. గతేడాది కమ్యూనిస్టు ప్రణాళిక 150వ జయంతి సందర్భంగా, దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో కమ్యూనిస్టు ప్రణాళికను స్థానిక భాష లలో లక్షల ప్రతులు ముద్రించి పంపిణీ చేశారు. అయినప్పటికీ కమ్యూనిస్టు ప్రణాళి కను మరింత సరళంగా తెలుగులో తీసుకురావాలని మేం భావించాం. మార్క్స్ రచనా శైలి కవితాత్మకంగా ఉంటే, ఏంగెల్స్ రచనా శైలి మర ఫిరంగి పక్కన నిలబడ్డ ఒక పెద్దమనిషి రెండు చేతుల్తో బాంబులు విసురుతున్నట్లుగా ఉంటుందని ప్రముఖ ఆర్టిస్ట్ తాడి మోహన్ అంటారు.

సమాజం నిత్య చలనశీలమైనదన్న వాస్తవాన్ని అందరూ అంగీకరిస్తారు. సమాజంలో వచ్చే మార్పులకు అనుగుణంగా భాష, సంస్కృతి, ప్రజల ఆహార్యం, ఆహార అలవాట్లు... ఇలా మానవజీవిత సకల పార్శ్వాలూ మార్పులకు లోనవుతుంటాయి. ఇందుకు మన తెలుగు భాష అతీతం కాదు. 50వ దశకంలో తెలుగు భాష, 80వ దశకానికి వచ్చేసరికి చదువరుల సౌలభ్యం కోసం మార్పులకు లోనయింది. 2000వ ఏడాది నుండి విద్య కార్పొరేటీకరణకు లోనయి, ప్రైవేటు విద్యారంగంలో తెలుగు మాధ్యమం లేకుండా పోవడం, మార్కుల కోసం సంస్కృతాన్ని ద్వితీయ భాషగా ఎంపిక చేసుకునే దుఃస్థితి కల్పించటంతో ఆ తరం చదువరులకు భాష మరింత సరళం అవ్వాల్సిన అవసరం ఏర్పడింది. గతంలో కమ్యూనిస్టు మానిఫెస్టోకు వచ్చిన అనువాదాలు కాలప్రామాణికత రీత్యాగానీ, సారం రీత్యాగానీ గొప్పవే. యువతరం చదువరుల కోసం సారం రీత్యాగానీ, భాషా సరళత రీత్యాగానీ మరో అనువాదం అవసరం అనిపించింది. మా అభ్యర్థన మేరకు రచయిత్రి ఉమా నూతక్కి అనువదించిన కమ్యూనిస్టు ప్రణాళిక ఆవిష్కరణ సభ డిసెంబర్ 17, సాయంత్రం 6 గంటలకు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. మాజీ శాసన సభ్యులు పాటూరు రామయ్య, గుమ్మడి నరసయ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు.

– విశ్వేశ్వరరావు, పబ్లిషర్ । 94906 34849

(రేపు ‘కమ్యూనిస్ట్ ప్రణాళిక’ నూతన అనువాదం ఆవిష్కరణ)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఆ కెనాల్ కోసమే ఉత్తర గాజాపై దాడి

అభిప్రాయం



బుడ్డిగ జమిందార్

గాజాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపమని ప్రపంచవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నా అమెరికా అండతో ఇజ్రాయెల్ బేఖాతరు చేస్తోంది. లక్షలాది ప్రజానీకాన్ని గాజాలో ఉత్తర ప్రాంతం నుండి దక్షిణాదికి తరుముతూ ఇప్పటి వరకూ 20 వేల మందిని చంపింది. యుద్ధానికి ప్రధాన రహస్య ఎజెండా ‘బెన్ గురియన్ కెనాల్ ప్రాజెక్ట్’ను నిర్మించటమే అనే అనుమానం నిజమౌతోంది. ‘సూయజ్ కెనాల్’ చుట్టూ ఉన్న క్లిష్టమైన భౌగోళిక రాజకీయ వ్యూహాలను విశ్లేషిస్తే కానీ అసలు విషయం అర్థం కాదు.

1948 ఊచకోత (నక్బా) సమయంలో ప్రథమ ప్రధానమంత్రిగా బెన్-గురియన్, లక్షమంది పాలస్తీనియన్లను చంపించి, 7 లక్షల పాలస్తీనియన్ అరబ్బులను బలవంతంగా దేశం నుండి బహిష్కరించి ఇజ్రాయెల్ రాష్ట్ర స్థాపన చేశాడు. పాలస్తీనాలో యూదులకూ, అరబ్బులకూ సమాన రాజకీయ హక్కులను కల్పించే ప్రజాస్వామ్య గణతంత్ర స్థాపనను వ్యతిరేకించాడు. అన్ని యూదు మిలిటరీ సమూహాలను ఒక కేంద్ర సంస్థగా ఏకం చేస్తూ ఇజ్రాయెల్ రక్షణ దళాలను స్థాపించాడు. 1956లో గాజా, సినాయ్‌పై దాడికి ఆదేశించాడు. ఈజిప్టు నియంత్రణ నుండి సూయజ్ కాలువను స్వాధీనం చేసుకునేందుకు ఫ్రాన్స్, బ్రిటన్‌లు చేసిన ప్రయత్నంలో భాగస్వామిగా మారాడు. అందుకే బెన్ గురియన్ జియోనిస్ట్ ప్రభుత్వం అరబ్బులను మాతృభూమి నుంచి తరిమివేసినా పశ్చిమ దేశాల నుంచి వ్యతిరేకతను ఎదుర్కోలేదు.

1963లో ‘బెన్ గురియన్ కెనాల్ ప్రాజెక్ట్’ సముద్ర రవాణా మౌలిక సదుపాయాల చొరవగా భావించబడింది. ఈ ప్రాజెక్టుకు దేశ వ్యవస్థాపకుడు అయిన ‘డేవిడ్ బెన్-గురియన్’గా నామకరణం జరిగింది. ప్రతిపాదిత బెన్ గురియన్ కాలువ తూర్పు మధ్యధరా తీరం వరకు విస్తరించి, గాజా ఉత్తర సరిహద్దు దగ్గర మధ్యధరా సముద్రంలో కలుస్తుంది. కనుకనే గాజాలోని ఉత్తర ప్రాంత పాలస్తీనియన్లను ఏరివేసే పనిచేపట్టింది ఇజ్రాయెల్. యూరప్-ఆసియా మార్గంలో ఈజిప్ట్‌ను సవాలు చేస్తూ ప్రపంచ సముద్ర మార్గాలను పునర్నిర్మించటానికి ఈ నూతన కాలువను ‘గల్ఫ్ ఆఫ్ అకాబా’ (ఎర్ర సముద్రం యొక్క తూర్పు భాగం) నుండి ప్రారంభించి ‘నెగెవ్ ఎడారి’ (ఇజ్రాయెల్) ద్వారా నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. గల్ఫ్ ఆఫ్ అకాబా నాలుగు దేశాలు (ఈజిప్ట్, ఇజ్రాయెల్, జోర్డాన్, సౌదీ అరేబియా) పంచుకున్న తీర



రేఖను కలిగి ఉంది. ఈ ప్రతిపాదిత కాలువ నిర్మాణంతో ఒనగూరే ఆర్థిక అవకాశాల కోసం ఇజ్రాయెల్ ప్రస్తుతం పాలస్తీనాపై యుద్ధం చేస్తుందనిపిస్తోంది. సూయజ్ కెనాల్‌కు ప్రత్యామ్నాయాన్ని రూపొందించడానికి అమెరికా సరఫరా చేసే 520 అణుబాంబులను ఉపయోగించాలనే ప్రతిపాదనను ఇజ్రాయెల్ 1963లో పరిగణనలోకి తీసుకున్నది. ఒక డీ క్లాసిఫైడ్ మెమోరాండం ప్రకారం... ఇజ్రాయెల్ నెగెవ్ ఎడారి గుండా సముద్ర మట్ట కాలువకు 160 మైళ్ల కంటే ఎక్కువ త్రవ్వకాలు జరిపి ఉండేదని చరిత్రకారుడు అలెక్స్ వెల్లర్ స్టెయిన్ అంటున్నాడు. ప్రతి మైలుకు నాలుగు 2-మెగా టన్నుల పరికరాలు అవసరమని మెమోరాండం అంచనా వేసింది. ‘‘దీనిని వెల్లర్‌స్టెయిన్ ‘520 న్యూక్స్’ అని వ్యవహరిస్తా’’రని అలెక్స్ వెల్లర్ స్టెయిన్ ట్వీట్ చేశాడు. ఈ ప్రణాళికను ‘సూయజ్ కెనాల్‌కు ప్రత్యమ్నాయ ప్రతిపాదన’గా పేర్కొన్నాడు.

సూయజ్ కెనాల్ 1869లో ప్రారంభించబడిన మానవ నిర్మిత జలమార్గం. ఇది ఈజిప్ట్‌లోని సూయజ్ యొక్క ఇస్త్మస్ మీదుగా ఉత్తరం నుండి దక్షిణం వైపు ప్రవహిస్తూ, మధ్యధరా సముద్రాన్ని ఎర్ర సముద్రంతో కలుపుతోంది. యూరప్ ఆసియా మధ్య నౌకాయాన దూరాన్ని గణనీయంగా తగ్గిస్తోంది. ఆఫ్రికా ఖండాన్ని ఆసియా నుండి వేరు చేసే ఈ కాలువ 150 సంవత్సరాల క్రితం తవ్వినది. కాలువ ప్రారంభంలో బ్రిటిష్, ఫ్రెంచ్ ప్రయోజనాలకు ఉపయోగపడేది. అయితే ఈజిప్ట్ 1956లో దీన్ని జాతీయం చేసింది. దీంతో ఈ కాలువపై ఈజిప్టు ఆధిపత్యం ఏర్పడింది. ప్రస్తుతం ఈజిప్టు జీడీపీలో దాదాపు 2 శాతం వాటా ఈ కాలువ ద్వారా సరుకు రవాణా చేసే నౌకలపై విధించిన టోల్ రుసుము ద్వారానే లభిస్తోంది. ప్రపంచ వాణిజ్యంలో దాదాపు 12 శాతం సూయజ్ కెనాల్ గుండా సాగుతోంది.

ఈ పరిస్థితుల్లో బెన్-గురియన్ కాలువ నిర్మాణం జరిగితే ప్రపంచ వాణిజ్య, భౌగోళిక రాజకీయాలపై గణనీయమైన ప్రభావం పడుతుంది. యూరప్- ఆసియా మధ్య కొత్త నౌకా రవాణా మార్గాన్ని సృష్టించి ప్రపంచ నౌకా రవాణాపై ఇజ్రాయెల్ ఆధిపత్యం చెలాయించాలనే తపనతో ఉత్తర గాజా ప్రాంతవాసుల్ని దక్షిణం వైపునకుగానీ, వేరే దేశాలకుగానీ శరణార్థులుగా పొమ్మంటున్నదనే ఆలోచనలు బలపడుతున్నాయి.

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్,
కె.ఎల్. యూనివర్సిటీ

లైఫ్@360

పేరెంటింగ్

బాధ్యతతో పెంచుతున్నారా?



పంచుకోవడం అన్నది పిల్లలకి తప్పనిసరిగా నేర్పాల్సిన వాటిలో ఒకటి. దానివల్ల ఇతరులతో స్నేహ బాంధవ్యాలు పెరుగుతాయి. ఒకరి అవసరం మరొకరికి తెలుస్తుంది. కొంతమంది పిల్లలు స్కూలు నుండి రాగానే, పుస్తకాల సంచీ అక్కడే ఏ సోఫాలోనో పారేసి, విడిచిన బట్టలని, చెప్పులని ఒకపక్కకి వదిలేస్తారు. అటువంటప్పుడు వారికి ఆ వస్తువుల విలువ, అవసరం తెలియజేస్తూ, క్రమపద్ధతిలో భద్రపరచుకునేట్లు వారికి అలవాటు చేయాలి. అంతేకాదు, వారు అడిగినవన్నీ వెంటనే తెచ్చి ఇవ్వకుండా మంచి మాటలతో బుజ్జగించి దారికి తేవాలి.

ఎదిరించి మాట్లాడుతుంటే...

పెద్దవాళ్ళని ఎదిరించి మాట్లాడే పిల్లలని చూస్తుంటాం. మొదట తల్లిదండ్రులు తమ పెద్దలని గౌరవిస్తే, అదే బాటలో పిల్లలూ నడుచుకుంటారు. గురువులు, పెద్దలు, వృద్ధులను తల్లిదండ్రులు గౌరవిస్తే పిల్లలు అదే అలవాటు చేసుకుంటారు.

> చాలామంది తల్లిదండ్రులు తాము పడ్డ కష్టాలను తమ పిల్లలు అనుభవించకూడదనే ఉద్దేశ్యంతో వారిని అతి గారం చేస్తుంటారు. తమకు ఉన్నా లేకున్నా, వారికి కావలసిన అన్ని వసతులూ, సౌకర్యాలూ సమకూర్చుతూ, వారికి కష్టం అనేది తెలియకుండా పెంచుతుంటారు. అయితే అది చాలా తప్పు. వారికి బాల్యం నుంచి బాధ్యతలు తెలియజేయాలి. అలాగని వారి నెత్తిమీద బాధ్యతల బరువు వెయ్యడం కాదు... వారి బాధ్యత వారికి తెలిసేలా చేయడమే బాధ్యతతో కూడిన పెంపకం.

షాపింగ్

షాపింగ్‌కి వెళ్ళినపుడు, పిల్లలని తమతో తీసుకెళుతుంటారు. అక్కడ వారికి సెల్‌ఫోన్ చేతికిచ్చి ఒకచోట కూర్చోబెట్టి తాము షాపింగ్ చేసుకుంటారు. అలా కాక తమ పిల్లలని కూడా తమతో ఉంచుకుంటే ఒక వస్తువు కొనేటప్పుడు తమ తల్లిదండ్రులు ఆ వస్తువు నాణ్యతని ఎలా పరీక్షిస్తున్నారో, ఎలా ఎంచుకుంటున్నారో అన్న విషయాలు తెలుసుకోవటంతో పాటు అక్కడ ఏమేమి రకాలు ఉన్నాయి, తమకు ఏమి కావాలి, ఏవి ఉపయోగం అన్నది గ్రహించుకోగల్గుతారు.

కలిసి భోజనం చేయడం

వారానికి ఒక్కరోజు అయినా అందరూ కలిసి భోజనం చేయాలి. అలా చేయటం వల్ల బయటకు వెళ్ళి, ఇతరులతో కలిసి భోజనం చేయాల్సొచ్చినప్పుడు, తల్లిదండ్రులు పిల్లలకు తినిపించాల్సిన అవసరం ఉండదు.

మంచి మాటలతో

సహజంగా పిల్లలు అల్లరి బాగా చేస్తుంటారు. ఆ అల్లరి మోతాదు మించిపోతుంటుంది. వస్తువులు పాడవటం, విరగటం, పగిలి పోవటం కూడా జరుగుతుంటుంది. ఆ సమయంలో ఎంత కోపం వచ్చినా, ఆ పాడయిన వస్తువు గురించే మాట్లాడాలి కాని పిల్లవాడి మనస్తత్వం గురించి మాట్లాడకూడదు. ఆ వస్తువు భద్రత గురించి చెప్పాలి. మరొకసారి ఆ తప్పు చేయకుండా ఉండేలా చేయాలి.

పాకెట్ మనీ

సాధారణంగా పిల్లలు కొంచెం ఎదిగాక, వారికి వారి ఖర్చుల నిమిత్తం కొంత సొమ్ము ఇస్తుంటారు. వారు ఎలా ఖర్చు పెట్టుకున్నా పట్టించుకోరు. ఇది సరి కాదు. వారు ఆ డబ్బును ఎందుకు... ఎలా ఖర్చు చేస్తున్నారో పద్దు రాయమనాలి. వాటిని చెక్ చేసి, అందులో అనవసర ఖర్చులుంటే వాటిని ఎత్తి చూపాలి. దీనివల్ల పిల్లలకి మనీ మేనేజ్‌మెంట్ అలవడుతుంది.

టైమ్ మేనేజ్‌మెంట్

ఉదయం లేచే సమయం, భోజన సమయం, చదువుకునే సమయం, ఆటలాడే సమయం, పడుకునే సమయం.. ఇలా అన్నింటికీ ఒక టైం టేబుల్ తయారు చేయాలి. ఇది ఎంతో అవసరం.

చదువు

చదువు అని పోరాటం కాదు, ఎలా చదువుకోవాలో, చదువు ప్రాముఖ్యత ఏమిటో తెలియపరిస్తే వారు చదువుని కష్టపడి కాకుండా, ఇష్టపడి చదువతారు.

థాంక్స్.. సారీ..!

ఎదుటి వారికి ఇబ్బంది కలిగించినపుడు సారీ చెప్పటం, ఎవరి దగ్గరైనా ఏ వస్తువునైనా, లేదా సహాయాన్నైనా పొందితే కృతజ్ఞత చెప్పటం అలవరచాలి.

బాల్యం నుంచే పెద్దలను, తల్లిదండ్రులను గౌరవించడం, ఇరుగు పొరుగుతో, తోటివారితో మర్యాదగా మెలగడం, ఉన్నదానిని కలిసి పంచుకోవడం వంటి వాటిని నేర్పిస్తూ, మంచి పౌరులుగా తీర్చిదిద్దాలి.

కీళ్ళ నొప్పులా..? ఇలా చేసి చూడండి...

> చలి కాలం వచ్చిందంటే చాలు కీళ్ల నొప్పులు,ఒంటి నొప్పులతో బాధ పడే వారి సంఖ్య బాగా పెరుగుతుంది. చాలా మందికి చలికాలంలో కీళ్ల నొప్పులతో లేచి నడవలేని పరిస్థితి కూడా ఉంటుంది. ఇక ఉదయం పూట పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంటుంది. కీళ్లు గట్టి పడిపోవడం, జాయింట్లు సహకరించకపోవడంతో చాలామంది ఇబ్బందులు పడుతూ ఉంటారు. అలాంటి వారు చలికాలంలో కీళ్ల నొప్పుల నుండి, ఒంటి నొప్పుల నుండి ఉపశమనం పొందడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు.



చలికాలంలో వాతావరణంలోని చల్లదనానికి కీళ్లమధ్యలో ఉండే మృదువైన కార్టిలేజ్ కుచించుకుపోతుంది. చర్మం, కండరాలు బిగుసుకుపోతాయి. అందుకే చాలా మందికి చలి కాలంలో కీళ్ల సమస్యలు వస్తుంటాయి. ముఖ్యంగా ఆడవాళ్లలో రక్తహీనత కారణంగా కీళ్ల నొప్పులు ఎక్కువగా వస్తుంటాయి. అందుకే ఈ సీజన్‌లో శరీరాన్ని వీలైనంత వెచ్చగా ఉంచుకోవడానికి ప్రయత్నం చేయాలి. కీళ్ల నొప్పులను తేలిగ్గా తీసుకోకూడదు. చలికాలంలో వచ్చే సాధారణ కీళ్ల నొప్పులను తగ్గించడానికి తేలికపాటి వ్యాయామాలు చేయాలి. ముఖ్యంగా భుజాలు, తొడ కండరాలు గట్టిపడే వ్యాయామాలు చేస్తే కీళ్లపై ఒత్తిడి పడదు. అలాగే గంటల తరబడి కూర్చొని పనిచేసే వాళ్లు అప్పుడప్పుడు లేచి అటు ఇటు నడుస్తుండాలి. నొప్పి నుంచి తక్షణ ఉపశమనం కోసం వేడినీళ్ల కాపడం, మసాజ్, ఫిజియోథెరపీ వ్యాయామాలు లాంటివి ఉపయోగపడతాయి. కీళ్ల అరుగుదల, కీళ్లవాతం లాంటి సమస్యలు ఉన్నవాళ్లు చలికాలంలో డాక్టర్ సలహా మేరకు మందులు వాడాలి. కీళ్లు మరీ వీక్‌గా ఉన్నవాళ్లు డాక్టర్ల సలహా మేరకు క్యాల్షియం, విటమిన్ డి మాత్రలు వేసుకోవచ్చు. ఇక వీటితోపాటు చలికాలంలో జంక్ ఫుడ్ తగ్గించి శరీరంలో వేడిని పెంచే ఆహారాన్ని తీసుకోవాలి. ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్, క్యాల్షియం, విటమిన్-డి, ప్రొటీన్స్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉండే ఆహారం తీసుకోవాలి. కీళ్లను వెచ్చగా ఉంచుకునేందుకు మందపాటి బట్టలు వేసుకోవాలి. శరీరాన్ని చలికి ఎక్స్‌పోజ్ అవ్వకుండా చూసుకోవాలి.

చలికాలంలో సూర్యరశ్మి శరీరానికి కావలసినంత అందకపోవడం వల్ల విటమిన్ డి లోపం ఏర్పడుతుంది. విటమిన్-డి లోపాన్ని తగ్గించుకోవడానికి విటమిన్ డి సప్లిమెంట్లు తీసుకోవడం ఎంతో మంచిది.

సల్ఫర్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకున్నా, క్యాల్షియం ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకున్నా కాస్త కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం లభిస్తుంది. కీళ్ల నొప్పులు బాధిస్తున్న వారు సమతుల్యమైన ఆహారాన్ని తీసుకుంటే మంచిది. నారింజ, క్యాబేజీ, బచ్చలికూర, టమోటాలు వంటి వాటిని ఆహారంలో భాగంగా చేసుకోవడం మరీ మంచిది.

చలికాలంలో మనకు తెలియకుండానే తక్కువ నీటిని తీసుకుంటాం కాబటి బాడీ డీహైడ్రేషన్ కు గురవుతుంది. దానివల్ల కీళ్ల నొప్పులు ఎక్కువగా ఇబ్బంది పెడుతుంటాయి. అందువల్ల అది గుర్తుంచుకుని కీళ్లనొప్పులతో బాధపడేవారు శరీరం డీ హైడ్రేట్ కాకుండా తగినంత నీటిని తాగడం మంచిది.

బచ్చలికూర బంగారం!



మనకు అందుబాటులో ఉండే అనేక రకాల ఆకుకూరల్లో బచ్చలి కూర ఒకటి. కానీ, బచ్చలికూరను చాలామంది ఇష్టపడరు.. అయితే, బచ్చలికూరలో దాగివున్న ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే మాత్రం నిజంగా బంగారమే అంటారు. బచ్చలి కూర లో విటమిన్ ఎ, సి, ఇ, కె, మెగ్నీషియం, ఫోలేట్, పొటాషియం, ఐరన్, కాపర్ పుష్కలంగా ఉన్నాయి. ఇది ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, డైటరీ ఫైబర్, ఫ్లేవనాయిడ్స్‌కు భాండాగారం.

రక్తహీనతతో బాధపడే వారికి బచ్చలి కూర దివ్యౌషధంలా పని చేస్తుంది. శరీరంలో రక్తం తక్కువగా ఉన్నవారు తమ రోజు వారి ఆహారంలో బచ్చలికూరను చేర్చుకుంటే ఆ సమస్య నుంచి త్వరగా బయటపడగలరని నిపుణులు చెబుతున్నారు. హైబీపీ పేషెంట్లు బచ్చలి ఆకులను రసంగా చేసుకుని తాగుతుంటే..రక్తపోటు అదుపులో ఉంటుంది.

అంతేకాదు.. బచ్చలి కూర గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బచ్చలికూరను తరచూ తీసుకోవటం ద్వారా శరీరంలో అదనంగా పేరుకుపోయిన కొలెస్ట్రాల్ కరుగుతుంది. బచ్చలి కూరలో ఉండే కాల్షియం వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి. బచ్చలి కూరలో అధికంగా ఉండే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, నియాసిన్, సెలీనియం నరాల ఆరోగ్యానికి, మెదడు ఆరోగ్యానికి ఎంతో సహాయపడతాయి. అంతేకాదు, మూత్రంలో మంట, ఇన్ఫెక్షన్ వంటి సమస్యలతో బాధపడేవారు రెగ్యులర్‌గా బచ్చలి కూరను తీసుకోవడం వల్ల మూత్ర విసర్జనలోని సమస్యలు తొలగిపోతాయి. పైల్స్, కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు వంటి సమస్యలతో బాధపడేవారు బచ్చలికూరను తింటే ఈ సమస్యనుంచి ఉపశమనం లభిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

మీకు తెలుసా?

కాలీఫ్లవర్ వల్ల గ్యాస్... అలర్జీ



కాలీఫ్లవర్‌తో వివిధ రకాల వంటకాలు తయారు చేసుకుని చాలా మంది ఇష్టంగా తింటారు. కాలీఫ్లవర్‌లోని పోషకాలు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. అయితే కాలీఫ్లవర్‌ను అతిగా తినడం వల్ల కడుపు ఉబ్బరంతోపాటు జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తలెత్తుతాయి. ముఖ్యంగా వీటిని పచ్చిగా తింటే పొట్టలో గ్యాస్ సమస్య, జీర్ణక్రియ సమస్యలతో పోరాడక తప్పదు. కాలీఫ్లవర్‌లో ఉండే గ్లూకోసినోలేట్స్ అనే సల్ఫర్ కలిగిన రసాయనాలు కడుపులోకి ప్రవేశించినప్పుడు, అవి హైడ్రోజన్ సల్ఫైడ్ వంటి సమ్మేళనాలను ఏర్పరుస్తాయి.

ఇది కడుపులో వాయువును సృష్టిస్తుంది. అందువల్లనే, కాలీఫ్లవర్ తిన్న తర్వాత కడుపు ఉబ్బరంగా అనిపిస్తుంది. థైరాయిడ్ సమస్య..కాలీఫ్లవర్ వంటి కూరగాయలు గ్రంథుల పనితీరుకు ఆటంకం కలిగిస్తాయి. హైపోథైరాయిడిజం వంటి సమస్యలతో బాధపడేవారు కాలీఫ్లవర్ తినకపోవడం మంచిది. అలెర్జీ ప్రమాదం..కొందరికి కాలీఫ్లవర్ తినడం వల్ల చర్మంపై దురద, దద్దుర్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వాపు వంటి సమస్యలు తలెత్తుతాయి.

హెల్త్ టిప్స్

మాటలు సరిగ్గా రానివారి కోసం...



వసకొమ్ముని దంచి చూర్ణం చేసుకుని ఆ చూర్ణాన్ని ఒక పాత్రలో పోసి ఆ చూర్ణం నిండేవరకు ఉసిరికాయల రసం పోసి బాగా కలిపి ఒక రాత్రి నానబెట్టి తరువాత ఎండబెట్టాలి. బాగా ఎండిన తరువాత మళ్లీ దంచి మెత్తగా తయారు చేసుకుని ఆ చూర్ణాన్ని రోజూ పూటకు మూడు గ్రాముల మోతాదుగా ఒక చెంచా తేనె కలిపి రెండు పూటలా సేవిస్తూ ఉంటే మాటలు తడబడే వారికి, మాటలు ముద్దగా పలికేవారికి , ఆగి ఆగి మాట్లాడేవారికి ఆ సమస్యలు తొలగి మాటలు స్పష్టంగా వస్తాయి.

లేత మర్రి ఊడలు సాన పైన అరగదీసి ఆ గంధాన్ని నాలిక పైన రాస్తున్నా మాటలు త్వరగా వస్తాయి.

క్షయరోగానికి...

క్షయ... అదేనండీ... టీబీతో ఇబ్బంది పడేవారు అశ్వగంధ పొడిని పాలల్లో కలిపి తీసుకోవడం వల్ల ఊపిరితిత్తులకు బలం చేకూరటమే కాక శరీర రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. నిద్రలేమి కూడా తగ్గుతుంది.

గొంతులో కఫం

వామాకు, తులసాకు, తమలపాకుని రోజూ తింటూ ఉంటే గొంతులో కఫం తగ్గిపోతుంది. మెత్తగా దంచి జల్లించిన కరక్కాయ పొడిని తేనెలో రంగరించి రెండు పూటలా చప్పరించినా గొంతులో గరగర, శ్లేష్మం పడటం వంటి సమస్యలు తొలగిపోతాయి.

సినిమా

అవసరమైన మేరకే కండలు పెంచాను

- ప్రభాస్



"'సలార్' సినిమాలోని పాత్రల మధ్య చక్కని భావోద్వేగాలు ఉంటాయి. ముఖ్యంగా రెండు పాత్రల మధ్య చక్కని సోదర భావాన్ని చూస్తారు. ప్రేక్షకులు మునుపెన్నడూ చూడని పాత్రలో నన్ను చూస్తారు. అలా అని ఈ పాత్ర కోసం నేనేం ప్రత్యేకంగా కష్టపడలేదు. పాత్రకు అవసరమైన మేరకే కండలు పెంచాలని దర్శకుడు ప్రశాంత్ ముందే చెప్పారు. నా కెరీర్‌లో గడచిన 21 ఏళ్లలో నేను మారిన దానితో పోల్చుకుంటే 'సలార్' సినిమా కోసం జరిగిన మార్పులు చాలా సాధారణమైనవని నాకనిపించింది" అన్నారు ప్రభాస్. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా హోంబలే ఫిలింస్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మించిన చిత్రం 'సలార్'. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించారు. 'సలార్' చిత్రంలోని తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రభాస్ ఓ ఆంగ్ల మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు ఈ విధంగా...

- ప్రశాంత్ నీల్‌తో సినిమా చేయాలని చాలా ఆసక్తిగా ఎదురు చూశాను. మా (హీరో ప్రభాస్, దర్శకుడు ప్రశాంత్ నీల్) కాంబినేషన్‌లో సినిమా ఎలా ఉంటే ప్రేక్షకులందరినీ ఆకట్టుకుంటుందనే విషయంపై నేను, ప్రశాంత్ బాగా చర్చించుకున్నాం. వర్క్‌షాప్స్ కూడా చేశాం. సినిమా గురించిన నా ఆలోచనలను ఆయనతో పంచుకున్నాను. వాటిలో కొన్ని ప్రశాంత్‌కు నచ్చాయి. నా పాత్రను ఎలా చూపించాలనుకుంటున్నాడో ఆ విషయాలను నాకు చాలా విపులంగా చెప్పాడు. కథకు తగ్గట్టు నా బాడీ లాంగ్వేజ్ ఎలా ఉండాలో కూడా మాట్లాడుకున్నాం. 'సలార్' సినిమా చిత్రీకరణ మొదలైన నెల రోజుల్లోనే ఇద్దరం మంచి స్నేహితులైపోయాం. ఈ సినిమా షూటింగ్ చాలా సరదాగా గడిచింది.
- హీరోలను తెరపై గొప్పగా చూపించాలనుకునే దర్శకుడు ప్రశాంత్ నీల్. నేను సెట్స్‌లోకి అడుగుపెట్టగానే అంతా ఆపేసి హీరో సీన్స్‌ని చిత్రీకరించడానికి టీమ్ సిద్ధమయ్యేది. నేను ఎప్పుడూ షాట్ కోసం ఎదురు చూడాల్సిన అవసరం ఏర్పడలేదు. ప్రశాంత్ అలాంటి జాగ్రత్తలు తీసుకున్నాడు. ఎప్పుడూ ముందుగానే ఏర్పాట్లను పూర్తి చేసేవాడు. ఇక నేను, శ్రుతీహాసన్, పృథ్వీరాజ్ కలిశామంటే షూటింగ్ ఇంకా సరదాగా గడిచేది. 'సలార్' సినిమాను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు.

వ్యూహం... నేను నమ్మిన రియాలిటీ

- దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ



• దాసరి కిరణ్‌కుమార్, రామ్‌గోపాల్ వర్మ

''నేను తీసినటువంటి విభిన్న రకాలైన సినిమాలు ఎవరూ తీయలేదు. రాజకీయ నాయకులు, పోలీసులు.. ఇలా ఎవరైనా కావొచ్చు. నాకు పవర్‌ఫుల్ వ్యక్తుల బయోపిక్‌లు తీయడం అంటే ఇష్టం'' అన్నారు దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ. అజ్మల్, మానస ముఖ్య తారలుగా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో రామధూత క్రియేషన్స్ పతాకంపై దాసరి కిరణ్‌కుమార్ నిర్మించిన చిత్రం 'వ్యూహం'. రెండు భాగాలుగా విడుదల కానున్న ఈ సినిమా తొలి భాగం 'వ్యూహం: 1' ఈ నెల 29న విడుదల కానుంది. మలి భాగం 'శపథం' పేరుతో జనవరి 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన 'వ్యూహం: 1' రెండో ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– ''అరచేతిని అడ్డుపెట్టి సూర్యుడిని ఆపలేరు. 'వ్యూహం' సినిమా రిలీజ్‌ను ఎవరూ ఆపలేరు అని నేను గతంలోనే చెప్పాను. ఇప్పుడు నేను, కిరణ్‌గారు కలిసి నిరూపించాం. క్లీన్ యూతో మాకు సెన్సార్ సర్టిఫికెట్ ఎలా వచ్చింది? అనేది సీక్రెట్. వైఎస్ రాజశేఖర్ రెడ్డిగారు మరణించిన సమయం నుంచి 2023 వరకు 'వ్యూహం' సినిమా మొత్తం కథనం ఉంటుంది. వైఎస్ జగన్‌గారు ముఖ్యమంత్రి అయ్యే వరకు తొలి భాగం ఉంటుంది. ఈ క్రమంలో ఎవరెవరు ఏయే వ్యూహాలు రచించారు వంటి ప్రధాన ఘటనలు ఈ సినిమాలో ఉంటాయి. 'వ్యూహం' తొలి భాగంలో ఏవైనా సందేహాలు కలిగితే అవి రెండో భాగంలో నివృత్తి అవుతాయి. నిజ జీవితంలోని వ్యక్తులు, వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా ఉంటుంది. కానీ నేను నమ్మిన రియాలిటీతోనే 'వ్యూహం' ఉంటుంది. సినిమా అంటేనే నాటకీయత. కాబట్టి ఈ సినిమాలో ఆ నాటకీయత కూడా ఉంటుంది. ప్రేక్షకులకు తెలియని విషయాలు కూడా ఈ సినిమాలో ఉంటాయి. 'వ్యూహం' సినిమాలో కామెడీ పాత్ర కూడా ఉంది. ఆ పాత్ర సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. భవిష్యత్తులో 'వ్యూహం' తరహా సినిమాలను నేను తీస్తానా? అంటే చెప్పలేను. ఎందుకంటే నా మాటపై నేను నిలబడను'' అని అన్నారు. ''రామ్‌గోపాల్ వర్మగారితో నేను గతంలో 'వంగవీటి' సినిమా చేశాను. ఆ తర్వాత మళ్లీ సినిమా చేయాలనుకున్నప్పుడు 'వ్యూహం', 'శపథం' ప్రాజెక్ట్స్ మొదలయ్యాయి. ప్రతి వారం థియేటర్స్‌లోకి మూడు నాలుగు సినిమాలు రావడం సహజమే. అన్నింటికీ థియేటర్లు దొరుకుతాయి. మా 'వ్యూహం' సినిమాను ఎక్కువ థియేటర్స్‌లోనే రిలీజ్ చేస్తాం'' అన్నారు నిర్మాత దాసరి కిరణ్.

> ఆంధ్రప్రదేశ్ సీయం వైఎస్ జగన్‌గారితో నాకు పరిచయం లేదు. అయితే జగన్‌గారంటే నాకు పాజిటివ్ అభిప్రాయాలు ఉన్నాయి. సీబీఎన్‌గారంటే కూడా నాకు ఇష్టమే. విలన్స్ అన్నా నాకిష్టమే. 'నా వెనక ఉండే నీకు అర్థం కాదు తమ్ముడు (ఓ పాత్రధారి).. తన ఊపు చూస్తుంటే ఏదో కొత్త పార్టీ పెట్టేసేలా ఉన్నాడు (మరో పాత్రధారి). క్షవరం అయితే కానీ వివరం తెలియదు అని ఊరికే అనలేదు పెద్దలు (ఓ పాత్రధారి)' అనే డైలాగ్స్ సినిమాలో ఉన్నాయంటే... చిరంజీవి, పవన్ కల్యాణ్ ఇంట్లో పని చేసినవారిని సంప్రదించి, నేను నమ్మిన అంశాలతో ఈ సినిమాలో కొన్ని డైలాగ్స్ పెట్టాం. అసలు.. జనసేనలో పవన్‌కల్యాణ్ టీడీపీ కోవర్టుగా పని చేస్తున్నాడని నా అభిప్రాయం. పవన్ పార్టీ పెట్టినప్పుడు అతన్ని అభిమానిస్తున్నట్లుగా మాట్లాడాను. కానీ అతనిలో స్థిరత్వం లేదు. ఇక తెలంగాణలో ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్‌లో బలమైన ప్రతిపక్ష పార్టీ లేదని నా అభిప్రాయం. ఎన్నికల్లో ఎవరెవరు నిలబడుతున్నారు? వారు ఏమేం హామీలు ఇస్తున్నారనే రాజకీయ పరిజ్ఞానం నాకు లేనప్పుడు ఎన్నికల్లో ఓటు వేయడం కరెక్ట్ కాదని, ఓ బాధ్యత గల పౌరుడిగా నేనిప్పటి వరకూ ఓటు వేయలేదు.
>
> – రామ్‌గోపాల్ వర్మ

లేదంటే మాటొచ్చేత్తది!



• నాగార్జున, 'అల్లరి' నరేశ్

అంజిగా మారిపోయారు 'అల్లరి' నరేశ్. నాగార్జున హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'నా సామిరంగ'. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ సినిమాలో ఆషికా రంగనాథన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఇందులోని కీలకమైన అంజి పాత్రను 'అల్లరి' నరేశ్ చేస్తున్నారు. శుక్రవారం 'అల్లరి' నరేశ్ పాత్ర అంజిని గురించిన గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''మా అల్లరి అంజిగాడ్ని పరిచయం చేస్తున్నాం. లేదంటే మాటొచ్చేత్తది'' అంటూ 'అంజి' గ్లింప్స్ వీడియోను షేర్ చేశారు నాగార్జున. ''చేసేయ్.. చేసేయ్.. లేదంటే మాటొచ్చేత్తది'' అనే డైలాగ్ చెప్పారు 'అల్లరి' నరేశ్. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరిలో విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: కీరవాణి.

ఒక రోజు వస్తది..



• రానా, రవికాంత్ పేరేపు, రోషన్, రాఘవేంద్ర రావు, మానస, అనిల్, వివేక్

ప్రముఖ యాంకర్ సుమ కనకాల తనయుడు రోషన్ కనకాల హీరోగా పరిచయం అవుతున్న సినిమా 'బబుల్‌గమ్'. మానసా చౌదరి హీరోయిన్‌గా నటించారు. రవికాంత్ పేరేపు దర్శకత్వంలో మహేశ్వరి మూవీస్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో రానా, దర్శకుడు కె. రాఘవేంద్ర రావు, దర్శకుడు అనిల్ రావిపూడి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ట్రైలర్ లాంచ్ అనంతరం రాఘవేంద్ర రావు మాట్లాడుతూ– ''ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే సూపర్‌హిట్ కళ కనిపిస్తోంది. రోషన్, మానసల కెమిస్ట్రీ బాగుంది'' అన్నారు. ''రోషన్‌కు ప్రేక్షకుల అభిమానం దక్కాలని కోరుకుంటున్నాను'' అన్నారు రానా. ''యూత్‌కు కావాల్సిన అంశాలు ఉన్న చిత్రమిది. రోషన్ యూనిక్‌గా ఉన్నాడు'' అన్నారు అనిల్ రావిపూడి. ''జీవితంలో ఏదో ఒక సందర్భంలో పగ తీర్చుకోవాలనిపిస్తుంటుంది. ఈ సినిమాలో ఆది (రోషన్ పాత్ర పేరు) పాత్ర మాటల్లో చెప్పాలంటే 'ఒక రోజు వస్తది.. ఆ రోజు చెవులు మూసుకున్నా వినపడతా.. కళ్లు మూసుకున్నా కనపడతా..'. రానా అన్న మా అందరికీ స్ఫూర్తి. రాఘవేంద్రరావు, అనిల్ గార్లు ఈ వేడుకకు రావడం హ్యాపీగాగా ఉంది'' అన్నారు రోషన్. ''ట్రైలర్ కంటే సినిమా ఇరవై రెట్లు హై ఇస్తుంది'' అన్నారు రవికాంత్ పేరేపు. ''బబుల్‌గమ్' ట్రైలర్ యూత్‌ఫుల్‌గా ఉంది. ఈ మధ్య 'బేబీ' చిత్రం ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. ఈ సినిమా కూడా అంత పెద్ద హిట్టవుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు నిర్మాత వివేక్ కూచిభొట్ల. సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల పాల్గొన్నారు.

థ్రిల్లింగ్ రుధిరాక్ష



• ఆది, జేడీ చక్రవర్తి, సముద్ర ఖని, రాజు జువ్వల

ఆది సాయికుమార్ హీరోగా జేడీ చక్రవర్తి, సత్యరాజ్ కీలక పాత్రల్లో నటించనున్న పాన్ ఇండియా చిత్రానికి 'రుధిరాక్ష' టైటిల్ ఖరారు చేశారు. శివ శంకర్ దేవ్ దర్శకత్వంలో రాజు జువ్వల నిర్మిస్తున్న ఈ డార్క్ థ్రిల్లర్ మూవీ ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత రామ్ తాళ్లూరి కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు–దర్శకుడు సముద్ర ఖని క్లాప్ ఇచ్చారు. దేవ్ గౌరవ దర్శకత్వం వహించారు. ''త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆరంభిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, కెమెరా: కిశోర్ బోయిదాపు.

సర్కారు నౌకరికి డేట్ ఫిక్స్



• ఆకాశ్, భావన

ప్రముఖ గాయని సునీత కుమారుడు ఆకాశ్ హీరోగా పరిచయవుతున్న చిత్రం 'సర్కారు నౌకరి'. ఈ చిత్రంలో భావన హీరోయిన్. గంగనమోని శేఖర్ దర్శకత్వంలో ఆర్కే టెలీ షో పై దర్శకుడు రాఘవేంద్ర రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. ''సర్కారు నౌకరి'ని కొత్త సంవత్సరం సందర్భంగా జనవరి 1న ఘనంగా విడుదల చేయనున్నాం'' అని యూనిట్ ప్రకటించింది. ఈ చిత్రానికి సంగీతం: శాండిల్య, సహ నిర్మాత: పరుచూరి గోపాలకృష్ణా రావు.

సాక్షి బిజినెస్
శనివారం
16-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	970	71,484
నిఫ్టీ ▲	274	21,457

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	14,826	▲ 65
డోజోన్స్	37,251	▲ 3
ఎఫ్‌టీఎస్ఈ 100	7,577	▽ 72
డాక్స్	16,765	▲ 10
షాంఘై	2,943	▽ 16
నికాయ్	32,971	▲ 284

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,367	▽ 29
బంగారం (99.5 స్వచ్ఛత)	62,117	▽ 29
వెండి (కిలో)	74,273	▲ 280

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒక్కటి	82.90	83.92
£	బ్రిటన్ పౌండ్	ఒక్కటి	104.24	106.80
€	యూరో	ఒక్కటి	89.83	92.19
¥	జపాన్ ఎన్ (100)	ఒక్కటి	56.67	57.96
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒక్కటి	55.12	57.06
S$	సింగపూర్ డాలర్	ఒక్కటి	61.38	63.37
SAR	సౌదీ రియాల్	ఆన్‌సీవీ	21.18	22.00
UAE D	యూఏఈ దిర్హామ్	ఆన్‌సీవీ	21.70	23.49
¥	చైనా యువాన్	ఆన్‌సీవీ	10.56	12.63

గోల్డ్ బాండ్ @ రూ. 6,199

- ఆర్‌బీఐ నుంచి సావరిన్ బాండ్లు
- ఈ నెల 18–22 మధ్య విక్రయం
- బ్యాంకులు, స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా అమ్మకం



ముంబై: తదుపరి దశ సావరిన్ గోల్డ్ బాండ్ల(ఎస్‌జీబీ)కు రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) తాజాగా ధరను ప్రకటించింది. ఒక గ్రాము బాండుకు రూ. 6,199ను నిర్ణయించింది. వీటి సబ్‌స్క్రిప్షన్ ఈ నెల సోమవారం(18న) ప్రారంభమై ఐదు రోజుల పాటు కొనసాగనుంది. ఎస్‌జీబీ పథకం 2023–24– సిరీస్–3లో భాగంగా ఆర్‌బీఐ ఈ నెల 18–22 మధ్య పసిడి బాండ్ల సబ్‌స్క్రిప్షన్‌కు తెరతీస్తోంది. స్మాల్, పేమెంట్, గ్రామీణ బ్యాంకులు మినహా షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు వీటిని విక్రయిస్తాయి. వీటితోపాటు స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్, క్లియరింగ్ కార్పొరేషన్, ఎంపిక చేసిన పోస్టాఫీసులు, స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు ఎన్ఎస్ఈ, బీఎస్ఈ ద్వారా కొనుగోలు చేయవచ్చు. పూర్తి స్వచ్ఛత(999)గల పసిడి సగటు ముగింపు ధర ఆధారంగా గ్రాముకు రూ. 6,199 ధరను నిర్ధారించినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ఆర్‌బీఐతో చర్చల తదుపరి కేంద్ర ప్రభుత్వం గ్రాముకు రూ. 50 చొప్పున ఇన్వెస్టర్లకు డిస్కౌంట్‌ను ఆఫర్ చేసేందుకు నిర్ణయించింది. అయితే ఇందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయడంతోపాటు.. డిజిటల్ విధానంలో చెల్లింపులు చేపట్టవలసి ఉంటుంది. వెరసి గోల్డ్ బాండ్ రూ. 6,149కు లభించనున్నట్లు ఆర్‌బీఐ పేర్కొంది. కాగా.. ఎస్‌జీబీ సిరీస్–4లో భాగంగా వచ్చే (2024) ఫిబ్రవరి 12–16 మధ్య బాండ్లను ఆఫర్ చేయనున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది.

మదర్‌సన్ చేతికి విదేశీ కంపెనీలు

డీల్ విలువ రూ. 575 కోట్లు

న్యూఢిల్లీ: ఆటో విడిభాగాల దిగ్గజం సంవర్ధన మదర్‌సన్ ఇంటర్నేషనల్ తాజాగా రెండు విదేశీ కంపెనీలను సొంతం చేసుకోనుంది. ఆస్ట్రేలియా సంస్థ లూమెన్ గ్రూప్, స్విట్జర్లాండ్‌కు చెందిన డెల్టాకార్ప్ ఎస్ఏలను రూ. 575 కోట్లకు కొనుగోలు చేయనుంది. పూర్తి అనుబంధ సంస్థ సంవర్ధన మదర్‌సన్ ఆటోమోటివ్ సిస్టమ్స్ గ్రూప్ బీవీ ద్వారా ఈ సంయుక్త కొనుగోళ్లు చేపట్టేందుకు బోర్డు అనుమతించినట్లు సంవర్ధన మదర్‌సన్ వెల్లడించింది. ఆస్ట్రేలియా పీటీవైసహా లూమెన్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్(ఉత్తర అమెరికా, థాయ్‌లాండ్, యూరప్, దక్షిణాఫ్రికాలో 90%), లూమెన్ ఇంజనీరింగ్ సొల్యూషన్స్, స్పెషల్ కన్వెర్షన్స్ పీటీవైలతో కూడిన లూమెన్ గ్రూప్‌ను సొంతం చేసుకోనున్నట్లు తెలియజేసింది. అయితే లూమెన్ దక్షిణాఫ్రికాను చేర్చలేదని వెల్లడించింది.

జనవరి–మార్చిలో..: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో లూమెన్ గ్రూప్ కొనుగోలు పూర్తికావచ్చని అంచనా వేస్తోంది. ఆటో రంగ దిగ్గజాలు(ఓఈఎంలు) ఆమోదించిన ఆటోమోటివ్ విడిభాగాల తయారీ, డిజైన్, సరఫరాలు చేపడుతోంది. 93 మిలియన్ డాలర్ల(దాదాపు రూ. 520 కోట్లు) ఎంటర్‌ప్రైజ్ విలువలో లూమెన్ గ్రూప్‌ను సొంతం చేసుకోనుంది. 2024–27 మధ్య కాలంలో పనితీరు ఆధారంగా అదనపు చెల్లింపులకు వీలున్నట్లు సంవర్ధన మదర్‌సన్ తెలియజేసింది. మరోపక్క స్విస్ కంపెనీ డెల్టా కార్ప్ ఎస్ఏను 4.5 మిలియన్ డాలర్ల(రూ. 43 కోట్లు)కు కొనుగోలు చేయనున్నట్లు తెలియజేసింది. కొనుగోలులో భాగంగా సుమారు 1.2 మిలియన్ డాలర్ల లీజ్ లయబిలిటీలను సైతం టేకోవర్ చేయనున్నట్లు తెలియజేసింది.



ఎగుమతులు మళ్లీ మైనస్‌లోకి..

- నవంబర్‌లో 2.83 శాతం క్షీణత
- విలువలో 33.90 బిలియన్ డాలర్లు
- దిగుమతులదీ క్షీణ బాటే
- 4.33 శాతం పతనంతో 54.48 బిలియన్ డాలర్లుగా నమోదు
- వాణిజ్యలోటు 20.58 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ తీవ్ర అనిశ్చితి పరిస్థితులకు భారత్ వస్తు ఎగుమతులు అద్దం పడుతున్నాయి. అక్టోబర్‌లో 'ప్లస్'లోకి వచ్చిన ఎగుమతులు తిరిగి నవంబర్‌లో మైనస్‌లోకి జారిపోయాయి. 2022 ఇదే నెలతో పోల్చితే 2023 నవంబర్‌లో ఎగుమతుల విలువ 2.83% క్షీణించి 33.90 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ఇక 10 నెలల తర్వాత అక్టోబర్‌లో ఎగువబాటకు చేరిన దిగుమతులు నవంబర్‌లో మళ్లీ క్షీణతలోకి జారాయి. 4.33% పతనంతో 54.48 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వెరసి ఎగుమతులు దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం– వాణిజ్య లోటు 20.58 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

ముందు.. వెనుకలు ఇలా...

అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, ఉక్రెయిన్ యుద్ధం, ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం సవాళ్లు, కఠిన ద్రవ్య పరిస్థితుల నేపథ్యంలో 2023 ఫిబ్రవరి నుంచి జూలై వరకూ భారత్ వస్తు ఎగుమతుల్లో అసలు వృద్ధిలేకపోగా క్షీణతలో నడిచాయి. అయితే ఆగస్టులో వృద్ధిలోకి (3.88 శాతం) మారినా, మళ్లీ సెప్టెంబర్‌లో 2.6 శాతం క్షీణించాయి. అక్టోబర్‌లో సానుకూల ఫలితం వెలువడింది. మరుసటి నెలలోనే మళ్లీ క్షీణరేటు నమోదయ్యింది.

ఏప్రిల్–నవంబర్ మధ్య క్షీణ గణాంకాలే..

ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్య భారత్ వస్తు ఎగుమతుల విలువ 6.51 శాతం క్షీణించి 278.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. దిగుమతుల విలువ కూడా 8.67 శాతం క్షీణించి 445.15 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. వెరసి ఎగుమతులు–దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం వాణిజ్యలోటు– ఈ ఏడు నెలల్లో 166.36 బిలియన్ డాలర్లుగా ఉంది. ఎనిమిది నెలల కాలంలో పసిడి దిగుమతులు 21 శాతం పెరిగి 32.93 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

స్మార్ట్ ఫోన్ కొంటే హెల్త్‌కేర్ ప్రయోజనాలు

21వ వార్షికోత్సవం సందర్భంగా బిగ్ 'సి' వినూత్న ఆఫర్లు


హైదరాబాద్: ప్రముఖ మొబైల్ రిటైల్ చైన్ బిగ్ 'సి' తన 21వ వార్షికోత్సవం సందర్భంగా వినూత్న ఆఫర్లు ప్రకటించింది. 'స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై రూ.1.10 లక్షల హెల్త్ కేర్ ప్రయోజనాలు ఉచితం. ఇందులో భాగంగా ఏడాది పాటు టెలిఫోనిక్ డాక్టర్ కన్సల్టేషన్, ప్రమాద బీమా కవరేజ్, ఔషధాలపై 20% డిస్కౌంట్, రూ.50 వేల వరకు అంబులెన్స్ సేవలు ఉచితంగా పొందొచ్చు' అని సంస్థ సీఎండీ బాలు చౌదరి తెలిపారు. మరో ఆఫర్‌గా రూ. 75 వేల విలువైన పేటీఎం కూపన్లతో ఎంటర్‌టైన్‌మెంట్, డైనింగ్, ట్రావెలింగ్, వినియోగ వస్తువులు, వెల్‌నెస్, షాపింగ్ ప్రయోజనాలు పొందొచ్చు. మూడో ఆఫర్‌గా రూ. 21కే రూ.4,999 విలువ గల ఫైర్‌బోల్ట్ స్మార్ట్ వాచ్, లేదా రూ. 2,999 విలువ గల రెడ్‌మీ బడ్స్ సొంతం చేసుకోవచ్చు. బిగ్ సి షోరూంల్లో స్మార్ట్ ఫోన్ కొనుగోలు చేసే కస్టమర్లు ఈ మూడింటిలో ఏదో ఒకటి ఎంచుకునే సౌలభ్యం కల్పిస్తున్నట్టు బాలు చౌదరి వెల్లడించారు.



71,000 శిఖరంపై సెన్సెక్స్

- 21,450 స్థాయి పైకి నిఫ్టీ
- రెండో రోజూ బుల్ రికార్డుల్

ముంబై: ఐటీ, మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇంధన షేర్లు రాణించడంతో సెన్సెక్స్ చరిత్రలో తొలిసారి 71,000 పాయింట్ల ఎగువన ముగిసింది. జాతీయ, అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిణామాలతో శుక్రవారం సెన్సెక్స్, నిఫ్టీలు తాజా గరిష్టాలు నమోదు చేశాయి. వచ్చే ఏడాదిలో ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు సంకేతాల ప్రభావం భారత్‌తో సహా అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లపై కొనసాగింది. దేశీయంగా మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాల నమోదు, ఎఫ్ఐఐల వరుస కొనుగోళ్లు అంశాలు కలిసొచ్చాయి. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు రోజంతా స్థిరంగా ముందుకు కదిలాయి. సెన్సెక్స్ 70,804 పాయింట్ల వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 1,092 పాయింట్లు ఎగసి 71,484 వద్ద కొత్త జీవితకాల గరిష్టం తాకింది. చివరికి 970 పాయింట్లు లాభపడి 71,484 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నిఫ్టీ 310 పాయింట్లు బలపడి 21,492 వద్ద సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఆఖరికి 274 పాయింట్లు లాభపడి 21,457 వద్ద నిలిచింది. ఎఫ్ఎంసీజీ, ఆటో, రియల్టీ, సేవా రంగ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది.



- సూచీల రికార్డుల ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీ మొత్తం మార్కెట్ విలువ గత ట్రేడింగ్ సెషన్లలో రూ.8.11 లక్షల కోట్లు పెరిగి రూ.357.87 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ సూచీలో 30 షేర్లకు గానూ ఐదు మాత్రమే నష్టపోయాయి. ఇక వారం మొత్తంగా సెన్సెక్స్ 1,658 పాయింట్లు, నిఫ్టీ 487 పాయింట్లు చొప్పున లాభాలు నమోదు చేశాయి. ఇరు సూచీలకిది వరుసగా ఏడో వారం లాభాల ముగింపు.
- పెన్సిళ్ల తయారీ సంస్థ డోమ్స్ ఇండస్ట్రీస్ ఐపీఓకు చివరిరోజు నాటికి 93.40 రెట్ల అధిక స్పందన లభించింది. కంపెనీ మొత్తం 88.37 లక్షల ఈక్విటీలను జారీ చేయగా 82.54 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. అర్హత గల సంస్థాగత ఇన్వెస్టర్ల విభాగం 115.97 రెట్లు, రిటైల్ కోటా 69.10 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల కోటా 66.47 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి.
- డాలర్ మారకంలో రూపాయి విలువ 27 పైసలు బలపడి 83.03 వద్ద స్థిరపడింది. దేశీయ మార్కెట్లోకి విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు వెల్లువెత్తడం, స్టాక్ సూచీల కొత్త శిఖరాలకు చేరుకోవడం రూపాయి ర్యాలీకి కారణమయ్యాయని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు.
- ఫెడ్ వడ్డీరేట్ల యథాతథ కొనసాగింపు, ద్రవ్యోల్బణం దిగివచ్చేందుకు చర్యలు తీసుకోవడంతో ఐటీ షేర్లు రెండో రోజూ లాభపడ్డాయి. ఇన్ఫీబీమ్ 12%, జెన్సార్ టెక్ 11%, మెస్టెక్ 6.50%, హెచ్‌సీఎల్ టెక్ 6%, పర్‌సిస్టెంట్, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు 5%, కో ఫోర్జ్, సైయంట్ 4%, టెక్ మహీంద్రా 3 చొప్పున లాభపడ్డాయి.
- బ్యాంకింగ్ షేర్లలో ర్యాలీ భాగంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ షేరు ఒకటిన్నర శాతం లాభపడి రూ.91.24 వద్ద స్థిరపడింది. ఈ క్రమంలో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.ఒక లక్షల కోట్లను అధిగమించింది.

ఘనంగా వాల్యూ జోన్ హైపర్ మార్ట్ ప్రారంభం

హైదరాబాద్: భాగ్యనగరంలోని పటాన్‌చేరులో అతి పెద్ద అవుట్‌లెట్ ''వాల్యూ జోన్ హైపర్ మార్ట్'' శుక్రవారం ప్రారంభమైంది. సినీ నటుడు బాలకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. మీకు నచ్చిన, మీరు మెచ్చిన ప్రతి వస్తువుకూ కేరాఫ్ అడ్రస్... వాల్యూ జోన్ హైపర్ మార్ట్ అని ఆయన అన్నారు. ''కస్టమర్ల భిన్న అభిరుచులు, అవసరాలు దృష్టి ఉంచుకొని నాణ్యమైన వస్తువులను, అతి తక్కువ ధరల్లో ఒకే చోట అందుబాటులో ఉంచుతున్నాము. రిటైల్ వాణిజ్య వ్యవస్థలోనే ఇదో వినూత్న విప్లవం'' అని డైరెక్టర్ సురేశ్ సీర్ల తెలిపారు.



జోయాలుక్కాస్ 'సీజన్ ఆఫ్ గివింగ్' ప్రచారం

హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ సంస్థ జోయాలుక్కాస్ 'సీజన్ ఆఫ్ గివింగ్' క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. నెల రోజుల ఈ ప్రచారంలో భాగంగా బంగారం, డైమండ్ జ్యువెలరీ మజూరీ చార్జీలపై 25% తగ్గింపు ఇస్తున్నట్లు గ్రూప్ చైర్మన్ ఎండీ జోయ్ అలుక్కాస్ తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని జోయాలుక్కాస్ షోరూంల్లో జనవరి 15 వరకు 'సీజన్ ఆఫ్ గివింగ్' ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. పండుగ డిస్కౌంట్‌కు అదనంగా కొనుగోలు చేసిన జ్యువెలరీపై ఏడాది ఉచిత బీమా గ్యారంటీ, జీవిత కాల ఉచిత నిర్వహణ, బైబ్యాక్ గ్యారంటీని అందిస్తుంది.

Joyalukkas

సాక్షి స్పోర్ట్స్



వేలంలో మెస్సీ 6 జెర్సీలకు రూ. 65 కోట్లు!

ఫుట్‌బాల్ దిగ్గజం లయోనల్ మెస్సీ ప్రపంచకప్ మ్యాచ్‌లలో ధరించిన జెర్సీలకు వేలంలో అత్యద్భుత స్పందన లభించింది. 2022లో ఖతర్‌లో జరిగిన వరల్డ్ కప్‌లో మెస్సీ అర్జెంటీనా జట్టును విజేతగా నిలిపాడు. ఈ టోర్నీలో అతను ధరించిన 6 జెర్సీలను న్యూయార్క్‌లో ఆన్‌లైన్‌లో వేలం వేశారు. వీటిని మొత్తం 78 లక్షల డాలర్లకు (సుమారు రూ. 65 కోట్లు) ఒక అజ్ఞాత అభిమాని సొంతం చేసుకోవడం విశేషం. అతని వివరాలను బయటకు వెల్లడించలేదు. క్రీడల్లో జ్ఞాపికల వేలానికి సంబంధించి ఇటీవలి కాలంలో ఇది రికార్డు మొత్తం కావడం గమనార్హం. ఫైనల్ మ్యాచ్‌లో 3–3తో స్కోరు సమమైన తర్వాత పెనాల్టీ షూటౌట్‌లో గెలిచి అర్జెంటీనా విశ్వవిజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో మెస్సీ 2 గోల్స్ చేశాడు. వేలం ద్వారా దక్కిన మొత్తంలో కొంత భాగాన్ని మెస్సీ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న చిన్న పిల్లల ఆస్పత్రికి విరాళంగా అందజేస్తారు.

ధోని జెర్సీ నంబర్ '7'కు రిటైర్మెంట్: బీసీసీఐ



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, రెండు ప్రపంచకప్‌లను గెలిపించిన సారథి మహేంద్ర సింగ్ ధోనిపై బీసీసీఐ సముచిత గౌరవం ప్రదర్శించింది. అతను మైదానంలో ధరించిన '7' నంబర్ జెర్సీకి కూడా రిటైర్మెంట్ ఇస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. దిగ్గజ క్రికెటర్‌గా భారత క్రికెట్‌కు ధోని చేసిన సేవలకు గుర్తిస్తూ తాము ఈ నిర్ణయం తీసుకున్నామని బోర్డు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వెల్లడించారు. దీని ప్రకారం ఇకపై భారత క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించే ఏ ఆటగాడు కూడా తమ జెర్సీపై '7' నంబర్ వాడేందుకు బోర్డు అనుమతించదు. గతంలో ఆల్‌టైమ్ గ్రేట్ సచిన్ టెండూల్కర్ గౌరవార్థం కూడా అతను ధరించిన '10' నంబర్‌కు కూడా బీసీసీఐ అధికారికంగా రిటైర్మెంట్ ప్రకటించింది. సచిన్ తప్పుకున్న తర్వాత ఒకే ఒకసారి ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్ '10' నంబర్ జెర్సీని వేసుకోగా అభిమానుల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. దాంతో అతను తన నంబర్‌ను మార్చుకోవాల్సి వచ్చింది. జెర్సీ నంబర్లకు రిటైర్మెంట్ ప్రకటించడం ఇతర క్రీడల్లో చాలా కాలంగా ఉంది. బాస్కెట్‌బాల్ దిగ్గజం మైకేల్ జోర్డాన్ వేసుకున్న '23' నంబర్‌ను కూడా అతని కెరీర్ తర్వాత చికాగో బుల్స్ టీమ్ రిటైర్మెంట్ ఇచ్చింది.

ఆస్ట్రేలియా 487 ఆలౌట్

పెర్త్: పాకిస్తాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 113.2 ఓవర్లలో 487 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 346/5తో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ 141 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లు కోల్పోయింది. మిచెల్ మార్ష్ (90; 15 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీని చేజార్చుకున్నాడు. తొలి టెస్టు ఆడుతున్న పాక్ బౌలర్ ఆమెర్ జమాల్ 111 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. అబ్దుల్లా షఫీక్ (42; 6 ఫోర్లు), కెప్టెన్ షాన్ మసూద్ (30; 5 ఫోర్లు) అవుటయ్యారు.



రోహిత్ అవుట్

కెప్టెన్సీ నుంచి తప్పించిన ముంబై ఇండియన్స్

- కొత్త సారథిగా హార్దిక్ పాండ్యా
- 2024 సీజన్ నుంచే బాధ్యతలు

ముంబై: ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన, ఆకర్షణీయమైన ఫ్రాంచైజీ ముంబై ఇండియన్స్‌లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. 2024 సీజన్ ఆరంభానికి చాలా ముందే ఆ జట్టులో సారథ్య మార్పు జరిగింది. 11 సీజన్ల పాటు టీమ్‌కు అద్భుత విజయాలు అందించి ముంబై ఇండియన్స్ ముఖచిత్రంగా మారిన కెప్టెన్ రోహిత్ శర్మను నాయకత్వ బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్లు టీమ్ యాజమాన్యం ప్రకటించింది. రోహిత్ స్థానంలో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను జట్టు కెప్టెన్‌గా నియమించింది. గత నెల 26న గుజరాత్ జెయింట్స్ టీమ్ నుంచి హార్దిక్‌ను ముంబై తీసుకున్నప్పటి నుంచే భవిష్యత్తులో అతనికి కెప్టెన్సీ అప్పగించే అవకాశం ఉందని వినిపించింది. అయితే అది ఇంత తొందరగా జరుగుతుందని ఎవరూ ఊహించలేదు. ఈ సీజన్ వరకు రోహిత్ నాయకత్వంలో ఆడి వచ్చే ఏడాది నుంచి అతను పగ్గాలు చేపట్టవచ్చని భావించగా... ముంబై ఇండియన్స్ యాజమాన్యం మాత్రం వేగంగా నిర్ణయం తీసుకుంది. ఐదుసార్లు ముంబైని ఐపీఎల్‌లో విజేతగా నిలిపిన సారథి రోహిత్ ఇప్పుడు 'మాజీ'గా మారిపోయాడు. మరో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి **గతం**లోనే బెంగళూరు కెప్టెన్సీ నుంచి తప్పుకోగా, **2008** నుంచి చెన్నైకి సారథిగా ఉన్న ధోని ఇంకా **కెప్టెన్‌గా** కొనసాగుతున్నాడు.

అందుకే మార్పు...

2024 సీజన్ నుంచే హార్దిక్‌కు కెప్టెన్సీ **అప్పగిం**చాలని తాము భావించినట్లు ముంబై ఇండి**యన్స్** గ్లోబల్ హెడ్ ఆఫ్ పర్ఫార్మెన్స్ మహేలా జయ**వర్ధనే** అన్నాడు. 'ఎప్పుడైనా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే ముంబై ఇండియన్స్ నిర్ణయాలు తీసుకుంటుంది. ఇది కూడా అందులో భాగమే. రోహిత్‌తో పాటు గతంలోనూ సచిన్, హర్భజన్, పాంటింగ్ కెప్టెన్లుగా జట్టును సమర్థంగా నడిపించడంతో పాటు ముందు చూపుతోనూ వ్యవహరించారు. వచ్చే సీజన్ నుంచే హార్దిక్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపడతాడు. రోహిత్ నాయకత్వంలో ముంబై టీమ్ అత్యుత్తమ ఫలితాలు సాధించింది. అతని నాయకత్వ పటిమకు మా అభినందనలు. ఐపీఎల్‌లో అత్యుత్తమ కెప్టెన్లలో ఒకడిగా రోహిత్ అనుభవం మైదానంలోనూ, మైదానం బయటా జట్టుకు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాం' అని అతను చెప్పాడు. 2015–2021 మధ్య ముంబైతో ఉన్న హార్దిక్ పాండ్యా 92 మ్యాచ్‌లు ఆడి నాలుగు టైటిల్స్ విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. గత రెండు సీజన్లలో గుజరాత్‌ను ఫైనల్‌కు చేర్చిన అతను ఒకసారి ట్రోఫీ అందించాడు.

ఐదు ఐపీఎల్ ట్రోఫీలు...

ఐపీఎల్‌లో ముంబై కెప్టెన్‌గా రోహిత్ ముద్ర అసామాన్యం. 2013 సీజన్‌లో తొలి ఆరు మ్యాచ్‌లలో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన రికీ పాంటింగ్ అనూహ్యంగా ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. దాంతో ఏడో మ్యాచ్ నుంచి సారథిగా వ్యవహరించిన రోహిత్ ఆ ఏడాది జట్టును విజేతగా నిలిపాడు. ఆ తర్వాత 2015, 2017, 2019, 2020లలో కూడా ముంబై ఐపీఎల్ గెలుచుకుంది. 2013 చాంపియన్స్ ట్రోఫీ కూడా రోహిత్ నాయకత్వంలోనే వచ్చింది. రోహిత్ సారథ్యంలో జట్టు మొత్తం 158 మ్యాచ్‌లు ఆడగా... అందులో 87 విజయాలు, 67 పరాజయాలు ఉన్నాయి. 4 మ్యాచ్‌లు 'టై'గా ముగిశాయి. అయితే 2021, 2022 సీజన్లలో 'ప్లే ఆఫ్స్'కు చేరడంలో ముంబై విఫలం కాగా... 2023లో రెండో క్వాలిఫయర్‌లో ఓడి మూడో స్థానంతో ముగించింది.



హార్దిక్‌కు హామీతోనే...

రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించడంపై ఎలాంటి స్పష్టమైన కారణం బయటకు కనిపించడం లేదు. ఇప్పటికీ మంచి ఫామ్‌తో భారత జట్టు కెప్టెన్‌గా కూడా కొనసాగుతున్న రోహిత్‌ను పక్కన పెట్టడం అంటే అంతర్గతంగా ఏదైనా జరిగి ఉండాలి. గత మూడు సీజన్లలో జట్టు ప్రదర్శన గొప్పగా లేకపోయినా సరే... మార్కెటింగ్ పరంగా కూడా రోహిత్ విలువేమీ తగ్గలేదు. లేదంటే రోహిత్ తానే స్వయంగా సారథిగా ఇక చాలు, ఈ సీజన్‌లో ఆటగాడిగా మాత్రమే కొనసాగాలని భావిస్తున్నట్లు చెప్పి ఉండవచ్చు. అయితే భారీ మొత్తం చెల్లించి గుజరాత్ నుంచి హార్దిక్‌కు ఎలాగైనా తీసుకునేందుకు ముంబై ఇండియన్స్ చేసిన ప్రయత్నం చూస్తేనే జట్టు ప్రణాళిక ఏమిటో అర్థమవుతుంది. పాండ్యా కూడా కెప్టెన్సీ హామీ మేరకే ముంబైకి తిరిగి వచ్చినట్లు సమాచారం. గత రెండు సీజన్లలో టైటాన్స్‌కు సారథ్యం వహించినా... ముంబై కెప్టెన్సీపై అతను మక్కువ పెంచుకున్నాడు. తాజా పరిణామాలతో రోహిత్ భారత టి20 జట్టు కెప్టెన్సీ కూడా సందేహంలోనే పడింది. రోహిత్ లేని సమయంలో భారత్ ఆడిన గత 25 టి20ల్లో 13 మ్యాచ్‌లలో నాయకత్వం వహించిన హార్దిక్ పాండ్యానే వచ్చే టి20 వరల్డ్ కప్‌లోనూ కెప్టెన్ అయ్యే అవకాశాలు మరింత మెరుగ్గా కనిపిస్తున్నాయి. బ్యాటర్‌గా మాత్రమే రోహిత్ టి20ల్లో కొనసాగుతాడా అనేది కూడా చెప్పలేం. ఎందుకంటే 2020 టి20 వరల్డ్ కప్ సెమీస్‌లో ఓటమి తర్వాత రోహిత్ ఒక్క అంతర్జాతీయ టి20 మ్యాచ్ కూడా ఆడలేదు.

దీప్తి ధమాకా



దీప్తి

7 పరుగులిచ్చి 5 వికెట్లు

- తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 136 ఆలౌట్
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 186/6
- గెలుపు దిశగా హర్మన్‌ప్రీత్ బృందం

ముంబై: ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో భారత మహిళల జట్టు విజయంపై కన్నేసింది. భారత బౌలర్ల జోరుతో రెండో రోజే మ్యాచ్‌పై జట్టు పూర్తిగా పట్టు బిగించింది. స్పిన్నర్ల హవా సాగిన శుక్రవారం రెండు జట్లలో కలిపి 19 వికెట్లు నేలకూలగా... అందులో 15 వికెట్లు స్పిన్నర్లే పడగొట్టారు. భారత ఆఫ్‌స్పిన్నర్ దీప్తి శర్మ (5/7) కేవలం 7 పరుగులకే 5 వికెట్లు పడగొట్టి తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. దీప్తి ధాటికి ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 35.3 ఓవర్లలో 136 పరుగులకే కుప్పకూలింది. నాట్ సివర్ బ్రంట్ (70 బంతుల్లో 59; 10 ఫోర్లు) మాత్రమే పోరాడి అర్ధ సెంచరీ సాధించగా, ఇతర బ్యాటర్లంతా విఫలమయ్యారు. మరో ఆఫ్ స్పిన్నర్ స్నేహ్ రాణాకు 2 వికెట్లు దక్కాయి. ఫలితంగా భారత్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 292 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అయితే ఇంగ్లండ్‌కు ఫాలోఆన్ ఇవ్వకుండా భారత్ మళ్లీ బ్యాటింగ్‌కు దిగింది. ఆరంభం నుంచే బ్యాటర్లంతా దూకుడుగా ఆడటంతో జట్టు ఆధిక్యం మరింత పెరిగింది. రెండో రోజు ఆట ముగిసేసమయానికి భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు కోల్పోయి 186 పరుగులు సాధించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (67 బంతుల్లో 44 నాటౌట్; 5 ఫోర్లు) రాణించగా... షఫాలీ వర్మ (33), జెమీమా (27), స్మృతి మంధాన (26) కీలక పరుగులు సాధించారు. ఇంగ్లండ్ లెఫ్టార్మ్ స్పిన్నర్లు చార్లీ డీన్ 4, ఎకెల్‌స్టోన్ 2 వికెట్లతో భారత్‌ను దెబ్బ తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ టాప్ స్కోరర్‌గా నిలిచిన శుభ సతీశ్ ఎడమ చేతికి ఫ్రాక్చర్ కావడంతో బ్యాటింగ్‌కు దిగలేదు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 410/7తో శుక్రవారం ఉదయం ఆట కొనసాగించిన భారత్ మరో 18 పరుగులు జోడించి 428 పరుగులకు ఆలౌటైంది. ప్రస్తుతం ఏకంగా 478 పరుగుల ఓవరాల్ ఆధిక్యంతో భారత్ ఇప్పటికే అసాధ్యమైన లక్ష్యం విధించే దిశగా సాగుతోంది. మ్యాచ్‌లో మరో రెండు రోజులు మిగిలి ఉన్న నేపథ్యంలో ఇంగ్లండ్ ఓటమి నుంచి తప్పించుకోవడం దాదాపు అసాధ్యమే.

భారత్, పాక్ జట్లకు షాక్

దుబాయ్: ఆసియా కప్ అండర్–19 క్రికెట్ టోర్నీలో ఫేవరెట్స్ భారత్, పాకిస్తాన్ జట్ల కథ సెమీఫైనల్లోనే ముగిసింది. గురువారం జరిగిన సెమీఫైనల్స్‌లో బంగ్లాదేశ్ నాలుగు వికెట్ల తేడాతో భారత్‌పై, యూఏఈ 11 పరుగుల తేడాతో పాకిస్తాన్‌పై సంచలన విజయాలు సాధించి టైటిల్ పోరుకు అర్హత సాధించాయి. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో ముందుగా భారత్ 42.4 ఓవర్లలో 188 పరుగులకు ఆలౌటైంది. ముషీర్ ఖాన్ (50; 3 ఫోర్లు), హైదరాబాద్ క్రికెటర్ అభిషేక్ మురుగన్ (62; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం బంగ్లాదేశ్ 42.5 ఓవర్లలో 6 వికెట్లకు 189 పరుగులు చేసి గెలిచింది. మరోవైపు యూఏఈ నిర్దేశించిన 194 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పాక్ 182 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది.

